


నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

శనివారం SATURDAY 14.9.2024 | హైదరాబాద్ HYDERABAD

సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 100 ‖ వెల (Price) రూ.6.50 | పేజీలు: 12+4 Pages: 12+4

ముహూర్తం: శనివారం, సూర్యోదయం: 6-04, సూర్యాస్తమయం: 6-19. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం శుక్ల పక్షం తిథి: ఏకాదశి రాత్రి 8-42 వరకు. నక్షత్రం: ఉత్తరాషాఢ రాత్రి 8-32 వరకు. వర్జ్యం: రాత్రి 12-16 నుంచి రాత్రి 1-45 వరకు. రాహుకాలం: ఉదయం 9-08 నుంచి రాత్రి 10-39 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 6-04 నుంచి ఉదయం 7-42 వరకు. అమృతకాలం: పగలు 2-25 నుంచి పగలు 3-57 వరకు.



హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, కార్యకర్తలు బయటకు రాకుండా గేట్లు మూసి అడ్డుకుంటున్న పోలీసులు



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని అడ్డుకుంటున్న పోలీస్ అధికారులు



హరీశ్‌ను కలిసేందుకువచ్చిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు



గురువారం నాటి అరెస్టు సందర్భంగా భుజానికి గాయమైన హరీశ్‌రావు.. చికిత్స కోసం దవాఖానకు వెళ్లకుండా అడ్డుకుంటున్న నార్సింగ్ ఏసీపీ వెంకటరమణ

తెలంగాణ హౌస్ అరెస్ట్

సర్కారు అణచివేతల పర్వం.. బీఆర్ఎస్ నేతల నిర్బంధం

నిన్న బీఆర్ఎస్‌లో అంతర్గత గొడవగా చెప్పిండ్రు.
నేడు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ అంటున్నరు.
కౌశిక్ ఇంటికి హరీశ్, సొంతపార్టీ నేతలు వెళ్తే తప్పు!
గాంధీ ఇంటికి దానం, బొంతు వెళ్తే ఒప్పు!
దాన్నెవరూ ఆపరు! అదేందని అడగరు!

వందల సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు గాంధీ ఇంటికాడ గుమికూడొచ్చు.
కానీ, బీఆర్ఎస్ నాయకులు తమ ఇంటి గడప దాటకూడదు!
కాంగ్రెసోళ్లు కాన్వాయ్ వేసుకుని ఎమ్మెల్యే ఇంటిపైకి దాడికి రావొచ్చు!
హరీశ్, తలసాని వంటి నేతలను కనీసం దవాఖానకైనా వెళ్లనివ్వరు!

బీఆర్ఎస్ అని చెప్పుకునే గాంధీ ఇంటికి కాంగ్రెస్ నేతలు రావొచ్చు.
'టిఫిన్ చేస్తందుకే వచ్చినం' అంటూ వెటకారమాడొచ్చు.
ఇంకా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే చెప్పుకునే అదే గాంధీ ఇంటికి..
బీఆర్ఎస్ నేతలు రాకూడదు. వస్తే అరెస్టులు.. అక్రమ కేసులు!

బీఆర్ఎస్ నేతల ఆందోళన శాంతి భద్రతల సమస్య!
కాంగ్రెస్ నేతలు చేస్తే.. అది రాజకీయ ప్రతిస్పందన!
ఇదీ రేవంత్ సర్కారు ద్వంద్వనీతి!
ప్రజాస్వామిక విలువలకు పట్టిన దుర్గతి!!



రాష్ట్రంలో రెండు రోజులుగా జరుగుతున్న పరిణామాలు తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న రోజులను గుర్తుకు తెచ్చాయి. సమైక్య నేతల పర్యటనలను అడ్డుకుంటామని తెలంగాణ సమాజం హెచ్చరికలు జారీ చేసినప్పుడు.. నెలకొన్న పరిస్థితులే తిరిగి కండ్ల ముందు కదలాడాయి. గురువారం నాటి హైటెన్షన్ ప్రతిఘటనతో వెనక్కితగ్గినట్టు కనిపించిన పోలీసులు.. ఏ ఒత్తిళ్లు పనిచేశాయోగానీ అర్ధరాత్రి నుంచే మళ్లీ అరెస్టులకు దిగారు. ఎక్కడికక్కడ బీఆర్ఎస్ నాయకులను గృహనిర్బంధం చేశారు. పార్టీ ఆఫీసులచుట్టూ బలగాలను మోహరించారు. బీఆర్ఎస్ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు మొదలుకొని సాధారణ కార్యకర్తల వరకూ ఎవరినీ పోలీసులు వదల్లేదు. దవాఖానకు వెళ్తామన్న విడిచిపెట్టలేదు. గులాబీ శ్రేణులపై నిర్బంధాన్ని ప్రయోగించిన పోలీసులే.. అధికార పార్టీ నేతలకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. అరెకపూడి ఇంటికి కాంగ్రెస్ నేతలు వెళ్తేఎస్కార్ట్ ఇచ్చి మరీ రక్షణ కల్పించారు.

- రాష్ట్రవ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే అరెస్టులు
- పార్టీ ఆఫీసుల చుట్టూ బలగాల మోహరింపు
- పలువురు ముఖ్య నేతలు ఇంట్లోనే నిర్బంధం
- దవాఖానలకూ వెళ్లనీయకుండా అడ్డగింత
- వెంట రావాలని హరీశ్ చెప్పినా ససేమిరా
- వరంగల్‌లో కార్యకర్తలు, పోలీసుల తోపులాట
- మరోవైపు దాడి చేసిన కాంగ్రెస్ నేతలకు స్వేచ్ఛ
- గాంధీ ఇంటికి కాంగ్రెస్ నేతలు దానం, బొంతు
- దగ్గరుండి మరీ భద్రత కల్పించిన పోలీసులు

హైదరాబాద్/సిటీబ్యూరో, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): అర్ధరాత్రి వేళ పోలీసుల బూట్ల చప్పుళ్లు.. చడీచప్పుడు కాకుండా తలుపుతట్టి.. తలుపు తీసి తీయకముందే ఎత్తుకెళ్లిపోవడం.. సర్కిల్ సాబ్ తీస్కరమ్మన్నడు... ఇంటి నుంచి కదలొద్దని ఆర్డర్.. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లారేవరకు తెలంగాణ అంతటా ఇవే ఫత్వాలు... బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకే కాదు.. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు..మాజీ మంత్రులు అన్న తేడా లేమీలేవు. ఎక్కడివాళ్లక్కడ.. ఎవరింట్లో వాళ్లను కాలు తీసి కాలుపెట్టడానికి వీలు లేదన్నట్టే పోలీసులు వ్యవహించారు. మొత్తంగా తెలంగాణ హౌజ్ అరెస్ట్. దవాఖానకు పోవుడు లేదు.. మందుగోలీలు తెచ్చుకునుడు లేదు. అటున్న మనిషి ఇటు రావొద్దు..ఇటున్న మనిషి అటుపోవద్దు.. ఇదీ బీఆర్ఎస్‌పై పోలీసులు వ్యవహరించిన తీరు. గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ › 2వ పేజీలో

ప్రశ్నించే గొంతుకపై దాడి!

- రెచ్చిపోతున్న కాంగ్రెస్ గూండాలు
- రాష్ట్రంలో ఫ్యాక్షన్ తరహా ఘటనలు
- బీఆర్ఎస్ లక్ష్యంగా భౌతిక దాడులు › 2

ప్రభుత్వ ఒత్తిడిలో పోలీస్?

- వరుస వైఫల్యాలతో ఖాకీకి మకిలీ
- 'ప్రతిపక్షం' అరెస్టుకు పైనుంచి ప్రెషర్!
- కాంగ్రెసోళ్లు దాడి చేస్తే కేసుల్లేవ్! › 3
- గాంధీ-కౌశిక్ ఇష్యూతో తేటతెల్లం

మీరు విసిరే రాళ్లు మాకు పునాదిరాళ్లు

- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ఇప్పుడు గుర్తొచ్చిందా?
- శాంతిభద్రతల విఘాతానికి కారణం నువ్వే రేవంత్
- దాడిచేసిన వారికి ఎస్కార్ట్. . మాపై అరెస్టులా?
- పీఏసీ చైర్మన్‌ది ఎలక్షనా? సెలక్షనా? : హరీశ్ › 2

రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ

- బీఆర్ఎస్ అంటే సీఎం రేవంత్‌కు వణుకెందుకు?
- గూండాలను వదిలి మా నేతలను అరెస్టు చేస్తారా?
- పార్టీ నేతలను బేషరతుగా విడిచిపెట్టాలి: కేటీఆర్ › 5

సాగు భూములకే రైతు భరోసా

పది ఎకరాల వరకే పెట్టుబడి సాయం

తెల్లకార్డులేని రైతులకు నెలాఖరులోగా మాఫీ

మంత్రి తుమ్మల



ఉండవెల్లి, సెప్టెంబర్ 13 : సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా పథకం వర్తిస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తాలో నూతన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో సాగు చేయని భూములకూ పెట్టుబడి సాయం అందించారని, కానీ కాంగ్రెస్ సర్కారు మాత్రం అలా చేయదని స్పష్టంచేశారు. రైతుబంధు పథకం పేరును రైతు భరోసాగా మారుస్తున్నట్టు ప్రకటించారు .అందుకనుగుణంగా మంత్రుల సబ్‌కమిటీ ఏర్పాటు చేసి జిల్లాలో సమావేశాలు నిర్వహించి రైతులు, మేధావుల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను స్వీకరిస్తామని చెప్పారు. త్వరలోనే రైతుభరోసా మార్గదర్శకాలు విడుదల చేసి › 6వ పేజీలో

వరద నష్టం 10,032 కోట్లు

మున్నేరు రిటెయినింగ్ వాల్‌కు నిధులివ్వండి.. కేంద్ర బృందంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి › 6



కేజ్రీవాల్ విడుదల

- సీబీఐ కేసులో బెయిల్ మంజూరు చేసిన సుప్రీం
- సచివాలయానికి వెళ్లొద్దు.. సంతకం చేయొద్దు
- కేసు గురించి బయట మాట్లాడొద్దని షరతులు
- సీబీఐ తీరుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు › 7
- 'పంజరంలో చిలక' భావనను తొలగించుకోవాలి
- ఈడీ కేసులో బెయిల్ వచ్చిన వెంటనే అరెస్టా?
- 22 నెలలుగా లేని తొందర అప్పుడే ఎందుకు?
- సుదీర్ఘంగా నిర్బంధించడం స్వేచ్ఛను హరించడమే
- ఈడీ కేసులో బెయిల్ వచ్చాక కస్టడీలో ఉంచడం అంటే న్యాయాన్ని అపహాస్యం చేయడమేనన్న కోర్టు
- అధినేతకు బెయిల్‌తో ఆప్ శ్రేణుల సంబరాలు

నోటీసుల్లేకుండా కూలుస్తరా?

అక్రమ నిర్మాణమైతే నిబంధనలు పాటించరా?: హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం



- ప్రభుత్వ అనుమతులతో జరిపిన నిర్మాణాలపైనా అదే ధోరణా?
- నోటీసులు ఇవ్వకుండా, వివరణ తీసుకోకుండా కూల్చివేతలా?
- కోర్టుల్లో ఒకటి చెప్తూ.. బయట మరోలా వ్యవహరిస్తారా?
- జీహెచ్ఎంసీ అధికారాలను హైడ్రాకు ఎలా బదలాయిస్తారు?
- మీ చర్యలను ఎలా సమర్థించుకుంటారు.. హైకోర్టు ప్రశ్నలు
- జీవో 99 జారీపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశం

చెరువుల్లో అక్రమ నిర్మాణాలంటూ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపడుతున్న 'హైడ్రా' తీరుపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇతర ప్రభుత్వ శాఖల అనుమతులతో జరిపిన నిర్మాణాలకు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా ఎలా కూల్చుతారని ప్రశ్నించింది. ఆయా నిర్మాణదారులకు నోటీసులు ఇవ్వకుండా, వారి నుంచి వివరణ తీసుకోకుండా కూల్చివేత చర్యలకు పాల్పడటాన్ని ఏవిధంగా సమర్థించుకుంటారని నిలదీసింది.

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): 'కోర్టుల్లో ఒకటి చెప్తూ బయట మరోలా వ్యవహరిస్తారా?' అంటూ నిప్పులు చెరిగింది. హైడ్రా దూకుడుగా వ్యవహరించడం సబబు కాదని, ఆ నిర్మాణాలు చట్టవిరుద్ధమైనవే అయినప్పటికీ కూల్చివేత చర్యలు మాత్రం చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఉండాల్సిందేనని తేల్చిచెప్పింది. జీవో 99 చట్టపరిధిపై వివరణ ఇవ్వాలని, సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. హైడ్రాను ఏర్పాటుకు సంబంధించిన జీవో 99 చట్టబద్ధతను సవాల్ చేస్తూ హైదరాబాద్ నానక్ రాంగూడకు చెందిన డీ లక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లోని 119/21, 1199/22 సర్వే నంబర్లలో › 9వ పేజీలో

24 గంటల్లో మరో అల్పపీడనం › 6

అదానీ గ్రూప్‌లో స్విస్ ప్రకంపనలు

స్విట్జర్లాండ్ మనీ లాండరింగ్ కేసులో 2,610 కోట్ల సొమ్ము ఫ్రీజ్

అదానీ గ్రూప్ బినామీదేనన్న అనుమానాలు › 8

ట్రాఫిక్ నియంత్రణకు ట్రాన్స్‌జెండర్లు!

సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదన

హోంగార్డుల్లా వాడుకోవాలని పోలీసుశాఖకు సూచన

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాన్స్‌జెండర్లను వలంటీర్లుగా నియమించాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. నగర ట్రాఫిక్ వ్యవస్థపై శుక్రవారం పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు సూచనలు చేసిన ఆయన.. ట్రాఫిక్ నియంత్రణలో ప్రస్తుతం పోలీసులతో పాటు హోమ్‌గార్డులు పనిచేస్తున్నారని, హోమ్‌గార్డుల తరహాలోనే ట్రాన్స్‌జెండర్లను నియమించి, ట్రాఫిక్ నియంత్రణ విధులు అప్పగించాలని తెలిపారు. ప్రతి నెల వారి కి కొంత స్టైపెండ్ చెల్లించాలని, దీంతో వారికి ఉపాధి కల్పించినట్టు కూడా అవుతుందని వెల్లడించారు. వారం, పది రోజులు ట్రాఫిక్ వ్యవస్థపై శిక్షణ ఇచ్చి, ప్రత్యేక యూనిఫాం అందజేయాలని చెప్పారు. అర్హులైన, ఆసక్తి గల ట్రాన్స్‌జెండర్ల వివరాలను సేకరించాలని ఆదేశించారు.

'నీట్' డైలమా!

- రాష్ట్రంలో నిలిచిన ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లు
- ఆలిండియా కోటా భర్తీ.. ఆగిన కన్వీనర్ కోటా
- ఆంధ్రప్రదేశ్‌లో నిరాటంకంగా సీట్ల భర్తీ
- కనీసం భరోసా ఇవ్వని హెల్త్ వర్సిటీ, వైద్యారోగ్యశాఖ
- ఒక్క ప్రకటన కూడా విడుదల చేయని ప్రభుత్వం



హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): వేల మంది 'నీట్' విద్యార్థులు తమ భవిష్యత్తు ఏమిటో తెలియక ఆగమాగం అవుతున్నా వైద్యారోగ్యశాఖకు కనీసం చీమ కుట్టినట్టు కూడా లేదు. వారికి భరోసా కల్పిస్తూ కనీసం ఒక ప్రకటన కూడా చేయలేని దుస్థితిలో హెల్త్ యూనివర్సిటీ, వైద్యారోగ్యశాఖ ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. స్థానికతను నిర్ధారించడానికి వచ్చిన అడ్డంకులేమిటి? జీవో-33పై ఎందుకు సుప్రీంకోర్టుకు వెళ్లాల్సి వచ్చింది? తదుపరి కార్యాచరణ ఏమిటి? వంటి వివరాలు కూడా ఎందుకు చెప్పలేకపోతున్నాయని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం నీట్ అడ్మిషన్లలో భాగంగా దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్ › 10వ పేజీలో

ఇంజినీరింగ్ సీట్లపై సుప్రీంకోర్టుకు

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం.. ఢిల్లీకి సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ › 10

మాప్ అప్ కౌన్సెలింగ్ చేపట్టాలన్న హైకోర్టు ఆదేశాలపై అప్పీలు

కేసు సెటిల్మెంట్‌కు 50 లక్షల డీల్

- అడ్వాన్స్‌గా 30 లక్షలు అందుకున్న నగర ఏసీపీ!
- ఓ చర్చి వివాదంలో సివిల్ కేసు క్రిమినల్‌గా మార్పు
- ఉన్నతాధికారుల రహస్య విచారణతో వెలుగులోకి..



హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : ఓ చర్చికి సంబంధించి రెండు గ్రూపుల మధ్య వివాదాన్ని సెటిల్ చేసేందుకు హైదరాబాద్‌లోని ఓ ఏసీపీ రూ.50 లక్షల లంచం ఒప్పందం చేసుకొని, అడ్వాన్స్‌గా రూ.30 లక్షలు తీసుకొని ఉన్నతాధికారులకు పట్టుబడ్డాడు. సెంట్రల్ జోన్‌లోని ఓ చర్చికి సంబంధించిన సొసైటీ, ట్రస్ట్ మధ్య వివాదం నెలకొన్నది. చర్చి యాజమాన్య హక్కుల విషయంలో 2014 నుంచి కోర్టులో సివిల్ వివాదం కొనసాగుతున్నది. ఈ క్రమంలో ఓ నాయకుడు సొసైటీకి మద్దతు తెలిపాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సదరు నాయకుడు ఆ పార్టీ తీర్థం పుచ్చుకొని ప్రత్యర్థి వర్గానికి › 9వ పేజీలో

మరో 500 కోట్ల అప్పు!

కసరత్తు చేస్తున్న రేవంత్ సర్కార్

17న ఆర్బీఐ నుంచి పొందే ప్రయత్నం

ఈ నెలలో ఇప్పటికే రూ.4,000 కోట్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారుస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారు.. మరో 500 కోట్ల రుణం తీసుకోవడానికి చర్యలు చేపట్టింది. ఈ నెల 17న మరో రూ.500 కోట్ల అప్పు సమీకరించుకొనేందుకు కసరత్తు మొదలుపెట్టింది. 500 కోట్ల › 6వ పేజీలో

వంటనూనె మంటలు

దిగుమతి సుంకం పెంచిన కేంద్రం › 7

రైల్లో బాలికపై లైంగిక దాడి

తల్లిలేని సమయంలో అఘాయిత్యం

ప్రయాణికుల దాడిలో నిందితుడి మృతి

హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌లో ఘటన › 7

రేప్‌ను ప్రతిఘటించి.. మర్మాంగాలను కోసివేసి

బీహార్ గంగాపూర్ దవాఖానలో నర్సు సాహసం › 7

లైంగిక దాడికి యత్నించిన డాక్టర్‌కు గుణపాఠం



బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు నెటిజన్ల బాసట!

ఆంధ్రనేతల ప్రోద్బలం.. తెలంగాణపై కుట్రలు
సోషల్ మీడియా వేదికల్లో పోస్టులు వైరల్
తెలంగాణ కోసం ముందుండేది బీఆర్ఎస్సే
అభిప్రాయలు పంచుకున్న నెటిజన్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఏనాడైనా తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీయే శ్రీరామరక్ష అని నెటిజన్లు సోషల్ మీడియా వేదికల్లో పెద్ద ఎత్తున అభిప్రాయాలు వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడిని నెటిజన్లు తీవ్రంగా ఖండించారు. ఆంధ్ర నేతల ప్రోద్బలంతో తెలంగాణపై కుట్రలు చేస్తున్నారని, తెలంగాణ సమాజం మేల్కొని ఖండించాలని పలువురు చర్చించుకుంటున్నారు. తెలంగాణ సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం ఆలోచించే గులాబీ పార్టీకి అండగా నిలవాలని నవీన్ అనే నెటిజన్ మద్దతు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కలలను సాకారం చేసిన కేసీఆర్‌తోనే తెలంగాణకు రక్షణ అని మానస అనే నెటిజన్ అభిప్రాయం వ్యక్తంచేశారు. కౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడి వీడియోలు, గాంధీ అనుచరుల రౌడీయిజం తదితర వీడియోలన్నీ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఖండించారు. శాంతిభద్రతల విషయంలో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉండేదని.. అలాంటి తెలంగాణను ఆంధ్రనేతల కుట్రతోనే అణగదొక్కాలని చూస్తున్నారని ప్రకాశ్ తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టారు. ఈ దాడి వెనుక పెద్ద తలకాయలు ఉన్నాయని.. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఉంటే తమ పప్పులు ఉడకవని గ్రహించి ఆ పార్టీకి చెందిన నేతలపై దాడులు చేస్తున్నారని సతీశ్ అనే నెటిజన్ సందేహం లేవనెత్తారు. అరికెపుడి గాంధీ రాజీనామా చేసి సవాల్ విసరాలి.. పోలీసుల సహకారంతో కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేయడం సిగ్గుచేటని సుశీలారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేసింది.

హరీశ్‌రావు వీడియో వైరల్

'మీరు విసిరే రాళ్లు.. రేపటి మా ప్రభుత్వానికి పునాది రాళ్లు'' అని హరీశ్‌రావు అన్న వీడియోను నెటిజన్లు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ చేశారు. శుక్రవారం బీఆర్ఎస్ నేతల హౌస్ అరెస్ట్‌పైనా పెద్ద ఎత్తున చర్చ జరిగింది. రేవంత్ సర్కార్ తన పతనాన్ని కొని తెచ్చుకుంటున్నారని నెటిజన్లు ఎద్దేవా చేశారు. మొత్తంగా సోషల్ మీడియా అంతా బీఆర్ఎస్ వెంట నిలవడం విశేషం.

ఇమేజ్ ఇప్పుడు గుర్తొచ్చిందా రేవంత్?

- హైదరాబాద్ శాంతిభద్రతల విఘాతానికి కారణమే నువ్వు
- అరికెపూడి గాంధీకి బందోబస్తు ఇచ్చి దాడులు చేయించిందెవరు?
- ఒకవేళ ఆయన్ను ఆపి ఉంటే హైదరాబాద్ నగర ఇమేజ్ దెబ్బతినేదా?
- ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడులను నువ్వు, డీజీపీ ఎందుకు ఆపలేదు?
- మీరు విసిరే ప్రతి రాయి రేపటి రోజు బీఆర్ఎస్ అధికారానికి పునాది రాయి
- పీఏసీ చైర్మన్ పదవికి ఎన్నిక జరిగిందా?: ఎమ్మెల్యే హరీశ్‌రావు



మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో దేశపతి శ్రీనివాస్, కల్వకుంట్ల సంజయ్, సుదర్శన్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, దేవీప్రసాద్

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): పోలీసులను అడ్డంపెట్టుకొని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై దాడి చేసినపుడు లాఅండ్‌ఆర్డర్ గుర్తురాలేదా? హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ గుర్తుకు రాలేదా? అని సీఎం రేవంత్‌ను మాజీమంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు దెబ్బతినడానికి కారణమే రేవంత్ అని దుయ్యబట్టారు. కౌశిక్‌రెడ్డిపై దాడులను రేవంత్, డీజీపీ ఎందుకు ఆపలేదని నిలదీశారు. శుక్రవారం కోకాపేటలోని నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తమ పార్టీ ఎమ్మెల్యేపై దాడి జరుగుతుంటే సీఎం, డీజీపీ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అది గాంధీ చేసిన దాడి కాదని, రేవంత్‌రెడ్డి చేసిన దాడి అని విమర్శించారు. కూకట్‌పల్లి నుంచి 8 పోలీస్‌స్టేషన్లు దాటించి పోలీస్ బందోబస్తు ఇచ్చి మరీ కౌశిక్‌రెడ్డి ఇంటికి వరకు తీసుకొచ్చారని మండిపడ్డారు. ఇంటి లోపలికి పంపించి దాడి చేయించారని తెలిపారు. తనతో సహా రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులందరని హౌజ్ అరెస్ట్ చేశారని, మరి గాంధీని ఎందుకు హౌజ్ అరెస్టు చేయలేదని నిలదీశారు. ఫిర్యాదు చేయడానికి వెళ్తే అరెస్టులు చేస్తరా? తమను అరెస్టుచేసి, హత్యాయత్నం చేసిన అరికపూడి గాంధీ, ఆయన అనుచరులను ఎస్కార్ట్ బందోబస్తు మధ్య ఇంటికి పంపుతారా? అని ప్రశ్నించారు. వారికి బిర్యానీలు, సమోసాలు, చాయ్‌లతో రాచమర్యాదలు చేశారని, తమకు నీళ్లు కూడా ఇవ్వకుండా గంటల పాటు తిప్పారని ఫైర్ అయ్యారు. కౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడికి కర్త, కర్మ, క్రియ అంతా రేవంత్‌రెడ్డేనని, ఆయన డైరెక్షన్‌లోనే దాడి జరిగిందని ఆరోపించారు. రాష్ట్ర ఖ్యాతిని పాడుచేయొద్దని, పోలీసుల గౌరవాన్ని తగ్గించొద్దనే సంయమనం పాటించామన్నారు. దానం, గాంధీ.. కేసీఆర్ నాయకత్వంలో ఎలా ఉన్నారు? రేవంత్ నాయకత్వంలో ఇప్పుడు ఎలా ఉన్నారు? అంటూ ఎద్దేవా చేశారు.

హౌస్ అరెస్టులే ప్రజాపాలనా?

ప్రధాన ప్రతిపక్ష నేతలను హౌస్ అరెస్టులు చేయడమే ప్రజాపాలనా? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? అని శుక్రవారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. 'హైదరాబాద్‌లో నన్ను హౌస్ అరెస్టు చేశారు. నా ఇంటి చుట్టూ పోలీసులను మోహరించారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ మా పార్టీ నాయకులు, కార్యకర్తలను ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. ఇదేనా ప్రజాపాలన, ఇదేనా ఇందిరమ్మ రాజ్యం. సిగ్గు సిగ్గు.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నావు రేవంత్‌రెడ్డి.. దాడులు చేసిన వారిని వదిలి, బాధిత పక్ష నేతలను అరెస్టులు చేయడం, భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గం' అని హరీశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

యధా రాజా తథా ప్రజా

రాష్ట్రంలో యధా రాజా తథా ప్రజా అన్న పరిస్థితి ఉన్నదని హరీశ్‌రావు అన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. బీఆర్ఎస్ నాయకులను కొట్టాలని మాట్లాడుతున్నారని తెలిపారు. సీఎం తనను తాను రివ్యూ చేసుకోవాలని, మంత్రులను రివ్యూ చేసుకోవాలని చురక అంటించారు. రేవంత్‌రెడ్డి పాలన ఎమర్జెన్సీని తలపించేలా ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. 'విత్తొకటి నాటితే మొక్కొక్కటి మొలుస్తుందా? పైన సక్కగ ఉండాల్సిన నీకే వక్రబుద్ధి ఉంటే కిందిస్థాయిలో సక్కగా ఉంటారా? నీ అసభ్య, సంస్కారహీనమైన భాష మార్చుకోకుండా యూట్యూబ్ చానళ్లకు నీతులు చెప్తున్నవా?' అని సీఎంపై మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా అరెస్టు చేసిన బీఆర్ఎస్ నేతలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రేవంత్‌ది యూటర్న్ రాజకీయం

ఎన్నికే లేకున్నా పీఏసీ చైర్మన్‌ను నియమించి.. ఎన్నిక జరిగిందని రేవంత్ చెప్పటం దుర్మార్గమని హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఎలక్షన్ కాదు, సెలక్షన్ ద్వారా నియామకం జరిగిందని, రాజ్యాంగం ప్రకారం ఎన్నిక పెట్టాలి కానీ, జరగలేదని వెల్లడించారు. అన్నింటిపైనా రేవంత్‌ది యూటర్న్ రాజకీయమేనని, చెప్పేదొకటి చేసేదొకటి, సీఎం డ్రామాలతోనే రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతింటున్నదని ధ్వజమెత్తారు. రేవంత్ ఒక సమస్య నుంచి తప్పించుకోవడానికి మరో సమస్యను సృష్టించే ప్రయత్నం చేస్తూ.. డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. ఆదర్శంగా ఉండాల్సిన డీజీపీ.. రాజకీయ కుట్రలో భాగమై ప్రతిపక్షాల గొంతును నొక్కాలని చూడటం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. గుడ్డిగా రేవంత్‌రెడ్డిని ఫాలో కావొద్దని, విచక్షణతో పని చేయాలని డీజీపీని, పోలీసులను కోరుతున్నానని అన్నారు.

> గ్యారెంటీల గురించి అడిగితే డ్రామా..
> రుణమాఫీ, ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే డ్రామా..
> వరద బాధితులకు సాయంపై అడిగితే డ్రామా..
> రైతుబంధు అడిగితే కాళేశ్వరం లీక్ అంటూ డ్రామా..
> సీఎం రేవంత్‌రెడ్డివి అన్నీ డైవర్షన్ పాలిటిక్సే!
>
> **- హరీశ్‌రావు**

రాజకీయం కాదు.. రాష్ట్రమే ముఖ్యం

తమకు పోరాటాలు, ఉద్యమాలు, కొట్లాటలు, అరెస్టులు కొత్త కాదని, జైలుకు పోయినవాళ్లం, లాఠీ దెబ్బతిన్నవాళ్లం, పదవులు త్యాగం చేసి తెలంగాణ సాధించిన వాళ్లమని, రాష్ట్రం గురించి బాధ్యతగా ఆలోచిస్తున్నామని హరీశ్‌రావు స్పష్టంచేశారు. 'దాడికి ప్రతిదాడి చేయలేక కాదు. రాష్ట్ర ప్రయోజనాల గురించి ఆలోచిస్తున్నాం కాబట్టే ప్రతిదాడుల గురించి ఆలోచించటం లేదు. ఖమ్మం, హైదరాబాద్‌లో మీరు మమ్మల్ని రాళ్లతో కొట్టవచ్చు, ఎన్ని రాళ్లు విసురుతావో విసురు, మీరు విసిరే రాళ్లే బీఆర్ఎస్ అధికారంలోకి రావడానికి పునాది రాళ్లు అవుతాయి' అని అన్నారు. ఎన్ని గృహ నిర్బంధాలు చేసినా తమ సంకల్పాన్ని నీరుగార్చలేరని తేల్చిచెప్పారు. చినజీయర్‌స్వామిని, ఆనంద్‌సాయి ఆంధ్రోళ్లు అన్నవ్. కానీ, కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను కడుపులో పెట్టుకున్నారు' అని హరీశ్ వివరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, దేవీప్రసాద్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల విషయంలో రాజీ వద్దు: డీజీపీ

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని ట్రై కమిషనరేట్ల పరిధిలో శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండొద్దని డీజీపీ జితేందర్ ఉద్ఘాటించారు. ఇటీవలి పరిణామాలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లతో డీజీపీ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా ప్రయత్నిస్తే చట్టప్రకారం కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోవద్దని ఓ ప్రకటనలో డీజీపీ ప్రజలను కోరారు.

శాంతిభద్రతలపై సీఎం సమీక్ష

రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో ఇటీవల నెలకొన్న పరిస్థితులపై సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఉదయం సమీక్ష నిర్వహించారు. లా అండ్ ఆర్డర్ సరిగా లేకపోవడంపై సీఎం సీరియస్ అయినట్టు తెలిసింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం కోల్పోయామనే అక్కసుతో కొందరు శాంతిభద్రతలకు విఘాతం కల్పించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. శాంతి భద్రతలు కాపాడే విషయంలో సీరియస్‌గా వ్యవహరించాలని డీజీపీని సీఎం ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. తెలంగాణ ఇమేజ్ దెబ్బతీసేలా ఎవరు ప్రవర్తించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

నాయకుడి పేరు	జిల్లా (నిర్బంధ ప్రాంతం)
ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్	కోకాపేట(హరీశ్‌రావు ఇంటి వద్ద)
ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి	గచ్చిబౌలి (స్వగృహంలో)
మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి	కొంపల్లి (స్వగృహంలో)
ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీయాదవరెడ్డి	గజ్వేల్ పీఎస్
మాజీ మంత్రి జోగురామన్న	ఆదిలాబాద్ (హౌస్ అరెస్టు)
ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను	హౌస్ అరెస్టు
ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్	హనుమకొండ (బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌లో)
కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి	హనుమకొండ (హౌస్ అరెస్టు)
జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి	ములుగు (హౌస్ అరెస్ట్)
చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్	గంగాధర మండలంలో (గృహ నిర్బంధం)
ఎస్సీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు బండ శ్రీనివాస్	హుజూరాబాద్ పీఎస్
బీఆర్ఎస్ నాయకులు మామిడి అంజయ్య, సందెల్లి వెంకటేశ్	చిగురుమామిడి పీఎస్
దావ సురేశ్, శీలం ప్రవీణ్, తాండ్ర సుధీర్	జగిత్యాల పీఎస్
మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్,కౌన్సిలర్లు	సత్తుపల్లి
జయాకర్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, అప్పారావు	మధిర పీఎస్
పుల్లయ్య, శ్రీనివాసరావు, హనుమంతరావు, వెంకట్రామారావు	చింతకాని పీఎస్



ఆదిలాబాద్‌లో మాజీమంత్రి జోగురామన్నను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు. చిత్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు

కాంగ్రెస్ గుండాలతో దాడులు

మా అధినేత కేసీఆర్ బీఆర్ఎస్ శ్రేణులకు చలో హైదరాబాద్ పిలుపు ఇవ్వకున్నా భయపడి బీఆర్ఎస్ శ్రేణులను ప్రభుత్వం అరెస్టులు చేయిస్తున్నది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ కాంగ్రెస్ గుండాలతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దాడులు చేయిస్తున్నది. కాంగ్రెస్ వచ్చిన 9 నెలల్లో శాంతిభద్రతలు అదుపుతప్పాయి.

- జోగు రామన్న, మాజీమంత్రి

సీఎం ప్రోత్సాహంతోనే దాడులు

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దాడుల పాలనగా మారింది. ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలకు రక్షణ లేనప్పుడు సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుంది. హరీశ్‌రావుకు మద్దతు తెలిపేందుకు పోతున్న తనను, బీఆర్ఎస్ నేతల అరెస్ట్ అప్రజాస్వామికం.

- అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే

తెలంగాణ హౌస్ అరెస్ట్

మొదటిపేజీ తరువాయి...

అనుచరగణం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిమీద దాడి అనంతర పరిణామాల నేపథ్యంలో ఎక్కడిక్కడ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను పోలీసులు నిర్బంధించారు. శుక్రవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇంట్లో ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు సమావేశమై అక్కడి నుంచి తాను పార్టీ ఎమ్మెల్యేనని చెప్పుకుంటున్న అరికెపూడి గాంధీ ఇంటికి వెళ్లి సమావేశం అవుదామని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి గురువారం ప్రకటించారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి ఎక్కడిక్కడ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేశారు. హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను ముందస్తు అరెస్టులు చేశారు.

ఎవరూ బయటకు రావొద్దు

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి తరువాత జరిగిన పరిణామాల నేపథ్యంలో గురువారం రాత్రి డీజీపీ నగరంలోని ట్రై పోలీస్‌కమిషనర్లతో మాట్లాడినట్టు తెలిసింది. ఎట్టి పరిస్థితులలోను బీఆర్ఎస్ శ్రేణులు ఇండ్ల నుంచి బయటకు రావద్దని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా కమిషనర్ డీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌వోలకు ఆ ఆదేశాలు పంపించారు. దీంతో గురువారం అర్ధరాత్రి నుంచే పోలీసులు బీఆర్ఎస్ నాయకులు గృహ నిర్బంధాలు మొదలు పెట్టారు. శుక్రవారం వినాయక బందోబస్తులు, నిమజ్జన ఏర్పాట్లను పక్కన పెట్టి మరీ బీఆర్ఎస్ నాయకులు ఇండ్ల నుంచి బయటకు రాకుండా చూడడమే విధిగా పోలీసులు పని చేశారు.

దవాఖానకూ వెళ్లనీయం

గురువారం మాజీ మంత్రి హరీశ్‌రావును పోలీసులు అరెస్టు చేస్తుండగా పెనుగులాటలో ఆయన ఎడమ భుజం ఒత్తిడికి గురైంది. విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు ఆయనను పరామర్శించేందుకు కోకాపేటలోని హరీశ్ ఇంటికి వెళ్లారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ హరీశ్‌ఇంటికి వెళ్లగా పోలీసులు లోనికి అనుమతించలేదు. దీంతో వారు అక్కడిక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం వారిని పోలీసులు అరెస్టు చేశారు. కొద్దిసేపటికి హరీశ్‌రావు తాను దవాఖానకు వెళ్లాలని ఎంత చెప్పినా పోలీసులు పట్టించుకోలేదు. 'మిమ్మల్ని హౌజ్ అరెస్టు చేశాం.. ఎక్కడికి వెళ్లనీయం' అని చెప్పారు. అవసరం అయితే 'మీరూ రండి.. హాస్పిటల్‌కు పోయి వస్తాం' అని హరీశ్ నచ్చజెప్పినా పోలీసులు ససేమిరా అన్నారు. అలాగే మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌నూ మారేడ్‌పల్లి పోలీసులు ఇదే రీతిలో నిర్బంధం చేశారు. తన హెల్త్ బాగోలేదని, డాక్టర్ అపాయింట్‌మెంట్ ఉన్నదని చెప్పినా పోలీసులు వినలేదు. కారు ఎక్కకుండా అడ్డుకున్నారు. దీంతో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఇంట్లోనే ఉండిపోయారు.శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే హైదరాబాద్ నగర ప్రతిష్ట దెబ్బతింటుందని మాజీ మంత్రి తలసానిశ్రీనివాస్‌యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.



సికింద్రాబాద్‌లోని తన నివాసం నుంచి బయలుదేరిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

రాజధాని దారులన్నీ జల్లెడ

రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు వెళ్లే దారులను పోలీసులు జల్లెడ పట్టారు. బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లలో గట్టినిఘాను పెంచారు. బస్సుల్లో.. రైళ్లల్లో ప్రయాణీకులను 'ఎక్కడికి వెళుతున్నారు?' అని అడిగి అనుమానం వచ్చినవారిని అదుపులోకి తీసుకొని సాయంత్రం విడిచిపెట్టారు. మరోవైపు హైదరాబాద్ ఇమ్లీబన్, జేబీఎస్ సహా సికింద్రాబాద్, హైదరాబాద్ రైల్వేస్టేషన్లపై ప్రత్యేక నిఘాను మోహరించారు. హైదరాబాద్ నలువైపులా ఉన్న టోల్‌గేట్ల వద్ద పోలీసులు నిఘా పెట్టారు.

బీఆర్ఎస్ నేతల ఇండ్ల వద్ద సెక్షన్ 144

బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టులను ఖండిస్తూ హైదరాబాద్ బయలుదేరేందుకు ప్రయత్నించిన నేతలను పోలీసులు ఎక్కడికక్కడే అరెస్టు చేశారు. తెలంగాణవాప్తంగా గురువారం అర్ధరాత్రి నుంచే ముందస్తు అరెస్టులు మొదలయ్యాయి. రాష్ట్రంలోని గ్రామస్థాయిలో సోషల్ మీడియాల్లో యాక్టివ్‌గా ఉండే కార్యకర్తల నుంచి మండల, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి నేతల వరకూ అరెస్టులు కొనసాగాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలను గృహ నిర్బంధం చేస్తూ.. వారి ఇండ్ల వద్ద 144 సెక్షన్ అమలు చేశారంటే పరిస్థితి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ అనధికారిక నిర్బంధాలను నిరసిస్తూ.. కొందరు కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారు. దీంతో వారిని సైతం పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలను పథకం ప్రకారం అర్ధరాత్రిళ్లు అరెస్టు చేయడంపై ప్రజల్లో తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తమవుతుంది. అయితే కొందరి తమ పోలీసు వాహనాల్లో తిప్పుతూ.. ఎక్కడికి తీసుకెళ్తున్నారో కూడా చెప్పలేదు. దీంతో పోలీసులు తమను ఏం చేస్తారోననే ఆందోళన బీఆర్ఎస్ కార్యకర్తల్లో నెలకొన్నది.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇల్లు అష్టదిగ్బంధం

మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇంటి వద్ద గురువారం అర్ధరాత్రి పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించి, అష్టదిగ్బంధం చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇంటి నుంచి వేలాది మంది కార్యకర్తలతో కలిసి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడీ గాంధీ ఇంటికి వెళ్లి సత్కరిస్తామని పేర్కొన్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి గురువారం రాత్రే శంభీపూర్‌లోని ఎమ్మెల్సీ రాజు ఇంటికి చేరకున్నాడు. పోలీసులను ఛేదించుకుని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నివాసానికి వెళ్లేందుకు యత్నించిన ఎమ్మెల్సీ శంభీర్‌పూర్ రాజు, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని పోలీసులు అడ్డుకుని హౌస్ అరెస్టు చేశారు. శంభీపూర్ రాజు నివాసానికి వచ్చిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలనూ అదుపులోకి తీసుకున్నారు. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఎమ్మెల్సీ నివాసానికి చేరుకుని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుకు సంఘీభావం ప్రకటించారు. సాయంత్రం 6గంటల వరకు నేతలను గృహనిర్బంధంలో ఉంచిన పోలీసులు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని ఇంటికివెళ్లేందుకు అనుమతించడంతో ఆయనతోపాటు ఎమ్మెల్సీ రాజు వెళ్లిపోయారు.

15 రోజుల పాటు ఫిజియోథెరపీ

హరీశ్‌రావుకు నొప్పి తీవ్రత పెరగటంతో పోలీసు వాహనాల నడుమ ఆయన శుక్రవారం గచ్చిబౌలిలోని ఏఐజీ దవాఖానలో పరీక్షలు చేయించుకున్నారు. భుజానికి దెబ్బతగిలినందున 15 రోజులపాటు ఫిజియోథెరపీ చేయించుకోవాలని సూచించినట్టుగా హరీశ్‌రావు మీడియాకు తెలిపారు. 15 రోజుల తరువాత మరోసారి పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్లు చెప్పారని తెలిపారు. హరీశ్‌రావు వెంట ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


ధర్నాలు.. నిరసనలు

ఎమ్మెల్యే హరీశ్‌రావు అరెస్టును నిరసిస్తూ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి మదర్ థెరిస్సా సెంటర్లో ధర్నా నిర్వహించారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూరుతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ దిష్టి బొమ్మలను దహనం చేశారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గోదావరిఖనిలోని గోదావరి బ్రిడ్జిపై నిరసనకు దిగారు. దీంతో అక్కడికి చేరుకున్న గోదావరిఖని పోలీసులు వారిని మంచిర్యాల జిల్లా జైపూర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

అడుగడుగునా నిర్బంధాలు

శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు, పార్టీ కండువాయే కాదు చివరికి గులాబీ రంగు కనిపిస్తే చాలు అరెస్ట్ చేసి లోపల వేస్తాం అన్నట్టు పోలీసులు వ్యవహరించారు. అడుగడుగునా నిర్బంధాలు, అరెస్టులతో తెలంగాణ ఉద్యమ రోజులను గుర్తు చేశారు.

లోకం పోకడ



బయట తిరుగుతుంటే కుక్కలు కరుస్తున్నాయని గురుకులంలో చేర్పిస్తే పాము కరిచింది డాక్టర్!

ప్రశ్నించే గొంతుకపై దాడి!

బీఆర్ఎస్ లక్ష్యంగా విచక్షణారహిత దాడులు
రాష్ట్రమంతా రెచ్చిపోతున్న కాంగ్రెస్ శ్రేణులు

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో ప్రశ్నించే గొంతులను లేకుండా చేయాలని కంకణం కట్టుకున్నట్టు తెలుస్తున్నది. ప్రతిపక్ష నేతలపై వరుసగా జరుగుతున్న దాడులు రాష్ట్రంలో శాంతిభద్రతలు పడకేసిన పరిస్థితికి అద్దం పడుతున్నాయి.

కాంగ్రెస్ దాడులు ఇవీ..

సెప్టెంబర్ 3: ఖమ్మంలో వరదబాధితులకు అండగా నిలిచేందుకు మాజీమంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో వెళ్లిన మాజీమంత్రులు సబితాఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, పువ్వాడ అజయ్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి సహా పలువురు బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున వచ్చి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. మాజీ మంత్రి హరీశ్‌రావు వాహనం ధ్వంసమైంది.

ఆగస్టు 17: మాజీ మంత్రి హరీశ్‌రావు అధికారిక నివాసంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేస్తూ ఫ్లెక్సీని చించేశారు.

ఆగస్టు 7: తుమ్మిళ్ల లిఫ్ట్ మోటర్‌ను అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఆన్ చేయగానే కొద్దిసేపటికే మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మోటర్‌ను బంద్‌చేసి వాగ్వాదానికి దిగారు. వారించిన ఎమ్మెల్యేను అరెస్టు చేశారు.

జూలై 20: నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం బెజ్జోరాలోని కప్పలవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని ప్రశ్నించిన బీఆర్ఎస్ యువజన విభాగానికి చెందిన కర్నే మహేందర్, అనిల్, నరేశ్‌పై కాంగ్రెస్ శ్రేణులు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు.

జూలై 1: నిరుద్యోగ యువకుల కోసం దీక్ష చేస్తున్న మోతీలాల్‌ను పరామర్శించేందుకు వెళ్లిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, రాకేశ్‌రెడ్డి సహా పలువురిని పోలీసులు అరెస్టు చేశారు.

జూలై 1: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులు మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ వాణీవీరారెడ్డిపై దాడికి పాల్పడ్డారు.

జూన్ 5: నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం మద్దిమడుగులో బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ ఉడుతల అంజయ్య కుటుంబంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేశా.

జూన్ 2: మంచిర్యాలలో బీఆర్ఎస్ పట్టణ ప్రధానకార్యదర్శి గడప రాకేశ్‌పై కాంగ్రెస్‌కు చెందిన 15 మంది ఇనుపరాడ్లు, కర్రలతో విచక్షణారహితంగా దాడిచేశారు.

మే 25: మెదక్ జిల్లా రామాయంపేట పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు గజవాడ నాగరాజుపై భూ వివాదం నెపంతో కాంగ్రెస్ నాయకుడు పోచమ్మల గణేశ్.. ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పు అంటించే ప్రయత్నం చేశాడు.

మే 23: బీఆర్ఎస్ కార్యకర్త బొడ్డు శ్రీధర్‌రెడ్డిని కాంగ్రెస్ కార్యకర్తలు పదునైన ఆయుధాలతో దాడిచేసి హతమార్చారు. భూ వివాదం నెపంతో మంత్రి జూపల్లి అనుచరులు ఈ దాడికి పాల్పడినట్టు ఆరోపణలున్నాయి.

మే 14: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో బీఆర్ఎస్ కౌన్సిలర్ ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఇంట్లోకి చొరబడి కర్రలతో దాడికి పాల్పడ్డారు.

ఏప్రిల్ 9: ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పండితాపురంలో కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ కొమ్మినేపల్లి గ్రామ అధ్యక్షుడు చల్లా హరి కుటుంబంపై దాడి చేశారు. హరి కుమారుడు జానీకి తీవ్ర గాయాలయ్యాయి.

ఏప్రిల్ 21: సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం సింగార్‌బొగుడ తండాలో సీసీ రోడ్డు పనులను ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ కార్యకర్త శ్రీనునాయక్‌ను పంచాయతీ పేరుతో పిలిచి కాంగ్రెస్ కార్యకర్తలు విచక్షణారహితంగా దాడి చేయటంతో ఆయన మరణించారు.

ఏప్రిల్ 10: నాగర్‌కర్నూల్ జిల్లా జొన్నలబొగుడలో మాజీ సర్పంచ్ ఇందిర, ఆమె భర్త రవినాయక్‌పై మంత్రి జూపల్లి అనుచరులు దాడికి పాల్పడ్డారు.

మార్చి 19: ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారనే అక్కసుతో ధర్మపురి నియోజకవర్గ బీఆర్ఎస్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ సల్వాజీ మాధవరావుపై కాం గ్రెస్ కార్యకర్తలు విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచారు.

ఫిబ్రవరి 20: కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని రామన్నపల్లె 3వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ మేడిపల్లి రవీందర్ భూకబ్జాలపై ఫిర్యాదు చేసినందుకు పలువురు యువకులపై ఇనుప రాడ్లతో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు.

ఫిబ్రవరి 13: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చలో నల్లగొండ పేరుతో నిర్వహించిన బహిరంగసభను అడ్డుకుంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించటంతో హైదరాబాద్ నుంచి సభకు హాజరయ్యేందుకు బయలుదేరిన మాజీమంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సహా పార్టీ ఎమ్మెల్యేలు ప్రయాణిస్తున్న బస్సుపై ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు దాడికి యత్నించారు.

జనవరి 29: యాదాద్రి-భువనగిరి జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి దౌర్జన్యానికి పాల్పడ్డారు. వేదిక మీద నుంచి పోలీసులతో నెట్టివేయించారు.

జనవరి 8: బీఆర్ఎస్‌లో చురుగ్గా పాల్గొంటున్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేశారన్న అక్కసుతో భూవివాదం నెపం మోపి ఆర్మీ మాజీ అధికారి మల్లేశ్‌ను దారుణంగా హతమార్చారని ఆయన భార్య, తల్లి డీజీపీకి ఫిర్యాదు చేశారు.

నిర్బంధంలో తెలంగాణ

• మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా శంభీపూర్‌లో..



మేడ్చల్ జిల్లా శంభీపూర్‌లో శంభీపూర్ రాజు ఇంటి నుంచి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నివాసానికి బయలుదేరుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

• కాప్రా సైనిక్‌పురిలో..



హైదరాబాద్‌లోని సైనిక్‌పురి నివాసంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

• ఆదిలాబాద్ జిల్లాలో..




నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

• మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలో..



కూకట్‌పల్లిలోని తన నివాసంలో హౌస్ అరెస్ట్‌కు వచ్చిన అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

• భద్రాద్రి జిల్లా ఇల్లెందులలో..



బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ గూండాగిరికి నిరసనగా భద్రాద్రి జిల్లా ఇల్లెందులో నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

• సిద్దిపేట జిల్లాలో..



గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

• హైదరాబాద్‌లో..



మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసం వద్ద ఆందోళ్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌ను అరెస్ట్ చేసి కారులో తీసుకెళ్తున్న పోలీసులు



వికారాబాద్ జిల్లా పరిగిలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేస్తున్న ఎస్ఐ సంతోష్, పోలీసులు



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లిలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌ను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

• మహబూబాబాద్ జిల్లాలో..



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

ఇమేజ్ డ్యామేజ్ చేసి!

రాత్రికి రాత్రి స్టాండ్ మార్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం

- నష్టమంతా జరిగాక గుర్తొచ్చిన హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్
- కౌశిక్‌రెడ్డిపై గాంధీ దాడిని ఎంజాయ్ చేసిన ప్రభుత్వ పెద్దలు
- బీఆర్‌ఎస్ ఇంటి సమస్యగా చిత్రీకరిస్తూ రాజకీయ వినోదం
- బూమరాంగ్ కావటంతో హడావుడిగా నష్ట నివారణ చర్యలు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరం.. ఇక్కడ చీమ చిటుక్కుమన్నా తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలు ఉలిక్కిపడతాయి. ఇప్పుడే కాదు.. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు సైతం ఈ మినీ భారతంలో చిన్న సంఘటన చోటుచేసుకున్నా ఇతర ప్రాంతాల్లోని కోట్ల మంది ఆందోళన చెందుతారు. అలాంటిది.. నిన్నటిదాకా సినిమాల్లోనే చూసిన దృశ్యాలు గురువారం నగర రోడ్లపై కనిపించాయి. చరిత్రలో తొలిసారిగా ఆంధ్రా ఫ్యాక్షనిజం ఛాయలు అందరినీ కలవరపరిచాయి. అత్యంత సురక్షితమైన ప్రాంతంగా విరాజిల్లుతున్న హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో పదుల సంఖ్యలో వాహనాల ఫుట్‌బోర్డుపై కొందరు నిలబడి తొడగొడుతూ వెళ్లి ఒక ఎమ్మెల్యే మీద దాడి చేయటం అందరినీ నివ్వెరపరిచింది. సగటు వ్యక్తి దీనిని హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు ఇది డ్యామేజ్‌గా భావించాడు. ఆందోళన పడ్డాడు. అధికారంలో ఉన్న పెద్దలు మాత్రం దీనిని రాజకీయ వినోదంగా చూశారు. సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ మీడియా చిట్‌చాట్‌లో ఇది బీఆర్‌ఎస్ అంతర్గత వ్యవహారం, తమకేం సంబంధం అని అభిప్రాయపడ్డారు. అంటే రాజకీయ నేతగా ఆయన రాజకీయ కోణంలోనే చూశారే తప్ప సీఎం హోదాలో పరిణామాలను విశ్లేషించుకోలేదు. పర్యవసానంగా 'చట్టం తన పని తాను' చేయలేకపోయింది. యథా రాజా.. తథా ప్రజా అన్నట్టు రాజకీయ కోణంలోనే వ్యవహరించింది. అందుకే కొండాపూర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని నిర్బంధించిన చట్టం.. కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అరికపూడి గాంధీని మాత్రం కట్టడి చేయలేకపోయింది.

అధికారంలో ఉన్నామన్న వాస్తవాన్ని మరిచి


రాజకీయ కోణంలో కాంగ్రెస్ ఇదే కోరుకోవచ్చు. కానీ ఆ పార్టీ అధికారంలో ఉన్నదనే వాస్తవాన్ని గుర్తించకపోవడంతో హైదరాబాద్ ఒక్కసారి అభద్రతకు లోనైంది. అంతర్జాతీయంగా భౌగోళికంగానే కాదు.. శాంతిభద్రతల పరంగా ఎవరెస్టులాంటి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కుప్పకూలిపోయింది. ఈ సత్యాన్ని పాలకులు గుర్తించేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. నిన్నటిదాకా అనేక ప్రశంసలు అందుకున్న పోలీస్‌శాఖ.. 'వైఫల్యం' అనే అప్రతిష్ఠను మూటగట్టుకోవాల్సి వచ్చింది. దీంతో రాత్రికి రాత్రి కాంగ్రెస్ ప్రభుత్వానికి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ బోధపడింది. శుక్రవారం ఉదయం నుంచే నష్ట నివారణ చర్యలు మొదలుపెట్టింది. తమ కండ్ల ముందే గురువారం అరికపూడి గాంధీ వర్గీయులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నా ప్రేక్షకపాత్ర పోషించిన పోలీస్ శాఖ.. 'ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే' కఠినంగా వ్యవహరిస్తామంటూ హూంకరించింది. అన్నింటికీ మించి నిన్నటిదాకా రాజకీయ కోణంలోనే పరిణామాల్ని విశ్లేషించిన సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మాత్రం హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తే ఊరుకోం అంటూ హెచ్చరించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పదేండ్లలో ఒక్క దుర్ఘటన లేదు

ఉమ్మడి ఏపీ పాలనలో హైదరాబాద్‌లో అనేక పర్యాయాలు కర్ఫ్యూ విధించాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఒక దశలో సీఎం కుర్చీ కోసం శాంతిభద్రతలనూ ఫణంగా పెట్టిన దాఖలాలు ఉన్నాయి. 4 సార్లు ఉగ్రవాదుల బాంబు పేలుళ్లు జరిగాయి. రాయలసీమ ఫ్యాక్షనిజం కోణంలోనూ హత్యలు జరిగాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేండ్లలో చిన్న దుర్ఘటన కూడా చోటుచేసుకోలేదు. అటు ఫ్యాక్షనిజం.. ఇటు ఉగ్రవాదం.. ఏ కోణంలో కూడా ఒక్క ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. అందుకే హైదరాబాద్ నగరం సురక్షిత నగరంగా పేరొంది అంతర్జాతీయ కంపెనీలు క్యూ కట్టాయి. ఐటీ రంగంలో సేఫెస్ట్ సిటీగా బ్రాండ్ ఇమేజ్ ఏర్పడటంతో ఐటీ రంగ ఉత్పత్తులు ఐదు రెట్లు పెరిగాయి.

9 నెలల్లో తలకిందులు

9 నెలల కాలంలోనే హైదరాబాద్ శాంతి భద్రతల్లో భారీ మార్పు.. నడిరోడ్డుపై హత్యలు పెరిగిపోయాయి. అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు ప్రవేశించాయి. సీఎం రేవంత్ కూడా తన సమీక్షలో నగరంలో శాంతిభద్రతలపై ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీలోనూ పెద్ద ఎత్తున చర్చ జరిగింది. చాలా వరకు ఘటనలు హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలోనే జరిగాయి. సైబరాబాద్ పరిధిలో పెద్దగా సంఘటనలు చోటుచేసుకోలేదు. గురువారం చోటుచేసుకున్న సంఘటన మాత్రం ఐటీ కారిడార్‌లో శాంతిభద్రతలపై ప్రజల్లో ఆందోళన మొదలైంది. పదుల సంఖ్యలో వాహనాల్లో వెళ్లి ఒక ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేయటమంటే.. సామాన్యుడి పరిస్థితి ఏమిటన్న సందేహం వచ్చింది. మీడియాలో లైవ్ కవరేజీతో వెళ్లి దాడి చేయటం, పోలీస్ బలగాలు ఉన్నా దాటుకొని వెళ్లటం.. పోలీస్‌శాఖ వైఫల్యమేనని తేలిపోయింది. గురువారం రాత్రి దాకా ఈ పరిణామాల్ని రాజకీయ వినోదంలా ఆస్వాదించిన ప్రభుత్వ పెద్దలు.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తుందనే వాస్తవాన్ని గుర్తించలేకపోయారు. నష్టం జరిగిపోయిన తర్వాత నిజాన్ని తెలుసుకున్నారు. దాంతో శుక్రవారం శాంతిభద్రతల కోణంలో హడావుడి మొదలైంది. రాత్రికిరాత్రి బ్రాండ్ ఇమేజ్ గుర్తుతెచ్చుకున్న రేవంత్ సర్కారు.. తెల్లారేసరికి స్టాండ్ మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



ప్రభుత్వ ఒత్తిడిలో పోలీస్?

- వరస ఫెయిల్యూర్స్‌తో పోలీస్‌శాఖకు మకిలీ
- ప్రతిపక్ష నేతల అరెస్టులెందుకో తెలియదు
- కాంగ్రెసోళ్లు దాడిచేస్తే కేసుల్లేవ్, అరెస్టుల్లేవ్
- ప్రభుత్వ పెద్దల ఆదేశాలకు మాత్రం జీ హుజూర్!
- గాంధీ ఇష్యూలో డీజీపీ, కమిషనర్లపై ప్రభుత్వ పెద్ద ఆగ్రహం!
- ఏరికోరి తెచ్చుకుంటే ఇజ్జత్ తీస్తున్నారంటూ గుస్సా

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): 'కరవమంటే కప్పకు కోపం.. విడువమంటే పాముకు కోపం' అన్న చందంగా తయారైంది తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారుల పరిస్థితి. రాజకీయ చదరంగంలో ప్రభుత్వ పెద్దల నుంచి రోజురోజుకూ పెరుగుతున్న ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నట్టు వాపోతున్నారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలను గుడ్డిగా పాటిస్తూ.. ఏం చేస్తున్నామో? ఏం చేయకూడదో? కూడా అర్థంకాని స్థితికి కొందరు పోలీసు ఉన్నతాధికారులు చేరుకున్నారు. పదేండ్ల పాటు ఫోకల్‌లో ఉన్నా.. నాన్ ఫోకల్‌లో ఉన్నా.. ఎవరి పని వారు కామ్‌గా చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసు వ్యవస్థ పటిష్టానికి కొన్ని తప్పనిసరిగా పాటించాల్సిన విధులను కూడా సమర్థంగా నిర్వర్తించలేకపోతున్నామని కొందరు సీనియర్ అధికారులు చెప్తున్నారు. కేసీఆర్ హయాంలో పోలీసు వ్యవస్థకు మెరుగులు దిద్దారని.. చేయాల్సినవి, చేయకూడనివి, తప్పనిసరిగా పాటించాల్సిన విధులపై ఆయన సీరియస్‌గా ఉండేవారని, ఇప్పుడు పరిస్థితి అంతా తలకిందులవుతుండగా.. తమపై తీవ్రస్థాయిలో ఒత్తిడి పెరుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

వరస ఫెయిల్యూర్స్‌తో వ్యతిరేకత

కొందరు పోలీసు అధికారుల తీరు.. మొత్తం వ్యవస్థకే మకిలీ తెచ్చింది. గుడ్డిగా ప్రభుత్వ పెద్దల ఆదేశాలు పాటిస్తూ వరుస తప్పిదాలు చేస్తుండటంతో ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నది. బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్ అక్రమ అరెస్టు దగ్గర్నుంచి గురువారం రాత్రి మాజీమంత్రుల అక్రమ అరెస్టు, గురువారం అర్ధరాత్రి అక్రమ నిర్బంధాల వరకూ ఏ క్లారిటీ లేకుండా తప్పు మీద తప్పు చేస్తూనే ఉన్నారు. ఓ తప్పుడు కేసులో క్రిశాంక్‌ను బలవంతంగా ఇరికించేందుకు.. గత ఏప్రిల్ 30 నుంచి మే 10 వరకు ముప్పుతిప్పలు పెట్టారు. ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి.. 10 రోజుల్లో 6 సెషన్ కోర్టులకు క్రిశాంక్ కేసు బెయిల్ బదిలీ చేసినా.. క్రిశాంక్ ఫోర్జరీ చేసినట్టు ఆధారాలు చూపలేకపోయారు. ఆ తర్వాత సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్నారంటూ తెలంగాణ సోషల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌ను సైతం అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఆయన అరెస్టు చూపేందుకు అధికారులు కుస్తీపడ్డారు. ఫిరాయింపు ఎమ్మెల్యే గాంధీ, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇష్యూలోనూ బీఆర్‌ఎస్ నేతలను ఎందుకు అరెస్టు చేశారో చెప్పలేకపోయారు. మాజీమంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి తదితరుల అరెస్టులపై సరైన క్లారిటీ లేక అభాసుపాలయ్యారు. ఎందుకు అరెస్టు చేశారో చెప్పుకోలేక పోలీసు ఉన్నతాధికారులు తిప్పలు పడి బీఆర్‌ఎస్ బృందాన్ని బతిమిలాడుకొని మరీ వదిలిపెట్టారు.

ప్రతిపక్షాలపై దాడులైతే అరెస్టుల్లేవ్!

తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నేతలు, వారి ఇండ్లు, ఆస్తులను ఎవరైనా కాంగ్రెస్ కార్యకర్తలు, గూండాలు ధ్వంసం చేస్తే వారిపై పేరుకే కేసులు నమోదు చేస్తున్నారు. దాడులకు తెగబడిన వారిని అరెస్టు చేసేందుకు మాత్రం సాహసించటం లేదు. అరెస్టు చేసినా సాయంత్రానికల్లా ఇంటికి పంపేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఖమ్మంలో వరద బాధితులకు సాయం చేసేందుకు బీఆర్‌ఎస్ అగ్రనేతలు వెళ్తే.. అక్కసుతో కాంగ్రెస్ గూండాలు దాడులు చేశారు. రాళ్లు, కర్రలతో నేతల కార్ల అద్దాలు ధ్వంసం చేశారు. సంతోష్‌రెడ్డి అనే వ్యక్తి ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నా అనుమానాస్పద వ్యక్తులు రెండు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొన్నారని తెలిసింది. అందులో ఒకటి జీరో ఎఫ్ఐఆర్ అని విశ్వసనీయ సమాచారం. అంతకుముందు సిద్దిపేటలో మాజీ మంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడిచేసిన కాంగ్రెస్ గూండాలపై నేటికీ ఎలాంటి చర్యలు లేవు. నల్లగొండలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే కిశోర్‌పై కాంగ్రెస్ గూండాలు దాడికి తెగబడితే ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సీఎం సొంత గ్రామంలో రుణమాఫీ వివరాలు తెలుసుకునేందుకు వెళ్లిన మహిళా జర్నలిస్టులపై దాడి చేసిన వారిపైనా చర్యలు లేవు. ప్రస్తుతం ఎమ్మెల్యే గాంధీ, అతని అనుచరులపై హత్యాయత్నం కేసులు నమోదుచేసినా కేవలం స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపేయటం, నిందితులకు పోలీసు స్టేషన్‌లో రాచమర్యాదలు చేయటం వెనుక అధికార పార్టీ పెద్దల ఒత్తిడి ఉన్నదని తెలుస్తున్నది. ఈ దాడుల్లో అధికార పార్టీకి చెందినవారు ఎవరున్నా సరే.. వారికి స్టేషన్ బెయిల్ ఇచ్చి, కుర్చీల్లో కూర్చోబెట్టి, అవసరమైతే చాయ్, స్నాక్స్ ఇచ్చి, రాత్రికి ఉండాల్సి వస్తే బిర్యానీ సైతం అందిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అదే ప్రతిపక్ష పార్టీకి చెందిన వారైతే విధులకు ఆటంకం కలిగించారనే పేరుతో ఉల్టా కేసులు కూడా పెడుతున్న ఘటనలు కలవరపెడుతున్నాయి.

మీకు చేతకాదంటే చెప్పండి

'బీఆర్‌ఎస్ హయాంలో ఎక్కడో నాన్ ఫోకల్‌లో ఉన్న మిమ్మల్ని మన ప్రజాప్రభుత్వంలో ఫోకల్‌లోకి తీసుకొస్తే.. మీరు చేసేది ఇలాగేనా? గాంధీ, కౌశిక్‌రెడ్డి ఇష్యూలో ఎందుకు ఇంత లొల్లి జరిగింది? అంత జరిగేంత వరకు మీరేం చేస్తున్నారు?' అంటూ ఓ ప్రభుత్వ పెద్ద శుక్రవారం పొద్దుపొద్దునే పోలీసు బాస్‌లకు తలంటినట్టు తెలిసింది. తన జిల్లా బోర్డర్ వరకూ ఈ ఇష్యూ వెళ్లడం, తన జిల్లా నుంచి కూడా బీఆర్‌ఎస్ సానుభూతిపరులు కేశంపేట పోలీస్‌స్టేషన్‌కు రావటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. 'ఏరికోరి తెచ్చుకుంటే ఎందుకబ్బా ఇజ్జత్ తీస్తారు. మీకు చేతగాదంటే చెప్పండి బీఆర్‌ఎస్ హయాంలో చేసిన వాళ్లతోనే పనిచేయించుకుంటా' అంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం. ఇంత జరుగుతుంటే తీరిగ్గా వచ్చి ఇంటెలిజెన్స్ సమాచారం ఇస్తారా? ప్రజల్లోకి ఎలాంటి సంకేతాలు వెళ్తాయో మీకు తెలుసా?' అంటూ ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. బీఆర్‌ఎస్ బృందాన్ని సైబరాబాద్ సీపీ ఆఫీసు వరకు ఎందుకు రానిచ్చారని, వాళ్లందరినీ కేశంపేట, తలకొండపల్లివైపు ఎందుకు తీసుకెళ్లారని కూడా ప్రశ్నించినట్టు తెలిసింది. ఇలాగైతే కష్టం అంటూ గట్టిగానే వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం. మొత్తానికి పదేండ్ల పాలనలో సగర్వంగా తలెత్తుకొని బతికిన తెలంగాణ పోలీస్ వైభవం.. ప్రజాపాలనలో రాజకీయ క్రీడలో రోజురోజుకు దిగజారుతున్నది. అధికారంవైపే కొమ్ముకాయడం, నాయకులు చెప్పినట్టే వినడంతో అభాసుపాలవుతున్నట్టు పోలీస్ వర్గాల్లోనే చర్చ జరుగుతున్నది.



రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మొదళ్లగూడలోని నివాసంలో హౌస్ అరెస్టు చేసిన నందిగామ పోలీసులు



మంచిర్యాల జిల్లా జైపూర్ పోలీసు స్టేషన్‌లో బీఆర్‌ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, నాయకులు

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

సామాజిక న్యాయ సాధనలో తొలిమెట్టు

దేశ నిర్మాణం, అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఉత్పాదక వర్గాలైన ఇతర వెనుకబడిన కులాలు (ఓబీసీలు) దశాబ్దాలుగా అణచివేతకు, దోపిడీకి గురవుతున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏండ్లు గడిచినా దేశ జనాభాలో దాదాపు 56 శాతం ఉన్న ఓబీసీలకు విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాల్లో సరైన వాటా లభించడం లేదు. మరో దిగ్భ్రాంతికరమైన విషయం ఏమిటంటే.. విద్య, ఉద్యోగ రంగాల్లో ఓబీసీలకు ఇప్పటికే ఉన్న రిజర్వేషన్లు కూడా నిరాకరిస్తున్నారు. అందుకే కుల ఆధారిత జనాభా గణన చేయాలి. తద్వారా సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వెనుకబాటుతనాన్ని గుర్తించి, బానిసత్వంలో కొట్టుమిట్టాడుతున్న బీసీలకు దామాషా పద్ధతిలో దేశవ్యాప్తంగా రిజర్వేషన్లు అమలుచేయాలి. అప్పుడే వారికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టవుతుంది. అంతేకాదు, సంపూర్ణ సామాజిక న్యాయం జరుగుతుంది.



డాక్టర్ దాసోజు శ్రవణ్‌కుమార్

మన దేశంలో కులమనేది సామాజిక గుర్తింపు మాత్రమే కాదు, అది ఆత్మగౌరవ సాధనం కూడా. కుల గుర్తింపు ఆధారంగా ప్రపంచంలోనే అత్యంత విస్తృతమైన సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయి. మన దేశంలో ఉన్న కుల వ్యవస్థ ఈ నాటిది కాదు, దశాబ్దాలుగా కొనసాగుతోంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు దాటినా, కొద్దిమంది చేతుల్లోనే దేశ ఆర్థిక సంపద, రాజకీయ పదవులు బందీ అయ్యాయి. చైతన్యానికి, ఉద్యమాలకు, విప్లవాలకు నిలయమైన తెలంగాణలో కూడా ఒక కులం మాత్రమే రాజ్యం, అధికారం, ఆర్థిక వనరులు, అవకాశాలను హస్తగతం చేసుకొని ప్రజాపాలన పేరిట ఫ్యూడల్ రాచరికాన్ని, దోపిడీ స్వామ్యాన్ని కొనసాగిస్తున్నది. కులగణనను తిరస్కరించడమనేది కళ్లు మూసుకుని పిల్లి పాలు తాగినట్టుగానే భావించాలి. అంతేకాదు, ఓబీసీల వృత్తి అవకాశాలను నాశనం చేయడంతో పాటు వారి ఆత్మగౌరవాన్ని, గుర్తింపును, అస్తిత్వాన్ని హరించే ప్రయత్నంగా పాలకవర్గాలు గ్రహించాలి.

కుల ఆధారిత జనాభా గణన చేయడమంటే సమాజంలో ఉన్న అన్ని కులాలకు చెందిన జనాభాతో పాటు వారి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ స్థితిగతులపై సమాచారం సేకరించడం. ఓబీసీ జనాభా వివరాలతో పాటు, వారి వెనుకబాటుతనాన్ని కూడా నిర్ధారించాలనేది చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్. ప్రజల జీవన స్థితిగతులు, వారి కష్టాలు, కన్నీళ్ల గురించి పాలకవర్గాలకు పూర్తి సమాచారం, అవగాహన లేకపోతే ఉన్నవాడికి, లేనివాడికి, సామాజికంగా అణచివేతకు గురైనవాడికి, అధిపత్య వర్గాలకు ఉన్న అంతరాలు ఎలా తెలుస్తాయి? నిరుపేదల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు రూపొందించి, వాటిని ఎలా అమలు చేస్తాయి? వెనుకబాటుతనంపై శాస్త్రీయ విధానంలో అధ్యయనం చేయకుండా, గణించకుండా వారి అవసరాలను ఎలా తీర్చగలరు? వ్యాధిని నిర్ధారించకుండా వైద్యం చేయడం సాధ్యమా? ఓబీసీల గణన చేయకుండా వారి అవసరాలు, సమస్యలు తీరుస్తామని మాట్లాడటం వ్యాధి గురించి తెలియకుండా మందు ఇవ్వడం లాంటిదే.

అయితే, ఓబీసీ జనాభా వివరాలు లేనందున ఈ అణగారినవర్గాలకు ఉద్దేశించిన ప్రస్తుత రిజర్వేషన్లను కూడా అగ్రవర్ణ పాలకులు తిరస్కరిస్తున్నారు లేదా అనుభవిస్తున్నారు. ఉదాహరణకు అనేక పీఎస్‌యూలు (పబ్లిక్ సెక్టార్ యూనిట్లు), కేంద్ర ప్రభుత్వ సంస్థలు, విభాగాలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఐఐటీ, ఐఐఎం లాంటి ఉన్నత విద్యా సంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్లు అమల్లో లేవు. నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) వంటి ప్రధాన కేంద్ర సంస్థల్లో ఓబీసీలకు రిజర్వేషన్లను నిరాకరించిన విషయాన్ని ఎన్‌సీబీసీ ద్వారా గతంలో మేం సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లాం.

మేం తీవ్రంగా పోరాడితే తప్ప, నల్సార్‌లో బీసీ రిజర్వేషన్లు అమలు కాలేదు. ఇఫ్లూలో బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఐఐటీ, ఐఐఎంలలో కూడా అదే పరిస్థితి. మన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ జీవితాల్లో కులం ప్రధాన పాత్ర పోషిస్తున్నప్పటికీ, బహుళంగా కుల ఆధారిత నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ, 1931 నుంచి విశ్వసనీయమైన కుల డాటా అందుబాటులో లేకపోవడం విచిత్రం. 1951 నుంచి 2011 వరకు స్వతంత్ర భారతదేశంలోని ప్రతి జనాభా గణన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలపైనే జరిగిందే తప్ప ఇతర కులాలపై కాదు.

రెండవ వెనుకబడిన తరగతుల కమిషన్‌గా గుర్తింపు పొందిన బీపీ మండల్ కమిషన్ 1931 జనాభా లెక్కల్లో ఓబీసీలకు సంబంధించిన డాటా ఆధారంగా నివేదిక రూపొందించి, 27 శాతం రిజర్వేషన్లు ప్రతిపాదించింది. నేటికీ కొన్ని ప్రభుత్వాలు దానిపై ఆధారపడుతున్నాయి. జంతువులు, పక్షులు, నిర్జీవ వస్తువుల డాటా కూడా ప్రభుత్వాల వద్ద ఉంది. కానీ, దురదృష్టవశాత్తు ఈ దేశంలో ఓబీసీలకు సంబంధించిన డాటా మాత్రం లేదు. ఫలితంగా, ఓబీసీలు రాజ్యాంగపరమైన రక్షణ లేకుండా సమాజంలో తీవ్ర వివక్ష, ప్రాథమిక హక్కుల తిరస్కరణను ఎదుర్కొంటున్నారు.

వాస్తవానికి, 2021 జనాభా లెక్కల్లో అన్ని కులాల లెక్కింపు ఉంటుందని 2019 ఎన్నికలకు ముందు అప్పటి హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రకటించారు. అయితే ప్రస్తుత కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాత్రం ఆ నిర్ణయంపై యూ టర్న్ తీసుకున్నారు. రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్ ప్రకారం జనాభా గణన అనేది కేంద్ర ప్రభుత్వం బాధ్యత. కానీ, ఆ విషయం తెలిసినా, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా కులగణన భారాన్ని

> **దురదృష్టవశాత్తూ కాంగ్రెస్ సర్కార్ ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్‌లోనే బీసీలకు తీవ్ర అన్యాయం జరిగింది. బీసీ డిక్లరేషన్‌లో ఉన్న 26 హామీల్లో ఏ ఒక్కదానికి అందులో స్పష్టత ఇవ్వలేదు. అంతేకాదు, ఏ ఒక్క హామీకి బడ్జెట్ కేటాయింపులు చేయలేదు. తెలంగాణలో 56 శాతం జనాభా ఉన్న బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌ను పట్టించుకున్న దాఖలాలు లేవు.**



రాష్ట్ర ప్రభుత్వాలపైకి నెట్టివేస్తున్నది. ఈ విధంగా తీవ్రమైన రాజ్యాంగ గందరగోళానికి గురిచేస్తూ తన ద్వంద్వ వైఖరిని బీజేపీ సర్కార్ ప్రదర్శిస్తోంది. అయితే, ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ మాత్రం కులగణన జరపాలని అభిప్రాయపడ్డారు. ఆయన వ్యాఖ్యల నేపథ్యంలో మోదీ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకొని జాతీయ స్థాయిలో కులగణన చేయాలని మెజారిటీ ప్రజలు కోరుతున్నారు.

140 కోట్ల జనాభా ఉన్న మన దేశంలో దాదాపు 65-75 కోట్ల మంది ఓబీసీలు ఉన్నారని ఓ అంచనా. కానీ, దురదృష్టవశాత్తు 2-5 శాతం కులాలు మాత్రమే విద్య, ఉపాధి అవకాశాలతో పాటు రాజకీయ, ప్రభుత్వ ప్రయోజనాలను పొందుతున్నాయి. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా మెజారిటీ ఓబీసీలు కడు పేదరికంలో మగ్గుతున్నారు. అంతేకాదు, అనేక వెనుకబడిన తరగతులవారు (ఎంబీసీ), డీనోటిఫైడ్ సంచార తెగలవారు (డీఎన్టీ) ఇప్పటికీ ఎలాంటి సామాజిక భద్రత లేకుండా కడు పేదరికాన్ని అనుభవిస్తూ బిచ్చగాళ్లలా జీవిస్తున్నారు. రాజకీయ అణచివేతను ఎదుర్కొంటున్నారు.

'రాజకీయ శక్తి అన్ని రకాల అభివృద్ధికి మాస్టర్ కీ' అని పేర్కొన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నిజమైన సాధికారతకు న్యాయమైన రాజకీయ ప్రాతినిధ్యం అవసరమని ప్రతిపాదించారు. వెనుకబడిన తరగతుల్లో 100 కంటే ఎక్కువ కులాలవారు ఇప్పటివరకు ప్రజాప్రతినిధులుగా ఒక్క అవకాశమూ పొందలేదు. ఇది అత్యంత వెనుకబడిన తరగతులు, సంచార తెగల దయనీయ స్థితికి నిదర్శనం. ఎన్నికల వ్యవస్థ, భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థల్లోని లోపాలను ఇది ఎత్తిచూపుతున్నది.

'సంఖ్య తెలియకుండా సమగ్ర సంక్షేమం చేయలే'మన్న దార్శనిక దృక్పథంతో తెలంగాణ ఏర్పడిన తొలి నాళ్లలోనే నాటి సీఎం కె.చంద్రశేఖర్ రావు ఒక్కరోజులోనే సమగ్ర కుటుంబ సర్వేను పూర్తిచేశారు. అయితే, ఆ సమాచారానికి చట్టబద్ధత లేకుండా చట్టపరమైన చిక్కులు రావడంతో ప్రణాళికలు తయారు చేసుకోవడానికి ఆ డాటాను వాడారు. దాని ఆధారంగా అన్ని కులాల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశారు. అంతేకాదు, ఓబీసీ జనాభాను లెక్కించడానికి కుల ఆధారిత జనాభా గణన కోసం 2021 అక్టోబర్‌లో నాటి సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ సర్కార్ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. సమానత్వం, సామాజిక న్యాయం కోసం సమగ్ర ఓబీసీ సహిత జనాభా గణన అవసరమని సీఎం హోదాలో కేసీఆర్ నిర్ద్వంద్వంగా ప్రకటించారు. అంతేకాదు, ఈ అంశంపై త్వరగా చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీని కూడా కోరారు.

ఈ నేపథ్యంలో 2023లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను ఆవిష్కరించి, కులగణన నిర్వహిస్తామని రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. 2023 నవంబర్ 10న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఏఐసీసీ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, రేవంత్‌రెడ్డి, ఇతర సీనియర్ నాయకుల సమక్షంలో ఈ డిక్లరేషన్‌ను ప్రకటించారు. కులగణన చేపట్టడం, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో 42 శాతానికి బీసీ రిజర్వేషన్లను పెంచడం అందులోని కీలకమైన హామీలు. బీసీ రిజర్వేషన్లలో ఉపవర్గీకరణను అమలు చేయాలని, అతి వెనుకబడిన, సంచార గిరిజనులకు న్యాయబద్ధమైన ప్రాతినిధ్యం కల్పించాలని ఈ డిక్లరేషన్ ప్రతిపాదించింది. పంచాయతీలు, పురపాలక సంఘాల్లో 23,973 కొత్త నాయకత్వాన్ని ఇది పెంపొందిస్తుంది. మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించి, బీసీల సంక్షేమానికి ఐదేండ్లలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేయడం, అత్యంత వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖను ఏర్పాటు చేయడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయడం వంటి హామీలు వాటికి అదనం. ప్రభుత్వ సివిల్ నిర్మాణ, నిర్వహణ కాంట్రాక్టుల్లో వాటా ఇస్తామని కూడా కాంగ్రెస్ వాగ్దానం చేసింది. చిన్న వ్యాపారాలు స్థాపించడానికి, ఉన్నత విద్యనభ్యసించేందుకు ఎలాంటి తాకట్టు లేకుండా బీసీ యువతకు రూ.10 లక్షల వరకు వడ్డీ రహిత రుణాలు ఇస్తామని హామీ ఇచ్చింది. అలాగే వృద్ధాప్య పింఛన్ అర్హత వయస్సును, ముఖ్యంగా కళాకార వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న బీసీల అర్హత వయస్సును 57 నుంచి 50 ఏండ్లకు తగ్గిస్తామని చెప్పింది. ముదిరాజ్, ముత్రాసి, తెనుగోలు వంటి కులాలను బీసీ-డీ నుంచి బీసీ-ఏ రిజర్వేషన్ కేటగిరీకి మారుస్తామని డిక్లరేషన్‌లో ప్రతిపాదించింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి సర్కార్ జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వును పునరుద్ధరిస్తామని వాగ్దానం చేసింది.

అయితే, దురదృష్టవశాత్తూ కాంగ్రెస్ సర్కార్ ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్‌లోనే బీసీలకు తీవ్ర అన్యాయం జరిగింది. బీసీ డిక్లరేషన్‌లో ఉన్న 26 హామీల్లో ఏ ఒక్క దానికి అందులో స్పష్టత ఇవ్వలేదు. అంతేకాదు, ఏ ఒక్క హామీకి బడ్జెట్ కేటాయింపులు చేయలేదు. 'ఓడలో ఉన్నప్పుడు ఓడ మల్లన్న ఒడ్డెక్కినంక బోడి మల్లన్న' అన్నట్లుగా.. తెలంగాణలో 56 శాతం జనాభా ఉన్న బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌ను పట్టించుకున్న దాఖలాలు లేవు. తెలంగాణను ఒక సామాజికవర్గానికి భోజ్యంగా మలచుకుని, అన్ని పదవులను ఒకే సామాజికవర్గానికి కట్టబెడుతూ తన అణచివేత ఫ్యూడల్ వైఖరిని రేవంత్ ప్రదర్శిస్తున్నారు. అణచివేతకు గురైన వర్గాల ఆత్మగౌరవాన్ని మరింతగా అణచివేస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు ముందు 2024 ఫిబ్రవరి 16న బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీల కులగణన కోసం సమగ్ర సామాజిక-ఆర్థిక సర్వేను నిర్వహించాలని శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయి. కులగణన కోసం రూ.150 కోట్లు కేటాయిస్తున్నట్టు 2024 మార్చి 16న జీవో నెం.26ను కాంగ్రెస్ సర్కార్ జారీచేసింది. రాజకీయ లబ్ధి కోసం ఈ తీర్మానాలు, ఉత్తర్వుల గురించి పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ భారీగా ప్రచారం చేసింది. కానీ, ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

అయితే, సమగ్ర కులగణన చేసి జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లను పెంచాలని, కర్ణాటక, బీహార్ రాష్ట్రాల్లో లాగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ఉపవర్గీకరణ చేయాలని క్షేత్రస్థాయిలో గళమెత్తిన మేం న్యాయపోరాటాన్ని ప్రారంభించాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేశాం. తెలంగాణలో సమగ్ర కులగణన చేయాలని, అంతేకాకుండా బీసీల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేయాలని కోరాం. కులగణన సర్వే 9 నెలలు వాయిదా పడింది. ఈ నేపథ్యంలో బీసీ కమిషన్ కొనసాగుతుండగానే.. సమగ్ర కులగణన చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, బీసీ రిజర్వేషన్ల పెంపును నిర్లక్ష్యం చేయాలని ఒక పథకం ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి కుట్రపన్నారు. అదే సమయంలో నేను (దాసోజు శ్రవణ్‌కుమార్), జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎర్ర సత్యనారాయణ దాఖలు చేసిన మూడు వేర్వేరు రిట్ పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు విస్తృత విచారణ జరిపింది. వాదోపవాదాలు విన్న తర్వాత 'వికాశ్ కృష్ణారావు గవాలి వర్సెస్ ది స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆధారంగా చేసుకొని విప్లవాత్మకమైన తీర్పు ఇచ్చింది. రాష్ట్రాన్ని యూనిట్‌గా కాకుండా, ప్రతి స్థానిక సంస్థను యూనిట్‌గా తీసుకొని వెనుకబాటుతనాన్ని, స్థితిగతులను అధ్యయనం చేయాలని అందులో పేర్కొంది. తద్వారా తగిన రిజర్వేషన్లను అమలుచేయాలని ఆదేశించింది.

హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో సమగ్ర కులగణనను తెలంగాణ ప్రభుత్వం చేపట్టాల్సిన అవసరమున్నది. అన్ని కులాల స్థితిగతులను పోల్చి, తులనాత్మకంగా బీసీల వెనుకబాటుతనంపై సమగ్ర శాస్త్రీయ పద్ధతుల్లో అధ్యయనం చేయాలి. దాని ఆధారంగా పూర్తి సమాచారంతో రిజర్వేషన్ల పెంపును సమర్థించడానికి వీలుగా పటిష్ఠమైన ఆధారాలను సుప్రీంకోర్టులో సమర్పించాలి.

భారత రాజ్యాంగ స్ఫూర్తిని అనుసరించి ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మాట్లాడుతున్న సామాజిక న్యాయాన్ని అమలుచేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావించినట్టయితే.. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చిన విధంగా రిజర్వేషన్లను పెంచాలి. దాంతో పాటు ఉపవర్గీకరణను స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ రంగాల్లో మాదిరిగా అమలు చేయాలి. దానికి మూలాధారం సమగ్ర కులగణన. అయితే అంతర్జాతీయ వేదికలపై కులగణన గురించి మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ.. తెలంగాణలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కొనసాగుతున్న అరాచకాలను, అణచివేతలను సరిదిద్దాల్సిన అవసరం ఉంది. 'తనను తాను సంస్కరించుకున్న వ్యక్తి మాత్రమే ఇతరులను సంస్కరించే అధికారాన్ని పొందుతాడు' అనే విషయాన్ని ఆయన గుర్తెరగాలి.

ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. భారత అత్యున్నత న్యాయస్థానం రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని విధించింది. కాబట్టి దానిని అధిగమించలేమనే తీవ్రమైన దురభిప్రాయం చాలామందిలో ఉంది. కానీ, సమగ్ర కులగణనను నిర్వహించి, బీసీల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వెనుకబాటుతనానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని సమర్పించినట్టయితే రిజర్వేషన్ల పెంపును పరిశీలించవచ్చని 'కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో, ఇతర అనేక సందర్భాల్లో సుప్రీంకోర్టు తెలిపింది. అయినప్పటికీ, ఫ్యూడల్ పాలకవర్గాలు ఈ విషయాన్ని తొక్కిపెట్టి, పక్కదారిపట్టించి, రిజర్వేషన్ల పెంపు జరగకుండా బీసీలను మోసం చేస్తున్నాయి.

తెలంగాణ రాష్ట్రంలోనే కాదు, దేశవ్యాప్తంగా బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకోవాలంటే, తెలంగాణలో జరుగుతున్న ఆధిపత్యవర్గం అణచివేత ధోరణి పోవాలంటే సమగ్ర కులగణన జరగాల్సిందే. ముఖ్యంగా, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి అయినా సరే అమలుచేయించాలి.

నిర్బంధాలతో నిజాలు దాగవు!

'నేను తప్పులు చేస్తూ వెళ్తా.. మీరు చూస్తూ నోరు మూసుకోవాలి' అన్న చందంగా ఉంది తెలంగాణలో నేటి పరిస్థితి. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను చూస్తుంటే సమైక్య పాలనలో తెలంగాణ ఉద్యమాన్ని అణచివేయటానికి అడుగడుగునా నిర్బంధాలు చేసిన రోజులు యాదికొస్తున్నాయి. నాడు ఉద్యమకారులు, బీఆర్‌ఎస్ నాయకులను కాలు బయటపెడితే చాలు అరెస్టు చేశారు. రోడ్డెక్కితే దాడులు చేశారు. అలాంటి విష సంస్కృతే మళ్లీ తెరమీదికొచ్చింది.



తెలంగాణ విజయ్
94919 98702

స్వరాష్ట్రంలో గత పదేండ్లలో ఎన్నడూ లేని పరిస్థితి నేడు రాష్ట్రంలో నెలకొన్నది. ప్రశ్నించినవారిపై దాడులు, స్వయంగా ముఖ్యమంత్రే బూతుపురాణాన్ని అందుకోవడాన్ని చూస్తుంటే ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ ఎంత అసహనంతో ఉన్నాయో అర్థమవుతున్నది. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి హుందాగా ప్రవర్తించాల్సింది పోయి, 'పేగులు మెడలో వేసుకుంటా, గుడ్లు పీకి గోలీలు ఆడుతా' అంటూ వికృత భాషను ప్రయోగిస్తుండటాన్ని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు.

కాంగ్రెస్ సర్కార్ కొలువైన నాటినుంచీ రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తున్నది. కక్ష సాధింపు రాజకీయాలే లక్ష్యంగా పాలన సాగుతున్నది. హామీల అమలుపై నిలదీసినా, ప్రభుత్వ విధానాలపై ప్రశ్నించినా, లోపాలను ఎత్తిచూపినా అసభ్య పదజాలంతో దూషించడమో, అరెస్టు చేసి నిర్బంధించడమో పరిపాటిగా మారింది. అసెంబ్లీలో మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నల ధాటిని తట్టుకోలేక.. విషయాన్ని పక్కదారి పట్టించేందుకు సాక్షాత్తూ సీఎం రేవంత్‌రెడ్డే బూతుపురాణం అందుకున్నారు. 'వెంటనే బ్యాంకులకు వెళ్లి రూ.2 లక్షలు తెచ్చుకోండి. మేం రాగానే డిసెంబర్ 9న మాఫీ చేస్తాం' అని ఎన్నికల ముందు రేవంత్ డంబాచారాలు పలికారు. తీరా అధికారంలోకి వచ్చాక రుణమాఫీ, రైతుభరోసాలను మర్చిపోయారు. పార్లమెంట్ ఎన్నికలు రాగానే మళ్లీ ఆయనకు రైతులు యాదికొచ్చారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తానని ఊరూరా దేవుళ్లపై ఒట్లు వేసి మాట తప్పారు. ఓవైపు రుణమాఫీ అవ్వని రైతులు రోడ్డెక్కడం, మరోవైపు హరీశ్‌రావు నిలదీస్తుండటంతో అసహనంతో ఆయన



క్యాంపు కార్యాలయంపై దాడి చేయించారు. మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్ ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షాశిబిరంపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులపై ప్రశ్నించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని అసెంబ్లీ సాక్షిగా అవమానించారు. హామీలు ఇవ్వడం, అమలు చేయలేక చేతులెత్తేయడం, ప్రశ్నించినవారిపై దాడులకు తెగబడటం.. ఇదెక్కడి ప్రజాస్వామ్యం.

రాష్ట్రంలో నిర్బంధకాండకు రేవంత్ సర్కార్ తెరతీసింది. రైతు రుణమాఫీపై రైతుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వెళ్లిన జర్నలిస్టులపై స్వయంగా ముఖ్యమంత్రి స్వగ్రామంలో దాడికి పాల్పడటం, సినీ ఫక్కీలో వారిని చేజింగ్ చేయటమే అందుకు నిదర్శనం. యూట్యూబ్ చానళ్లను అడ్డుపెట్టుకుని గెలిచిన రేవంత్.. నేడు యూట్యూబ్ జర్నలిజంపై వెకిలిగా మాట్లాడటం అవకాశవాద రాజకీయం కాదా? అంతేకాదు, డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ దిలీప్ కొణతంను అక్రమంగా అరెస్ట్ చేశారు. న్యాయస్థానం చివాట్లు పెట్టడంతో చేసేదేం లేక వదిలేశారు. మరోవైపు సమైక్య పాలకులు అనుమతులిచ్చిన ఇండ్లను హైడ్రా పేరిట కూల్చి పేదలను కాంగ్రెస్ సర్కార్ రోడ్డున పడేస్తున్నది. ఇదెక్కడి దౌర్జన్యమని ప్రశ్నించిన బాధితులపైనే కేసులు పెడుతుండటం బాధాకరం.

ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంలో హైకోర్టు చీవాట్లు పెట్టినా కాంగ్రెస్ బుద్ధి మారడం లేదు. ఫిరాయింపు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి పీఏసీ చైర్మన్ పదవిని కట్టబెట్టి ఫిరాయింపులను పరాకాష్ఠకు తీసుకెళ్లింది. ఈ అంశంపై బీఆర్‌ఎస్ నిలదీయడంతో ఇరకాటంలో పడ్డ కాంగ్రెస్ మళ్లీ డైవర్షన్ రాజకీయాలకు తెరలేపింది. తాను బీఆర్‌ఎస్‌లోనే ఉన్నానంటూ గాంధీ డ్రామా మొదలుపెట్టారు. ఆయన మాటలకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి కౌంటర్ ఇవ్వడంతో కాంగ్రెస్ బరితెగించింది. కౌశిక్‌రెడ్డిని ఇంట్లోనే నిర్బంధించి, అరికెపూడి గాంధీకి మాత్రం ఎర్ర తివాచీ పరిచింది. ఎస్కార్ట్ ఇచ్చి మరీ కౌశిక్‌రెడ్డి ఇంటిమీదకు దాడికి పంపింది. దాడి సందర్భంగా గాంధీ మాట్లాడిన బూతులు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయి. అంతేకాదు, దాడి చేయడమే కాకుండా బాధితుడిపైనే కేసు నమోదు చేయడం హేయం. ఇదేంటని ప్రశ్నించిన బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు రాత్రంతా వారిని ఇబ్బందులకు గురిచేశారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ప్రజలపై లాఠీలు ఝుళిపించారు. హరీశ్‌రావు అరెస్టును చూసి రాష్ట్రమంతా ఎలా స్పందించిందో, ఊరు ఊరు ఎలా కదిలిందో పాలకులు గుర్తెరగాలి. అది ఉద్యమ చైతన్యం. ఉద్యమంలో సమైక్య పాలకులు నిర్బంధించినా, జైలులో పెట్టినా వెన్నుచూపక పోరాడింది గులాబీ దళం. కేసీఆర్ నాయకత్వంలో పోరు నడిపి తెలంగాణను సాధించింది.

పదేండ్ల పాటు తెలంగాణలో ఎలాంటి అలజడి లేదు. ఇలాంటి విష సంస్కృతికి కేసీఆర్ ఎక్కడా అవకాశం ఇవ్వలేదు. మొన్నటివరకు కుక్కిన పేనులా పడున్నవారు నేడు కాంగ్రెస్ పాలనలో మళ్లీ రౌడీయిజానికి పాల్పడుతున్నారు.

ఈ నిర్బంధాలు తెలంగాణ సమాజానికి కొత్తకాదు. నిర్బంధాలు, దాడులతో నిజాలను దాచాలనుకోవడం మూర్ఖత్వమే. అధికారం ఎవరికి శాశ్వతం కాదు. పోలీసులను అడ్డుపెట్టుకుని ఎంతో కాలం పాలన కొనసాగించలేరు. నిర్బంధపు కంచెలు తెంచడం ప్రజలకు, బీఆర్‌ఎస్‌కు కొత్తకాదు. బీఆర్‌ఎస్ ఉద్యమ పార్టీ. ఎదురుదెబ్బ తగిలిన ప్రతీసారి ఫీనిక్స్ పక్షిలా రెట్టింపు వేగంతో పైకి లేస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం సోయి తెచ్చుకొని ఈ పీఆర్ స్టంట్లను బంద్ చేయాలి. పరిపాలనపై దృష్టిపెట్టి హామీలను అమలుచేయాలి. లేదంటే ప్రజా తిరుగుబాటును ఎదుర్కోవాల్సి వస్తుంది.

ఉత్తరం

ప్రజాస్వామ్యానికే తలమానికం

పీఏసీ చైర్మన్‌గా ప్రతిపక్ష నాయకుడిని ప్రకటించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆదిలోనే తప్పటడుగులు వేసింది. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొన్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని నియమించడంతో రాష్ట్రంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో ఎన్నడూ లేని సంప్రదాయానికి కాంగ్రెస్ పార్టీ తెర ఎత్తడంతో నిరసనలు, ఆందోళనలతో రాష్ట్రం అట్టుడుకుతున్నది. గాంధీ నియామకంపై ప్రతిపక్ష బీఆర్‌ఎస్ ఆక్షేపణలు తెలియజేస్తుండగా, అధికార కాంగ్రెస్ పార్టీ తన తప్పిదాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నది. అరికెపూడి నియామకంపై నిర్ణయాన్ని మార్చుకోవాల్సిన కాంగ్రెస్సే ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌పైకి ఆయనను ఉసిగొల్పుతున్నది. ప్రభుత్వ పెద్దలే గాంధీని ముందుకు నడిపిస్తున్నారనే విషయం స్పష్టంగా అర్థమవుతున్నది. ఇదిలా ఉంటే గాంధీ అనుచర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై దాడికి దిగడం సరికాదు. ఇది ప్రజాస్వామానికే తలమానికం.


- కొత్వాల్ ప్రవీణ్, బేగంపేట్, హైదరాబాద్



ప్రశ్నించినందుకే అవమానించారా!

ఒక వ్యాపారవేత్త క్షమాపణలు కోరుతున్న వీడియోను బీజేపీ నేతలు అసలు ఎందుకు చిత్రీకరించారు? ఆ వీడియోను విడుదల చేయడంలో ఆంతర్యమేంటి? కేంద్ర మంత్రి నిర్మలను 'విలువైన ప్రశ్న' అడిగే ధైర్యం చేసిన వ్యాపారవేత్తను అవమానించడమే వారి ఉద్దేశమా? నిజంగానే ఆ వ్యాపారవేత్త మంత్రిని క్షమాపణ కోరి ఉంటే అది ప్రైవేట్‌గా జరగాలి. అందు కు సంబంధించి ఒక ప్రకటనను విడుదల చేస్తే సరిపోయేది కదా!

- సుమంత్ సీ రామన్, రాజకీయ విశ్లేషకులు



- కేసీఆర్‌ను కలిసిన బీసీ కమిషన్ మాజీ సభ్యులు



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను బీసీ కమిషన్ మాజీ సభ్యులు కిశోర్ గౌడ్, ఉపేంద్ర, శుభప్రద్ పటేల్ కలిశారు. శుక్రవారం ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్న వీరు పలు అంశాలపై చర్చించారు. పార్టీ పూర్వవైభవానికి కృషి చేయాలని ఈ సందర్భంగా కేసీఆర్ వారికి సూచించారు. – హైదరాబాద్

రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ

- బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టులు, నిర్బంధాలు
- బీఆర్ఎస్ అంటే సీఎం రేవంత్‌కు వణుకెందుకు?
- గూండాలను వదిలి మా పార్టీ నేతలనే అరెస్టు చేస్తరా?
- మా పార్టీ శ్రేణులను ఎక్కడికక్కడ విడుదల చేయాలి
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ రాజ్యం పేరిట రాష్ట్రంలో ఆనాటి ఎమర్జెన్సీ రోజులను తలపిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలను పోలీసులు ఎక్కడికక్కడ అక్రమ అరెస్ట్‌లు, గృహ నిర్బంధాలు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలను గురువారం అర్ధరాత్రి వరకు అక్రమ అరెస్టులు చేసి, శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా హౌస్ అరెస్టులు చేస్తారా? అని మండిపడ్డారు. ప్రజాపాలనలో ప్రతిపక్షాలు మీటింగ్ పెట్టుకోవడానికి కూడా అనుమతి లేదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ సమావేశం పెట్టుకుంటే ముఖ్యమంత్రికి వెన్నులో వణుకెందుకని ప్రశ్నించారు. మా పార్టీ నేతలంటే సర్కారుకు ఎందుకింత భయమో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలను గృహనిర్బంధం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా ముందస్తు అరెస్టులు చేసిన తమ పార్టీ నేతలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

గాంధీ అనుచర గూండాలను అరెస్టు చేయాలి

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిచేసిన అరికెపూడి గాంధీ అనుచరులైన కాంగ్రెస్ గూండాలను వెంటనే అరెస్ట్ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిని వదిలేసి బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడం ప్రభుత్వ దిగజారుడు విధానాలకు నిదర్శనమని పేర్కొన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, బీఆర్ఎస్ నేతలపై ప్రభుత్వం జులుం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని తేల్చిచెప్పారు. ప్రశ్నించిన ప్రజాప్రతినిధులపై దాడులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణలో గతంలో ఎప్పుడూలేని విధంగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులకు దిగే సంస్కృతిని తీసుకొచ్చారని మండిపడ్డారు. తెలంగాణ ఇమేజ్‌ను డ్యామేజ్ చేసేలా ప్రవర్తిస్తామంటే బీఆర్ఎస్ పార్టీ సహించబోదని స్పష్టం చేశారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరును, ఇతర అన్నివిషయాలను ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్తారని తెలిపారు.

బీఆర్ఎస్ యోధులకు వందనాలు

రౌడీ మూకలు దాడి చేసినా, రాళ్లు రువ్వినా, దాడులను ఆపాల్సిన పోలీసులు చేతులు ముడుచుకున్నా.. ధైర్యంగా నిలబడి పోరాడిన ప్రతీ ఒక్క గులాబీ సైనికుడికి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. అండగా నిలిచిన ప్రతీ సోదరుడికి, సోదరికి, అలాగే సోషల్ మీడియాలో అండగా నిలిచిన యోధులకు వందనాలు అని పేర్కొన్నారు.

రాయదుర్గంలో ఎమ్మెల్యే కౌశిక్‌పై కేసు

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 13: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదుచేశారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తన అనుచరులతో కలిసి కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసంపై గురువారం దాడి చేశారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేసేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌కు వెళ్లారు. సైబరాబాద్ సీపీ చాంబర్‌లోకి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకోవటంతో కమిషనరేట్ కార్యాలయ అడ్మిన్, ఏడీసీపీ రవిచందన్‌రెడ్డికి, కౌశిక్‌రెడ్డి మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. దీనిపై రవిచందన్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు. బీఎన్ఎస్ 132, 351(3) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీంతోపాటు సైబరాబాద్ కమిషనర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఇతర మంత్రులు, నాయకులు మొత్తం 30 మందిపైనా కేసు నమోదు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశామని రాయదుర్గం పోలీసులు తెలిపారు.

ప్రాణత్యాగానికైనా సిద్ధం

- ప్రాణం పోయినా రేవంత్‌తో కాంప్రమైజ్ కాను
- రేవంత్‌కు సీఎం పదవి కేసీఆర్ ఇచ్చిన భిక్షే
- గాంధీతో సఖ్యత కోసమే ప్రయత్నించా
- సెటిలర్లకు వ్యతిరేకం కాదు: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి . చిత్రంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

దుండిగల్, సెప్టెంబర్ 13: తెలంగాణ కోసం ప్రాణత్యాగానికైనా తాను సిద్ధమని బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రాణం పోయినా సీఎం రేవంత్‌రెడ్డితో మాత్రం కాంప్రమైజ్ కానని తేల్చిచెప్పారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మున్సిపాలిటీ పరిధి శంభీపూర్‌లోని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో సఖ్యత కోసమే తాను ప్రయత్నించానని, తానేమీ తప్పు చేయలేదని స్పష్టం చేశారు. ఆయనే స్వయంగా తాను పార్టీ మారలేదని పేర్కొన్నారని, అందుకే తాము ఆయనను సత్కరించేందుకు వెళ్దామనడంలో తప్పేమిటని ప్రశ్నించారు. ఆంధ్రా సెటిలర్లకు తాను వ్యతిరేకం కాదని, తాను సెటిలర్లను గౌరవిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే గాంధీ అన్నట్టుగా ఇది తమ ఇద్దరి మధ్యన జరుగుతున్న యుద్ధమేనని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి తనస్థాయిని దిగజార్చుకొని మాట్లాడుతున్నారని విమర్శించారు. గత పదేండ్లలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను అమాంతగా పెంచితే, దానిని దిగజార్చేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ధ్వజమెత్తారు. రేవంత్‌కు సీఎం పదవి అనేది కేసీఆర్ ఇచ్చిన భిక్ష అని, కేసీఆరే తెలంగాణ తేకుంటే, ఈ నాడు ముఖ్యమంత్రివి అయ్యేవాడివా? అని ప్రశ్నించారు. మీరు చేస్తున్న వెకిలిచేష్టలను ప్రజలు గమనిస్తున్నారని, ఇప్పటికే తిరుగుబాటు మొదలైందని చెప్పారు. తన పోరాటానికి అండగా నిలిచి మద్దతిస్తున్న ప్రతి ఒక్కరికీ శిరసు వంచి నమస్కరిస్తున్నట్టు కౌశిక్‌రెడ్డి తెలిపారు.

గాంధీ రాజీనామా చెయ్: శంభీపూర్‌రాజు

నిజంగా గాంధీకి నీతి నిజాయితీ, చిత్తశుద్ధి ఉంటే ముందుగా ఎమ్మెల్యే పదవికి రాజీనామ చేసి, కాంగ్రెస్ టికెట్‌పై గెలుపొందాలని ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ కార్యకర్తల కష్టం, శ్రమతో గెలిచిన ఆయన అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ఆనాడు చెప్పింది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే ఉన్నానన్న గాంధీ ఆయన ఇంటికి వెళ్లి సమావేశం పెడతామంటే ఎందుకు బయపడుతున్నారని, అక్కడికి వెళ్లకుండా పోలీసులు తమను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు స్వేచ్ఛగా తిరుగుతూ తొడలు కొడుతుంటే చోద్యం చూస్తున్న పోలీసులు.. తమను అడ్డుకోవడం ఏ రకమైన ధర్మమని పేర్కొన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు ప్రభుత్వమే కుట్రలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. సెటిలర్ల విషయంలో కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను ఒక సెక్షన్ ఆఫ్ మీడియా వక్రీకరించి, విషప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు.

కౌశిక్‌రెడ్డిపై దాడికి సర్కార్‌దే బాధ్యత

- ఇది ముమ్మాటికీ సీఎం రేవంత్‌రెడ్డి పనే
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్‌రెడ్డి ప్రమేయంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి జరిగిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడిపై శుక్రవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఇది కచ్చితంగా రేవంత్‌రెడ్డి చేయించిన దాడే. దీనికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలి. ఇదేం ప్రజాపాలన ఇదేం ఇందిరమ్మ రాజ్యం? పట్టపగలు హైదరాబాద్ నడిబొడ్డున ఒక ఎమ్మెల్యేపై జరిగిన దాడికి ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ బాధ్యత వహించాలి. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి పూర్తి భద్రత కల్పించాలని డీజీపీని డిమాండ్ చేస్తున్నాం. దాడి చేసిన వారిని అరెస్టు చేయాల్సింది పోయి.. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడం ఎంతవరకు న్యాయం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆడుతున్న వికృత రాజకీయ క్రీడలో తెలంగాణ పోలీసులు కూడా భాగం కావడం దారుణం' అని అన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఒక ప్రజా ప్రతినిధి ఇంటి మీద పోలీసుల సమక్షంలో దాడి జరుగుతుంటే నియంత్రించకుండా.. రాత్రి నుంచి గ్రామాల్లో ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడం సరికాదని అన్నారు.



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

రేవంత్ ప్రోద్బలంతోనే..

- దానం, గాంధీ, మైనంపల్లి ద్వారా విద్వేషాలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ప్రోద్బలంతోనే ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు రెచ్చిపోతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ముగ్గురు గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉన్నపుడు ఎలా ఉండేవారని, ఇప్పుడు ఎలా అయ్యారని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. కౌశిక్‌రెడ్డి వివాదంలో ఆంధ్ర, తెలంగాణ వివాదం లేదని, సీఎం కావాలనే దానినో వివాదంగా చేయాలని చూస్తున్నారని తెలిపారు. అసలు తెలంగాణ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డే ఆటంకంగా మారారని ధ్వజమెత్తారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై దృష్టి మళ్లించడానికి సీఎం ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ప్రతిపక్ష నేతలపై వికృత దాడులు చేస్తున్నారని, నిర్బంధిస్తున్నారని ధ్వజమెత్తారు. దాడుల సంస్కృతి రాష్ట్రానికి మంచిది కాదని, పోరాడి సాధించుకున్న తెలంగాణను నాశనం చేయాలని రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నారంటూ ఆరోపించారు. తెలంగాణను ప్రేమించే వారు రేవంత్ తీరును ఖండించాలని, పదేండ్ల కేసీఆర్ పాలనలో ఇలాంటి దాడుల సంస్కృతి ఉన్నదా? దీనిని కాంగ్రెస్ ఆహ్వానిస్తుందా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీ మీద జరుగుతున్న ఈ దాడులను తెలంగాణ మేధావులు ఖండించాలని హితవు పలికారు. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడానికి గాంధీ ద్వారా రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని చెప్పారు.

అల్లకల్లోలానికి కుట్ర: దేవీప్రసాద్

రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలు పన్నుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత దేవీప్రసాద్ అనుమానం వ్యక్తంచేశారు. ప్రతిపక్షంపై దాడులకు పురికొల్పుతున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలపై అణిచివేత ధోరణి సరికాదని హితవు పలికారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్నింటిపైనా ప్రజలు లెక్కలు రాస్తున్నారని, తగిన సమయంలో బుద్ధిచెపుతారని హెచ్చరించారు. కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిన మేధావులు, బుద్ధిజీవులు ఇప్పుడు స్పందించాలని కోరారు.

పీఏసీ ఇచ్చేందుకు భయమా?

- హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డికి ఇస్తే ప్రభుత్వానికి చుక్కలే
- అందుకే దొడ్డిదారిన అరికెపూడి గాంధీకి కట్టబెట్టారా?
- కాంగ్రెస్ వర్గాలు, రాజకీయ పరిశీలకుల్లో ఆసక్తికరమైన చర్చ





నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్ పదవిని రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు ఇచ్చేందుకు అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు భయపడుతున్నది అన్న ప్రశ్న సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఆనవాయితీ ప్రకారం కాకుండా ఓ ఫిరాయింపు ఎమ్మెల్యేకు పీఏసీ చైర్మన్ పదవిని కట్టబెట్టి, రాష్ట్రంలో రెండు రోజులుగా తీవ్ర గందరగోళ పరిస్థితిని సృష్టించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఖరిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఆర్థిక వ్యవహారాలను పారదర్శకంగా నిర్వహించాలనుకున్నప్పుడు ప్రధాన ప్రతిపక్ష ఎమ్మెల్యేను పీఏసీ చైర్మన్‌గా నియమించేందుకు వస్తున్న అడ్డంకులేమిటని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు.

లోక్‌సభ లేదా రాష్ట్రాల అసెంబ్లీల్లో పీఏసీకి ప్రత్యేక ప్రాధాన్యం, ప్రాముఖ్యత ఉన్నాయి. ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకతను ప్రదర్శించేందుకు, ప్రభుత్వ సొమ్ము పక్కదారి పట్టకుండా నిరంతరం మానిటరింగ్ చేయడంలో పీఏసీ పాత్ర కీలకం. ఈ కమిటీ ప్రభుత్వ నిధుల ఖర్చు, ఆర్థికపరమైన వ్యవహారాలను పర్యవేక్షించవచ్చు, నిధుల దుర్వినియోగం లేదా అవినీతి వంటి ఆరోపణలపైనా విచారణ జరపవచ్చు, ప్రభుత్వ విభాగాల ఆడిట్ నివేదికలపైనా, ఆర్థిక కార్యకలపాలపైనా సమీక్ష జరపవచ్చు. ఇలాంటి కమిటీకి చైర్మన్‌గా ప్రతిపక్ష పార్టీకి చెందిన సభ్యుడిని నియమించడం ద్వారా ప్రభుత్వాలు తమ పారదర్శకతను ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తాయి. అనేక సంవత్సరాలుగా ఇదే సాంప్రదాయంగా కొనసాగుతూ వస్తున్నది. కానీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సాంప్రదాయానికి తూట్లు పొడుస్తూ అడ్డదారులు తొక్కింది. వాస్తవంగా పీఏసీ కమిటీ చైర్మన్‌గా మాజీ మంత్రులు, అసెంబ్లీ వ్యవహారాలపై మంచి పట్టు ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డిలో ఎవరో ఒకరికి అవకాశం దక్కాల్సి ఉంది. అలా కాకుండా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని పీఏసీ చైర్మన్‌గా ప్రకటించారు.

హరీశ్‌రావు చైర్మన్ అయితే ఇక్కట్లు తప్పవనేనా?

రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాలు, నిధుల కేటాయింపు, ఖర్చులను పర్యవేక్షించే అధికారం ఉన్న పీఏసీ కమిటీకి చైర్మన్‌గా ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి చెందిన హరీశ్‌రావు లేదా ప్రశాంత్‌రెడ్డి ఉంటే ఇక్కట్లు తప్పవని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ ముఖ్యులకు భయం పట్టుకున్నట్టు తెలుస్తున్నది. అసలే ప్రభుత్వ పాలనపై, ఆర్థిక వ్యవహారాలపై అంతంతమాత్రం అవగాహన ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులకు వీరు కొరకరాని కొయ్యగా మారుతారని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరిగినట్టు సమాచారం. ఇప్పటికే రెండుమార్లు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్‌దే పైచేయిగా సాగింది. అనేక అంశాల్లో బీఆర్ఎస్ సభ్యులు ముఖ్యంగా కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి వంటి సీనియర్లంతా ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ నేపథ్యంలో కీలకమైన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పదవి హరీశ్‌రావు వంటి వారికి దక్కితే ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవన్నది సీఎం భావన అని సమాచారం.


అందుకే దొడ్డిదారిన చైర్మన్‌గా గాంధీ

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 10 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ సీఎంతోపాటు ఆర్థిక మంత్రి, ఇతర ప్రభుత్వ ముఖ్యులకు పాలనపై, ఆర్థిక వ్యవహారాలపై సరైన పట్టు దొరకలేదన్న చర్చ సాగుతున్నది. ఈ పరిస్థితుల్లో హరీశ్‌రావు లేదా ప్రశాంత్‌రెడ్డి వంటి వారికి పీఏసీ చైర్మన్ పదవి దక్కితే తమకు ఇబ్బందులు తప్పవని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్టు ఆ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ప్రభుత్వ నిధుల కేటాయింపు, ఖర్చులు ఇతర ఆర్థిక కార్యకలాపాలపై నిరంతరం పీఏసీ చైర్మన్‌గా నిఘా వేస్తే ప్రభుత్వ డొల్లతనం బహిర్గతం అవుతుందన్న భయంతోనే తమ చెప్పుచేతుల్లో ఉండే వ్యక్తికి బాధ్యతలు అప్పగించారని పరిశీలకులు భావిస్తున్నారు. కాంగ్రెస్‌లో చేరిన అరికపూడి గాంధీకి ఇవ్వడం ద్వారా అతను టెక్నికల్‌గా బీఆర్ఎస్ అని చూపవచ్చన్నది సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహంగా చెప్తున్నారు.



రాష్ట్రంలో గాడ్సే పాలన: తుంగ బాలు

హైదరాబాద్, సెప్టెంబర్13 (నమస్తే తెలంగాణ): గాంధీ వారసులమని చెప్పుకొనే కాంగ్రెస్.. తెలంగాణలో గాడ్సే పాలన సాగిస్తున్నదని బీఆర్ఎస్వీ రాష్ట్ర నేత తుంగ బాలు మండిపడ్డారు. తనను హౌస్ అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిలదీసిన ప్రతిసారీ కాంగ్రెస్ నేతలు దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇటీవల ఖమ్మం, సిద్దిపేటలో హరీశ్‌రావుపై, నిన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై దాడులు చేశారని చెప్పారు. రేవంత్ పాలనలో ప్రజాప్రతినిధుల పరిస్థితే ఇలా ఉంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రేవంత్‌కు తగిన సమయంలో బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.



రేవంత్‌ది నియంత పాలన: సతీశ్

హైదరాబాద్, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియంత పాలన సాగిస్తున్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్ ఒక ప్రకటనలో విమర్శించారు. న్యాయం కోసం ఆందోళనకు దిగిన మాజీ మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అక్రమంగా అరెస్ట్ చేసి స్టేషన్లలో నిర్బంధించడం కాంగ్రెస్ సర్కారు అరాచకాలకు పరాకష్ఠ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ, ప్రజావ్యతిరేక దుర్మార్గాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. ఉద్యమ పార్టీ అయిన బీఆర్ఎస్‌కు అక్రమ అరెస్టులు, నిర్బంధాలు కొత్తకాదని, అణిచివేయాలని చూస్తే ఉప్పెనలా పైకిలేస్తామని తెలిపారు.

కేశంపేటలో బీఆర్ఎస్ నాయకులపై కేసు

- 10 మందిపై నమోదు చేసిన పోలీసులు
- పోలీసుల విధులకు అడ్డంకులు సృష్టించారని ఆరోపణ
- హోంగార్డు రమేశ్ పోలీసులకు ఫిర్యాదు

షాద్‌నగర్, సెప్టెంబర్ 13: రంగారెడ్డి జిల్లా కేశంపేట పోలీస్ స్టేషన్‌లో 10 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదయ్యాయి. ఎమ్మెల్యేలు అరికెపుడి గాంధీ, పాడి కౌశిక్‌రెడ్డి మధ్య వివాదం రాజుకున్న నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి బృందాన్ని హైదరాబాద్ నుంచి కేశంపేటకు తరలిస్తుండగా మార్గమధ్యంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని సైబారాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించే హోంగార్డు రమేశ్ కేశంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై అంజయ్యయాదవ్ కుమారులు వై రవియాదవ్, వై మురళీయాదవ్‌తోపాటు నవీన్, జమాల్‌ఖాన్, లక్ష్మణ్, జగన్, బండ నిరంజన్, మల్లయ్య, సుధాకర్, వెంకట్‌రెడ్డి, ధన్‌రాజ్‌లపై సెక్షన్ 126(2), 132, 189 (2), 191 (2), ఆర్/డబ్ల్యూ 190బీఎన్ఎస్, 3పీడీపీపీఏ కింద కేసు నమోదు చేశారు. కేశంపేట మండలం కొత్తపేటలో ఎమ్మెల్యేల బృందాన్ని తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకోవడంతో పాటు వాహనం అద్దాలను పగులగొట్టారని, రాత్రి వేళలో పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగి విధులకు ఆటంకం కలిగించారని హోంగార్డు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లో ఉన్నారా, కాంగ్రెస్‌లోనా?

మీడియా ప్రశ్నకు సమాధానం దాటేసిన ఎమ్మెల్యే గాంధీ



హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): 'మీరు బీఆర్ఎస్‌లో ఉన్నారా? కాంగ్రెస్ పార్టీలో ఉన్నారా? ఇంతకూ ఏ పార్టీలో ఉన్నారు' అంటూ మీడియా అడిగిన ప్రశ్నకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ సమాధానాన్ని దాటేశారు. ఇప్పటికే గాంధీ ఏ పార్టీలో ఉన్నారంటూ జరుగుతున్న రచ్చకు ఆయన తెరదించకపోగా, ఎప్పటికప్పుడు సమాధానం దాటేస్తూనే ఉన్నారు. తాజాగా గాంధీ తన ఇంటి వద్ద మీడియా సమావేశంలోనూ సేమ్ సీన్ రిపీట్ అయింది. తాను ఏ పార్టీలో ఉన్నానో కూడా డిసైడ్ చేసుకోలేని దుస్థితిలో ఒక ఎమ్మెల్యే ఉన్నారా? అన్న చర్చ కూడా మొదలైంది. శుక్రవారం ఉదయం నుంచి గ్రేటర్ పరిధిలో బీఆర్ఎస్ నేతల అరెస్టుల పర్వం కొనసాగుతుండగా, మరోవైపు వివేకానందనగర్‌లోని అరకపూడి గాంధీ ఇంటివద్ద పోలీసులు మూడంచెల భద్రతను ఏర్పాటుచేశారు. ఉదయం నుంచి హైడ్రామా తర్వాత సాయంత్రం నాలుగు గంటలకు గాంధీ మీడియా సమావేశం నిర్వహించారు.

కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌పై గౌరవం

బీఆర్స్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు అంటే ఎంతో అభిమానమని, వారు ఏ రోజూ ప్రజలను తప్పుగా మాట్లాడిన సందర్భాలు లేవని గాంధీ పేర్కొన్నారు. వీరు హుందాగా వ్యవహరించారని చెప్పారు. కేసీఆర్ ఉద్యమంతోపాటు పదేండ్ల పాలనలో ఆంధ్ర, తెలంగాణ పేరిట మాట కూడా తూలకుండా గౌరవంగా వ్యవహరించారని వివరించారు. కౌశిక్‌రెడ్డి పరుషంగా మాట్లాడటం వల్లే తాను ఆ విధంగా ప్రతిస్పందించాల్సి వచ్చిందని గాంధీ చెప్పారు. చివరగా తన పార్టీ ఏదంటూ మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండానే వెళ్లిపోయారు.

రాజ్యాంగానికి సీఎం రేవంత్ తూట్లు

- కౌశిక్ నిర్బంధం.. గాంధీకి రెడ్‌కార్పెట్
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్పీ ఫైర్



బండ్లగూడ, సెప్టెంబర్ 13: సీఎం రేవంత్‌రెడ్డి తన పాలనలో అడుగడుగునా రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. రాజ్యాంగబద్ధ పాలనే సాగడం లేదని, కనీసం రాజ్యాంగం ఎప్పుడైనా ఆయన చదివారా? అని ప్రశ్నించారు. మంత్రులకు, ఎమ్మెల్యేలకు గూండాయిజం చేయాలని సీఎం స్క్రిప్ట్ ఇచ్చి మరీ చేయిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగం రక్షించబడాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని చేతబట్టుకుని ప్రతిచోట ప్రచారాన్ని కొనసాగిస్తుంటే.. రాష్ట్రంలో మాత్రం ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాస్తూ దుర్మార్గపు పాలన సాగిస్తున్నారని, ఇదేమి రాజ్యం, ఇదేమి న్యాయం అని మండిపడ్డారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు, నేతల గృహా నిర్బంధం, అక్రమ అరెస్టులే దానికి నిదర్శనమని పేర్కొన్నారు. శుక్రవారం తన నివాసంలో మీడియాతో ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. ఉదయం 8 గంటల నుంచి పోలీసులు తనను గృహనిర్బంధం చేశారని, తనును కలవడానికి వచ్చిన నేతలను అరెస్ట్ చేశారని ధ్వజమెత్తారు. శాసనసభ్యుడైన పాడి కౌశిక్‌రెడ్డిని చంపడానికి గూండాలతో వచ్చిన అరికెపూడి గాంధీకి పోలీసులు రెడ్ కార్పెట్ వేసి పోలీస్‌స్టేషన్‌లో కుర్చోబెట్టారని, బాధితుడైన కౌశిక్‌రెడ్డిని నిర్బంధించారని విమర్శించారు. ఎసమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్ ఆర్య క్షత్రియ, పుడరి సైదులు, బీఆర్ఎస్ బండ్లగూడ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు, అరుణ, క్వీన్ ఎలిజబెత్, జంపన్న, భీమయ్య, నటరాజ్, అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళిత కాలనీలకు కరెంట్ కట్

- మీటర్ తీసుకోవడం లేదంటూ విద్యుత్తు అధికారుల చర్యలు
- ప్రభుత్వ తీరుపై దళితుల ఆగ్రహం

రేగొండ, సెప్టెంబర్ 13 : విద్యుత్తు అధికారులు గురువారం రాత్రి నుంచి దళిత కాలనీలకు కరెంట్ సరఫరా నిలిపివేశారు. దీంతో ఆయా కాలనీలు అంధకారంలో మగ్గుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ, గోరికొత్తపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో చోటుచేసుకుంది. భూపాలపల్లి ఏడీ, రేగొండ ఏఈ తమ సిబ్బందితో రేగొండ, గోరికొత్తపల్లి మండల కేంద్రాలతో పాటు పెద్దంపల్లి, నారాయణపురం, జగ్గయ్యపేట, నిజాంపల్లితోపాటు పలు గ్రామాల్లోని దళిత కాలనీలకు విద్యుత్తు సరఫరా చేసే వైర్లను తొలగించారు. దీంతో రాత్రంతా కరెంట్ లేకపోవడంతో దోమల బెడదతో నిద్ర కరువైంది దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్తు పథకం అమలు కావాలంటే ప్రతి ఒక్కరూ మీటర్ తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ సరఫరా నిలిపివేస్తున్నారు. ఓ పక్క దళితులకు ఉచిత విద్యుత్తు ఇస్తున్నట్టు ప్రకటిస్తూనే మరోపక్క అధికారుల చేత దాడులు చేయిస్తున్న ప్రభుత్వం తీరుపై దళితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ మీటర్ ఉంటేనే గృహజ్యోతి వర్తిస్తుందని ఏఈ కనకయ్య తెలిపారు. వారం రోజులుగా అవగాహన కల్పించినా ఎవరూ స్పందించడం లేదని పేర్కొన్నారు. అందువల్లే కరెంట్ సరఫరాను నిలిపివేసినట్టు ఆయన పేర్కొన్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలోని దళిత కాలనీ

ప్రజాపాలన అన్నరు.. పరేషాన్ చేస్తున్నరు



ప్రజాపాలన తెస్తామన్న కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పుడు అందరినీ వివిధ కారణాలతో పరేషాన్ చేస్తున్నరు. పదేండ్ల నుంచి కేసీఆర్ సర్కారు ఏనాడూ మా కాలనీలకు వచ్చి కరెంట్ కట్ చేయలేదు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత కరెంట్ మీటర్ తీసుకోవాలని అధికారులు వేధింపులకు గురిచేస్తున్నరు. డబ్బులు లేక చెల్లించకపోవడంతో మా కాలనీకి కరెంట్ కట్ చేసి మమ్మల్ని అంధకారంలోకి నెట్టారు. కరెంట్ లేక పిల్లలు చదువుకుంటలేరు. దోమల బెడద, ఉక్కపోతతో నరకయాతన అనుభవిస్తున్నాం.

– గజ్జెల రామకృష్ణ, రేగొండ

బ్రీత్ టెస్ట్‌లతో డ్రైవర్ల తొలగింపు ఆపాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : టీజీఎస్ఆర్టీసీ డ్రైవర్‌లకు బ్రీత్ ఎనలైజర్ టెస్ట్‌ల పేరుతో ఉద్యోగాల తొలగింపును ఆపాలని కోరుతూ టీజీఎస్ ఆర్టీసీ జాక్ ప్రతినిధులు శుక్రవారం బస్‌భవన్‌లో ఎండీ సజ్జనార్‌ని కలిసి వినతిపత్రం ఇచ్చారు. బ్రీత్ అనలైజర్ టెస్ట్‌లో రీడింగ్ చూపినప్పుడు ఆ డ్రైవర్ కోరితే రైల్వేశాఖలో మాదిరిగా మరొక బ్రీత్ ఎనలైజర్‌తో టెస్ట్ చేయించాలని, లేదా రక్త పరీక్ష ద్వారా నిర్ధారించాలని కోరారు. కార్యక్రమంలో టీజీఎస్ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, కో కన్వీనర్ సురేష్, జేఏసీ నాయకులు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకే రైతుభరోసా

మొదటిపేజీ తరువాయి...

పది ఎకరాల వరకే పెట్టుబడి సాయం నిధులు విడుదల చేస్తామని వెల్లడించారు. గత డిసెంబర్‌లో తమ ప్రభుత్వం వచ్చాక రైతుబంధు నిధులు జమ చేసినట్టు తెలిపారు. అధికారంలోకి రాగానే రైతుబంధు మార్పులకు అవకాశం దొరకలేదని అన్నారు. రాష్ట్రంలో 42 లక్షల మంది రైతులు బ్యాంకుల ద్వారా రుణాలు పొందినట్టు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే రూ.2 లక్షల్లోపు ఉన్న 22 లక్షల మంది కర్షకులకు రుణమాఫీ అమలు చేశామని అన్నారు. తెల్లరేషన్ కార్డు లేని రైతులకు సైతం ఈనెలాఖరులోగా రుణమాఫీ నిధులు జమ చేస్తామని చెప్పారు. రూ.2 లక్షలకుపైగా రుణం తీసుకున్న రైతులు తమ బ్యాంకు ఖాతాల్లో రూ.2 లక్షలకుపైనున్న లోన్ డబ్బు చెల్లిస్తే మాఫీ వర్తింపజేస్తామని స్పష్టంచేశారు. రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దని, అందరికీ వందశాతం మాఫీ చేసి తీరుతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

తన్నుకున్న అటవీ అధికారులు

సుబేదారి, సెప్టెంబర్ 13 : హనుమకొండ సుబేదారిలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో ఇద్దరు అధికారులు సిబ్బంది ముందే తన్నుకున్నారు. వారం రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. జిలాల్లోని అటవీశాఖలో పనిచేస్తున్న రేంజ్ ఆఫీసర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మధ్య డ్యూటీ విషయంలో గొడవలు జరుగుతున్నా యి.

ఎస్సీ వర్గీకరణ కమిటీ చైర్మన్‌గా దళితుడు అర్హుడు కాదా?

మాదిగలను మరోసారి మోసం చేస్తున్న కాంగ్రెస్: ఎర్రోళ్ల ధ్వజం



హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణ విషయంలో మాదిగజాతిని కాంగ్రెస్ పార్టీ మరోసారి మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ నాయకుడు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అధ్యయనం చేసి సిఫారసులు చేయడానికి ప్రభుత్వం ఉత్తమ్ నేతృత్వంలో కమిటీని నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎర్రోళ్ల శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేస్తూ అగ్రవర్ణానికి చెందిన ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కమిటీ చైర్మన్‌గా నియమించడమంటే మరోసారి మాదిగలను దగా చేయడమేనని ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గాల సమస్యలు తెలిసిన నాయకుడిని కాకుండా ఉన్నత వర్గానికి చెందిన ఉత్తమ్‌ని నియమించడంలో మీ ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఉత్తమ్ వల్ల మాదిగ జాతికి ఎలా న్యాయం చేకూరుతుందని నిలదీశారు. ఈ కమిటీకి మంత్రి దామోదర రాజనర్సింహను చైర్మన్‌గా నియమించకపోవడం దారుణమని పేర్కొన్నారు. వర్గీకరణపై చిత్తశుద్ధి ఉంటే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మంత్రి దామోదర రాజనర్సింహను కమిటీ చైర్మన్‌గా నియమించాలని, లేదంటే కమిటీనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఏనాడూ మాదిగలను పట్టించుకోలేదని ఎర్రోళ్ల ధ్వజమెత్తారు. కాంగ్రెస్ విధానాలతోనే గతంలో సురేందర్ మాదిగ గాంధీభవన్‌లో అమరుడయ్యారని గుర్తు చేశారు.

ఉత్తమ్ కమిటీని ఉపసంహరించుకోవాలి



- మంత్రుల కమిటీలోనే మాలలకు అన్యాయం

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 13 : ఎస్సీ వర్గీకరణ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఉత్తమ్ నేతృత్వంలోని కమిటీని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర నాయకుడు బండి అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండలో జరిగిన సమావేశంలో ఆయన మాటాడుతూ.. వర్గీకరణ అమలు కోసం మంత్రుల కమిటీ ఏర్పాటు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కమిటీతో తెలంగాణలో మాలలకు ఏ మాత్రం న్యాయం జరగదని, ఏ ఒక్క మాల మంత్రి లేకుండా కమిటీని ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. మంత్రు ల కమిటీలోనే మాలలకు అన్యాయం జరిగిందని అన్నారు. ఈ కమిటీని రద్దు చేసి సిట్టింగ్ న్యాయమూర్తి నేతృత్వంలో కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లో దళితులకు స్థానం లేదు

- పార్టీలో రెడ్డిలు, బీసీలకే పదవులు
- 40 ఏండ్లుగా పార్టీలో ఉన్నా..
- మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వకపోతే ఆత్మహత్యే శరణ్యం
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దర్శనాల సంటెన్న హెచ్చరిక



మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దర్శనాల సంటెన్న

ఎదులాపురం, సెప్టెంబర్ 13: కాంగ్రెస్ పార్టీలో దళితులకు స్థానం లేదని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దర్శనాల సంటెన్న అవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఆదిలాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. 'నేను ఓ దళిత బిడ్డను. 40 ఏండ్లుగా పార్టీలో పనిచేస్తున్న. నాకు ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వకపోతే కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ ఆఫీస్ ముందట పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంట' అని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక పార్టీ సీనియర్లకు నామినేటెడ్ పదవులు ఇస్తామని పలు సందర్భాల్లో చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ విషయంలో మంత్రులు, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ కాళ్లుపట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.లక్ష రుణం తీసుకొని పార్టీ కోసం తిరిగానని, దళిత బిడ్డనైన తనకు న్యాయం చేయాలని కోరారు. గతంలో రెడ్డిలకు, బీసీలకు ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నేత కంది శ్రీనివాస్‌రెడ్డి స్పందించి మార్కెట్ కమిటీ పదవి ఇప్పించాలని, లేదంటే కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు.

బీసీ కులగణనపై సంప్రదింపులు

బీసీ కమిషన్‌తో కమిషన్ పూర్వ సభ్యులు

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్, కమిషన్ సభ్యులు శుక్రవారం కమిషన్ పూర్వ అధ్యక్షుడు, సభ్యులతో సమావేశమయ్యారు. బీసీ కులగణన, రిజర్వేషన్ అంశాలపై సంప్రదింపులు జరిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న సభ్యులకు తాము గతంలో సేకరించిన సమాచారాన్ని సమావేశంలో వ్యక్తపరచి ప్రస్తుత కమిషన్‌కు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. తరుచూ సమావేశమై పరస్పర చర్చలు జరుపుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. సమావేశంలో చైర్మన్ జీ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మితోపాటు పూర్వ బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, సభ్యులు డాక్టర్ ఆంజనేయగౌడ్, జూలూరి గౌరీశంకర్, సీహెచ్ ఉపేంద్ర, శుభప్రద్ పటేల్, కే కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై కేంద్రం స్పందించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య



హైదరాబాద్, సెప్టెంబర్13 (నమస్తే తెలంగాణ) : బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ భవన్‌లో శుక్రవారం ఆర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీసీ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నేతలు భారీగా తరలివచ్చారు. కృష్ణయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచుతూ పార్లమెంట్‌లో బిల్లును పెట్టాలని, లేకుంటే దేశంలో తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. బీసీల అభివృద్ధి, హక్కుల కోసం పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు ఎర్ర సత్యనారాయణ, గుజ్జ కృష్ణ, గోరిగె మల్లేశ్‌యాదవ్, గవ్వల భరత్, గుజ్జ సత్యం, లాల్‌కృష్ణ, నీల వెంకటేశ్, నంద గోపాల్, రాజేందర్, అనంతయ్య, కృష్ణ, కృష్ణుడు, పృథ్వీగౌడ్, రమాదేవి, లక్ష్మి, నిఖిల్ పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్ కుమార్, నాయకులు సాయి కుమార్

బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి

- చట్టసభలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలుచేయాలి
- మంత్రి పొన్నంకు బీసీ బహుజన సంక్షేమ సంఘం ప్రతినిధుల వినతి

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 13: బీసీలకు చట్టసభలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపు అంశాలను పొందుపర్చిందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్ కుమార్ గుర్తుచేశారు. బీసీ గణన చేపట్టి, రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు ఆకారపు మోహన్, నూతనకంటి ఆనందం, భిక్షపతి, పీ మల్లేశ్ ఉన్నారు.

ప్రజాపాలన దినోత్సవానికి హాజరవ్వండి

కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్ ఆహ్వానం

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహించనున్న 'తెలంగాణ ప్రజాపాలన' దినోత్సవ కార్యక్రమాలకు హాజరుకావాలని కేంద్ర మంత్రులను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి లేఖలు పంపారు. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణలో ప్రజాస్వామిక పాలన శకం ఆరంభమైన సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలో ప్రజాపాలన దినోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిపారు. నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

సీఎం వెల్ఫేర్ ఫండ్‌కు విరాళాలు..

ముఖ్యమంత్రి వెల్ఫేర్ ఫండ్‌కు డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీ రూ.5కోట్లు విరాళంగా అందించింది. వెస్టర్న్ కన్‌స్ట్రక్షన్స్ రూ.కోటి, ఏఎంఆర్ ఇండియా రూ.కోటి, నటుడు నందమూరి బాలకృష్ణ రూ.50లక్షలు, వాక్సెన్ యూనివర్సిటీ రూ.50 లక్షలు అందజేశారు.

వృద్ధులకు 5 లక్షల బీమా హర్షణీయం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకంలో భాగంగా 70 ఏండ్లు దాటిన వయోవృద్ధులందరికీ రూ.5 లక్షల వరకు వైద్య బీమా అందించాలని కేంద్రం నిర్ణయించడం హర్షణీయమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ 'వృద్ధుల సంక్షేమానికి ఓ కుటుంబ పెద్దగా, పెద్దకొడుకుగా ఆలోచించిన ప్రధాని మోదీ గొప్ప నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ నుంచి దాదాపు 10 లక్షల మంది లబ్ధిపొందుతారు' అని కిషన్‌రెడ్డి తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లకు క్లినిక్‌లు

జిల్లాకు ఒకటి ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : ట్రాన్స్‌జెండర్ల కోసం జిల్లాకో క్లినిక్ ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారానికి రెండు లేదా మూడు రోజులపాటు వైద్యసేవలు అందించనున్నారు. జనరల్ ఫిజీషియన్, డెర్మటాలజిస్ట్, సైకియాట్రిస్ట్ అందుబాటులో ఉండనున్నారు. అవసరాన్ని బట్టి గైనకాలజిస్ట్, యూరాలజిస్ట్ ఇతర స్పెషలిస్టుల సేవలు అందించనున్నారు. జెండర్ మార్పిడి ఆపరేషన్లు కూడా ఉచితంగా చేయించనున్నట్టు తెలిసింది. ఉస్మానియా దవాఖానలోని ట్రాన్స్‌జెండర్ల క్లినిక్‌లో ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. వైద్యారోగ్య, మహిళా సంక్షేమ శాఖలు సంయుక్తంగా వీటిని ఏర్పాటుచేయనున్నాయి. ఈ మేరకు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసినట్టు ప్రభుత్వవర్గాలు తెలిపాయి. తాము అనారోగ్యం బారిన పడ్డప్పుడు దవాఖానలకు వెళ్లలేకపోతున్నామని, ధైర్యం చేసి వెళ్లినా అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రాన్స్‌జెండర్లు ఇటీవల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా క్లినిక్‌లు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గ్రీన్‌పవర్ ఉత్పత్తికి ప్రణాళికలను సిద్ధం చేయండి

రెడ్ కో, ఎస్పీడీసీఎల్ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తేతెలంగాణ) : రాష్ట్రంలో గ్రీన్‌ఎనర్జీ(పునరుత్పాదక విద్యుత్తు)ని పెద్దఎత్తున ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో గ్రీన్‌ఎనర్జీ ఉత్పత్తిపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కొన్ని గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకొని.. రైతుల వ్యవసాయ పంపుసెట్లకు ప్రభుత్వ ఖర్చులతో సోలార్ పవర్‌ను ఏర్పాటు చేయడంతో వచ్చే విద్యుత్తును పవర్‌గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని ఆదేశించారు. ఎంపిక చేసిన స్వయం సహాయక సంఘాలకు ఐదు నుంచి పది మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పెట్టుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. తెలంగాణ రెడ్ కో వైస్‌చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనీల, ఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్‌అలీ పాల్గొన్నారు.

వరద నష్టం 10,032 కోట్లు

- ఎన్డీఆర్ఎఫ్ నిధులున్నా వాడుకునే పరిస్థితి లేదు
- మున్నేరు రిటెయినింగ్ వాల్‌కు నిధులివ్వండి
- కేంద్ర బృందంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మల్లెలమడుగు వద్ద కొట్టుకుపోయిన ప్రధాన రహదారి (ఫైల్)

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో రూ.10,032 కోట్లు నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనా వేశామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. పూర్తి వివరాలు ఇంకా అందాల్సి ఉన్నదని చెప్పారు. వరద నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర అధికారుల బృందంతో సీఎం శుక్రవారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణకు తక్షణమే ఆర్థికసాయం అందించాలని కోరారు. వేలాది ఇండ్లు దెబ్బతిన్నాయని, లక్షలాది ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని వివరించారు. ఎలాంటి షరతులు లేకుండా నిధులు విడుదల చేయాలని కోరారు. విపత్తు నిధుల వినియోగం విషయంలో కేంద్రం అమలు చేస్తున్న కఠిన నిబంధనలు సడలించాలని కోరారు. ఎన్డీఆర్ఎఫ్ నుంచి రూ.1,350 కోట్లు అందుబాటులో ఉన్నా నిబంధనల ప్రకారం ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం వాడుకునే పరిస్థితి లేదని అధికారుల బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఖమ్మం పట్టణంలో మున్నేరు వాగు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని సీఎం కోరారు. రాకాసి తండా, సత్యనారాయణ తండాతోపాటు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న తండాల ప్రజల కోసం సమీపంలోని సురక్షిత ప్రాంతాల్లో ఇండ్లను కేటాయిస్తామని, వాటి నిర్మాణాలకు అవసరమైన సాయం అందించాలని కోరారు. మేడారం అటవీ ప్రాంతంలో ఇటీవల దాదాపు 50 వేల ఎకరాల్లో చెట్లు నేలమట్టమైన ఘటనపై కేంద్ర నిపుణుల బృందంతో శాస్త్రీయ అధ్యయనం చేయించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, కేంద్ర బృంద సభ్యులు కల్నల్ కేపీ సింగ్, శాంతినాథ్ శివప్ప, మహేశ్‌కుమార్, నాయల్ కాన్సన్, రాకేశ్ మీనా, శశివర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందానికి అందించిన నష్టం అంచనాలు

విభాగం	నష్టం అంచనా (రూ.కోట్లలో)
మానవ మరణాలు	1.40
హౌసింగ్	25.30
పశుసంవర్ధక	4.35
ఫిషరీస్	56.41
వ్యవసాయం	231.13
ఆర్ అండ్ బీ, పీఆర్	7693.53
విద్యుత్తు	179.88
పాఠశాలలు	27.31
నీటిపారుదల	483.00
తాగునీటి సరఫరా	331.37
పట్టణాభివృద్ధి	1216.57
ప్రభుత్వ భవనాలు, ఆస్తులు	70.47
మొత్తం	10,320.72

దెబ్బతిన్న 'సాగర్' గండ్లను పూడ్చాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ): వరదలతో దెబ్బతిన్న నాగార్జునసాగర్ ఎడమకాలువ, చెరువులు, వాగుల గండ్లను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు భాగం ఏమంత రావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. ఈ నెల 3న కాలువలు, చెరువులకు గండ్లు పడటంతో పంటలు విపరీతంగా దెబ్బతిన్నాయన్నారు. దీంతో సాగర్ నీళ్లు వస్తాయో లేదోనని రైతులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. పంట నష్ట పరిహారం కోసం రాష్ట్రానికి రూ.10వేల కోట్లు విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

- 21 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 28న తుది జాబితా ప్రకటన
- జాబితా ఆధారంగానే స్థానిక ఎన్నికలు

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీ ఎన్నికల ముసాయిదా ఓటరు జాబితాను అధికారులు శుక్రవారం ప్రదర్శించారు. పంచాయతీ, మండల పరిషత్, మండల రెవెన్యూ కార్యాలయాల ఎదుట ముసాయిదా జాబితాను అందుబాటులో ఉంచారు. ఈనెల 21వరకు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి, 28న తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నారు. తుది జాబితా ఆధారంగానే గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల ఎన్నికలు నిర్వహించనున్నట్టు పంచాయతీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ముసాయిదా జాబితాను పరిశీలించుకోవాలని, గడువు ముగిసిన తర్వాత అభ్యంతరాల స్వీకరణకు అవకాశం ఉండదని చెబుతున్నారు.



జూరాల డ్యాం రోడ్డుపై మొసలి

వనపర్తి జిల్లా అమరచింత మండలంలోని జూరాల ప్రాజెక్టు రోడ్డుపై శుక్రవారం ఉదయం మొసలి సంచరించింది. మత్స్యకారులు మొసలిని తాళ్లతో బంధించి ప్రాజెక్టులో వదిలిపెట్టారు. నెల రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టుకు భారీగా వరద రావడంతో మొసళ్లు బయటకు వచ్చి సంచరిస్తున్నాయి.

– అమరచింత



మల్కాపూర్ శివారులో చిరుత సంచారం

సారంగాపూర్, సెప్టెంబర్ 13 : నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్కాపూర్(ఏ) గ్రామ శివారులో చిరుత సంచారం కొన్నిరోజులుగా కలకలం సృష్టిస్తున్నది. నెలరోజుల నుంచి ఇదే ప్రాంతంలో చిరుత సంచరిస్తుండటంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఓ రైతు తన పొలం నుంచి కూలీలతో కలిసి టిప్పర్‌లో శుక్రవారం వేకువజామున వస్తుండగా చిరుత కనిపించింది. గమనించిన కూలీలు తమ సెల్‌ఫోన్లలో చిరుత సంచరిస్తున్న దృశ్యాలు చిత్రీకరించి వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశారు.

మరో 500 కోట్ల అప్పు!

మొదటిపేజీ తరువాయి...

విలువైన బాండ్‌ను 12 ఏండ్లకాలానికి రాష్ట్ర ఆర్థికశాఖ భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ)కు జారీచేసింది. ఈ బాండ్‌ను ఈ నెల 17న ఆర్బీఐ వేలం వేయనున్నది. అనంతరం ఆ మొత్తం రాష్ట్ర ఖజానాకు చేరనున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు రూ.46,118 వేల కోట్ల అప్పు చేసింది. వచ్చే రూ.500 కోట్లతో కలిపి రాష్ట్ర రుణం 46,618 కోట్లకు చేరనుంది. ఈ నెలలో ఇప్పటికే 3వ తేదీన రూ.2,500 కోట్లు, 10న 1,500 కోట్లు.. ఇలా వారం రోజుల్లోనే రూ.4,000 కోట్లు రుణం పొందిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఈ నెల 17న మరోసారి రూ.500 కోట్లు అప్పు తీసుకోనున్నది. ప్రతి నెలా రూ.5 వేల నుంచి 6 వేల కోట్ల విలువైన బాండ్ల వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వు బ్యాంకు నుంచి అప్పులు తీసుకుంటున్నది. అలవికాని హామీలు ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటి అమలుకు ఆపసోపాలు పడుతున్నది.

24 గంటల్లో మరో అల్పపీడనం

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : రానున్న 24గంటల్లో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడబోతున్నట్టు అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆగ్నేయ బంగ్లాదేశ్ పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగడంతో కోస్తా బంగ్లాదేశ్, ఉత్తర బంగాళాఖాతం ప్రాంతాలపై అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. 48 గంటల్లో పశ్చిమ వాయువ్యదిశగా కదులుతూ వాయుగుండంగా అల్పపీడనం బలపడుతుంది. పశ్చిమ బెంగాల్, వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశముంది. దీని ప్రభావంతో తెలంగాణ, కోస్తాలో పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురుస్తాయని.. మిగతా ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. బలమైన ఉపరితల గాలులు గంటకు 30–40 కిలోమీటర్ల వేగముతో వీస్తాయని తెలిపింది.

19 నుంచి నైరుతి రుతుపవనాలు వెనక్కి

నైరుతి రుతుపవనాలు ఈ నెల 19 నుంచి 25 మధ్య వెనక్కి మళ్లుతాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. సెప్టెంబర్ 17న తిరోగమనం మొదలై అక్టోబర్ 15 వరకు వెళ్లిపోతాయి.

అడ్డగోలు జీఎస్టీపై ఆక్రోశం

- తమిళనాడులో రెస్టారెంట్ యజమాని ఆవేదన
- అనంతరం కేంద్ర మంత్రికి బలవంతంగా క్షమాపణ
- వ్యక్తిగత సంభాషణ వీడియోను లీక్ చేసిన బీజేపీ
- తీవ్రంగా మండిపడిన విపక్ష నేతలు, నెటిజన్లు
- విచారం వ్యక్తం చేసిన తమిళనాడు బీజేపీ చీఫ్



జీఎస్టీపై ఆవేదన వ్యక్తం చేస్తున్న శ్రీనివాసన్

కోయంబత్తూర్: ఆహార పదార్థాలపై కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా జీఎస్టీ (వస్తు, సేవల పన్ను) వసూలు చేస్తుండటం పట్ల తమిళనాడులో ఓ రెస్టారెంట్ యజమాని బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను వ్యక్తిగతంగా కలిసి తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పారు. ఈ వ్యక్తిగత సంభాషణకు సంబంధించిన వీడియోను బీజేపీ లీక్ చేయడం వివాదాస్పదంగా మారింది. దీనిపై విపక్ష నేతలు, నెటిజన్లు మండిపడటంతో తమిళనాడు రాష్ట్ర బీజేపీ శాఖ అధ్యక్షుడు అన్నామలై క్షమాపణ చెప్పాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. కోయంబత్తూరు జిల్లాలోని వ్యాపారులు ఇటీవల కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. ఆ సమావేశంలో అన్నపూర్ణ రెస్టారెంట్ చైన్ యజమాని, తమిళనాడు హోటల్ యజమానుల సమాఖ్య చైర్మన్ శ్రీనివాసన్ మాట్లాడుతూ.. ఆహార పదార్థాలపై నానా రకాలుగా జీఎస్టీ వసూలు చేస్తుండటం వల్ల రెస్టారెంట్ల యజమానులకు ఎదురవుతున్న సమస్యలను ఏకరువు పెట్టారు. రొట్టె (బన్)లపై ఎలాంటి పన్ను విధించకపోయినప్పటికీ క్రీమ్‌తో కూడిన రొట్టెలపై 18% పన్ను విధించడాన్ని తప్పుపట్టారు. స్వీట్లపై 5%, బిస్కెట్లపై 12%, క్రీమ్ ఫిల్డ్ బన్స్‌పై 18% చొప్పున పన్ను వసూలు చేస్తుండటంపై కస్టమర్ల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. ఆ సమావేశం ముగిశాక ఆయన వ్యక్తిగతంగా సీతారామన్‌ను కలిసి, తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పారు. ఆ సమయంలో కోయంబత్తూర్ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీనివాసన్ (బీజేపీ) అక్కడ ఉన్నారు. అనంతరం ఆ వ్యక్తిగత సంభాషణ వీడియోను తమిళనాడు బీజేపీ సోషల్ మీడియా సెల్ కన్వీనర్ 'ఎక్స్'లో షేర్ చేయడం దుమారాన్ని రేపింది. బీజేపీ తీరుపై కాంగ్రెస్, డీఎంకే నేతలతోపాటు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీనివాసన్ పట్ల బీజేపీ తలబిరుసుతో అమర్యాదకరంగా వ్యవహరించిందని, ఆయనతో నిర్మలా సీతారామన్‌కు బలవంతంగా క్షమాపణ చెప్పించినట్టు కనిపిస్తున్నదని మండిపడ్డారు. జీఎస్టీలో ఉన్న లొసుగులను వివరించి, విలువైన ప్రశ్న అడిగినందుకు వ్యాపారవేత్త శ్రీనివాసన్‌ను బీజేపీ ఘోరంగా అవమానించిందని ప్రముఖ రాజకీయ వ్యాఖ్యాత సుమంత్ సీ రామన్ లాంటివారు సైతం ధ్వజమెత్తడంతో తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై స్పందించారు. శ్రీనివాసన్‌కు, నిర్మలా సీతారామన్‌కు మధ్య జరిగిన వ్యక్తిగత సంభాషణ వీడియోను బీజేపీ నేతలు సోషల్ మీడియాలో షేర్ చేయడంపై విచారం వ్యక్తం చేస్తూ.. శ్రీనివాసన్‌కు క్షమాపణ చెప్పారు.

పోర్ట్‌బ్లెయిర్ ఇక శ్రీ విజయపురం

న్యూఢిల్లీ: కేంద్ర పాలిత ప్రాంతమైన అండమాన్ నికోబార్ దీవులశ్రేణికి రాజధానిగా ఉన్న పోర్ట్‌బ్లెయిర్ నగరం పేరును శ్రీవిజయపురంగా మార్చినట్టు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించారు. దేశంలో ఇప్పటికే ఎన్నో నగరాలు, పట్టణాల పేర్లు మార్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. వలసపాలకుల ముద్రలు చెరిపేసే క్రమంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. దేశ స్వాతంత్ర్య పోరాటంలో అండమాన్ నికోబార్ దీవులకు అసమాన స్థానం ఉన్నదని అమిత్‌షా ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఒకప్పుడు చోళ సామ్రాజ్యానికి నౌకా స్థావరంగా ఉన్న అండమాన్ దీవులు ఇప్పుడు భారత అభివృద్ధి, వ్యూహాత్మక ఆకాంక్షలకు కీలకమైన ప్రాంతమని తెలిపారు. అండమాన్ ద్వీప సముదాయంలో 836 దీవులు ఉన్నాయి.

కేజ్రీవాల్‌కు బెయిల్

- సీబీఐ కేసులో మంజూరు చేసిన సుప్రీంకోర్టు
- సచివాలయానికి వెళ్లొద్దు.. ఫైళ్లపై సంతకం చేయొద్దు
- కేసు గురించి బయట మాట్లాడొద్దని షరతులు
- 'పంజరంలో చిలక' అపవాదును తొలగించుకోండి
- సీబీఐకి అత్యున్నత న్యాయస్థానం కీలక సూచన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించి సీబీఐ నమోదు చేసిన కేసులో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం కేజ్రీవాల్‌కు భారీ ఉపశమనం కలిగించింది. ఇప్పట్లో విచారణ పూర్తయ్యే అవకాశం లేదని పేర్కొన్న కోర్టు.. కేజ్రీవాల్ ఆధారాలను ట్యాంపర్ చేస్తారనే వాదనను తిరస్కరించింది. సుదీర్ఘంగా నిర్బంధించడం అన్యాయంగా స్వేచ్ఛను హరించడమేనని వ్యాఖ్యానించింది. రూ.10 లక్షల పూచీకత్తు, ఇద్దరి జామీను సమర్పించాలని కేజ్రీవాల్‌ను ఆదేశించింది. కేసు గురించి బయట ఏమీ మాట్లాడవద్దని షరతు విధించింది. ఈడీ కేసులో బెయిల్ మంజూరు చేసినప్పుడు ఆయన తన కార్యాలయానికి గానీ, ఢిల్లీ సచివాలయానికి గానీ వెళ్లవద్దని, లెఫ్ట్‌నెంట్ గవర్నర్ అనుమతి కోసం తప్పనిసరి అయితే తప్ప ఏ ఫైలు పైనా సంతకం చేయవద్దని కోర్టు నిబంధనలు విధించింది. ఈ షరతులు ఇప్పుడు కూడా పాటించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

అంత తొందర ఏమొచ్చింది?

: జస్టిస్ ఉజ్జల్ భుయాన్

కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసే తీర్పుతో ఏకీభవించిన జస్టిస్ ఉజ్జల్ భుయాన్.. ప్రత్యేకంగా 31 పేజీల తీర్పు రాశారు. సీబీఐ అరెస్టు చేసిన సమయాన్ని ఆయన తప్పుబట్టారు. ఈడీ కేసులో బెయిల్ మంజూరు చేసినప్పుడే అరెస్టు చేయడం అంటే ఆయనను నిరాశపర్చడమే సీబీఐ లక్ష్యమని పేర్కొన్నారు. 22 నెలలుగా లేని తొందర ఈడీ కేసులో బెయిల్ వచ్చినప్పుడే సీబీఐకి ఏముందనేది అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. తప్పించుకునే సమాధానాలు ఇస్తున్నారనే కారణంతో అరెస్టు చేసి, నిర్బంధాన్ని కొనసాగించడాన్ని సీబీఐ సమర్థించుకోలేదని పేర్కొన్నారు. సహకరించకపోవడం అంటే నేరాన్ని అంగీకరించడం కాదని స్పష్టం చేశారు. 'పంజరంలో చిలక' అనే భావనను సీబీఐ తొలగించుకోవాలని, స్వతంత్రంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

షరతులపైనా అభ్యంతరాలు


ఈడీ కేసులో ఇవే కారణాలతో బెయిల్ ఇచ్చిన తర్వాత కూడా కేజ్రీవాల్‌ను కస్టడీలో పెట్టడమంటే న్యాయాన్ని అపహాస్యం చేయడమే అని అన్నారు. ఈడీ కేసులో కేజ్రీవాల్‌కు విధించిన బెయిల్ షరతులపైనా తనకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయని జస్టిస్ ఉజ్జల్ భుయాన్ పేర్కొన్నారు. ఈ షరతులు కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లకుండా, ఫైళ్లపై సంతకాలు చేయకుండా అడ్డుకుంటున్నాయని అన్నారు. అయితే, ఇది ప్రత్యేక ఈడీ కేసు కాబట్టి న్యాయపరమైన క్రమశిక్షణ వల్ల ఈ నిబంధనలపై తాను మాట్లాడటం లేదని ఆయన వ్యాఖ్యానించారు.

ఐదు నెలల జైలు జీవితం

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మార్చి 21న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆయనను అరెస్టు చేసింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మే 10 నుంచి జూన్ 1 వరకు ఆయనకు తాత్కాలిక బెయిల్ మంజూరైంది. జూన్ 2న ఆయన మళ్లీ జైలులో లొంగిపోగా, జూన్ 20న ట్రయల్ కోర్టులో బెయిల్ దక్కింది. బెయిల్‌ను ఈడీ సవాల్ చేయడంతో జూన్ 25న హైకోర్టు బెయిల్ ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. జూన్ 26న ఇదే కేసులో కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేసింది. జూలై 12న ఈడీ కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ సీబీఐ అప్పటికే అరెస్టు చేయడం వల్ల ఆయన జైలులోనే ఉండాల్సి వచ్చింది. సీబీఐ కేసులోనూ బెయిల్ దక్కడంతో శుక్రవారం సాయంత్రం తిహార్ జైలు నుంచి ఆయన విడుదలయ్యారు.

బీజేపీకి చెంపపెట్టు

కేజ్రీవాల్‌కు బెయిల్ రావడం బీజేపీకి చెంపపెట్టు అని ఆప్ కీలక నేత మనీశ్ సిసోడియా పేర్కొన్నారు. ఈడీ, సీబీఐని ఉపయోగించుకొని ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడానికి బీజేపీ సిగ్గుపడాలని ఆయన అన్నారు. నియంతృత్వాన్ని ఆపేయాలని సుప్రీంకోర్టు బీజేపీకి పెద్ద సందేశం ఇచ్చిందని పేర్కొన్నారు.



బెయిల్‌పై విడుదలయ్యాక మద్దతుదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కేజ్రీవాల్

దేశ వ్యతిరేక శక్తులపై పోరాటం కొనసాగిస్తా: కేజ్రీవాల్

జైలు నుంచి విడుదలయ్యాక కేజ్రీవాల్ మాట్లాడుతూ.. దేశాన్ని బలహీనం చేసేందుకు పనిచేస్తున్న దేశ వ్యతిరేక శక్తులతో పోరాటాన్ని కొనసాగిస్తానని పేర్కొన్నారు. 'నా కోసం ప్రార్థించిన అందరికీ ధన్యవాదాలు. నా ప్రతి రక్తపు చుక్క దేశ సేవకే అంకితం. నా జీవితంలో ఎన్నో కష్టాలను చూశాను. ప్రతిసారి దేవుడు నా వెంట ఉన్నాడు. నన్ను బలహీనం చేయాలని జైల్లో పెట్టారు, కానీ నా సంకల్పం మరింత బలోపేతమైంది.' అని ఆయన వ్యాఖ్యానించారు.

పెరగనున్న వంట నూనె ధరలు

దిగుమతులపై సుంకం భారీగా పెంచిన కేంద్రం



ముంబై, సెప్టెంబర్ 13: దేశంలో వంటనూనె ధరలు పెరగనున్నాయి. ముడి, రిఫైన్డ్ వంటనూనెలపై దిగుమతి సుంకాన్ని ఒకేసారి 20 శాతం వరకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం శుక్రవారం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో దేశంలో పామ్ ఆయిల్, సోయా నూనె, పొద్దుతిరుగుడు నూనె ధరలు పెరగనున్నాయి. ముడి సోయా, సన్‌ఫ్లవర్, పామ్ నూనెలపై ఇప్పటివరకు కస్టమ్స్ డ్యూటీ ఉండేది కాదు. ఇప్పుడు 20 శాతం కస్టమ్స్ డ్యూటీ విధించింది. గతంలో రిఫైన్డ్ పామ్ ఆయిల్, సోయా నూనె, పొద్దుతిరుగుడు నూనెపై 12.5 శాతం దిగుమతి సుంకం ఉండేది. ఇప్పుడు వీటిపై 32.5 శాతం దిగుమతి సుంకం పడనుంది. మొత్తంగా ముడి నూనెలపై సుంకం 5.5 శాతం నుంచి 27.5 శాతానికి, రిఫైన్డ్ నూనెలపై సుంకం 13.75 శాతం నుంచి 35.75 శాతానికి పెరగనుంది. ఇది సెప్టెంబర్ 14 నుంచి అమలులోకి వస్తుంది. ప్రభుత్వ నిర్ణయంతో ఈ నూనెల ధరలు పెరగడంతో పాటు డిమాండ్ తగ్గనుంది. మరోవైపు, ఉల్లిపై ఎగుమతి సుంకాన్ని కేంద్రం 40 శాతం నుంచి 20 శాతానికి తగ్గించింది.

ఎస్ఎస్‌బీ చీఫ్‌గా అమృత్ మోహన్ ప్రసాద్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ) డైరెక్టర్ జనరల్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి అమృత్ మోహన్ ప్రసాద్ శుక్రవారం నియమితులయ్యారు. ప్రసాద్ 1989 బ్యాచ్‌కు చెందిన ఒడిశా క్యాడర్ ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన సీఆర్పీఎఫ్ ప్రత్యేక డైరెక్టర్ జనరల్‌గా పని చేస్తున్నారు.

రష్యాపైకి స్టార్మ్ షాడో క్షిపణులు?

వినియోగించేందుకు ఉక్రెయిన్‌కు యూకే గ్రీన్‌సిగ్నల్!

కీవ్, సెప్టెంబర్ 13: రష్యా - ఉక్రెయిన్ యుద్ధం మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి. రష్యాపై దీర్ఘ శ్రేణి క్రూయిజ్ క్షిపణులతో (స్టార్మ్ షాడో క్షిపణులు) దాడికి ఉక్రెయిన్ సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది. ఈ క్షిపణుల వినియోగానికి ఉక్రెయిన్‌కు నాటో సభ్య దేశమైన యూకే అనుమతి ఇచ్చిందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. యూకే, ఫ్రాన్స్ కలిసి అభివృద్ధి చేసిన ఈ క్షిపణులు 500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలపై కూడా దాడి చేయగలవు. ఇప్పటివరకు రష్యా - ఉక్రెయిన్ సరిహద్దు ప్రాంతాలకు ఎక్కువగా యుద్ధం పరిమితమైంది. ఈ క్షిపణుల ద్వారా రష్యా భూభాగం లోపలి ప్రాంతాల్లోని లక్ష్యాలపై దాడులు చేయాలని ఉక్రెయిన్ భావిస్తున్నది. ఇదే జరిగితే యుద్ధం తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. ఒకవేళ ఉక్రెయిన్ కనుక ఈ క్షిపణులు వాడితే, దానికి ఇవి సరఫరా చేసిన నాటో దేశాలు, అమెరికా, యూరోపియన్ దేశాలను కూడా యుద్ధంలోకి లాగినట్టే అవుతుందని గురువారం రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు.

రైల్లో బాలికపై లైంగిక దాడి

ప్రయాణికుల దాడిలో నిందితుడి మృతి

కాన్పూర్: రైల్లో బాలిక(11)పై రైల్వే కాంట్రాక్టు కూలీ ఒకరు లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో ఆగ్రహించిన బాధితురాలి కుటుంబసభ్యులు, ప్రయాణికులు నిందితుడిపై దాడి చేయడంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. మంగళవారం రాత్రి లక్నో-కాన్పూర్ మధ్య ప్రయాణిస్తున్న హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌లో ఈ ఘటన జరిగిందని పోలీసులు శుక్రవారం తెలిపారు. బీహార్‌కు చెందిన నిందితుడు ప్రశాంత్ కుమార్(34) బాధితురాలి కుటుంబంతో కలిసి సివన్‌లో రైలెక్కాడు. అతడు తన బెర్త్‌ను బాలికకు ఆఫర్ చేసి.. ఆమె తల్లి లేని సమయంలో ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఈ విషయాన్ని తల్లికి తెలుపగా.. ఆమె ఈ విషయాన్ని తన కుటుంబానికి, ఇతర ప్రయాణికులకు తెలిపింది. వారంతా కోపంతో నిందితుడిని తీవ్రంగా కొట్టారు. కాన్పూర్ సెంట్రల్ స్టేషన్‌లో రైల్వే పోలీసులు నిందితుడిని కస్టడీలోనికి తీసుకొన్నారు. అతడి ఆరోగ్యం క్షీణించడంతో దవాఖానకు తరలించారు. అక్కడ అతడు మృతి చెందాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రేప్‌ను ప్రతిఘటించి.. మర్మావయవాలను కోసి

నర్స్ సాహసం.. లైంగిక దాడికి యత్నించిన డాక్టర్‌కు గుణపాఠం

పాట్నా, సెప్టెంబర్ 13: తనపై జరిగిన గ్యాంగ్ రేప్ యత్నాన్ని ఓ నర్స్ సమయస్ఫూర్తితో ధైర్యంగా ఎదుర్కొన్న ఘటన బీహార్‌లో జరిగింది. గంగాపూర్‌లోని ఆర్‌బీఎస్ హెల్త్‌కేర్ సెంటర్‌లో పనిచేస్తున్న నర్స్‌పై బుధవారం రాత్రి అదే దవాఖాన అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సంజయ్ కుమార్, అతడి ఇద్దరు సహాయకులు మద్యం తాగి లైంగిక దాడికి ప్రయత్నించారు. తనను రక్షించుకోవడానికి నర్స్ వెంటనే ఓ బ్లేడ్‌తో డాక్టర్ ప్రైవేట్ భాగాలను కోసింది. ఆ తర్వాత అక్కడి నుంచి తప్పించుకొని దగ్గర్లోని పొలంలో దాక్కొని పోలీసులకు ఫోన్ చేసింది. వారు వెంటనే అక్కడకు చేరుకొని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. నర్స్‌పై లైంగిక దాడికి యత్నించే ముందు నిందితులు దవాఖానకు లోపలి వైపు తాళం వేసి సీసీ కెమెరాలను ఆఫ్ చేశారని డీఎస్పీ పాండే తెలిపారు. వారి వద్ద మద్యం ఉండటంతో నిందితులపై ప్రొహిబిషన్ చట్టం ప్రకారం కూడా కేసులు నమోదు చేస్తామని పోలీసులు వెల్లడించారు.

రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి

కోల్‌కతా జూనియర్ డాక్టర్ల లేఖ

కోల్‌కతా, సెప్టెంబర్ 13: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ దవాఖాన సంక్షోభంపై జోక్యం చేసుకోవాలని నెల రోజులకు పైగా విధులు బహిష్కరించి ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యులు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కోరారు. పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫ్రంట్ రాసిన నాలుగు పేజీల లేఖను వారు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్‌కు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాలకు కూడా పంపారు.

ఇద్దరు జవాన్ల వీరమరణం

ఇద్దరు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో జరిగిన రెండు వేర్వేరు ఎదురు కాల్పుల ఘటనల్లో ఇద్దరు సైనికులు వీరమరణం పొందగా, ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రధాని మోదీ శనివారం నుంచి ఇక్కడ పర్యటించనున్నారు. ఆయన పర్యటనకు ఒక రోజు ముందు ఈ ఎన్‌కౌంటర్లు చోటుచేసుకోవడంతో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. కిష్త్వార్‌లో ఇద్దరు జవాన్లు అమరులు కాగా, కథువాలో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు.

బకాయిలు చెల్లించకుంటే సమ్మె

కర్ణాటక కాంగ్రెస్ సర్కారుకు ఆర్టీసీ ఉద్యోగుల హెచ్చరిక

26 వరకు ప్రభుత్వానికి గడువు

బెంగళూరు, సెప్టెంబర్ 13: కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్టీసీ యూనియన్లు గట్టి హెచ్చరికలు జారీ చేశాయి. తమ ఎరియర్స్ చెల్లింపులతో పాటు, ఇతర డిమాండ్లను నెరవేర్చకపోతే ఈ నెల 27 నుంచి ఆందోళనకు దిగుతామని ఆరు యూనియన్లతో కూడిన జాయింట్ యాక్షన్ కమిటీ హెచ్చరించింది. తమ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం కర్ణాటక స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (టీఎస్ఆర్టీసీ)కి చెందిన నాలుగు యూనియన్లు ఫ్రీడమ్ పార్కులో ధర్నా నిర్వహించాయి. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీఎం సిద్ధరామయ్యకు అందజేశారు. ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.4,565 కోట్లు, శక్తి స్కీమ్ కింద రీయింబర్స్ చేయాల్సిన 1,346 కోట్లు, వేతన బకాయిలు, తదితరాలు 998 కోట్లు చెల్లించాలని, వేతన సవరణ కమిటీని వెంటనే వేయాలని జేఏసీ డిమాండ్ చేసింది. ఈ నెల 26లోగా వీటిపై చర్య తీసుకోవాలని, లేకపోతే సెప్టెంబర్ 27 నుంచి నిరవధికంగా సమ్మెలోకి దిగుతామని హెచ్చరించింది.

హైజాక్ విమానంలో నా తండ్రి

1984 నాటి ఘటనను గుర్తు చేసుకున్న విదేశాంగ మంత్రి జైశంకర్



జెనీవా: విదేశాంగ మంత్రి జైశంకర్ సమస్యకు ఇరువైపులా తానే ఉన్న సంఘటనను గుర్తు చేసుకున్నారు. డిమాండ్ చేసేవారి పక్షంలోనూ, పరిష్కారాన్ని చూపించే పక్షంలోనూ తానే ఉన్న ఆ సంఘటన 1984లో జరిగినట్లు తెలిపారు. జెనీవాలో జరిగిన ఓ కార్యక్రమంలో భారత సంతతి ప్రజలు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు. ఇటీవల విడుదలైన టెలివిజన్ సిరీస్ 'ఐసీ 814: ది కాందహార్ హైజాక్' గురించి ప్రశ్నించినపుడు ఆయన బదులిస్తూ, ఈ సిరీస్‌ను తాను చూడలేదని చెప్పారు. 1984లో ఓ విమానం హైజాక్‌కు గురైందని, అప్పట్లో తాను వెరీ యంగ్ ఆఫీసర్‌నని చెప్పారు. ఆ విమానంలో తన తండ్రి కే సుబ్రహ్మణ్యం (ఐఏఎస్ అధికారి) ఉన్నట్లు తనకు ఆ తర్వాత తెలిసిందన్నారు. ఆ విమానాన్ని హైజాకర్లు దుబాయ్ తీసుకెళ్లిపోయారని, ఎవరినీ చంపలేదని అన్నారు. ఆ సమయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కుటుంబ సభ్యుల్లోనూ, సమస్యను పరిష్కరించే బృందంలోనూ తాను ఉన్నానని చెప్పారు.

ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు నేటితో ముగింపు

న్యూఢిల్లీ: పదేండ్ల క్రితం నాటి ఆధార్ కార్డుల్లోని వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసుకోవడానికి శనివారం ఆఖరు తేదీ అని ఉడాయ్ ప్రకటించింది. ఇందుకోసం వ్యక్తిగత గుర్తింపు, చిరునామా పత్రాలను అప్‌లోడ్ చేయాలని తెలిపింది. ఉడాయ్ అధికార వెబ్‌సైట్ http://myaadhar.uidai.gov.inలో ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ సాయంతో లాగిన్ అయి వివరాలను అప్‌డేట్ చేసుకోవచ్చని చెప్పింది. సెప్టెంబర్ 14 తర్వాత మార్పులు చేసుకోవాలంటే రూ.50 జరిమానా చెల్లించాలని తెలిపింది. వేలిముద్రలు, ఐరిస్ స్కాన్స్, ముఖ చిత్రాల వంటి బయో మెట్రిక్ సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసుకోలేరని తెలిపింది.

ఉల్లి, బాస్మతి బియ్యం కనీస ఎగుమతి ధర రద్దు

న్యూఢిల్లీ: ఉల్లిపాయలను ఎక్కువగా పండించే మహారాష్ట్రలో త్వరలో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో రైతులను మచ్చిక చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విదేశాలకు ఎగుమతి చేసే ఉల్లిపాయలకు కనీస ఎగుమతి ధర నిబంధనను శుక్రవారం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ రద్దు చేసింది. గతంలో విధించిన నిబంధన ప్రకారం ఉల్లిని ఎగుమతి చేయాలంటే, టన్నుకు కనీసం 550 డాలర్లు ధర ఉండాలి. మరోవైపు, బాస్మతి బియ్యం ఎగుమతికి కనీస ఎగుమతి ధర (ఎంఈపీ) టన్నుకు కనీసం 950 డాలర్లు ఉండాలన్న నిబంధనను కూడా కేంద్రం తొలగించింది.

గోధుమల నిల్వలపై కేంద్రం ఆంక్షలు

న్యూఢిల్లీ: గోధుమల అక్రమ నిల్వలు, ధరల పెరుగుదలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సవరించిన నిబంధనల ప్రకారం, ట్రేడర్లు, హోల్‌సేలర్లు 2,000 టన్నుల వరకు మాత్రమే గోధుమలను నిల్వ చేసుకోవచ్చు. గతంలో ఇది 3,000 టన్నులుగా ఉండేది. బిగ్ చైన్ రిటైలర్లు ఒక్కొక్క ఔట్‌లెట్‌కు 10 మెట్రిక్ టన్నుల వరకు తమ డిపోలో నిల్వ చేసుకోవచ్చు. గతంలో దీనిపై ఆంక్షలు ఉండేవి కాదు. ప్రాసెసర్లు మంత్లీ ఇన్‌స్టాల్డ్ కెపాసిటీ (ఎంఐసీ)లో 60 శాతం వరకు నిల్వ చేసుకోవచ్చు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మిగిలిన నెలలకు ఈ విధంగా నిల్వ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. గతంలో ఇది ఎంఐసీలో 70 శాతంగా ఉండేది. 10 టన్నుల గోధుమల వరకు నిల్వ ఉంచుకునే వ్యక్తిగత రిటైలర్ల విషయంలో ఎటువంటి మార్పులు లేవు.

ఎంపాక్స్ టీకాకు డబ్ల్యూహెచ్‌వో అనుమతి

జెనీవా: వయోజనులకు తొలి ఎంపాక్స్ టీకాకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) అనుమతిని ఇచ్చింది. ఆఫ్రికా, ఇతర ప్రాంతాల్లో వ్యాధిపై పోరాడటానికి ఇది ముఖ్యమైన చర్యగా అభివర్ణించింది. టీకా కూటమి గవి, యూనిసెఫ్ లాంటి దాతలు ఈ టీకాను కొనుగోలు చేసి ఆఫ్రికా దేశాలకు అందించవచ్చని సూచించింది. అయితే టీకా తయారీదారు ఒకరే ఉండటంతో సరఫరా పరిమితంగా ఉందని తెలిపింది. అవసరం ఉన్నచోట అత్యవసరంగా టీకా కొనుగోలు చేసి సరఫరా చేయాలని దాతలకు డబ్ల్యూహెచ్‌వో పిలుపునిచ్చింది. గత వారం ఎంపాక్స్ కారణంగా ఆఫ్రికా ఖండంలో 107 మరణాలు, 3160 కొత్త కేసులు నమోదయ్యాయి.

యూకేలో విదేశీ విద్యార్థుల కనీస పొదుపు పరిమితి పెంపు

లండన్, సెప్టెంబర్ 13: తమ దేశంలో చదివే విదేశీ విద్యార్థుల కనీస పొదుపు మొత్తాన్ని 2020 తర్వాత యూకే మొదటిసారి పెంచింది. 2025 జనవరి 2 నుంచి యూకేకు వచ్చే విద్యార్థులకు ఇది అమలు కానుంది. కొత్త నిబంధనల ప్రకారం విదేశీ విద్యార్థులు తప్పనిసరిగా తమ చదువుల కోసం తమ వద్ద తగినంత పొదుపు మొత్తం ఉందని ఆధారాలు చూపించాలి. 'తమ కోర్సుకు సంబంధించి తొమ్మిది నెలల వరకు ప్రతి నెల' ఖర్చుల కోసం తమ వద్ద తగినంత మొత్తం ఉందని విద్యార్థులు ఆధారాలు చూపించాలని హోం శాఖ కార్యాలయం తెలిపింది. లండన్‌లో ఉండే విద్యార్థులు నెలకు 1483 పౌండ్లు, లండన్ బయట చదివే వారు 1136 పౌండ్లు తమ వద్ద ఉన్నాయని ఆధారాలు చూపాలి.

త్వరగా పెండ్లి చేసుకుని పిల్లల్ని కనండి

- యువతీ యువకులను వేడుకుంటున్న చైనా
- తగ్గుతున్న జనన రేటుపై ఆందోళన
- రిటైర్మెంట్ వయసు పెంచేందుకు ప్రణాళిక



బీజింగ్, సెప్టెంబర్ 13: తగ్గిపోతున్న జనాభా, పెరిగిపోతున్న వృద్ధుల సంఖ్యతో చైనా ప్రభుత్వం తీవ్ర ఆందోళన చెందుతున్నది. దీంతో యువతీ యువకులను త్వరగా పెండ్లి చేసుకోండి, పిల్లల్ని కనండి, ఆలస్యంగా రిటైర్ అవ్వండి అంటూ వేడుకుంటున్నది. యుక్త వయసులోనే యువతీ యువకులకు వివాహాలు చేయించేందుకు నేషనల్ హెల్త్ కమిషన్ (ఎన్‌హెచ్‌సీ) తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అదే సమయంలో జనాభా సంబంధిత సమస్యల నివారణకు పదవీ విరమణ వయసును క్రమంగా పెంచుకుంటూ పోవాలని ప్రణాళిక సిద్ధం చేసింది. ఇటీవల కాలంలో తగ్గుతున్న జనన రేటు ప్రభుత్వాన్ని తీవ్ర ఆందోళన పరుస్తున్నది. ప్రస్తుతం చైనాలోని నిబంధనలు ప్రకారం యువకులు 22 ఏండ్లు నిండిన తర్వాత, యువతులు 20 ఏండ్ల తర్వాత మాత్రమే వివాహం చేసుకోవాలి. అయితే పిల్లల పెంపకానికి అధిక ఖర్చు కావడం, కెరీర్‌కు సంబంధించిన లక్ష్యాలు, కొన్ని సంప్రదాయ కట్టుబాట్ల కారణంగా చాలామంది మహిళలు పిల్లలను కనడానికి సందేహిస్తున్నారు. ఈ క్రమంలో త్వరగా పెళ్లి చేసుకుని, తొందరగా పిల్లల్ని కనాలంటూ చైనా నినదించనుంది. అందులో భాగంగానే రిటైర్మెంట్ వయసును కూడా పురుషులకు 60 నుంచి 63కు, మహిళలకు 50 నుంచి 55కు ఆయా ఉద్యోగాలను బట్టి పెంచాలని యోచిస్తున్నది. దీనిని 2025లో ప్రారంభించి 2040కు పూర్తి చేయాలని ప్రణాళిక సిద్ధం చేసింది.

కావాలన్నప్పుడే వర్షం!

- వద్దనుకుంటే రాదు.. అవసరం ఉన్నప్పుడే జల్లులు
- వర్షాన్ని నియంత్రించే దిశగా శాస్త్రవేత్తల అడుగులు
- 'మిషన్ మౌసమ్'లో భాగంగా త్వరలో పరిశోధనలు
- 'క్లౌడ్ చాంబర్' ఏర్పాటు చేసి మేఘాలపై అధ్యయనం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: వర్షానికి వేళాపాళా ఉండదు. అవసరం ఉన్నప్పుడు పడదు. అవసరం లేనప్పుడు కుంభవృష్టి కురుస్తుంది. అలాకాకుండా, మనకు అవసరం ఉన్నప్పుడే వర్షం కురిస్తే..! పండుగలకు, పబ్బాలకు కురవకుండా చేయగలిగితే..! భలేగా ఉంటుంది కదూ. ఆ దిశగా భారత శాస్త్రవేత్తలు ప్రణాళిక రచిస్తున్నారు. ఇందుకు గానూ కేంద్ర మంత్రివర్గం తాజాగా ఆమోదించిన 'మిషన్ మౌసమ్'లో భాగంగా వచ్చే ఐదేండ్లలో కీలక పరిశోధనలు జరగనున్నాయి. వడగండ్లు, ఉరుములు, మెరుపులను కూడా నియంత్రించే దిశగా ఆలోచిస్తున్నారు. క్లౌడ్ సీడింగ్‌పై ప్రధానంగా పరిశోధనలు కొనసాగనున్నాయి.

క్లౌడ్ సీడింగ్ అంటే ఏంటి?

ఆకాశంలోకి కొన్ని పదార్థాలను చల్లడం ద్వారా మేఘాలను ప్రభావితం చేయడాన్ని క్లౌడ్ సీడింగ్ అంటారు. ప్రస్తుతం సిల్వర్ అయోడైడ్, పొటాషియం ఐయోడైడ్, డ్రై ఐస్(సాలిడ్ కార్బన్ డయాక్సైడ్)ను క్లౌడ్ సీడింగ్‌కు వినియోగిస్తున్నారు. క్లౌడ్ సీడింగ్ చేయడం వల్ల నీటి ఆవిరి ద్రవ జలంగా మారి వర్షం కురుస్తుంది.

వర్షాలపై వాతావరణ మార్పుల ప్రభావం

వాతావరణ మార్పులు వర్షాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. అయితే అతివృష్టి లేదంటే అనావృష్టికి కారణమవుతున్నాయి. క్లౌడ్‌బరస్ట్‌ల వల్ల తక్కువ సమయంలో, తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ వర్షం కురుస్తున్న ఘటనలు ఇటీవల పెరిగిపోయాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా మేఘాల ఎత్తు పెరుగుతున్నదని, విస్తరణ తగ్గడం వల్ల కొన్ని చోట్ల ఎక్కువగా వర్షాలు పడుతున్నాయని, ఇంకొన్ని చోట్ల కరువు పరిస్థితులు తలెత్తుతున్నాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఉరుములు, మెరుపులు, పిడుగుపాట్లు ఎక్కువ కావడానికీ ఇదే కారణం. ఈ పరిస్థితి నియంత్రించేందుకు మేఘాలను ప్రభావితం చేసి అతివృష్టి, అనావృష్టిని నివారించాలనేది శాస్త్రవేత్తల ఆలోచన.

'మిషన్ మౌసమ్' ద్వారా ఏం చేస్తారు?

'మిషన్ మౌసమ్' కార్యక్రమంలో భాగంగా పుణేలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటిరియాలజీ(ఐఐటీఎం)లో ఒక 'క్లౌడ్ చాంబర్' ఏర్పాటు చేయనున్నారు. ఇందులో క్లౌడ్ సీడింగ్ సహా మేఘాలపై పరిశోధకులు అధ్యయనం చేయనున్నారు. ఇందుకు గానూ క్లౌడ్ చాంబర్ లోపల కృత్రిమ మేఘాలు తయారు చేసి పరిశోధనలు జరుపుతామని, వర్షాలు పెంచడంతో పాటు అడ్డుకోవడానికి క్లౌడ్ సీడింగ్ ద్వారా అవకాశాలను పరిశోధిస్తామని భూవిజ్ఞాన శాస్త్ర శాఖ కార్యదర్శి డాక్టర్ రవిచంద్రన్ తెలిపారు. రానున్న ఐదేండ్లలో కృత్రిమంగా వర్షాన్ని పెంచడంతో పాటు తగ్గించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. క్లౌడ్ సీడింగ్ పద్ధతిని అమెరికా, కెనడా, చైనా, రష్యా, ఆస్ట్రేలియా వంటి దేశాలు ఉపయోగిస్తున్నాయి.

రికార్డు ర్యాలీకి బ్రేక్

ముంబై, సెప్టెంబర్ 13: స్టాక్ మార్కెట్ల రికార్డు ర్యాలీకి బ్రేక్‌పడింది. మదుపరులు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గుచూపడంతో సూచీలు నష్టపోయాయి. వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి ఇంట్రాడేలో 300 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 71.77 పాయింట్లు కోల్పోయి 82,890.94 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 32.40 పాయింట్లు కోల్పోయి 25,356.50 వద్ద స్థిరపడింది. లాభాల్లో ప్రారంభమైన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో చివరకు నష్టాల్లోకి జారుకున్నాయి. పవర్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్‌ఎంసీజీ రంగ షేర్లు నష్టపోయాయి. అదానీ పోర్ట్స్ షేరు అత్యధికంగా 2 శాతం వరకు నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది.

స్విస్ ప్రకంపనలు

స్విట్జర్లాండ్ మనీ లాండరింగ్ కేసులో 2,610 కోట్ల సొమ్ము ఫ్రీజ్

అదానీ గ్రూప్ బినామీదేనన్న అనుమానాలు • ఖండించిన కంపెనీ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: మొన్న స్టాక్ మార్కెట్ అక్రమాలు.. నిన్న నకిలీ సంస్థల బాగోతాలు.. నేడు మనీ లాండరింగ్ అనుమానాలు.. అదానీ గ్రూప్‌పై వస్తున్న వరుస ఆరోపణలు కలకలం సృష్టిస్తున్నాయి. దేశ, విదేశాల్లో వెలుగుచూస్తున్న అవినీతి కేసుల్లో అదానీ ఆనవాళ్లు కనిపిస్తుండటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నది. తాజాగా స్విట్జర్లాండ్‌లో మనీ లాండరింగ్ కేసు విచారణలో భాగంగా వివిధ స్విస్ బ్యాంక్ ఖాతాల్లోని ఓ తైవాన్ వ్యక్తికి చెందిన 311 మిలియన్ డాలర్ల (రూ.2,610 కోట్లు)ను అక్కడి అధికారులు ఫ్రీజ్ చేశారు. అయితే ఈ వ్యక్తి అదానీ గ్రూప్ బినామీయేనన్న అనుమానాలు ఇప్పుడు సంచలనం రేపుతున్నాయి. మరోవైపు అదానీ గ్రూప్ వీటిని తీవ్రంగా ఖండించింది. ఏ స్విస్ కోర్టు విచారణల్లోగానీ లేదా జప్తు చేసిన ఖాతాలతోగానీ తమకు ఎలాంటి ప్రమేయం లేదని స్పష్టం చేసింది. ఇవన్నీ పూర్తిగా నిరాధారమైనవని కొట్టిపారేసింది.

ఇదీ సంగతి..

అమెరికా షార్ట్-సెల్లర్ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ తమ 'ఎక్స్' ఖాతాపై స్విట్జర్లాండ్ మీడియా సంస్థ 'గోతమ్ సిటీ' కొత్తగా విడుదల చేసిన స్విస్ క్రిమినల్ రికార్డులను పోస్ట్ చేసింది. వీటిలో స్విస్ అధికారులు అదానీకి సంబంధించిన మనీ లాండరింగ్, సెక్యూరిటీస్ ఫోర్జరీ కేసు దర్యాప్తులో భాగంగా కొన్ని స్విస్ బ్యాంక్ ఖాతాల్లో 310 మిలియన్ డాలర్లకుపైగా నిధులను స్తంభింపజేశారని ఉన్నట్టు హిండెన్‌బర్గ్ పేర్కొన్నది. ఈ సొమ్ముకు బాధ్యుడైన తైవాన్ వాసి చాంగ్ చుంగ్-లింగ్.. అదానీ కంపెనీలకు చెందిన నకిలీ సంస్థలు బీవీఐ/మారిషస్ అండ్ బెర్ముడా ఫండ్స్‌ల్లో ఎలా పెట్టుబడులు పెట్టారో అక్కడి విచారణాధికారులు స్పష్టం చేసినట్టు కూడా హిండెన్‌బర్గ్ తమ ఎక్స్ ఖాతాలో పేర్కొన్నది. కాబట్టి ఈ మనీ లాండరింగ్ కేసుతో అదానీకి సంబంధం ఉందని, సదరు తైవాన్ వ్యక్తి అదానీ బినామీయేనన్న అనుమానాలను వ్యక్తం చేసింది.

స్విస్ మీడియా రిపోర్టుల్లో..

'జెనీవా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం ఈ అక్రమాలపై దర్యాప్తు చేసింది. గత మూడేండ్లకుపైగా ఐదు స్విస్ బ్యాంకుల్లో బిలియనీర్ గౌతమ్ అదానీకి చెందినవాడిగా భావిస్తున్న వ్యక్తికున్న 310 మిలియన్ డాలర్లకు పైగా సొమ్మును అధికారులు ఫ్రీజ్ చేశారని ఫెడరల్ క్రిమినల్ కోర్టు వెల్లడించింది' అంటూ స్విస్ మీడియా గోతమ్ సిటీ తమ రిపోర్టుల్లో తెలియజేసింది. అంతేగాక తమ దర్యాప్తులో చాంగ్ చుంగ్-లింగ్ అసలు కంపెనీల యజమాని కాదని తేలిందని స్విస్ అధికారులు పేర్కొన్నట్టు వివరించింది. మొత్తంగా ఈ ఏడాది ఆగస్టు 9న ఇచ్చిన ఆదేశాల్లో అదానీ గ్రూప్.. మనీ లాండరింగ్ ఇతరత్రా అక్రమ కార్యకలాపాల్లో భాగమైనట్టు కోర్టు అనుమానాలు వ్యక్తం చేసిందంటూ ఈ నెల 10న విడుదల చేసిన రిపోర్టులో గోతమ్ సిటీ తేల్చిచెప్పింది. అంతేగాక అదానీ గ్రూప్ ద్వారా పెద్ద మొత్తంలో పొందిన సొమ్మును చుంగ్-లింగ్ అక్రమ మార్గాల్లో పెట్టుబడులు పెట్టారన్నది.

అదానీ వాదన ఇదీ..

ఈ వ్యవహారం విచారణ సందర్భంగా స్విస్ కోర్టు తమ కంపెనీ పేరును ప్రస్తావించలేదని, తమ నుంచి ఏ రకమైన వివరణనూ కోరలేదని అదానీ గ్రూప్ అంటున్నది. విదేశాల్లో ఉన్న తమ కంపెనీలన్నీ పారదర్శకంగా ఏర్పాటైనవేనని, అక్కడి చట్టాలు, నిబంధనలకు లోబడే పనిచేస్తున్నాయని చెప్పుకొచ్చింది. 'ఈ ఆరోపణలన్నీ అసంబద్ధమైనవి, అహేతుకమైనవి. ఇదంతా మా గ్రూప్ ప్రతిష్ఠను, మార్కెట్ వాల్యూను దెబ్బతీయడానికి చేస్తున్న మరో కుట్రని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు' అని అదానీ గ్రూప్ ఈ వ్యవహారంపై స్పందించింది. మరోవైపు హిండెన్‌బర్గ్-అదానీ వ్యవహారం రాజకీయంగా కూడా తీవ్ర దుమారం రేపుతున్నది. దీనిపై సుప్రీం కోర్టు లోతుగా విచారణ చేయాలని కాంగ్రెస్‌సహా ఇతర ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. మొత్తానికి గతంలో సెబీ విచారణ చేసి ఏమీ తేల్చక పోవడం, దానీ చీఫ్ మాధవీ పురీ బచ్ పైనా అవినీతి ఆరోపణలు వస్తుండటం, ప్రధాని మోదీకి అదానీకి సంబంధాలు సైతం వివాదాస్పదమవుతున్న నేపథ్యంలో ఈ అంశం మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది.

చాలా పెద్ద కథే..

గత ఏడాది జనవరిలో అదానీ గ్రూప్ స్టాక్ మార్కెట్ అక్రమాలపై హిండెబర్గ్ రిసెర్చ్ విడుదల చేసిన సంచలన రిపోర్టులోనే చాంగ్ చుంగ్-లింగ్ పేరుండటం గమనార్హం. అక్రమ నిధులతో మారిషస్‌లో ఏర్పాటైన గ్రోమోర్ అనే సంస్థకు ఇతను డైరెక్టర్‌గా ఉన్నాడని, విదేశీ ఫండ్స్ ద్వారా అదానీ స్టాక్స్ క్రయవిక్రయాల లావాదేవీలను జరుపుతాడని హిండెన్‌బర్గ్ చెప్తున్నది. అదానీ పవర్‌తో జరిగిన స్టాక్ విలీనం ద్వారా రాత్రికిరాత్రే గ్రోమోర్‌కు 423 మిలియన్ డాలర్ల ప్రయోజనం ఒనగూరినట్టు కూడా గతంలోనే హిండెన్‌బర్గ్ బహిర్గతం చేసింది. ఇక చుంగ్-లింగ్ కుమారుడు చాంగ్ చీన్-టింగ్.. పీఎంసీ ప్రాజెక్ట్స్ (ఇండియా) యజమానుల్లో ఒకరన్నది. భారతీయ క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. అదానీ గ్లోబల్, గ్రోమోర్‌తోపాటు ఈ పీఎంసీ ప్రాజెక్ట్స్‌పైనా విచారణ చేయడం గమనార్హం. నాటి హిండెన్‌బర్గ్ రిపోర్టు దెబ్బకు అదానీ గ్రూప్‌లోని సంస్థల మార్కెట్ విలువ ఏకంగా 150 బిలియన్ డాలర్లు కుప్పకూలిన సంగతి విదితమే.

టీ హబ్‌లో టీ-బ్రిడ్జ్ కార్యక్రమం

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర స్టార్టప్‌లకు అంతర్జాతీయ స్థాయిలో వ్యాపార అవకాశాలను అందించడానికి టీ హబ్..టీ బ్రిడ్జ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టీ హబ్ కేంద్రంగా పలు రంగాల్లో ఆవిష్కరణలు చేసిన స్టార్టప్‌లకు ప్రపంచవ్యాప్తంగా సంబంధాలు ఏర్పాటు చేయడానికి టీ బ్రిడ్జి వేదికగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం టీ హబ్‌ను ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఎఫ్‌సీ)కు చెందిన ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా స్టార్టప్ నిర్వాహకులతో ప్రత్యేకంగా నెట్‌వర్క్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

హైదరాబాద్‌లో ప్రణామ్ హాస్పిటల్

హైదరాబాద్, సెప్టెంబర్ 13: ప్రముఖ వైద్య సేవల సంస్థ ప్రణామ్ హాస్పిట్స్...హైదరాబాద్‌తోపాటు వైజాగ్‌లలో దవాఖానాలను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. వీటిని ఏర్పాటు చేయడానికి మేక్ ఇన్ ఇండియా హాస్పిటల్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నది. ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించడానికి ముఖ్యంగా ఇన్నోవేషన్, ఎక్సలెన్స్, మెడికల్ విభాగంలో తనదైన గుర్తింపు సాధించడానికి కృత నిశ్చయంతో ఉన్నది. ఈ సందర్భంగా ప్రణామ్ హాస్పిటల్స్ ఎండీ మనీష్ గౌర్ మాట్లాడుతూ.. మేక్ ఇన్ ఇండియా హాస్పిటల్స్‌తో కలిసి నూతన జర్నీని ప్రారంభించినట్లు, దీంతో తాము నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరుకోవడానికి ఈ ఒప్పందం దోహదం చేయనున్నదన్నారు. సరసమైన ధరలకే హెల్త్‌కేర్, మెడికల్ సర్వీసులు అందించడానికి కృత నిశ్చయంతో ఉన్నట్లు చెప్పారు.

లారస్ ప్లాంట్లో అమెరికా తనిఖీలు

హైదరాబాద్, సెప్టెంబర్ 13: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ లారస్ ల్యాబ్‌నకు చెందిన ప్లాంట్లో అమెరికా నియంత్రణ మండలి తనిఖీలు నిర్వహించింది. హైదరాబాద్‌కు సమీపంలోని శామీర్‌పేట్‌లోని జినోమ్ వ్యాలీలో కంపెనీకి ఉన్న ఏపీఐ తయారీ యూనిట్‌లో యూఎస్‌ఎఫ్‌డీఏ అధికారులు ఆడిట్ నిర్వహించి ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని వెల్లడించింది.

భగ్గుమన్న బంగారం

ఒకేరోజు 1,200 పెరిగిన తులం ధర • రెండు నెలల గరిష్ఠ స్థాయికి విలువ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: బంగారం ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. దేశీయంగా కొనుగోళ్లు ఊపందుకోవడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ ఉండటంతో బంగారం ధరలు రెండు నెలల గరిష్ఠ స్థాయిని తాకాయి. శుక్రవారం ఒకేరోజు దేశ రాజధాని ఢిల్లీలో తులం పుత్తడి ధర రూ.1,200 ఎగబాకి రూ.75,550 పలికింది. దీంతో గత రెండు నెలల్లో ఇదే గరిష్ఠ స్థాయి కావడం విశేషం. అంతకుముందు ఇది రూ.74,350 వద్ద ఉన్నది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,300 ఎగబాకి రూ.74,450కి చేరుకోగా, 22 క్యారెట్ ధర రూ.1,200 అందుకొని రూ.68,250 పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,599.70 డాలర్లు పలుకగా, వెండి 30.47 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది.

వెండి పరుగులు

బంగారంతోపాటు వెండి మరింత పరుగులు పెట్టింది. గత నాలుగు రోజులుగా పెరుగుతూ వచ్చిన వెండి శుక్రవారం మరో అడుగుముందుకేసింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి రూ.2,000 ఎగబాకి రూ.89 వేలకు చేరుకున్నట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గతంలో ఇది రూ. 87 వేలుగా ఉన్నది. గత నాలుగు రోజుల్లో వెండి ఏకంగా రూ.5,200 పెరిగినట్లు అయింది. ఇటు హైదరాబాద్‌లో రూ.3,500 అధికమైన కిలో ధర రూ.95 వేలకు చేరుకున్నది.

ఫెడ్ వడ్డీరేట్ల తగ్గింపు వల్లే

అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు మెండుగావున్నాయంటు వచ్చిన వార్తలు అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర రికార్డు స్థాయికి చేరుకున్నది. ఈ నెల 18న తన సమీక్షను ప్రకటించనున్నది. దీనికి తోడు దేశీయంగా పండుగ, పెళ్లిళ్ల సీజన్ కూడా తోడవడంతో ధరలు భారీగా పుంజుకున్నాయని ఓ వర్తకుడు వెల్లడించారు.

అన్ని ఆరోపణలూ అవాస్తవాలే


- **సెబీ చీఫ్ మాధవీ పురీ బచ్**



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: తనపై వచ్చిన ఆరోపణలన్నీ తప్పుడువేనని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ చైర్‌పర్సన్ మాధవీ పురీ బచ్ అన్నారు. అదానీ గ్రూప్ అక్రమాల్లో బచ్ దంపతులకూ భాగస్వామ్యం ఉందంటూ అమెరికా షార్ట్-సెల్లర్ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సెబీ చీఫ్‌పై వరుస విమర్శలు వ్యక్తమవగా.. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సైతం అవినీతి ఆరోపణలు గుప్పించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం భర్త ధవల్ బచ్‌తో కలిసి మాధవీ పురీ బచ్ ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఇందులో మహీంద్రా గ్రూప్, డాక్టర్ రెడ్డీస్ మరికొన్ని కార్పొరేట్ సంస్థల నుంచి చెల్లింపులు జరిగాయన్నదానిపైనా స్పష్టత ఇచ్చారు. ఏ కంపెనీతో కూడా మార్గదర్శకాలు, నిబంధనలకు విరుద్ధంగా వెళ్లలేదని చెప్పారు. 2017లో సెబీ బోర్డులోకి వచ్చాక కూడా అగోరా అడ్వైజరీ, అగోరా పార్ట్‌నర్స్ నుంచి ఆర్జించారన్న ఆరోపణలపై స్పందిస్తూ.. ఆ రెండింటికి సంబంధించిన ఏ వ్యవహారంలోనూ తలదూర్చలేదని వెల్లడించారు. సెబీలో తానున్నప్పుడు తన భర్త పనిచేసిన మహీంద్రా గ్రూప్, పిడిలైట్ ఇండస్ట్రీస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, అల్వారెజ్, మర్సల్, సెంబ్‌కార్ప్ వ్యవహారాల్లోనూ జోక్యం చేసుకోలేదన్నారు. ఇక తాను గతంలో పనిచేసిన ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి కాంట్రిబ్యూటరీ యాన్యుటీ స్కీం, ఇతరత్రా ఉద్యోగ ప్రయోజనాలకు సంబంధించిన చెల్లింపులనే తీసుకున్నట్టు వివరణ ఇచ్చారు.

మీ అమ్మాయిని కిడ్నాప్ చేశాం!

- **వాట్సాప్ కాల్స్‌తో బురిడీ**
- **నగరంలో కొత్త తరహా మోసాలు**
- **అజ్ఞాత వ్యక్తుల కాల్స్‌కు స్పందించ వద్దు : ఆర్టీసీ ఎండీ సజ్జనార్**



హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : నగరంలో కొందరు కేటుగాళ్లు ఈజీగా డబ్బు సంపాదించాలని మాస్టర్ ప్లాన్స్ వేస్తున్నారు. సామాన్యులు, సెలబ్రిటీలు, ప్రభుత్వ అధికారులు అనే తేడా లేకుండా అందర్నీ టార్గెట్ చేస్తూ లక్షల రూపాయలు కొల్లగొడుతున్నారు. తాజాగా నగరంలో మరో కొత్త తరహా మోసం వెలుగులోకి వచ్చింది. మీ అమ్మాయిని కిడ్నాప్ చేశాం, డబ్బులు ఇచ్చి మీ అమ్మాయిని తీసుకెళ్లండి అంటూ సైబర్ నేరగాళ్లు వాట్సాప్ తల్లిదండ్రులకు వాట్సాప్ కాల్ చేస్తున్నారు. అటువంటి కాల్స్‌కు స్పందించవద్దని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సూచించారు. సైబర్ కేటుగాళ్ల టార్గెట్ అమ్మాయిలే అంటూ ట్వీట్ చేశారు. స్కూల్స్, కాలేజీలకు వెళ్లే అమ్మాయిలను కిడ్నాప్ చేశారంటూ తల్లిదండ్రులకు పోలీసుల పేరుతో సైబర్ నేరగాళ్లు వాట్సాప్ కాల్స్ చేసి బెదిరింపులకు దిగుతున్నారు. అడిగినంత డబ్బు ఇవ్వకుంటే చంపేస్తారంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. తాజాగా హైదరాబాద్ రాయదుర్గంలో ఓ విద్యార్థిని తల్లిదండ్రులకు విదేశీ ఫోన్ నంబర్‌తో సైబర్ నేరగాళ్లు వాట్సాప్ కాల్ చేశారు. 'నేను పోలీస్ ఆఫీసర్‌ను మాట్లాడుతున్నాను. కాలేజీకి వెళ్లిన మీ అమ్మాయి కిడ్నాప్‌నకు గురైంది. ఆమె ప్రస్తుతం మా దగ్గరే ఉంది, వెంటనే డబ్బును ఆన్‌లైన్ ద్వారా పంపించండి. లేకుంటే మీ అమ్మాయిని కిడ్నాపర్లు చంపేస్తారు' అని బెదిరించారు'. ఇదిగో మీ అమ్మాయి ఏడుస్తుందంటూ ఒక వాయిస్‌ని వినిపించారు. ఏడుస్తున్న గొంతు వినిపించడంతో కాలేజీకి వెళ్లిన తమ కూతురు కిడ్నాప్‌నకు గురైందని తల్లిదండ్రులు భావించి, డబ్బులు పంపించేందుకు సిద్ధపడ్డారు. మోసగాళ్లతో ఫోన్‌లో మాట్లాడుతూనే తమ బంధువులకు ఈ విషయాన్ని చేరవేశారు. తమ కూతురు కాలేజీలో ఉందో..లేదో తెలుసుకోండని సూచించారు. ఆమె కాలేజీలో క్షేమంగా ఉందని చెప్పడంతో వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ తరహా బెదిరింపు ఫోన్ కాల్స్ తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా వస్తున్నాయి. ఆడపిల్లలను కిడ్నాప్ చేశారని చెప్పగానే నమ్మి డబ్బులు పంపిస్తున్నారు. అజ్ఞాత వ్యక్తుల నుంచి విదేశీ ఫోన్ నంబర్లతో వచ్చే వాట్సాప్ కాల్స్‌కు స్పందించకండి. బెదిరింపులకు జంకకుండా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండని సజ్జనార్ సూచించారు.



ఫార్మాకు వ్యతిరేకంగా రిలే దీక్షలు

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మా విలేజ్‌ను నిరసిస్తూ రైతులు గురువారం పలుచోట్ల ప్రారంభించిన రిలే దీక్షలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఫార్మా విలేజ్ ఏర్పాటుకు ఎట్టి పరిస్థితుల్లో భూములు ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేశారు. హకీంపేట చౌరస్తాలో చేపట్టిన రిలే దీక్షలో కూర్చున్న బాధిత రైతులు. - బొంరాస్‌పేట

పోలీసు కంప్లయింట్ అథారిటీలను ఎందుకు ఏర్పాటు చేయలేదు?

- **కోర్టు ధిక్కార కేసులో ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు**

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పోలీసు ఫిర్యాదు మండలితోపాటు జిల్లా పోలీసు ఫిర్యాదు మండళ్ల ఏర్పాటుపై గతంలో ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయలేదని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. ఆ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలంటూ నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర పోలీసు ఫిర్యాదు మండలిని, జిల్లా పోలీసు ఫిర్యాదు మండళ్లను ఏర్పాటు చేశామని, నాలుగు వారాల్లోగా ఆయా కార్యాలయాల సిబ్బందిని నియమిస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చింది. హామీని అమలు చేయకపోవడంపై న్యాయవాది మామిడి వేణుమాధవ్ వ్యక్తిగత హోదాలో దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్ కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపి ప్రతివాదులకు నోటీసులు జారీ చేసి తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేసింది.

700 కోట్లు కొల్లగొట్టిన డీకేజెడ్

- **నిందితులపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు**
- **మీడియా సమావేశంలో బాధితుల ఆవేదన**



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది అషీర్ ఖాన్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 13 : తమ సంస్థలో పెట్టుబడి పెడితే అధిక లాభాలొస్తాయంటూ ఓ కంపెనీ తమ పుట్టిముంచిందని బాధితులు వాపోయారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో న్యాయవాది ఆషీర్‌ఖాన్, నారీ నికేతన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సఫియామాహి బాధితులతో కలిసి వివరాలు వెల్లడించారు. 2018లో నగరానికి చెందిన మాజీ ఐటీ ప్రొఫెషనల్ రాహిల్, మహ్మద్ ఇక్బాల్ మాదాపూర్‌లో డీకేజెడ్ టెక్నాలజీస్ సంస్థను ప్రారంభించారు. సయ్యద్ ఉమేయిర్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారని, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేశారు. తమ సంస్థలో పెట్టుబడులు పెడితే ప్రతి నెలా 10 నుంచి 12 శాతం లాభాలు వస్తాయని నమ్మించారు. ప్రారంభంలో సజావుగా లాభాలు చెల్లించారు. దీంతో దేశవ్యాప్తంగా 18వేల మంది లక్ష నుంచి రూ. 2 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టారు. లక్షకు పైగా చెల్లించిన వారికి బాండ్ పేపర్ ఇచ్చారు. బక్రీద్, రంజాన్ ఆఫర్లంటూ రూ.700 కోట్లకు పైగా పెట్టుబడుల ద్వారా దోచుకున్నారు. ఈ నెల 4న బోర్డు తిప్పేసి, గూగుల్ నుంచి వెబ్‌సైట్‌ను కూడా తొలగించారు. మెహిదీపట్నంకు చెందిన ఓ వైద్యుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసినా నిందితులపై సత్వరమే చర్యలు తీసుకోలేదని బాధితులు ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సీసీఎస్ వద్ద నిరసన చేపట్టారు.

ప్రజావాణికి 576 దరఖాస్తులు

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 576 దరఖాస్తులు వచ్చాయి. సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించి 214, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 78, విద్యుత్ శాఖకు సంబంధించి 56, మైనారిటీ వెల్ఫేర్‌కు సంబంధించి 44, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 44, ఇతర శాఖలకు సంబంధించి 140 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

వేణుస్వామిపై కేసు నమోదుకు కోర్టు ఆదేశాలు అందలేదు

ఏసీపీ వెంకటగిరి

జూబ్లీహిల్స్, సెప్టెంబర్ 13: వేణుస్వామిపై కేసు నమోదు చేయాలని తమకు కోర్టు ఆదేశాలు అందలేదని జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి వెల్లడించారు. జ్యోతిష్యుడు వేణుస్వామిపై కేసు నమోదు చేసి విచారణ చేయాల్సిందిగా జూబ్లీహిల్స్ పోలీసులను నాంపల్లి 17 ఎంఎం కోర్టు ఆదేశించినట్టు వచ్చిన వార్తలపై ఏసీపీ స్పందించారు. జాతకాల పేరుతో వేణుస్వామి మోసం చేస్తున్నారని, ఇటీవల ప్రధాని ఫొటోను మార్ఫింగ్ చేసి తప్పుదోవ పట్టించినట్టు పిటిషన్‌లు వేశారు. వీటిని వెలుగులోకి తెచ్చిన మీడియాను టార్గెట్ చేశాడన్న కేసు విచారణలో పిటిషనర్‌కు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చినట్టు తెలిసింది.

• తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



సిద్దిపేట జిల్లా తిమ్మాపూర్‌లో కొద్ది రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. ఆగ్రహించిన మహిళలు ఖాళీ బిందెలతో శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. సమస్యను పరిష్కరిస్తామన్న కార్యదర్శి హామీ మేరకు ఆందోళన విరమించారు. - దుబ్బాక

కంబోడియా సైబర్‌క్రైమ్‌లో మహిళ అరెస్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ): ఇటీవల రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కంబోడియా సైబర్‌క్రైమ్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు ముంబైలోని చెంబూర్‌లో ప్రియాంక శివకుమార్ సిద్దును అదుపులోకి తీసుకున్నట్టు సైబర్ డీజీ శిఖాగోయెల్ శుక్రవారం తెలిపారు. ముంబైలోని మ్యాక్స్‌వెల్ విదేశీ జాబ్ ప్రాసెసింగ్ కంపెనీలో ప్రియాంక పనిచేసేది. కొన్ని కారణాలతో ఆ కంపెనీ మూతపడగా ప్రియాంక లైసెన్స్‌లేకుండానే సొంత ఏజెన్సీని ఏర్పాటు చేసుకుని, ఇదే తరహాలో ముంబైలో ఏజెన్సీ నిర్వహిస్తున్న నారాయణతో పరిచయం పెంచుకుంది. నారాయణ కంబోడియాకు వెళ్లి డాటా ఎంట్రీ జాబ్స్ గురించి ప్రియాంకకు తెలియజేసేవాడు. ఝూన్ జీ అనే చైనీస్ కంపెనీ డైరెక్టర్ జితేందర్ షా అలియాస్ అమీర్‌ఖాన్‌తో పరిచయం చేసుకుంది. కాల్ సెంటర్‌కు ఎవరినైనా పంపితే ఒక్కో వ్యక్తికి 500 డాలర్లు ఇచ్చేలా ఒప్పందం చేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన వంశీకృష్ణ, సాయిప్రసాద్ నుంచి రూ.30వేల చొప్పున కమీషన్ తీసుకొని కంబోడియా పంపింది. వారు అక్కడ సైబర్ క్రిమినల్స్ చేతిలో చిత్రహింసలు అనుభవించి ఇటీవల భారత్‌కు వచ్చారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఎస్‌బీ ముంబై వెళ్లి ప్రియాంకను అరెస్టు చేసింది.

• బస్సు కోసం విద్యార్థుల ఆందోళన



సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం గొల్లపల్లి నుంచి రామారం మీదుగా గుర్రాలసోఫ మార్గంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ గొల్లపల్లి, రామారం, సయ్యద్‌నగర్ గ్రామాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు శుక్రవారం ఆందోళనకు దిగారు. గుర్రలసోఫ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అధికారులు హామీతో ఆందోళన విరమించారు. - రాయపోల్

కేసు సెటిల్మెంట్‌కు 50 లక్షల డీల్

మొదటిపేజీ తరువాయి...

మద్దతు ప్రకటించాడు. కాంగ్రెస్ నేత అప్పటి వరకు ప్రత్యర్థి పార్టీగా చూసిన ట్రస్టీ వర్గంతో చేతులు కలిపాడు. చర్చి యాజమాన్య హక్కులను తమ వారికి ఇప్పిస్తే రూ.50 లక్షలు ఇస్తామంటూ డీల్ కుదిర్చి రూ.30 లక్షలు అడ్వాన్స్‌గా ఇప్పించాడు. స్థానిక ఇన్‌స్పెక్టర్‌ను సపోర్టు చేయాలని ఏసీపీ ఆదేశించగా అతను ఒప్పుకోలేదు. ఓ కానిస్టేబుల్‌ను చర్చి వద్దకు పంపించి గేట్ తాళాలు పగలగొట్టించాడు. ప్లాన్‌లో భాగంగా కానిస్టేబుల్ డయల్ 100కు ఫోన్ చేసి తనపై దాడి జరిగిందని ఫిర్యాదు చేశాడు. దీంతో సదరు ఏసీపీ తన సిబ్బందితోపాటు ట్రస్టీ సభ్యులను తీసుకొచ్చి చర్చిగేట్లను తెరిచి లోపలికి వెళ్లాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి పలువురిని అరెస్టు చేశారు. ఆ తరువాత అదే జోన్‌లోని మరో పోలీస్‌స్టేషన్‌లోనూ కేసు పెట్టించారు. విచారణలో ఏసీపీ రూ.50 లక్షల డీల్ వెలుగులోకి వచ్చింది.

నోటీసుల్లేకుండా కూలుస్తరా?

మొదటిపేజీ తరువాయి...

ఉన్న భూముల్లో హైడ్రా జోక్యాన్ని నిరోధిస్తూ ఆదేశాలివ్వాలని కోరారు. కూలీల విశ్రాంతి కోసం నిర్మించుకున్న నిర్మాణాలను ఈ నెల 3న హైడ్రా ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కూల్చివేసిందని తప్పుపట్టారు. ఆ రోజు ఉదయం హైడ్రా అధికారులు పోలీసు బలగాలతో వచ్చి కూల్చివేత చర్యలు చేపట్టడం చట్ట వ్యతిరేకమని, హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా కూల్చివేతలు చేపట్టారని వివరించారు. పరిపాలన పరమైన చర్యల్లో భాగంగా ప్రభుత్వం జీవో 99ని తీసుకొచ్చిందని తెలిపారు. చట్టాలకు లోబడే ఆ జీవో ఉండాలని, చట్టాలకు విరుద్ధంగా ఇచ్చే జీవోలు చెల్లవని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ అధికారాలను జీవో 99 ద్వారా హైడ్రాకు అప్పగించారని, ఇది జీహెచ్ఎంసీ చట్టానికి విరుద్ధమని వివరించారు. ఒక చట్టం కింద ఏర్పాటైన సంస్థ అధికారాలను మరో సంస్థకు బదలాయించాలంటే చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందని, అలాంటిదేమీ లేకుండా జీహెచ్ఎంసీ అధికారాలను హైడ్రాకు బదిలీ చేయడం చెల్లదని పేర్కొంటూ.. ప్రభుత్వం ఏ చట్టం కింద హైడ్రాకు అపరిమిత అధికారాలను అప్పగించిందో తెలియడంలేదని చెప్పారు. కార్యదర్శి లేదా అంతకంటే ఉన్నత హోదాలో ఉన్న అఖిల భారత సర్వీసు అధికారి హైడ్రాకు నేతృత్వం వహిస్తారని జీవోలో పేర్కొన్నప్పటికీ అందుకు విరుద్ధంగా బాధ్యతలు అప్పగించారని తప్పుపట్టారు. దీంతో హైడ్రా ఏర్పాటులో చట్టబద్ధత లోపించినట్టు హైకోర్టు అభిప్రాయపడింది. కానీ, జీవో 99 అమలుపై స్టే విధించేందుకు నిరాకరించింది. జీహెచ్ఎంసీ అధికారాలను హైడ్రాకు ఎలా బదిలీ చేశారో చెప్పాలంటూ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. హైడ్రా ఏర్పాటుతోపాటు దాని చట్టబద్ధత, విధులు, బాధ్యతలపై సమగ్ర వివరాలను అందజేయాలని ఆ నోటీసుల్లో స్పష్టం చేసింది.

హైడ్రాపై హైకోర్టుకు కాటసాని భార్య

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని 3 ఎకరాల వ్యవసాయ భూమిలో నిర్మించిన షెడ్, కాంపౌండ్ వాల్‌ను హైడ్రా కూల్చివేయచేయడాన్ని సవాలు చేస్తూ ఏపీకి చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి భార్య ఉమామహేశ్వరమ్మ హైకోర్టును ఆశ్రయించారు. ఆమె పిటిషన్‌పై జస్టిస్ టీ వినోద్‌కుమార్ శుక్రవారం విచారణ జరిపారు. పట్టా భూమిలోని ప్రహరీ గోడ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందంటూ ఈ నెల 8న హైడ్రా కూల్చివేసిందని, అది ఎఫ్‌టీఎల్ పరిధిలో లేదని స్పష్టం చేస్తూ గతంలో ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన నివేదికను హైడ్రా అధికారులు పట్టించుకోలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వివరించారు. ఆ చెరువుకు సంబంధించిన 1970 నాటి మ్యాప్‌ను సమర్పించడంతోపాటు పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. తదుపరి విచారణను అక్టోబరు 3కు వాయిదా వేశారు.

17న ప్రభుత్వ సంస్థలకు సెలవు

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే అమలు

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): గణేశ్ నిమజ్జనం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 17న మూడు జిల్లాల్లో సెలవు ప్రకటించింది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలతోపాటు రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించింది. 17న ఇచ్చిన సెలవుకు గానునవంబర్ 9న రెండో శనివారం పనిదినంగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.



చిత్తూరులో ఘోర రోడ్డు ప్రమాదం

- **8 మంది మృతి, 40 మందికి గాయాలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : ఏపీలోని చిత్తూరు జిల్లా మొగిలి ఘాట్ వద్ద శుక్రవారం బస్సు, రెండు లారీలను ఢీకొట్టగా.. బస్సులో ఉన్న 8 మంది ప్రయాణికులు మృతి చెందారు. మరో 40 మందికి గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను ప్రారంభించి కేసు విచారణ జరుపుతున్నారు.

స్కూల్ బిల్డింగ్ పైనుంచి దూకిన విద్యార్థిని

- **ఏఎన్ఎం మందలించిందని ఆత్మహత్యాయత్నం**
- **చికిత్స పొందుతున్న 6వ తరగతి విద్యార్థిని**



సూర్యాపేట ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థిని గీతిక

మద్దిరాల, సెప్టెంబర్ 13 : ఆరోగ్యం విషయమై ఏఎన్ఎం మందలించిందని మనస్తాపం చెందిన కేజీబీవీ విద్యార్థిని భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం చోటుచేసుకున్నది. ఎస్సై వీరన్న తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన బీసు గీతిక మద్దిరాలలోని కేజీబీవీలో 6వ తరగతి చదువుతున్నది. పాఠశాలలో ఆమె తరచూ అనారోగ్యానికి గురయ్యేది. 'నీకే ఎందుకు ఈ విధంగా జరుగుతుంది' అని విద్యార్థిని ఏఎన్ఎం మందలించింది. మనస్తాపం చెందిన విద్యార్థిని శుక్రవారం తెల్లవారుజామున పాఠశాల భవనం మొదటి అంతస్థు నుంచి కిందికి దూకింది. గమనించిన కొందరు విద్యార్థులు డ్యూటీలో ఉన్న టీచర్‌కు చెప్పారు. అప్పటికే కింద పడిపోగా గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. గాయాలు తీవ్రం కావడంతో మెరుగైన చికిత్స కోసం సూర్యాపేట ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. ఒక కాలు విరగడంతోపాటు వెన్నుపూస దెబ్బతిన్నట్టు వైద్యులు తెలిపారు. దీనిపై పాఠశాల ప్రత్యేక అధికారి తేజశ్రీని వివరణ కోరగా వాష్ ఏరియాలో జారి పడినట్టు చెప్పారు. ఈ ఘటన ఉదయం జరిగినా ఎవరికి తెలియకుండా సాయంత్రం వరకు గోప్యంగా ఉంచారు.

లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 'శ్రీశైలం'

- **ధ్రువీకరణ పత్రాన్ని అందజేసిన ప్రాంతీయ సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఉల్లాజి ఇలియాజర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ): శ్రీశైలం భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం అరుదైన రికార్డును సొంతం చేసుకున్నది. శ్రీశైల క్షేత్ర ఆధ్యాత్మిక ప్రాముఖ్యత, ప్రాచీన కట్టడాలు తదితర అంశాల ఆధారంగా లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నది. ఆ సంస్థ దక్షిణ భారత ప్రాంతీయ విభాగపు సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఉల్లాజి ఇలియాజర్ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఈవో పెద్దిరాజుకు ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు.

ట్రిబ్యునల్ అవసరమే లేదు

- **బ్రిజేశ్ ట్రిబ్యునల్ ఎదుట ఏపీ వాదనలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీకి ప్రత్యేక ట్రిబ్యునల్ అవసరమే లేదని ఏపీ సర్కారు పేర్కొన్నది. ఈ మేరకు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ దాఖలు చేసిన స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్ (ఎస్‌వోసీ)పై తాజాగా కౌంటర్ రిజాయిండర్‌ను సమర్పించింది. అంతర్‌రాష్ట్ర నదీవివాదాల చట్టం-1956లోని సెక్షన్ 3 ప్రకారం విచారణ జరిపి ఉమ్మడి ఏపీకి కేటాయించిన 1,005 టీఎంసీలు, గోదావరి డైవర్షన్ ద్వారా వచ్చే 45 టీఎంసీలు కలిపి మొత్తం 1,050 టీఎంసీల కృష్ణా జలాలను తెలంగాణ, ఏపీ మధ్య పునఃపంపిణీ చేయాలని, ఆ జలాలను ప్రాజెక్టుల వారీగా కేటాయించాలని పేర్కొంటూ నిరుడు అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను జారీచేసిన సంగతి తెలిసిందే. ఆ విచారణకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఎస్‌వోసీని సమర్పించింది. తెలంగాణలోని ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపు ఆవశ్యకత తదితర అంశాలను అందులో ప్రస్తావించింది. దీనిపై ఏపీ ప్రభుత్వం తాజాగా కౌంటర్ రిజాయిండర్‌ను సమర్పించింది. ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ద్వారానే రెండు రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపిణీ కొనసాగుతుందని పేర్కొన్నది. ఈ నేపథ్యంలో మళ్లీ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడం సరికాదని, సెక్షన్ 3 ద్వారా నూతనంగా ఇచ్చిన మార్గదర్శకాలు న్యాయవిరుద్ధమని తెలిపింది.

జగన్‌తో సెల్ఫీ : మహిళా కానిస్టేబుల్‌కు చార్జిమెమో

హైదరాబాద్, సెప్టెంబర్13 (నమస్తే తెలంగాణ) : ఏపీ మాజీ సీఎం జగన్‌తో సెల్ఫీ తీసుకున్న మహిళా కానిస్టేబుల్‌పై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గుంటూరు సబ్‌జైలులో ఉన్న బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను పరామర్శించేందుకు వైసీపీ అధినేత జగన్ వెళ్లారు. అదే జైలులో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా కానిస్టేబుల్ తన కుమార్తెతో కలిసి సెల్ఫీ తీసుకున్నారు. విధి నిర్వహణలో ఇలా వ్యవహరించడంతో కానిస్టేబుల్ ఆయేషా భానుకు ఛార్జిమెమో ఇస్తామని జైలర్ రవిబాబు తెలిపారు.

పంటల బీమా టెండర్ ఎప్పుడు?

- నెల రోజులుగా సీఎం వద్దే ఫైలు
- ప్రస్తుత పంట నష్టానికి బీమా లేనట్టే
- ఏప్రిల్ పంట నష్టం ఇవ్వని సర్కార్
- సీజన్ ముగుస్తున్నా రాని 'భరోసా'
- అర్హులకు సైతం అందని రుణమాఫీ
- 15-20 లక్షల ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- కుండపోతతో ఎవుసం ఆగం
- కాలం కలిసిరాక.. ప్రభుత్వ సహకారం లేక రైతన్న అరిగోస

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఫసల్ బీమా అమలుపై రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలల నుంచి చర్చిస్తూనే ఉన్నది. ఇప్పటివరకూ ఈ ప్రక్రియ టెండర్ వరకు వెళ్లకపోవడం విమర్శలకు తావిస్తున్నది. అధికారులు విధి విధానాలు సిద్ధం చేసి సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు ఫైలు పంపినా.. నెల రోజులుగా అది పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. మొన్నటివరకు వర్షాలు లేక ఇబ్బంది పడిన రైతులను ఇప్పుడు కుండపోత వర్షాలు ఆగం చేస్తున్నాయి. కాగా ప్రభుత్వం పంట నష్టంపై ఇచ్చే పరిహారంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీజన్ ముగుస్తున్నా రైతు భరోసా అందలేదు. ప్రభుత్వ సహకారం లేక, అటు కాలం కలిసిరాక రైతన్న అరిగోస పడుతున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల నుంచి 20 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు వ్యవసాయ శాఖ వర్గాల అంచనా. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్‌తోపాటు నిర్మల్ జిల్లాల్లో భారీగా పంట నష్టం జరిగినట్టు వ్యవసాయ శాఖ అంచనా వేసినట్టు తెలిసింది. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా ప్రకారం 4.15 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు దెబ్బతిన్నాయని ప్రభుత్వం వెల్లడించింది. ప్రభుత్వ లెక్కలను రైతు సంఘాలు తప్పుపడుతున్నాయి. పరిహారాన్ని తప్పించుకోవడానికే నష్టాన్ని తక్కువగా చూపిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. పంట నష్టంపై వాస్తవ లెక్కలు తెప్పించి, వారందరికీ సాయం చేయాలని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

కలిసిరాని కాలం.. దక్కని ప్రభుత్వ భరోసా

ఈ ఏడాది దెబ్బ మీద దెబ్బ మాదిరిగా కాలం కలిసిరాక, ప్రభుత్వం నుంచి భరోసా దక్కక రైతులు ఆగమైపోతున్నారు. మొన్నటివరకు వర్షాలు లేక, ఇప్పుడు కుంభవృష్టితో నష్టపోతున్నారు. ప్రభుత్వం నుంచి రైతుభరోసా దక్కక, రుణమాఫీ సరిగ్గా అమలుకాక ఇలా అన్ని విధాలుగా రైతులు ఇబ్బందిపడుతున్నారు. సకాలంలో సరైన వర్షాలు కురవకపోవడంతో గత సంవత్సరంతో పోల్చితే ఈసారి దాదాపు 10 లక్షల ఎకరాల్లో పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. ఇప్పుడు కుంభవృష్టితో సాగైన పంటలు కూడా దెబ్బతింటున్నాయి. ఈ విధంగా రైతులపై ప్రకృతి పగబడితే, వారిని ఆదుకునే విషయంలో ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదనే విమర్శలొస్తున్నాయి. పంటల సాగు కోసం ఎప్పుడో జూన్‌లో ఇవ్వాల్సిన రైతుభరోసా, సీజన్ ముగుస్తున్నా అతీగతీ లేకుండా పోయింది. రుణమాఫీలోనూ కోతలు పెట్టిన ప్రభుత్వం 50% మందికే మాఫీ చేసింది. ఇప్పటివరకు 22 లక్షల మందికే మాఫీ అయినట్టు ప్రభుత్వమే చెప్తున్నది. రైతులకు ప్రకృతి చేసిన నష్టంతో పోల్చితే ప్రభుత్వం చేసిన నష్టమే ఎక్కువనే విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తిస్థాయిలో పంట నష్ట పరిహారంతోపాటు రైతుభరోసా చెల్లించాలని రైతులు కోరుతున్నారు.



నాలుగు నెలలుగా నాన్చుడే

'ఈ వానకాలం సీజన్ నుంచే రైతులకు ఉచిత పంటల బీమా అమలు చేయబోతున్నాం. పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందిస్తాం..' ఇదీ పంటల బీమా పథకం అమలుపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పిన మాట. కానీ, మంత్రి మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. ఈ సీజన్‌కు పంటల బీమా అమలు లేనట్టేనని వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నారు. ఇప్పటికే ఆలస్యమైందని, రానున్న యాసంగి సీజన్ నుంచి అమలుకు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. దీంతో ప్రస్తుతం కురుస్తున్న కుండపోత వర్షాలతో జరిగిన పంట నష్టానికి బీమా పరిహారం దక్కే అవకాశం లేదు. ఫసల్ బీమా అమలుపై ప్రభుత్వం నాలుగు నెలల నుంచి చర్చిస్తూనే ఉన్నది. ఇప్పటివరకూ ఈ ప్రక్రియ టెండర్ వరకు వెళ్లకపోవడం విమర్శలకు తావిస్తున్నది. అధికారులు విధి విధానాలు సిద్ధం చేసి సీఎం వద్దకు ఫైలు పంపించినట్టు తెలిసింది. నెల రోజులుగా ఆ ఫైలు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. వారం క్రితం సీఎం సంతకం చేసినప్పటికీ, వ్యవసాయ అధికారులు, ఆ తర్వాత మంత్రి అందుబాటులో లేకపోవడంతో ఆ ప్రక్రియ అక్కడే నిలిచిపోయింది. దీంతో ఈ సీజన్ ముగిసింది కాబట్టి వచ్చే సీజన్ నుంచే అమలు చేయాలనే నిర్ణయానికి వచ్చినట్టు వ్యవసాయ శాఖలో చర్చ జరుగుతున్నది.

ఫసల్ బీమా లేదు.. పరిహారం రాదు

ఇప్పటికే ఫసల్ బీమాను అమలు చేసి ఉంటే రైతులకు ఈ విపత్తు సమయంలో ఎంతగానో అండగా ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎకరాకు రూ.10 వేల చొప్పున సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ పరిహారం ఏ మూలకు సరిపోతుందనే విమర్శలొస్తున్నాయి. ఒకవేళ ఫసల్ బీమా ఉంటే, ప్రతి రైతుకూ, ప్రతి పంటకూ జరిగిన నష్టం మేరకు పరిహారం వచ్చేదని, రైతుకు కొంత భరోసాగా ఉండేదనే అభిప్రాయాలున్నాయి. వర్షాకాలం సీజన్‌లో ఎప్పుడో ఒకప్పుడు భారీ వర్షాలు, వరదలు వస్తాయనే విషయం తెలిసినప్పటికీ, ప్రభుత్వం ముందస్తుగా పంటల బీమాను ఎందుకు అమలు చేయలేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ఏప్రిల్ పంట పరిహారం ఇవ్వని ప్రభుత్వం

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాలు పంటలు భారీగా దెబ్బతీశాయి. మార్చిలో కురిసిన వర్షాలతో 15,814 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు ప్రభుత్వం గుర్తించింది. ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ప్రకటించి చెల్లించింది. ఏప్రిల్‌లోనూ 3,120 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఈ రైతులకు కూడా ఎకరాకు రూ.10వేల పరిహారం చెల్లిస్తామని ప్రకటించింది. కానీ, ఇప్పటి వరకూ ఆ పరిహారాన్ని రైతులకు చెల్లించలేదు. దీంతో ప్రభుత్వం రైతులకు పరిహారం ఎగ్గొంటిందనే విమర్శలొస్తున్నాయి.

అప్‌లోడ్‌చేసినా.. పాత మార్కులే

- టెట్ మార్కుల సవరణకు అభ్యర్థుల తంటాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): టెట్ మార్కుల సవరణలో కొత్త చిక్కులు వచ్చిపడ్డాయి. కొత్త మార్కులు అప్‌లోడ్ చేసినా.. ఇంకా పాత మార్కులే చూపిస్తున్నాయి. కొందరు అభ్యర్థులు సీ టెట్ మార్కులు అప్‌లోడ్ చేయగా, ఇప్పుడవి కనిపించడం లేదు. ఓ అభ్యర్థి ఈ నెల 2న అప్లికేషన్ అప్‌లోడ్ చేయగా, 129 మార్కులు చూపించింది. మూడు రోజుల క్రితం చూడగా పాత మార్కులు 91 మా ర్కులే చూపిస్తున్నది. మరో అభ్యర్థి ఎడిట్ ఆ ప్షన్‌లోకి వెళితే సబ్జెక్టు గణితం, సైన్స్ అని చూ పిస్తున్నది. వాస్తవానికి సదరు అభ్యర్థి సోషల్ స్టడీస్‌కు ఎగ్జామ్ రాశాడు. ఇక హాల్‌టికెట్ నెంబర్ ఎడిట్‌చేసుకునే అవకాశమిచ్చినా వెబ్‌సైట్‌లో ఆ అవకాశమే లేకుండా పోయింది. ఇవేకాకుండా అనేక తప్పిదాలు చోటుచేసుకున్నట్టు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. 2017 డిసెంబర్‌లో టెట్ పరీక్ష జరగలేదు. జూలై 23న జరిగింది. ఆగస్టు 4న ఫలితాలిచ్చారు. కానిప్పుడు ఎడిట్ ఆప్షన్‌లో మాత్రం 2017 డిసెంబర్ 1 అని చూపిస్తున్నది. అసలు 2017లో టెట్ జరిగిందే ఒక్కసారే. ఇలా అనేక తప్పిదాలున్నాయని, సవరించాలని డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

ఫైనల్ 'కీ'పై మరిన్ని అభ్యంతరాలు

డీఎస్సీ ఫైనల్ 'కీ'పై అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే రెండు వందలకు పైగా రాగా, తాజాగా మరికొన్ని సబ్జెక్టుల ఫైనల్ కీపై అభ్యర్థులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. జూలై 18న నిర్వహించిన ఫిజికల్ సైన్స్ పేపర్‌పై అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు. ప్రశ్న నెంబర్ 3 యూనైటెడ్ నేషన్స్ హ్యూమన్ క్లోనింగ్ ఒప్పందం, ప్రశ్న నెంబర్ 7, ప్రశ్న నెంబర్ 32, 47, 54, 79, 117, 129, 136,137,143 ప్రశ్నలకిచ్చిన సమాధానాలపై అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు.

'నీట్' డైలమా!

మొదటిపేజీ తరువాయి...

కొనసాగుతున్నది. ఆలిండియా కోటా కింద రెండో రౌండ్‌కు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. కొత్తగా కాలేజీలు మంజూరైన నేపథ్యంలో గడువును పెంచారు. ఇందులో తెలంగాణ నుంచి నాలుగు కాలేజీలు ఉన్నాయి. మహేశ్వరం, మెదక్, కుత్బుల్లాపూర్, యాదాద్రిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఆలిండియా కోటా కింద 28 సీట్లను రిజర్వ్ చేశారు. రెండో రౌండ్‌లో ఈ సీట్లను కూడా జతచేశారు. కానీ రాష్ట్రంలో కన్వీనర్ కోటా సీట్ల భర్తీ మాత్రం నిలిచిపోయింది. 'స్థానికత'ను నిర్ధారించడంలో ప్రభుత్వం విఫలం కావటం, హడావుడిగా జీవో33ను తీసుకురావటంతో అడ్మిషన్ల ప్రక్రియ న్యాయవివాదాల్లో చిక్కుకున్న సంగతి తెలిసిందే. దీంతో సొంత రాష్ట్రంలో వైద్యవిద్య చదవాలన్న వేల మంది విద్యార్థుల కల త్రిశంకుస్వర్గంలో ఊగిసలాడుతున్నది.

భరోసా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం

'స్థానికత' నిర్ధారణలో తీవ్రంగా విఫలమైన తెలంగాణ వైద్యారోగ్యశాఖ.. విద్యార్థులకు భరోసా కల్పించడంలోనూ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. జీవో-33పై తమ వైఖరిని, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను విద్యార్థులకు ఎందుకు వివరించి చెప్పటం లేదని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. తమ తోటి విద్యార్థులకు అడ్మిషన్లు పూర్తవుతుంటే పిల్లలు మానసికంగా ఆందోళన చెందుతున్నారని వాపోతున్నారు. వాస్తవ పరిస్థితిని వివరిస్తూ 'మీ భవిష్యత్తుకు ఢోకా లేదు' అంటూ వైద్యారోగ్యశాఖ నుంచి గానీ, హెల్త్ యూనివర్సిటీ నుంచి గానీ ఒక ప్రకటన కూడా విడుదల చేయకపోవటం ఏమిటని నిలదీస్తున్నారు. యూనివర్సిటీకి వెళ్లి అడిగితే స్పందించే నాథుడే లేడని, 'మాకేం తెలియదు, హైదరాబాద్‌కు వెళ్లి అడగండి' అంటూ చేతులెత్తేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జరిగిన పరిణామాలన్నీ వివరిస్తూ, ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో తెలియజేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఆందోళన బాట తప్పదని స్పష్టం చేస్తున్నారు.

ఏపీలో నిరాటంకంగా అడ్మిషన్లు

'ఉమ్మడి' పాలన ముగిసిన నేపథ్యంలో స్థానికతను నిర్ధారించుకోవాల్సిన బాధ్యత ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్ మీద పడింది. ఏపీలో ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించింది. ఫిబ్రవరిలోనే ప్రత్యేక కమిటీ వేసి స్థానికతను నిర్ధారించటంతో ఎంబీబీఎస్ అడ్మిషన్లకు ఎలాంటి ఇబ్బంది కలగటం లేదు. ప్రస్తుతం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆంధ్రా యూనివర్సిటీ, ఎస్వీయూ పరిధిలో మెరిట్ లిస్ట్‌ను విడుదల చేశారు. వివిధ కారణాలతో స్థానికంగా ఇంటర్ చదవలేని వారికి 'ఏపీ నాన్‌లోకల్' స్టేటస్ ఇచ్చి, సీట్లలో కోటా ఇచ్చి భర్తీ చేస్తున్నారు.

మదర్ డెయిరీ హస్తగతం

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార యూనియన్ లిమిటెడ్(మదర్ డెయిరీ) హస్తగతమైంది. ఖాళీగా ఉన్న ఆరు డైరెక్టర్ స్థానాల కోసం శుక్రవారం రంగారెడ్డి జిల్లాలోని హయత్‌నగర్ ఎస్వీ కన్వెన్షన్‌లో ఓటిం గ్ జరిగింది. రంగారెడ్డి జిల్లాలో రెండు, యా దాద్రిలో నాలుగు స్థానాలు ఖాళీగా ఉండ గా.. మొత్తంగా 297 మంది ఓటర్లు ఉన్నా రు. యాదాద్రిలోని నాలుగు సీట్లకు కాంగ్రె స్, బీఆర్ఎస్ నుంచి అభ్యర్థులు బరిలో నిలిచారు. ముందుగానే కాంగ్రెస్ పార్టీ క్యాంప్ రాజకీయాలు, తాయిలాలకు తెరదీసింది. ఒక్కో ఓటరుకు రూ.30 వేల వరకు పంపిణీ చేసింది. అయినప్పటికీ బీఆర్ఎస్ అభ్యర్థులు హోరాహోరి పోటీనిచ్చారు. కాగా శనివారం మదర్ డెయిరీలో చైర్మన్ ఎన్నిక జరుగనున్నది. చైర్మన్‌గా ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండలానికి చెందిన గుడిపాటి మధుసూదన్‌రెడ్డిని ఎన్నుకోనున్నట్టు తెలిసింది.

ఇంజినీరింగ్‌కు పునర్వైభవం

- ఆరేండ్లుగా పెరుగుతున్న అడ్మిషన్లు
- నిరుటితో పోల్చితే 5వేలు అధికం

కన్వీనర్ కోటా సీట్ల భర్తీ వివరాలిలా..

సంవత్సరం	కాలేజీలు	మొత్తం సీట్లు	భర్తీ అయిన సీట్లు	అడ్మిషన్ల పెరుగుదల
2019	183	65,565	46,134	----
2020	181	70,135	47,739	1,605
2021	175	79,822	57,545	9806
2022	177	79,448	62,170	4,625
2023	174	82,702	70,689	8,519
2024	175	86,943	75,107	11,836

ఈ ఏడాది విభాగాల వారీగా అడ్మిషన్లు

విభాగం	మొత్తం సీట్లు	భర్తీ అయినవి (శాతం)
సీఎస్ఈ, ఐటీ	61,587	57,637 (93.59)
ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్	16,692	12,672(75.92)
సివిల్, మెకానికల్ తత్సమాన	7,458	4,081(54.72)
ఇతర విభాగాల్లో	1,206	717 (86.39)

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఎమర్జింగ్ కోర్సులను ప్రవేశపెట్టడం.. సీఎస్ఈ కోర్సుల్లో సీట్లను పెంచడం.. కొత్త బ్రాంచీలకు అనుమతులివ్వడంతో రాష్ట్రంలో ఇంజినీరింగ్ విద్య పునర్వైభవాన్ని సంతరించుకుంటున్నది. ఆరేండ్లుగా బీటెక్ ఫస్టియర్ అడ్మిషన్లు (28,973) గణనీయంగా పెరుగుతున్నాయి. అడ్మిషన్లు ఐదేండ్ల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. 2019తో పోల్చితే 2024కు వచ్చేసరికి 38శాతం అడ్మిషన్లు పెరగడం విశేషం. 2019లో బీటెక్ అడ్మిషన్ల సంఖ్య 49 వేల లోపే.. కానిప్పుడు 75వేలు దాటింది. గతం ఒలో 60శాతం కూడా నిండని పరిస్థితి ఉండే.. కానిప్పుడు 86శాతం సీట్లు నిండాయి. బీఆర్ఎస్ సర్కారు హయాంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. దీంతో భారీగా ఉద్యోగాల కల్పన జరగడంతో ఇంజినీరింగ్ కోర్సులు తిరిగి పుంజుకుంటున్నాయి. పైగా ఇక్కడి కాలేజీల్లో ఎమర్జింగ్ కోర్సులు, ఉద్యోగావకాశాలున్న కోర్సులను ప్రవేశపెడుతున్నారు. కేసీఆర్ సర్కారు హయాంలో నాలుగు జేఎన్టీయూ కాలేజీలను ఏర్పాటు చేసి, డ్యూయల్ డిగ్రీ కోర్సులు, ఆనర్స్, మైనర్ కోర్సులను ప్రవేశ పెట్టారు. 70శాతం ఆఫ్‌లైన్, 30 శాతం ఆన్‌లైన్ కోర్సును చదువుకునే వెసులుబాటు కల్పించారు. 86,943 సీట్లల్లో 61వేల సీట్లు సీఎస్ఈ తత్సమాన కోర్సులకు సంబంధించినవే ఉన్నాయి. జాతీయంగా సీఎస్ఈ సీట్లల్లో 25శాతం మన దగ్గరే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో మాంద్యం ప్రభావమున్నా.. మన విద్యార్థులు మాత్రం ఐటీ కొలువులే లక్ష్యంగా బీటెక్ కోర్సుల్లోనే చేరుతున్నారు. కంపెనీలు ఏర్పాటవుతుండటం.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడం.. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో మంచి ప్యాకేజీలతో ఇప్పుడు విద్యార్థులందరి దారి బీటెక్ వైపే కనిపిస్తున్నది.

స్కూల్ గ్రాంట్ విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): సర్కారు స్కూళ్ల రోజువారీ నిర్వహణ ఖర్చుల కోసం పాఠశాల విద్యాశాఖ నిధులు మంజూరుచేసింది. 50శాతం స్కూల్, స్పోర్ట్స్ గ్రాంట్‌ను విడుదల చేసింది. రాష్ట్రంలోని 21,342 స్కూళ్లకు 50శాతం కాంపొజిట్ స్కూల్ గ్రాంట్ రూ. 48 కోట్లు, స్పోర్ట్స్ గ్రాంట్ రూ.12కోట్లు విడుదల చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ఉత్తర్వులిచ్చారు. నాలుగు మాసాలుగా స్కూల్, స్పోర్ట్స్ గ్రాంట్ నిధులు మంజూరు విడుదల చేయకపోవడంతో ఇటీవలే నమస్తే తెలంగాణలో 'చాక్‌పీసులు, డస్టర్లు కొనేందుకు డబ్బులేవి' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. జూలైలోనే 50శాతం గ్రాంట్‌ను మంజూరుచేసిన విషయాన్ని ప్రస్తావించింది. దీంతో స్పందించిన విద్యాశాఖ తాజాగా స్కూల్, స్పోర్ట్స్ గ్రాంట్ నిధులను మంజూరుచేసింది.

నమస్తే ఎఫెక్ట్

ప్రజాభవన్‌లో కాంట్రాక్ట్ అధ్యాపకుల ధర్నా




ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ అధ్యాపకులు శుక్రవారం ప్రజాభవన్‌లో ధర్నా చేపట్టారు. హక్కులను ప్రభుత్వం కాలరాస్తున్నదని, తమను క్రమబద్ధీకరించకపోతే ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. ధర్నా సందర్భంగా ఒత్తిడికి గురైన మహిళను సమీప దవాఖానకు తరలించారు. - హైదరాబాద్ సిటీబ్యూరో

ఎనిమిది నెలలుగా జీతాల్లేవ్..



ఎనిమిది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, ప్రభుత్వమే న్యాయం చేయాలంటూ ఈఎస్ఐ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. న్యూబోయిగూడలోని ఈఎస్ఐ డైరెక్టరేట్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ జీతాలు రాకపోవడంతో ఇంటి కిరాయి, పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. అవుట్ సోర్సింగ్ విధానాన్ని తొలగించి, రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. - బన్సీలాల్‌పేట్



హైదర్‌గూడలోని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ప్రభుత్వ వాహనానికి అడ్డంగా పడుకొని నిరసన తెలుపుతున్న సర్పంచుల సంఘం జేఏసీ

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. హైదరాబాద్ హైదర్‌గూడలోని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట మాజీ సర్పంచులు శుక్రవారం నిరసన చేపట్టారు. ప్రభుత్వ వాహనానికి అడ్డంగా పడుకొని రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 12,769 గ్రామాల్లో 2019-24 పీరియడ్‌లో అనేక అభివృద్ధి పనులు చేశామని, ఫలితంగా రికార్డుస్థాయిలో గ్రామాలకు జాతీయ అవార్డులు వచ్చాయని గుర్తుచేశారు. అభివృద్ధి పనుల బిల్లు లు రాక, అప్పుల పాలైన సర్పంచులు పలువురు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాకే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ కమిషనర్‌కు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, నాయకులు రాంపాక నాగయ్య, మెడబోయిన గణేశ్, సముద్రాల రమేశ్, మల్లయ్య, బీరప్ప, నవీన్‌రావు పాల్గొన్నారు.

అధికారుల తప్పిదం.. విద్యార్థి పాలిట శాపం

- అర్హతలున్నా స్పోర్ట్స్ కోటాలో బీటెక్ సీటు నిరాకరణ
- 'శాట్స్' నిర్లక్ష్యంతో చెస్ క్రీడాకారుడికి అన్యాయం
- న్యాయం చేయాలని కోరుతున్న విద్యార్థి శ్రీశ్వాన్



హైదరాబాద్, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ): ఆ విద్యార్థి ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో బ్రాంజ్ మెడల్, ఏషియన్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్స్, కామన్‌వెల్త్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. చదువుల్లోనూ ప్రతిభావంతుడైన ఆ విద్యార్థి ఎప్‌సెట్‌లో టాప్ ర్యాంక్ కాలేజీల్లో సీటు వస్తుందని ఆశపడ్డాడు. కానీ స్పోర్ట్స్ అథారిటీ అధికారుల తప్పిదంతో అనామక కాలేజీల్లో సీటు పొందాల్సి వస్తుంది. నిజామాబాద్ జిల్లా రెంజల్‌కు చెందిన శ్రీశ్వాన్ మరలాక్షరి 2019లో అండర్-14 ఏషియన్ ఇంటర్నేషనల్ యూత్ చెస్ పోటీల్లో గోల్డ్ మెడల్, అదే ఏడాది వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. కామన్‌వెల్త్ గేమ్స్‌ల్లోనూ పతకాలు కొల్లగొట్టాడు. ఇంటర్ పూర్తి చేసిన శ్రీశ్వాన్ ఎంసెట్‌లో 15,784 ర్యాంకు సాధించాడు. స్పోర్ట్స్ కోటా కింద టాప్ కాలేజీల్లో సీటు వస్తుందనే నమ్మకంతో జూలై 6న కౌన్సెలింగ్‌కు హాజరయ్యాడు. కానీ సాంకేతిక విద్యామండలి అధికారులు స్పోర్ట్స్ కోటా వర్తించదని తేల్చిచెప్పారు. దీంతో స్పోర్ట్స్ అథారిటీ అధికారులను సంప్రదించగా, వారు కూడా అభ్యంతరాలు వ్యక్తంచేశారు. దీంతో కోర్టును ఆశ్రయించగా, శ్రీశ్వాన్‌కు స్పోర్ట్స్ కోటా కింద సీటు ఇవ్వాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల కాపీతో పలుమార్లు సాంకేతిక విద్యామండలి అధికారులను కలిశారు. అయితే టాప్ కాలేజీల్లో సీట్లు భర్తీ అయ్యాయని, వేరే కాలేజీల్లో సీటు ఇస్తామని చెబుతున్నారు. నిబంధనల ప్రకారం ఎస్‌జీఎఫ్ క్రీడల్లో రాణించిన విద్యార్థులకు స్పోర్ట్స్ కోటాలో టాప్ ర్యాంకు కాలేజీల్లో ప్రవేశం కల్పించాలని శ్రీశ్వాన్ పేర్కొంటున్నాడు. ప్రతి విషయంలో స్పోర్ట్స్ అధికారులు పొరపాటు చేసి తననెలా శిక్షిస్తారని ప్రశ్నిస్తున్నాడు. స్క్రీనింగ్ కమిటీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తనకు టాప్ కాలేజీల్లో సీటు రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. టాప్ కాలేజీల్లో సీట్లు అయిపోగా, స్పోర్ట్స్ కోటాలో 39 సీట్లు మిగలాయి. దీంతో ఆదిలాబాద్, సూర్యాపేటల్లోని కాలేజీల్లో సీట్లను తీసుకోమంటున్నారని, ఇదేం న్యాయమని ప్రశ్నిస్తున్నాడు. సాంకేతిక మండలి, స్పోర్ట్స్ అథారిటీ అధికారుల తీరుతో అన్యాయం జరిగిందని వాపోతున్నాడు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నాడు.

'రిటైర్డ్' బెనిఫిట్స్‌లో నిర్లక్ష్యం

- సోషల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీలో 6 నెలల్లో 56 మంది ఉద్యోగ విరమణ
- ఇప్పటికీ ఏజీ ఆఫీస్‌కు వివరాలు పంపని వైనం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీలో 6 నెలల్లో 53 మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందారు. విరమణ పొందే సమయంలో ఉద్యోగికి జీతం, సేవా వ్యవధి ఆధారంగా ఒకేసారి గ్రాట్యూటీ, పెన్షన్, కమ్యుటేషన్ ఆఫ్ పెన్షన్ చెల్లించడంతోపాటు లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. వివరాలన్నీ క్రోడీకరించి వాటి మంజూరు కోసం ఆ పత్రాలను ఏజీ(ఆడిటర్ జనరల్) కార్యాలయానికి సంబంధిత శాఖ అధికారులే సమర్పించాల్సి ఉంటుంది. ఏజీ ఆమోదం తరువాత ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్లి అనుమతి పొందిన అనంతరం నిధుల విడుదలతోపాటు నెలవారీ పెన్షన్ కూడా మంజూరవుతుంది. ఉద్యోగి విరమణ పొందడానికి 6 నెలల ముందు నుంచే అన్ని శాఖల్లో అధికారులు ఈ ప్రక్రియను ప్రారంభిస్తారు. కానీ, సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలో పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. ఆరు నెలలైనా విరమణ ఉద్యోగుల పెన్షన్ ప్రపోజల్స్‌ను సొసైటీ ఉన్నతాధికారులు ఏజీ కార్యాలయానికి పంపలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. విషయాన్ని సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సొసైటీ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తమకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇంజినీరింగ్ సీట్లపై సుప్రీంకోర్టుకు

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- మాప్ అప్ కౌన్సెలింగ్‌ను నిర్వహించాలన్న హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ సీట్లకు అనుమతినిచ్చి, మాప్ అప్ కౌన్సెలింగ్‌ను నిర్వహించాలన్న హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకెళ్లాలని సర్కారు నిర్ణయించింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఇందుకోసం ఢిల్లీకి వెళ్లారు. ఈ ఏడాది ఇంజినీరింగ్ కోర్సుల్లో 3- 4 వేల సీట్లు పెంచుకునేందుకు పలు కాలేజీలకు ఏఐసీటీఈ, జేఎన్టీయూలు పచ్చజెండా ఊపాయి. వీటిలో కోర్సుల కన్వర్షన్ సహా అదనపు సీట్లున్నాయి. అయితే ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. దీంతో కాలేజీలు ఆయా సీట్లను కోల్పోయాయి. వాటిని మినహాయించే ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ద్వారా 75వేలకు పైగా బీటెక్ సీట్లను భర్తీచేసింది. అయితే ఇదే అంశాన్ని కాలేజీలు హైకోర్టులో సవాల్ చేశాయి. తొలుత కాలేజీలకు వ్యతిరేకంగా తీర్పు వచ్చినా, మళ్లీ కాలేజీలు హైకోర్టులో డివిజన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశాయి. దీంతో కాలేజీలకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఆయా సీట్ల భర్తీకి మాప్ అప్ కౌన్సెలింగ్‌ను నిర్వహించాలని డివిజన్ బెంచ్ స్పష్టంచేసింది. రెండుమూడు రోజుల్లో మాప్ అప్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలవుతుందని అంతా భావించారు. అయితే ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని సర్కారు నిర్ణయించింది. దీంతో ఆయా సీట్ల భర్తీకి తాత్కాలికంగా బ్రేక్ పడినట్లయ్యింది.



ఎంబీఏ, ఎంసీఏకు భారీ డిమాండ్

- 91 కాలేజీల్లో 100% సీట్ల భర్తీ
- 17 లోపు ఫీజు చెల్లింపునకు అవకాశం

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ప్రొఫెషనల్ కోర్సుల్లో ఎంబీఏ.. ఎంసీఏ కోర్సులంటేనే ఎవర్‌గ్రీన్ కోర్సులు. ఈ కోర్సుల్లో చేరేందుకే అత్యధికులు ఆసక్తిచూపిస్తారు. కొంతకాలంగా ఈ రెండు కోర్సుల్లో చేరే వారి సంఖ్య పెరుగుతుండగా, ఈ ఏడాది సైతం అదే పునరావృతమైంది. ఎంసీఏలో 86శాతం, ఎంబీఏలో 87.5శాతం సీట్లు భర్తీ అయ్యాయి. మొదటి విడతలోనే 80శాతానికిపైగా సీట్లు భర్తీకావడం విశేషం. ఐసెట్ మొదటి విడత కౌన్సెలింగ్ సీట్లను శుక్రవారం కేటాయించారు. 34,748 సీట్లకు 30,300 సీట్లు తొలి విడతలోనే నిండాయి. 4,448 సీట్లు మిగలగా వీటిని రెండో విడతలో భర్తీచేస్తారు. 285కాలేజీలకు 91 కాలేజీల్లో వంద శాతం సీట్లు నిండాయి. 17లోపు ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాలని, 25 నుంచి 28వరకు సర్టిఫికెట్లను కాలేజీల్లో సమర్పించాలని సూచించారు.

ఇంటర్‌బోర్డు కార్యదర్శిగా శ్రీదేవసేన

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఇంటర్‌బోర్డు కార్యదర్శి, ఇంటర్ విద్య కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిణి శ్రీదేవసేనకు ప్రభుత్వం అదనపు బాధ్యతలప్పగించింది. ఇంతకాలం ఈ హోదాలో పనిచేసిన శృతిఓజా ఉన్నత చదువుల కోసం యూకేకు వెళ్లేందుకు ప్రభుత్వ అనుమతి కోరారు. ఇందుకు సర్కార్ అనుమతి ఇవ్వడంతో ఈనెల 16నుంచి ఏడాదిపాటు సెలవుపై వెళ్లనున్నారు. సాంకేతిక, కళాశాల విద్యాశాఖల కమిషనర్‌గా పనిచేస్తున్న శ్రీదేవసేనకు ఇంటర్‌బోర్డు కార్యదర్శి, ఇంటర్ విద్య కమిషనర్‌గా అదనపు బాధ్యతలప్పగిస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు విడుదల చేశారు.

మాడల్ టీచర్ల బదిలీలకు మోక్షం

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): మాడల్ స్కూల్ టీచర్ల బదిలీలను అధికారులు చేపట్టారు. ఇదివరకే వెబ్ ఆప్షన్లు స్వీకరించడంతో బదిలీలు చేపట్టనున్నారు. మాడల్ స్కూల్స్ టీచర్ల బదిలీలకు హైకోర్టు గురువారం పచ్చజెండా ఊపింది. స్కూళ్లల్లో చేరిన తేదీ ప్రకారమే ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్స్ ఇవ్వాలని ఆదేశించింది. 194 మోడల్ స్కూళ్లలో 2013, 2014లో నియామకమైన 3వేలకు పైగా ఉపాధ్యాయుల బదిలీలకు అవకాశమేర్పడింది. బదిలీల ఆప్షన్స్ ఎడిటింగ్‌కు ఒక రోజు అవకాశం కల్పించాలని పీఎంటీఏ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తరాల జగదీశ్ ఉన్నతాధికారులను కోరారు.



అందానికి మెరుగులు

అందాన్ని అందరూ కోరుకుంటారు. అందు కోసం భారీగా ఖర్చు చేసేస్తుంటారు కూడా! అయితే, చిన్నచిన్న పొరపాట్ల వల్ల ఆ ఖర్చంతా బూడిదలో పోసిన పన్నీరుగా మారుతుంది. అలా కాకుండా ఉండాలంటే.. ఇలా చేయండి. సన్‌స్క్రీన్ లోషన్స్ బయటికి వెళ్లినప్పుడే రాసుకోవాలని చాలామంది అనుకుంటారు. కానీ, ఇంటిలోపల కూడా యూవీ కిరణాల ప్రభావం ఉంటుంది. అందువల్ల ఇంట్లో ఉన్నప్పుడు కూడా సన్‌స్క్రీన్ లోషన్స్ వాడటం మంచిది. అలాగే.. మేకప్ బ్రష్‌లను రెగ్యులర్‌గా శుభ్రం చేస్తుండాలి. లేకుంటే, అందులో బ్యాక్టీరియా చేరి, చర్మ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ఇక మరి కొందరైతే రాత్రిపూట మేకప్ తీయకుండానే పడుకుంటారు. ఇలా చేయడం వల్ల చర్మరంధ్రాలు మూసుకుపోయి.. మొటిమలు, డల్ స్కిన్‌కు దారితీస్తుంది. అందుకని పడుకునే ముందు మేకప్ తీయడం ఉత్తమం. ముఖాన్ని ఎక్కువసార్లు కడగడం కూడా ఇబ్బంది తెచ్చిపెడుతుంది. చర్మంలోని సహజసిద్ధమైన నూనెలను కోల్పోవాల్సి వస్తుంది. దీనివల్ల చర్మం పొడిబారుతుంది. అందువల్ల రోజుకు రెండుసార్లు మాత్రమే ముఖాన్ని కడుక్కోవడం అలవాటు చేసుకోండి. మరో విషయం.. ఎక్స్‌పైరీ డేట్ అయిపోయిన బ్యూటీ ప్రొడక్ట్స్ వల్ల ఎలాంటి ఉపయోగం లేకపోగా.. చర్మానికి హాని కలుగుతుంది కూడా! అందుకే, వాటిని వాడటం ఏమంత మంచిది కాదు.

గజి'బిజీ' కావొద్దమ్మా!

మగవారితో పోలిస్తే.. మహిళలే పనిభారం అధికంగా మోస్తున్న రోజులివి! ఇల్లాలిగా ఇంటి పనులు చేస్తూనే.. ఉద్యోగ బాధ్యతలనూ సమర్థంగా నిర్వహిస్తున్నారు. రెండు పడవలపైనా ప్రయాణం చేస్తూ.. పోటీ ప్రపంచంలో దూసుకెళ్తున్నారు. అయితే.. ఈ గజి'బిజీ' లైఫ్‌లో తమకంటూ సమయాన్ని కేటాయించుకోలేక పోతున్నారు. గంటలకు గంటలు వంటగదిలో గడుపుతున్న తల్లులు.. సమయాన్ని ఆదా చేసుకోవాలంటే.. కింది టిప్స్ పాటించాల్సిందే!



రేపటి వంట కోసం ముందురోజు రాత్రే.. పిల్లలు పడుకున్న తరువాత కూరగాయలను తరుక్కోవాలి. వాటిని గాలి చొరబడని డబ్బాలో పెట్టి.. ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల మరుసటిరోజు వంటపని చిటికెలో పూర్తవుతుంది. అయితే, ఆకుకూరలను ఇలా ముందే తరిగి పెట్టుకుంటే.. వాటిలో పోషక విలువలు తగ్గిపోతాయి. అందుకే, అలాంటివాటిని నీళ్లలో కానీ, ఆలివ్ ఆయిల్‌లో కానీ 'ఫ్రీజ్' చేసేయండి. మీకు కావాల్సినప్పుడు డీప్ ఫ్రిజ్‌నుంచి బయటికి తీసి ఉపయోగించుకోండి.

పిల్లలకు బిస్కెట్స్ లాంటి స్నాక్స్ చేయాల్సి వచ్చినప్పుడు వెన్నను ఉపయోగించాల్సి వస్తుంది. అయితే, ఫ్రిజ్‌లో పెట్టిన వెన్న కరగడానికి ఎక్కువ సమయం పడుతుంది. అలా కావొద్దంటే.. వెన్నను ముందుగానే తురిమి నిల్వ చేసుకోండి. దీనివల్ల తొందరగా కరిగిపోయి.. సమయం ఆదా అవుతుంది.

కొందరైతే వంట హడావుడిలో ఉప్పు డబ్బా తీయబోయి, చక్కెర డబ్బా ఓపెన్ చేస్తారు. అందుకే.. కిచెన్‌ను ఓ క్రమపద్ధతిలో సర్దుకోండి. ఏయే బాక్సుల్లో ఏమేం ఉన్నాయో ఇట్టే తెలుసుకునేందుకు.. కంటైనర్ బాక్సులపై లేబుల్స్ అతికించండి. దీనివల్ల పదార్థాలను వెతుక్కునే సమయం కలిసొస్తుంది.

తీపి తినాలనిపిస్తుందేం?

చాలామందిలో తరచూ తీపి తినాలన్న కోరికలు (స్వీట్ క్రేవింగ్స్) కలుగుతూ ఉంటాయి. అలా తినడం అనారోగ్యం అని తెలిసినప్పటికీ వాటిని నియంత్రించుకోలేరు. అసలు ఇలా ఎందుకు జరుగుతుంది. స్వీట్ క్రేవింగ్స్ కలిగినప్పుడు ఆరోగ్యం దెబ్బతినకుండా ఉండేలా ఏం తినొచ్చు.

మన శరీరంలో ఏమైనా పోషకాహార లోపాలు ఉన్నప్పుడు శరీరం వాటికి సంబంధించిన పదార్థాలను కోరుకుంటుంది. శరీరానికి నీరు కావాలంటే మనకు దాహం వేస్తుంది కదా! ఈ క్రేవింగ్స్ కూడా అలాంటివే. మన ఒంట్లో కాల్షియం, మెగ్నీషియం, బి గ్రూప్ విటమిన్లు, క్రోమియం లాంటి ఖనిజాలు తక్కువగా ఉంటే... మనకు తరచూ తీపి తినాలన్న కోరిక కలుగుతూ ఉంటుంది.

డయాబెటిస్ వాళ్లకు పంచదార తినాలనిపిస్తుంది. అంటే తీపి తినకుండా వాళ్లను దూరం పెడుతున్నారు కాబట్టి, మనసు లాగడం కాదు. రక్తంలో చక్కెర స్థాయులు వాళ్లకి సరిగ్గా ఉండవు. అలాంటప్పుడు బ్లడ్ గ్లూకోజ్ స్థాయులను సరైన విధంగా ఉంచుకోవడానికి శరీరం తీపిని కోరుకుంటుంది.

అలాగే రాత్రిపూట కూడా కొందరికి ఇలాంటి కోరికలు వస్తుంటాయి. ఒత్తిడి కారణంగా విడుదలయ్యే కార్టిసోల్ హార్మోన్ పెరిగితే, తక్షణ శక్తి కోసం శరీరం తీపి కోరుకుంటుంది. అంటే మనం ఒత్తిడిలో ఉన్నప్పుడు పోరాడు లేదా పారిపో (ఫైట్ ఆర్ ఫ్లైట్) అన్న స్థితికి శరీరం సిద్ధం అవుతుంది. అలాంటప్పుడు ఎక్కువ చక్కెరలు కోరుతుంది.

కొంతమందికి తిన్న తర్వాత స్వీట్ తినే అలవాటు ఉంటుంది. అది మానసికమైన విషయం. వాళ్లకు అది లేకపోతే తినడం పూర్తయినట్టు కాదు. వీళ్ల మెటబాలిజమ్ భిన్నంగా ఉంటుంది. స్వీట్ తిన్నప్పుడు వెంటనే పెరిగే శక్తి స్థాయులు ఆహారం జీర్ణమవడానికి తోడ్పడతాయి. వాళ్లను అలా తిననివ్వడమే మంచిది.

పీరియడ్స్ సమయంలో కూడా కొందరికి స్వీట్ క్రేవింగ్స్ వస్తాయి. ఈ సమయంలో శరీరంలో ప్రొజెస్టిరాన్ హార్మోన్ స్థాయులు తగ్గి, ఈస్ట్రోజెన్ హార్మోన్ పెరుగుతుంది. దీంతో నెలసరి వచ్చే ముందు, వచ్చాక తొలి రోజుల్లో ఈ ఈస్ట్రోజెన్ కారణంగా బ్లడ్ షుగర్ లెవెల్స్ పడిపోతాయి. నెలసరిలో తీపి తినాలన్న కోరికకు కారణం ఇదే.



మయూరి ఆవుల
న్యూట్రిషనిస్ట్
Mayuri.trudiet@gmail.com

ఏం తినాలి...

ఆరోగ్యం దెబ్బతినకుండా తీపి తినాలన్న కోరికను కాస్త చల్లబరచాలంటే... ముందుగా పండ్లను ఎంచుకోవాలి. పండ్లు సహజంగా తియ్యగా ఉంటాయి. అలాగే విటమిన్స్, మినరల్స్ కూడా దొరుకుతాయి. అందులోనూ స్ట్రాబెర్రీ లాంటి తియ్యగా పుల్లగా ఉండేవైతే కాస్త నోటికి రుచిస్తాయి. అలాగే చాక్లెట్ తినాలంటే... 75 పర్సెంట్ కొకోవా ఉన్న డార్క్ చాక్లెట్ తీసుకోవాలి. ఇందులో



ఉండే పాలీఫినాల్స్ క్రేవింగ్స్‌ను తగ్గిస్తాయి. బెల్లంతో చేసిన పల్లీ చిక్కీ, నువ్వుల లడ్డు, ఖర్జూరాలు తినొచ్చు. బెల్లం సున్నుండలు, కిస్‌మిస్, పీనట్ బటర్‌లాంటివీ మంచివే. వీటిలో చాలావరకు షుగర్ ఉన్నవాళ్లూ పరిమిత మోతాదులో తీసుకోవచ్చు. ఇక పోషక లోపాలున్న వారికోసం... పాలలో కాల్షియం, అరటిపండులో మెగ్నీషియం, బఠాణీలు, బ్రౌన్ రైస్, సింగిల్ పాలిష్ రైస్, తృణధాన్యాలు, చిరుధాన్యాల్లో బి గ్రూప్ విటమిన్లు, గింజల్లో క్రోమియం దొరుకుతాయి. చక్కటి సమతులాహారం తీసుకుంటూ, వ్యాయామం చేస్తూ, సకాలంలో నిద్ర పోతే... ఏ రుగ్మతలూ దరిచేరవు.


అక్కడ అతివకే అందలం!

మనదేశంలోని అనేక కంపెనీల్లో మహిళలపై వివక్ష కొనసాగుతూనే ఉన్నది. 'సమాన పనికి సమాన వేతనం' అనే సిద్ధాంతం కాగితాలకే పరిమితమైంది. ఉద్యోగాలు చేస్తున్న మహిళల్లో 23 శాతం మంది తక్కువ జీతాలతో సరిపెట్టుకుంటున్నారనీ, 16 శాతం మంది మహిళా ఉద్యోగులు వివక్షను ఎదుర్కొంటున్నారని ఇటీవలి సర్వేలోనూ వెల్లడైంది. అయితే, కొన్ని సంస్థలు మాత్రం.. అందుకు భిన్నంగా అతివలను అందలం ఎక్కిస్తున్నాయి. పురుష ఉద్యోగుల కన్నా ఎక్కువ జీతాలిస్తూ.. వారి జీవితాలకు కొత్త బాటలు వేస్తున్నాయి. అలాంటి సంస్థల్లో జొమాటో, పేటీఎం, డెలివరీ, మామాఎర్త్ లాంటి సంస్థలు ముందున్నాయి. ఇక్కడ పురుషుల కన్నా మహిళా ఉద్యోగులకే ఎక్కువ జీతాలు వస్తున్నాయి. ఆయా సంస్థల వార్షిక నివేదికల్లో ఈ విషయం వెల్లడైంది. ఆయా సంస్థల్లో పనిచేస్తున్న పురుష సహచరులకంటే.. మహిళా ఉద్యోగుల సగటు వేతనం 160 శాతం ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది.



ఏఐ నమ్మొద్దు..

చదువుల్లో, ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో అంతటా పోటీ వాతావరణమే. ఈ పోటీ ఇప్పటి వరకు మనుషుల మధ్యే! కానీ, భవిష్యత్తులో మన పోటీదారు ఎవరో తెలుసా? ఇప్పుడు మనం వాడేందుకు ఎంతగానో ఇష్టపడే ఏఐ. అవును.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మన తెలివిని తెల్లారిపోయేలా చేస్తున్నది. మనల్ని బద్ధకస్తుల్ని చేసేస్తున్నది. ఎంతలా అంటే.. మన గురించి మనం చెప్పుకోవడం మానేసి.. ఏఐని చెప్పమనే స్థితికి వచ్చేశాం. అందుకే.. తాజాగా కొన్ని కంపెనీలు ఓ ట్విస్ట్ ఇస్తూ ప్రకటనలు జారీ చేశాయి. ఏఐతో క్రియేట్ చేసిన రెజ్యూమెలను నమ్మేంత పిచ్చోళ్లం కాదంటున్నాయి. అలా జెనరేట్ చేస్తే రిజెక్ట్ చేస్తామని కుండబద్దలు కొడుతున్నాయి. ఎందుకిలా అంటే.. ''టెల్ అజ్ అబౌట్ యువర్ సెల్ఫ్?' అని అడిగితే.. మీరు చెబుతారా? ఏఐ వచ్చి చెబుతుందా?' అని అభ్యర్థుల్ని ప్రశ్నిస్తున్నాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్, టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్స్, లాజిస్టిక్స్.. లాంటి రంగాల్లో ఈ రకమైన ఏఐ రెజ్యూమెల వడపోత పక్కాగా అమలు చేస్తున్నాయి కంపెనీలు. తమ స్కిల్స్‌ని అభ్యర్థులు స్వయంగా రాసినట్టుగా అనిపిస్తే మాత్రమే ఆ రెజ్యూమెలను పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఏఐ టూల్స్‌తో డెవలప్ చేసినవి బుట్టదాఖలు చేస్తున్నాయి. కొన్ని సర్వేల ప్రకారం ఏఐ టూల్స్ వాడి రెజ్యూమెలు రాస్తున్నవారి శాతం పెరుగుతున్నదట. అమెరికాలో 28 శాతం మంది ఏఐని విరివిగా వాడుతున్నారట. జెనరేషన్ 'జెడ్' ఏఐ టూల్స్ వాడకంలో ముందు వరుసలో నిలుస్తున్నది. ఈ నేపథ్యంలో వ్యక్తిగత విషయాలను వెల్లడించడానికి కూడా ఏఐపై ఆధారపడుతున్న వాళ్లలో ఏపాటి స్కిల్స్ ఉంటాయో అన్న అనుమానం కొద్దీ.. కంపెనీలు కాస్త కఠినంగానే వ్యవహరిస్తున్నాయి. ఏది ఏమైనా.. కెరీర్‌కి కీలకమైన రెజ్యూమెను క్రియేట్ చేయడంలో ఏఐ సాయం తీసుకున్నప్పటికీ చివరగా.. మీరే క్షుణ్నంగా రీరైట్ చేసుకుని స్పష్టంగా, సెన్సిబుల్‌గా ఉండేలా జాగ్రత్తపడటం అవసరం!





పరేడ్‌కు భాగ్యరేఖ



బిడ్డలు.. కన్నవారి కలలు నెరవేరుస్తారు. ఈ ఆడకూతురు అంతకుమించి! తల్లిదండ్రుల స్వప్నాన్ని సాకారం చేసింది. కట్టుకున్న వాడు అందుకోలేకపోయిన లక్ష్యాన్ని ఆమె చేరుకుంది. గోదావరి ఒడ్డున బుడిబుడి అడుగులు వేసిన ఒకనాటి చిన్నారి.. నేడు ఎస్సై క్యాడెట్ల దీక్షాంత్ పరేడ్‌లో అందరినీ ముందుకు నడిపించింది. ఇది చూసి ఆమె పుట్టిన సారపాక మనసారా పొంగిపోయింది. ఆమెకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు, తోడుగా నిలిచిన శ్రీవారు అందరూ ఉప్పొంగిపోయారు. 'చీఫ్ మినిస్టర్స్ రివాల్వర్ బెస్ట్ అండ్ బెస్ట్ ఆల్ రౌండర్', 'హోం మినిస్టర్ బాటెన్ విత్ సిల్వర్ ఎండ్ ఫర్ బెస్ట్ ఇండోర్' క్యాడెట్‌తోపాటు టాపర్ ఆఫ్ ద 2024 ఎస్సై బ్యాచ్ బెస్ట్ క్యాడెట్‌గా ఎంపికైన విజయ స్త్రీ.. భాగ్యశ్రీ కథ ఇది.

2019లో భాగ్యశ్రీ పెండ్లయింది. 2021లో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఆ మరుసటి ఏడాది ఎస్సై నోటిఫికేషన్ విడుదలైంది. పాలుతాగే పసిపాప ఒడిలో ఉండగా.. ఎస్సై పోస్టుకు ఎవ్వరూ కూడా అప్లయ్ చేయడానికి సాహసించరు. ఆమె మాత్రం పట్టుబట్టి పరీక్షకు సిద్ధమైంది. గట్టిగా కసరత్తులు చేసింది. బెస్టుగా పరీక్ష రాసింది. శిక్షణ పూర్తయ్యేసరికి ఫస్టుగా నిలిచిన భాగ్యశ్రీ విజయ గాథ ఆమె మాటల్లోనే..

మాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం సారపాక. ప్రాథమిక విద్య ఖమ్మంలోని గురుకుల విద్యాలయంలో.. ఇంటర్, ఇంజినీరింగ్ కొత్తగూడెంలో పూర్తిచేశాను. మా నాన్న పల్లి నాగేశ్వరరావు పెండ్లిళ్లకు వంటలు చేస్తుంటారు. అమ్మ సారపాకలో బడ్డీకొట్టు నడుపుతుంటుంది. మేము ముగ్గురు సంతానం. చదువు ఒక్కటే జీవితాన్ని మార్చే ఆయుధమని అమ్మానాన్నలు బలంగా నమ్మారు. అందుకే, ఎన్ని కష్టాలు వచ్చినా మమ్మల్ని పెద్ద చదువులు చదివించారు. వారి ప్రోత్సాహంతో అక్క, తమ్ముడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా స్థిరపడ్డారు. బీటెక్ తర్వాత నా పెండ్లి చేశారు. మా ఆయన పవన్‌కుమార్ హైదరాబాద్‌లో ఓ కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. పెండ్లికి ముందు కూడా ఉద్యోగం చేశాను. చదువుకొని ఉద్యోగం చేయకపోతే ఆడబిడ్డకు విలువ ఉండదని అమ్మానాన్న ఎప్పుడూ చెబుతుండేవారు. అందుకే ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని భావించేదాన్ని. 2018లో ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లలో గ్రూప్-4 ఉద్యోగానికి ఎంపికయ్యాను. 2020లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరాను.



ట్రైనర్ ఆయనే

2021లో మాకు ఆడబిడ్డ పుట్టింది. ఆ మరుసటి ఏడాది ఎస్సై నోటిఫికేషన్ పడింది. మా వారికి పోలీసు ఉద్యోగం అంటే చాలా ఇష్టం. యూనిఫాం సర్వీసుల్లో చేరాలని ఎప్పుడూ అనుకునేవారు. కానీ, ఆర్థిక పరిస్థితుల వల్ల తను అనుకున్న లక్ష్యాన్ని అందుకోలేకపోయారు. ఆయన కోరిక నేను నెరవేర్చాలని అనుకున్నా. ఆయన కారణంగానే పోలీసు ఉద్యోగంపై నాకు ఇష్టం పెరిగింది. నేను ఎస్సై పోస్టుకు అప్లయ్ చేస్తానని చెబితే.. ఆయన ఎంతో సంతోషించారు. పరీక్షకు సన్నద్ధం కావడంలో అండగా నిలిచారు. తనకు తెలిసిన మెలకువలు నేర్పారు. రోజూ ఇద్దరం గ్రౌండ్‌కు వెళ్లేవాళ్లం. దగ్గరుండి కసరత్తులన్నీ నేర్పారు.

పాలు తాగే బిడ్డను వదిలేసి

మా బంధువుల్లో పోలీసులెవరూ లేరు. మా వాళ్లందరికీ మార్గదర్శిగా ఉండాలనుకున్నా. ముఖ్యంగా నా కూతురి ముందు విజేతగా నిలవాలనే ఉద్దేశంతోనే పోలీసు ఉద్యోగం వైపు అడుగులు వేశాను. నేను ఉద్యోగానికి ఎంపికయ్యే నాటికి నా బిడ్డది పాలు తాగే వయసు. ఓ అమ్మగా బాధ ఎంత భారంగా ఉంటుందో నాకు తెలుసు. కానీ, నాకది తప్పని పరిస్థితి. నేను శిక్షణలో ఉన్న ఏడాదంతా మావారు, అమ్మానాన్నలు, అత్తమామలు నా చిట్టి తల్లి ఆలనాపాలన చూసుకున్నారు.

టాపర్‌గా నిలవాలని

నా దృష్టంతా లక్ష్యంపైనే ఉండేలా మా ఆయన స్ఫూర్తినిచ్చారు. సివిల్స్ టాపర్స్ పరేడ్‌ను లీడ్ చేసే విధానంపై ఎప్పుడూ మాట్లాడుతుండేవారు. 'వందలాది మంది ఉన్నా.. పరేడ్‌ను లీడ్ చేసే అవకాశం కేవలం ఒక్కరికి మాత్రమే వస్తుంది. అందుకోసం ఎంతో కష్టపడాలి. ఇండోర్, అవుట్‌డోర్ ఈవెంట్లలో, సబ్జెక్టుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి మాత్రమే ఈ అవకాశం వస్తుంద'ని చెప్పేవారు. ఆ మాటలు నాపై మంత్రంలా పనిచేశాయి. ఆ ఉత్సాహంతోనే ఎస్సై ప్రిలిమ్స్, ఫిజికల్ ఈవెంట్స్, ఫైనల్ ఎగ్జామ్స్‌లో నా బెస్ట్ పెర్ఫార్మెన్ ఇచ్చాను. ఎస్సైగా ఎంపిక కావడంతోనే నా టార్గెట్ పూర్తయిందని ఊరుకోలేదు. పరేడ్ కూడా లీడ్ చేయాలనుకున్నా. ఇండోర్, అవుట్‌డోర్ ఈవెంట్లలో చక్కటి ప్రతిభ కనబర్చాను. చివరికి పరేడ్ లీడ్ చేసే అరుదైన అవకాశాన్ని అందుకున్నాను. పైగా ముఖ్యమంత్రి చేతులమీదుగా 'చీఫ్ మినిస్టర్స్ రివాల్వర్ బెస్ట్ అండ్ బెస్ట్ ఆల్ రౌండర్ ఎస్సై', 'హోం మినిస్టర్ బాటెన్ విత్ సిల్వర్ ఎండ్ ఫర్ బెస్ట్ ఇండోర్' అవార్డులు అందుకోవడం గర్వంగా ఉంది. ఇవి నా బాధ్యతను నిరంతరం గుర్తు చేస్తుంటాయి.

చిన్ననాటి మాట..

నా పేరు సౌమ్య. నేను ఏఆర్ ఎస్సైగా ఎంపికయ్యాను. మా స్వస్థలం హైదరాబాద్ మలక్‌పేట్. నాన్న ఏఆర్ ఏఎస్సై. నా శిక్షణ పూర్తయ్యేంత వరకు కూడా మా నాన్న ఏఆర్ ఏఎస్సై అనే విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. నేనేంటో నిరూపించుకోవాలి అనుకున్నా. పోలీసు విభాగంలో ఉంటే ప్రజలకు, ముఖ్యంగా పేదవారికి ఎక్కువ సేవ చేసే అవకాశం దక్కుతుందని నాన్న ఎప్పుడూ చెబుతుండేవారు. అందుకే నేను కూడా ఈ దిశగా అడుగులు వేశాను. చిన్నప్పుడు 'నాన్నా నేను పోలీసు ఉద్యోగం చేస్తే మాత్రం.. నా దగ్గరే నిన్ను ఉండేలా చూసుకుంటాను' అని అంటుండేదాన్ని. 'నా కూతురి దగ్గర పనిచేయడం నాకూ గర్వకారణమ'ని నాన్న అనేవారు. అప్పుడు నేను సరదాగా అన్న మాటలు నేడు నిజమయ్యాయి. నాన్న నాకు సెల్యూట్ చేసినప్పుడు నా ఆనందానికి హద్దు లేదు. ఎంబీఏ చదువుకుంటూనే ఎస్సై ఉద్యోగానికి సిద్ధమయ్యాను. ప్రత్యేకంగా కోచింగ్ సెంటర్లకు వెళ్లలేదు. ఆన్‌లైన్‌లో సబ్జెక్ట్ చూసుకుంటూ, చదువుకుంటూ సొంతంగా మెటీరియల్ తయారు చేసుకున్నా. అమ్మ ఎంతో ప్రోత్సహించింది. మొత్తానికి అనుకున్నది సాధించాను. ఆ కష్టానికి ఫలితమే 'చీఫ్ మినిస్టర్స్ రివాల్వర్ బెస్ట్ అండ్ బెస్ట్ ఆల్‌రౌండర్', 'హోం మినిస్టర్ బాటెన్ విత్ సిల్వర్ ఎండ్ ఫర్ బెస్ట్ ఇండోర్' అవార్డులు. అక్క చార్టెడ్ అకౌంట్, తమ్ముడు డెలాయిట్‌లో జాబ్ చేస్తున్నారు. మొత్తానికి నా సక్సెస్‌ను వాళ్లు కూడా ఎంజాయ్ చేస్తున్నారు.

• **సౌమ్య,** బెస్ట్ ఆల్‌రౌండర్



గన్ పట్టడంపైనే నా ఆసక్తి

నా పేరు మమత. మాది నల్లగొండ జిల్లా బండవారిగూడెం. ఎంటెక్ చేశాను. అమ్మానాన్నలు ఇందిర, రంగారెడ్డి. భర్త ఈశ్వర్ రెడ్డి. మా బాబుకు ఎనిమిదేండ్లు. నేను నాలుగో తరగతి చదువుతున్నప్పుడు అనుకుంటా.. ఓ ల్యాండ్ ఇష్యూలో ఓ పోలీసు అధికారి వచ్చి.. తన క్యాప్ నా తలపై పెట్టి.. 'నువ్ పోలీసు అవుతావా' అన్నారు. అప్పట్నుంచి పోలీసు కావాలని అనుకునేదాన్ని. నేను మూడో ప్రయత్నంలో ఎస్సై సాధించాను. రెండు ప్రయత్నాల్లో రాకపోవడంతో ఇదే చివరిసారి అనుకొని శిక్షణ తీసుకున్నా. గతంలో చేసిన తప్పులు చేయకుండా గ్రాండ్ టెస్టులు రాశాను. ఫిజికల్ ఈవెంట్స్



సమయానికి నాకు ఆపరేషన్ అయింది. మూడు నెలలు అదే నొప్పితో లక్ష్యం కోసం 800 మీటర్లు పరుగెత్తాను. గత నోటిఫికేషన్ 7 మార్కులతో ఎస్సై ఉద్యోగం మిస్ అయింది. ఆ బాధ నుంచి కోలుకొని మళ్లీ బరిలో నిలిచి గెలిచాను. నాకు ఫైరింగ్‌లో డైరెక్టర్ మెడల్ వచ్చింది. రేంజ్ సెట్ చేసుకోవడం, ట్రిగ్గర్ ఆపరేషన్, సైట్ ఎలైన్‌మెంట్ ఇవన్నీ సెట్ చేయడం అనుకున్నంత తేలికేం కాదు. పైగా వెపన్స్ బరువు ఉంటాయి. హిట్ ఇచ్చినప్పుడు వెనక్కి పడిపోతుంటారు. కాగా, మొదట చిన్న వెపన్‌తో చేసిన ప్రయత్నం నాలో ఆసక్తి పెంచింది. ఆ తర్వాత నమ్మకం పెరిగింది. ఆ నమ్మకమే నన్ను ప్రత్యేకంగా నిలిపింది.

• **బి. మమత,** డైరెక్టర్ ట్రోఫీ గ్రహీత

... రవికుమార్ తోటపల్లి

హైదరాబాద్‌కు 25 లక్షల నజరానా

బుచ్చిబాబు టోర్నీ విజేతకు హెచ్‌సీఏ భారీ ప్రైజ్‌మనీ



హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఆల్‌ఇండియా బుచ్చిబాబు ఇన్విటేషనల్ టోర్నీలో విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టుకు భారీ నజరానా దక్కింది. ఏడేండ్ల తర్వాత బుచ్చిబాబు టైటిల్ దక్కించుకున్న హైదరాబాద్ టీమ్‌కు రూ.25 లక్షల నజరానా అందిస్తున్నట్లు హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు శుక్రవారం ప్రకటించారు. ఉప్పల్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ప్లేయర్లను అభినందించిన ఆయన మాట్లాడుతూ 'బుచ్చిబాబు టోర్నీలో హైదరాబాద్ విజేతగా నిలువడం చాలా సంతోషంగా ఉంది. గత సీజన్‌లో రంజీ ప్లేట్ చాంపియన్‌షిప్ దక్కించుకుంది. రానున్న సీజన్‌లో ఎలైట్ టైటిల్ లక్ష్యంగా ఎంచుకున్నాం. క్రికెటర్లకు, సహాయక సిబ్బందికి అన్ని రకాలుగా హెచ్‌సీఏ మద్దతిస్తుంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్, హెచ్‌సీఏ కౌన్సిల్ సభ్యులు దేవరాజ్, దల్జీత్‌సింగ్, బసవరాజు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



వ్రితి పతక జోరు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: మంగళూరు(కర్నాటక) వేదికగా జరుగుతున్న 77వ జాతీయ సీనియర్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ స్విమ్మర్ వ్రితి అగర్వాల్ పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. శుక్రవారం జరిగిన మహిళల 200మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో వ్రితి 2:09:25 సెకన్ల టైమింగ్‌తో కాంస్య పతకం సొంతం చేసుకుంది. హాశిక(కర్నాటక), అదితి(మహారాష్ట్ర) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. మరోవైపు పురుషుల 400మీటర్ల వ్యక్తిగత మెడ్లే విభాగంలో రాష్ర్టానికి చెందిన వర్షిత్ 4:37:68సె టైమింగ్‌తో కాంస్యం ఖాతాలో వేసుకున్నాడు.



గ్రామీణ క్రికెటర్ల కోసం టీడీసీఏ

లోగో ఆవిష్కరించిన వెంకటేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ గ్రామీణ ప్రాంత క్రికెటర్ల కోసం మరో కొత్త అసోసియేషన్ పురుడు పోసుకుంది. గ్రామీణ స్థాయి క్రికెటర్లకు జరుగుతున్న అన్యాయానికి చరమగీతం పాడేందుకు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ డిస్ట్రిక్స్ క్రికెట్ అసోసియేషన్(టీడీసీఏ) కొత్తగా ఏర్పాటైంది. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో టీడీసీఏ లోగో ఆవిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 'తెలంగాణ గ్రామీణ స్థాయి క్రికెటర్లకు సరైన న్యాయం జరుగడం లేదు. హెచ్‌సీఏ పూర్తిగా హైదరాబాద్ వరకే పరిమితమైంది. ఇప్పటి వరకు జిల్లాల నుంచి హైదరాబాద్ రంజీ టీమ్‌కు ఆడిన క్రికెటర్లు పెద్దగా లేరు. ఈ నేపథ్యంలోనే అద్భుత ప్రతిభ కల్గిన పల్లె క్రికెటర్లకు మద్దతుగా నిలిచేందుకు టీడీసీఏ ఏర్పాటు చేశాం. రానున్న రోజుల్లో బీసీసీఐ గుర్తింపు కోసం ప్రయత్నం చేస్తాం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ కేవీ రమణాచారి, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్టీస్ షురూ

భారత ఆటగాళ్ల ముమ్మర కసరత్తు • చెన్నై చేరుకున్న రోహిత్, విరాట్

చెన్నై: స్వదేశంలో సుమారు ఆరు నెలల విరామం తర్వాత బంగ్లాదేశ్‌తో రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌కు సిద్ధమవుతున్న భారత జట్టు ఈ మేరకు సన్నాహకాలు మొదలుపెట్టింది. చెన్నైలోని చిదంబరం స్టేడియం వేదికగా ఈనెల 19 నుంచి జరుగబోయే తొలి టెస్టు కోసం ఇది వరకే నగరానికి చేరుకున్న టీమ్‌ఇండియా.. శుక్రవారం తొలి ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంది. జట్టు సభ్యులంతా గురువారం నాటికే ఇక్కడికి చేరగా శుక్రవారం ఉదయం కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టీమ్‌తో కలిశారు. గత నెలలో హెడ్‌కోచ్ బాధ్యతలు చేపట్టిన గౌతం గంభీర్‌తో పాటు అతడి కోచింగ్ బృందం అభిషేక్ నాయర్(అసిస్టెంట్ కోచ్), బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్‌కు స్వదేశంలో ఇదే తొలి సిరీస్. గంభీర్ బృందం పర్యవేక్షణలో ఆటగాళ్లంతా ఉత్సాహంగా ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలలో పంచుకుంది.

దులీప్ ట్రోఫీ తొలి దశ పోటీలు ముగిసిన తర్వాతే చెన్నైకి చేరుకున్న కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్, తదితర ఆటగాళ్లు మైదానంలో కొంతసేపు ప్రాక్టీస్ చేశారు. టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత కొంతకాలం పాటు విరామం తీసుకున్న జస్‌ప్రీత్ బుమ్రా నెట్స్‌లో చెమటోడ్చాడు. అతడితో పాటు సిరాజ్, తొలిసారి టెస్టు జట్టుకు ఎంపికైన యశ్ దయాల్ సైతం బౌలింగ్ ప్రాక్టీస్ చేశాడు. తొలి టెస్టుకు ఎంపికైనా ఇంకా జట్టుతో చేరని యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్.. దులీప్ ట్రోఫీ రెండో దశ మ్యాచ్‌లు ముగియగానే చెన్నైకి రానున్నాడు.



విరాట్ ఆగమనం

ఆగస్టులో శ్రీలంకతో మూడు వన్డేల సిరీస్ ఆడిన అనంతరం కుటుంబంతో కలిసి ఇంగ్లండ్‌లో గడుపుతున్న విరాట్ కోహ్లీ స్వల్ప విరామం తర్వాత స్వదేశానికి చేరుకున్నాడు. శుక్రవారం ఉదయమే చెన్నైకి చేరుకున్న కోహ్లీ.. విమానాశ్రయం నుంచి నేరుగా టీమ్‌హోటల్‌కు చేరుకున్నాడు. అనంతరం జట్టుతో కలిసిన అతడు.. 45 నిమిషాల పాటు నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసినట్టు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఏడాది జనవరిలో దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్ టెస్టు ఆడిన తర్వాత మళ్లీ రెడ్‌బాల్ క్రికెట్ ఆడనుండటం కోహ్లీకి ఇదే మొదటిసారి. స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌కు వ్యక్తిగత కారణాలతో అతడు దూరంగా ఉన్న విషయం విదితమే.

నేడు ఐఆర్‌ఎల్ మూడో రౌండ్

చెన్నై: రేసింగ్ ప్రమోషన్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఆర్‌పీపీఎల్) ఆధ్వర్యంలో ఇండియన్ రేసింగ్ ఫెస్టివెల్ మూడో రౌండ్ పోటీలకు మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్ సిద్ధమైంది. శని, ఆదివారాల్లో మూడు రకాల చాంపియన్‌షిప్‌లు జరుగనున్నాయి. ప్రధానంగా ఐఆర్‌ఎల్ మూడో రౌండ్ రేసులో ఆరు ఫ్రాంచైజీలు పోటీపడనున్నాయి. తొలి రెండు రౌండ్లలో మూడుసార్లు పోడియం ఫినిష్ చేసిన బెంగాల్ టైగర్స్ ప్రస్తుతం అగ్రస్థానంలో కొనసాగుతున్నది. ఈ రెండు రోజుల్లో ఐఆర్‌ఎల్‌తో పాటు ఫార్ములా-4 ఇండియన్ చాంపియన్‌షిప్, నేషనల్ రేసింగ్ చాంపియన్‌షిప్ పోటీలు కూడా జరుగనున్నాయి. మొత్తం ఐదు రౌండ్లలో జరిగే ఇండియన్ రేసింగ్ ఫెస్టివెల్ పోటీలను అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

ఇండియా 'సీ' 525 ఆలౌట్

అనంతపూర్: దులీప్ ట్రోఫీ రెండో దశ మ్యాచ్‌లలో భాగంగా రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలోని ఇండియా 'సీ' భారీ స్కోరు సాధించింది. అనంతపూర్ వేదికగా ఇండియా 'బీ'తో జరుగుతున్న మ్యాచ్‌లో గైక్వాడ్ సేన.. తొలి ఇన్నింగ్స్‌లో 525 పరుగులు భారీ స్కోరు సాధించింది. తొలి రోజు ఇషాన్ కిషన్ సెంచరీతో మెరవగా రెండో రోజు మానవ్ సుతర్ (82), అన్షుల్ కంబోజ్ (38) రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన 'బీ' జట్టు.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 124 పరుగులు చేసింది. ఆ జట్టు సారథి అభిమన్యు ఈశ్వరన్ (51 నాటౌట్), జగదీశన్ (67 నాటౌట్) క్రీజులో ఉన్నారు.



ఖలీల్, అకిబ్ ధాటికి విలవిల

ఇండియా 'డీ'తో జరుగుతున్న మ్యాచ్‌లో 'ఏ' జట్టు భారీ ఆధిక్యం సాధించింది. మయాంక్ అగర్వాల్ నేతృత్వంలోని ఆ జట్టు.. తొలి ఇన్నింగ్స్‌లో 290 పరుగులకు ఆలౌట్ అయింది. మొదటి ఇన్నింగ్స్‌లో శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలోని 'డీ'.. 183 పరుగులకే చేతులెత్తేసింది. ఆ జట్టులో దేవ్‌దత్ పడిక్కల్ (92) తృటిలో సెంచరీ మిస్ చేసుకోగా మిగతా వారు విఫలమయ్యారు. కూలింగ్ గ్లాసెస్‌తో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ అయ్యర్ 7 బంతులాడి డకౌట్‌గా వెనుదిరిగాడు. ఖలీల్ అహ్మద్, అకిబ్‌ఖాన్ తలా మూడు వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో 107 పరుగుల ఆధిక్యాన్ని దక్కించుకున్న 'ఏ' జట్టు.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 115 రన్స్ చేసింది. తద్వారా 222 పరుగుల భారీ ఆధిక్యంతో మ్యాచ్‌పై పట్టు బిగిస్తోంది.

అఫ్గాన్, కివీస్ టెస్టు రద్దు

• **ఈ శతాబ్దిలో ఇదే ప్రథమం**

నోయిడా: అఫ్గానిస్థాన్, న్యూజిలాండ్ మధ్య నోయిడా వేదికగా జరగాల్సిన ఏకైక టెస్టు నాలుగు రోజుల నాటకీయ పరిణామాల తర్వాత అధికారికంగా రద్దైంది. ఈ మ్యాచ్‌లో టాస్ కూడా పడకపోగా ఒక్క బంతి సైతం పడలేదు. టెస్టు క్రికెట్ చరిత్రలో ఇలా జరగడం ఇది 8వ సారి కాగా 1998 తర్వాత ఇదే ప్రథమం. కాగా తొలి మూడు రోజులు నోయిడా స్టేడియంలో ఔట్ ఫీల్డ్ తడిగా ఉండటంతో ఆట సాగకపోగా తర్వాత రెండు రోజులూ వర్షాలతో మ్యాచ్‌ను రద్దు చేశారు. మ్యాచ్ రద్దవడంపై ఇరు జట్ల హెడ్‌కోచ్‌లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

సెమీస్‌కు క్రాస్టో జోడీ

హో చి మిన్హ్: భారత మిక్స్‌డ్ డబుల్స్ ద్వయం తనీషా క్రాస్టో, ధ్రువ్ కపిల వియత్నాం ఓపెన్ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లారు. శుక్రవారం ఇక్కడ జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్స్‌లో భారత జోడీ.. 14-21, 21-10, 21-14తో భారత్‌కే చెందిన సతీశ్ కుమార్, ఆద్యా వరియత్‌ను ఓడించారు. తొలి గేమ్‌ను దక్కించుకున్నా సతీశ్, ఆద్యా జోడీ చేతులెత్తేసింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో తరుణ్ మల్లెపల్లి క్వార్టర్స్‌లోనే వెనుదిరిగాడు.

భారత్‌కు 48 పతకాలు

చెన్నై: సౌత్ ఏషియన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఏకంగా 48 పతకాలు కొల్లగొట్టి ఓవరాల్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. శుక్రవారంతో ముగిసిన టోర్నీలో భారత అథ్లెట్లు 21 స్వర్ణాలు సహా 22 రజతాలు, 5 కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. శ్రీలంక(9స్వర్ణాలు, 9రజతాలు, 17కాంస్యాలు) రెండో స్థానంలో నిలిచింది.

తైక్వాండో టోర్నీకి బాబులాల్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: మహారాష్ట్ర వేదికగా జరుగనున్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) సౌత్‌జోన్ తైక్వాండో పోటీల్లో రాష్ర్టానికి చెందిన బాబులాల్ టెక్నికల్ డెలిగేట్‌గా ఎంపికయ్యాడు. ఈ నెల 20 నుంచి 23 వరకు జరుగనున్న టోర్నీలో బాబులాల్ సాంకేతిక ప్రతినిధిగా వ్యవహరించనున్నాడు. సీబీఎస్‌ఈ స్పోర్ట్స్ హెడ్ మజింత్‌సింగ్ ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించారు.



ఆయన సలహా పాటించాను

'దేవర' పాటల్లో ఎన్టీఆర్‌కి ధీటుగా డ్యాన్సలు చేసి ఆడియన్స్‌ని ఫిదా చేసేసింది శ్రీదేవి తనయ జాన్వీ కపూర్. 'దేవర-1' ప్రమోషన్స్‌లో ప్రస్తుతం జాన్వీ బిజీ బిజీగా ఉంది. నిదానంగా మీడియాతో ఇంటర్వ్యూలు కూడా షురూ చేసింది. తాజాగా తన టాలీవుడ్ ఎంట్రీ గురించి ఆసక్తికరమైన విషయాలను చెప్పుకొచ్చింది జాన్వీ. 'బాలీవుడ్‌లో నాకు అవకాశాలకు కొదవ లేదు. పైగా తక్కువ సమయంలో మంచి పాత్రలు పోషించాను. అయితే.. నేను సౌత్‌లో కూడా రాణించాలనేది అమ్మ కోరిక. ఆమె కోరిక తీర్చాలంటే సౌత్ సినిమా చేయాలి. దానికి తగ్గట్టే సౌత్ నుంచి నాకు ఆఫర్లొచ్చాయి. వాటిలో తెలుగు నుంచి 'దేవర' ఒకటి. అలాగే తమిళంలో కూడా ఓ సినిమా వచ్చింది. ఈ రెండింటిలో ఏ సినిమా చేయాలో తెలియక తికమక పడ్డాను. అప్పుడు కరణ్‌జోహార్ నాకు మార్గదర్శనం చేశారు. 'తారక్ సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వు. ఆ తర్వాత ఆటోమేటిగ్గా మంచి ఛాన్సులొస్తాయి' అని అన్నారు. ఆయన సలహా పాటించాను. ఆ సలహా నిజంగా కూడా బాగా కలిసొచ్చింది. వెంటనే రామ్‌చరణ్ సినిమా వచ్చింది. ఇంకా కొన్ని సినిమాలు టాక్స్‌లో ఉన్నాయి. ఏదేమైనా తెలుగు సినిమాతో సౌత్‌కి ఎంట్రీ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది' అంటూ చెప్పుకొచ్చింది జాన్వీ కపూర్

దేవర ఘనత

చిత్రం




పాటలు, ప్రచార చిత్రాల ద్వారా ఇప్పటికే 'దేవర -1' సినిమాపై అంచనాలు ఆకాశాన్ని అంటాయి. దీనికి తగ్గట్టు ఈ సినిమా మరో ఘనత సాధించింది. ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా 'దేవర -1' విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న సాయంత్రం ఆరున్నర గంటలకు, ఘనమైన సినిమా చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక సినిమా వేదిక 'బియాండ్ ఫెస్ట్'లో 'దేవర -1' రెడ్ కార్పెట్ ఈవెంట్ జరుపనున్నారు. హాలీవుడ్, లాస్ ఏంజిల్స్‌లోని ఐకానిక్ ఈజిప్షియన్ థియేటర్లో ఈవెంట్ జరుగనుంది. ఇక్కడ ప్రీమియర్ కానున్న తొలి భారతీయ సినిమాగా 'దేవర -1' రికార్డు సృష్టించింది. ఈ ప్రీమియర్‌కి ప్రముఖ హాలీవుడ్ నటీనటులతో పాటు హై ప్రొఫైల్ ఉన్న అమెరికన్ సిటిజన్స్ కూడా హాజరు కానున్నారు. ఈ వేడుక ప్రపంచ వేదికపై 'దేవర-1' ఖ్యాతిని మరింత పెంచనున్నదని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఎన్టీఆర్ ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ పాన్‌ఇండియా చిత్రంలో జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్, షైన్ టామ్ చాకో, అజయ్, గెటప్ శ్రీను తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు, ఎడిటింగ్: శ్రీకర్ ప్రసాద్, దర్శకుడు కొరటాల శివ, నిర్మాతలు: మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె, సమర్పణ: నందమూరి కల్యాణ్‌రామ్.

చివరి అధ్యాయానికి శ్రీకారం



దశాబ్దాల పాటు వెండితెరపై అలరించిన ఓ గొప్ప స్టార్, తన మార్గాన్ని మార్చుకొని ప్రజా క్షేత్రంలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నప్పుడు.. తను నటించే చివరి సినిమాపై ఇన్నాళ్లూ ఆరాధించిన అభిమానుల్లో ఎంతటి హైప్ ఉంటుందో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. తమిళనాట త్వరలో అలాంటి సినిమానే రానుంది. వివరాల్లోకెళ్తే.. తమిళ అగ్రనటుడు విజయ్ 'తమిళగ వెట్రి కళగం' పేరిట సొంత రాజకీయపార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 'దళపతి 69'(వర్కింగ్ టైటిల్)కి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానున్నదని తెలియజేస్తూ, సదరు చిత్ర నిర్మాణ సంస్థ కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ ఓ ప్రెస్‌నోట్ విడుదల చేసింది. 'కోట్లాది అభిమానులు ఆతృతగా ఎదరుచూస్తున్న 'దళపతి 69' సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుంది. ఇన్నాళ్లూ మనల్ని అలరించిన వ్యక్తికి ఇదే చివరి సినిమా కానుంది. ఈ కాంబో అత్యంత విధ్వంసకరంగా, ఇంతకు మించి అద్భుతం మరొకటి లేదు అనిపించేలా ఉండబోతున్నది' అనేది ఈ ప్రెస్‌నోట్ సారాంశం.



థర్డ్ కేస్ ఇన్వెస్టిగేషన్

వరుస విజయాలతో దూసుకుపోతున్న నాని కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'HIT : The 3rd Case'. ఇది నాని నటిస్తున్న 32వ సినిమా కావడం విశేషం. డాక్టర్ శైలేష్ కొలను దర్శకుడు. ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు. ఇందులో హిట్ ఆఫీసర్ అర్జున్ సర్కార్‌గా ఫెరోషియస్ కేరక్టర్‌లో నాని కనిపించనున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ శుక్రవారం నుంచి హైదరాబాద్‌లో మొదలైంది. తొలిరోజే నాని షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తామని, వచ్చే ఏడాది మే 1న వేసవిలో విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జె.మేయర్, నిర్మాణం: వాల్‌పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్.



రెండు ప్రపంచాల 'సత్యం సుందరం'

కార్తీ, అరవింద్ స్వామి ప్రధానపాత్రధారులుగా రూపొందిన చిత్రం 'సత్యం సుందరం'. '96'ఫేం సి.ప్రేమ్‌కుమార్ దర్శకుడు. సూర్య, జ్యోతిక నిర్మాతలు. ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్మెంట్స్ వారు ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 28న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ టీజర్ కార్తీ, అరవింద్‌స్వామికి సంబంధించిన రెండు ప్రపంచాలను పరిచయం చేసింది. వారిద్దరి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ హైలైట్‌గా టీజర్ సాగింది. ఇందులో కార్తీ అమాయకత్వంతో కూడి పాత్ర చేస్తే, అరవింద్ స్వామి రిజర్వ్‌డ్, అర్బన్ పర్సనాలిటీగా కనిపించారు. శ్రీదివ్య, స్వాతి కొండే, దేవదర్శిని ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: మహేందిరన్ జయరాజు, సంగీతం: గోవింద్ వసంత, నిర్మాణం: 2డీ ఎంటర్‌టైన్‌మెంట్.

నా అకౌంట్ హ్యాక్ అయ్యింది

లేడీ సూపర్‌స్టార్ నయనతార హ్యాకింగ్ బారిన పడింది. ఆమె ఎక్స్(ట్విటర్) ఖాతా హ్యాక్ అయినట్టు తాజాగా ఆమె తెలియజేసింది. 'దయచేసి ఆ అకౌంట్ నుంచి వచ్చే సందేశాలకు కానీ, ట్వీట్లకు కానీ ఎవరూ స్పందించొద్దు. నా అకౌంట్ హ్యాక్ అయ్యింది. ఈ విషయంపై సైబర్ పోలీస్‌లకు కంప్లయింట్ చేశా. త్వరలోనే మళ్లీ మీ ముందుకొస్తా' అని నయన్ తన ఎక్స్ ద్వారా వెల్లడించింది.



నయనతార మొదట్నుంచీ సోషల్‌మీడియాలో యాక్టివ్‌గానే ఉంటుంది. తనకు సంబంధించిన ఏ విషయాన్నయినా అభిమానులతో పంచుకునేందుకు ఆమె ఎక్స్‌ని, ఇన్‌స్టాని ఉపయోగిస్తుంది. తన సినిమాల ప్రమోషన్స్ విషయంలో కూడా కచ్చితంగా కొన్ని పద్ధతులు పాటిస్తుంది. తన సొంత ప్రొడక్షన్ సినిమా అయితే.. వ్యక్తిగత సోషల్ మీడియా ద్వారా ప్రమోట్ చేస్తుంది. బయట సినిమాలను ఆమె ప్రమోట్ చేయదు. అలాంటి నయనతార ఖాతా హ్యాక్ అవ్వడంతో ఆమె ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకుంది. ప్రస్తుతం టెస్ట్, తని ఒరువన్-2, మన్నన్‌గట్టి 1960, డియర్ స్టూడెంట్స్ సినిమాలతో నయనతార బిజీగా ఉంది.



మన్యం ధీరుడి పోరాటం

ఆర్‌వీవీ మూవీస్ సంస్థ రూపొందిస్తున్న చిత్రం 'మన్యం ధీరుడు'. స్వీయ నిర్మాణంలో ఆర్‌వీవీ సత్యనారాయణ నటిస్తూ నిర్మిస్తున్నారు. నరేష్ డెక్కల దర్శకుడు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా నిర్మాత, హీరో ఆర్‌వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ 'అల్లూరి సీతారామరాజు నిజమైన చరిత్రను ఈ సినిమాలో ఆవిష్కరించాం. ఈ సినిమా కోసం కత్తి యుద్ధం, విలువిద్యలో శిక్షణ తీసుకున్నా. బ్రిటీషర్లకు వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు చేసిన వీరోచిత పోరాటం స్ఫూరివంతంగా అనిపిస్తుంది. పాడేరు, హిమాచల్‌ప్రదేశ్, కశ్మీర్ వంటి ప్రదేశాలలో చిత్రీకరణ జరిపాం' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: పవన్‌కుమార్.

బాలీవుడ్‌లో మ్యూజికల్ లవ్‌స్టోరీ



తెలుగు సినిమాలకు కాస్త బ్రేక్‌నిచ్చిన మరాఠీ సుందరి మృణాల్ ఠాకూర్ ప్రస్తుతం బాలీవుడ్‌లో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నది. అక్కడ నాలుగు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. వాటిలో అగ్ర దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ నిర్మిస్తున్న సినిమాపై మృణాల్ ఠాకూర్ ఎన్నో ఆశల్ని పెట్టుకుంది. సిద్ధార్థ్ చతుర్వేది హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి రవి ఉద్యవార్ దర్శకత్వం వహిస్తున్నారు. బాలీవుడ్‌లో ప్రేమకథా చిత్రాల్ని అద్భుత రీతిలో తెరకెక్కిస్తుంటారు సంజయ్‌లీలా భన్సాలీ. దాంతో ఈ సినిమా తన బాలీవుడ్ కెరీర్‌కు బ్రేక్‌నిస్తుందనే నమ్మకంతో ఉంది మృణాల్. తాజాగా ఈ సినిమాకు 'తూ హీ హో..' అనే పేరును ఖరారు చేశారు. ఈ సినిమాలో నాయకానాయికలు సిద్ధార్థ్ చతుర్వేది, మృణాల్ ఠాకూర్ ఇద్దరూ మ్యూజిషియన్స్‌గా కనిపిస్తారని, మనసుల్ని కదిలించే సంగీతభరిత ప్రేమకథా చిత్రమిదని దర్శకుడు తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని సుందరమైన లొకేషన్లలో తదుపరి షెడ్యూల్ కోసం సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత సంజయ్‌లీలా భన్సాలీ తెలిపారు.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

NEWS LINE తెలుగు

ఇది తెలంగాణం

తెలుగు దినపత్రిక

Read share follow
www.newslinetelugu.com
NewsLineTelugu
News-Line-Telangana
NewsLineTelugu
#newslinetelugu

సంపుటి-2, సంచిక - 81, పేజీలు:08 వెల:4/- హైదరాబాద్, శనివారం, 14.09.2024



సీఎం మార్పు?..!



అమలు కాని హామీలతో తీవ్ర వ్యతిరేకత

- ఎమ్మెల్యేల చేరికల విషయంలోనూ ఎదురుదెబ్బలు
- పార్టీ కంటే సొంత ఇమేజ్‌పైనే ఫోకస్ పెట్టారని విమర్శలు..!
- రాష్ట్రంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలపై దాడులు
- ప్రశ్నించిన జర్నలిస్టులపైనా హత్యాప్రయత్నాలు
- మహిళలపై పెరిగిన అఘాయిత్యాలు
- రాష్ట్రంలో పెరిగిన మర్డర్లు, నేరాలు
- సీఎం దగ్గరే ఉన్నా.. లా అండ్ ఆర్డర్ ఆగమాగం
- రాష్ట్రంలో పూర్తిగా దెబ్బతిన్న శాంతిభద్రతలు
- త్వరలో నాలుగు రాష్ట్రాల ఎన్నికలు
- ఎఫెక్ట్ పడే ఛాన్సుందని హస్తం పెద్దల టెన్షన్
- ఇక్కడి పరిస్థితిని దేశమంతా చెప్తామన్న హరీష్ రావు..
- కామెంట్స్‌తో మరింత ఆందోళన
- సీఎంను మార్చక తప్పదనే ఆలోచనలో అధిష్టానం..!
- త్వరలోనే నిర్ణయం ఉంటుందని ఢిల్లీలో గుసగుసలు

కీలక పరిణామాలు జరగబోతున్నాయా.?

“ రాష్ట్ర రాజకీయాల్లో ఎవరు ఊహించని కీలక పరిణామాలు జరగబోతున్నాయన్న చర్చ ఢిల్లీలో జరుగుతోంది. పార్టీని గెలిపించారనే ఉద్దేశంతో అప్పట్లో రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి పీఠం అప్పజెప్పింది కాంగ్రెస్ అధిష్ఠానం. రాష్ట్రంలో పదవులైనా, మరేదైనా ఆయన చెప్పిందే పెద్దలు పాటిస్తారనే ప్రచారముంది. కానీ ఇప్పుడు సినిమా పూర్తిగా మారిపోయిందని తెలుస్తోంది. రాష్ట్రంలో అదుపుతప్పిన లా అండ్ ఆర్డర్.. ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకతతో కాంగ్రెస్ అధిష్టానం కూడా మార్పు కోరుకుంటున్నట్టుగా సమాచారం. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రిని కూడా మార్చబోతున్నారని తెలుస్తోంది.

తెలంగాణం, పొలిటికల్ డెస్క్(సెప్టెంబర్ 13):

'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి' అంటూ పార్టీని రేవంత్ రెడ్డి అధికారంలోకి తీసుకొచ్చారు. పాలనలో ఏ మార్పు అయితే కావాలని ఆయన కోరారో.. ఇప్పుడు అధిష్ఠానం కూడా అలాంటి మార్పునే కోరుకుంటుం దని టాక్. రాష్ట్ర ముఖ్యమంత్రిని మార్చే యోచనలో కాంగ్రెస్ హైకమాండ్ ఉన్నట్టు తెలుస్తుంది. గత పది నెలలుగా రాష్ట్రంలోని పరిణామాలు, అదుపుత ప్పుతున్న శాంతిభద్రతలు, అమలు కాని హామీలు, ఆగ్రహంగా ఉన్న రైతులు.. ఇలా ప్రతి ఒక్క అంశాన్ని బేరీజు వేసుకుని సీఎంను మార్చక తప్పదని కాంగ్రెస్ ఢిల్లీ నేతలు భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. రాష్ట్రంలో తనకు ఎదురే లేదనుకున్న సీఎం రేవంత్ రెడ్డికి తాజా పరిస్థితులు మింగుడు పడటం లేదు. మొన్నటి వరకు గౌరవించి, సీనియర్లను సైతం పక్కన పెట్టి మరీ అందలం ఎక్కించిన రేవంత్ రెడ్డికి ఈ పరిస్థితి ఎందుకు ఎదురయ్యింది.? నిజంగానే సీఎంను మా ర్చేందుకు హైకమాండ్ సిద్ధమైందా?

అమలుకాని హామీలపై ప్రజల్లో అసంతృప్తి

ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరునూరైనా అమలు చేస్తుందని జనం అనుకున్నారు. ఊహించని విజయాన్ని అందించిన జనానికి రేవంత్ సర్కార్ తీవ్ర నిరాశకు గురిచేసింది. 10నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకు హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయింది. ఒక్క మహిళ లకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప మరేవీ పూర్తిగా అమలు కాలేదు. జీరో విద్యుత్ బిల్లు, మహిళలకు రూ.2500, రూ.500 గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, ఫించన్ల పెంపు వరకు ఏదీ సక్రమంగా అమలు కావడం లేదు. కళ్యాణ లక్ష్మీ పథకంలో తులం బంగారం హామీని పూర్తిగా అటకెక్కించారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ అసంతృప్తిని మేనేజ్ చేయడంలో రేవంత్ రెడ్డి విఫల మయ్యాడని అధిష్ఠానం భావిస్తున్నట్టుగా సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆయన్ను ముఖ్యమంత్రి పీఠం నుంచి తప్పించాలని భావిస్తున్నట్టు తెలుస్తుంది.

పూర్తిగా క్షీణించిన శాంతిభద్రతలు

హైదరాబాద్ నగరంలో లా అండ్ ఆర్డర్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నది. రాష్ట్రంలో నేరాలను రేవంత్ సర్కార్ అదుపులో పెట్టలేకపోయింది. శాంతిభద్రత లు పూర్తిగా అదుపు తప్పాయా అన్నట్టుగా పరిస్థితు లు ఉన్నాయి. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గరే హోంశాఖ ఉన్నా.. దానిపై పూర్తి దృష్టి పెట్టిన దాఖలాలు లేవు. ఈ 10 నెలల కాలంలో చిన్నారు లపై అఘాయిత్యాలు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దొంగల దోపిడీలు పెద్దఎత్తున వెలుగులోకి వస్తున్నా..సరైన సమీక్ష నిర్వహించిన పాపాన పోలేదు సర్కార్. ఇంతగా లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తుతు న్నా పట్టించుకున్న నాథుడే లేడని ప్రతిపక్షాలు దుమ్మె త్తిపోస్తున్నాయి. హోంశాఖను తన దగ్గరే పెట్టుకున్న సీఎం ఏం చేస్తున్నారని మండిపడుతున్నాయి. ఈ అంశం కూడా అధిష్ఠానం దృష్టికి వెళ్లడంతో సీఎం రేవంత్ రెడ్డిపై ఫుల్ సీరియస్ అయినట్టు

మిగతా 2 లో >>>



గులాబీ నేతల గృహ నిర్బంధం..!

- ఎక్కడికక్కడ బీఆర్ఎస్ నేతల అడ్డగింత
- హాస్పిటల్‌కు వెళ్లకుండా హరీష్ రావును అడ్డుకున్న పోలీసులు
- సునీత, మాలోత్ కవితలను బలవంతంగా లాక్కెళ్లిన వైనం
- ఆర్ఎస్పీ, కౌశిక్ రెడ్డి, శంభీర్‌పూర్ రాజు, తలసాని, వివేకానంద, మాధవరం అందరినీ అడ్డుకున్న పోలీసులు
- అరెకపూడి ఇంటి దగ్గర భారీ బందోబస్తు
- లా అండ్ ఆర్డర్‌పై సీఎం రేవంత్ సీరియస్
- కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఆదేశం

తెలంగాణం, హైదరాబాద్(సెప్టెంబర్ 13):

“ పోలీసుల అడ్డగింతలు.. గృహ నిర్బంధాలతో ఎమర్జెన్సీని తలపించిందని రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ శ్రేణులు మండిపడ్డాయి. హాస్పిటల్‌కు వెళ్లకుండా హరీశ్ రావును అడ్డుకోవడాన్ని తీవ్రస్థాయిలో తప్పుబట్టారు నేతలు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి ఇంటి దగ్గర భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీస్ యంత్రాంగం, హరీష్ రావు తదితరులను ఎక్కడికక్కడ నిర్బంధించిందని మండిపడ్డారు. శుక్రవారం అరెకపూడి గాంధీ ఇంటికి వెళ్లి ఆయనకు బీఆర్ఎస్ కండువా కప్పుతానని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన సవాల్ నేపథ్యంలో కౌశిక్ రెడ్డితో పాటూ రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలను హౌస్ అరెస్ట్ చేశారు.

మిగతా 2 లో >>>

రేవంత్ రెచ్చగొడుతున్నడు!

- ఎవరిని ఎలా కొట్టాలో రివ్యూలు చేస్తున్నడు
- గాంధీని హౌస్ అరెస్ట్ చేస్తే దాడి జరిగేదా..?
- మా పార్టీ మహిళలను కూడా అరెస్ట్ చేశారు
- ఎమర్జెన్సీని మించిన రేవంత్ పాలన
- ఆయన భాష వల్లే కార్యకర్తలు దాడులు
- రాహుల్ అమెరికాలో
- లెక్చర్లు ఆపి తెలంగాణకు రా!
- కౌశిక్ సెటిలర్లను ఏం అనలేదు?
- పీఏసీ ఎంపిక ఎలక్షన్ కాదు సెలక్షన్!
- రాజకీయం ముఖ్యం కాదు రాష్ట్రం ముఖ్యం!
- తెలంగాణతో మాది పేగు బంధం!
- హైదరాబాద్ నివాసంలో హరీష్ హౌస్ అరెస్ట్
- సర్కార్ తీరుపై తీవ్రస్థాయిలో మండిపాటు



తెలంగాణం, హైదరాబాద్ (సెప్టెంబర్ 13):

అరికపూడి గాంధీని హౌస్ అరెస్ట్ చేసి ఉంటే కౌశిక్ రెడ్డిపై దాడి జరిగేదా..? అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసం వద్ద హరీష్ రావు మీడియాతో మాట్లాడా రు. సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే ఈ దాడి జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను హౌస్ అరెస్ట్ చేశారని, తమను కూడా బయటకు రానివ్వలేదని అన్నారు. ఇది గాంధీ చేసిన దాడిలా చూడటం లేదని, రేవంత్ రెడ్డి చేయించిన దాడిలానే చూస్తు న్నామని చెప్పారు. కౌశిక్ రెడ్డిపై రేవంత్ రెడ్డే దాడి చేయాలని ఎస్కార్ట్ ఇచ్చి పంపించాడని ఆరోపించారు. ఇది రేవంత్ ఎజెండా

మిగతా 2 లో >>>



పంట వేసిన రైతులకే రైతు భరోసా

2 లో >>>



కేజ్రీవాల్‌కు బెయిల్!

4 లో >>>



ట్రాన్స్ జెండర్లతో ట్రాఫిక్ నియంత్రణ

సీఎం రేవంత్ వినూత్న ఆలోచన

తెలంగాణం, హైదరాబాద్ (సెప్టెంబర్ 13): సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాన్స్ జెండర్లను వాలంటీర్లుగా

మిగతా 2 లో >>>



కేజీబీవీలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- పాఠశాల భవనంపై నుంచి దూకిన స్టూడెంట్
- సిబ్బంది వేధింపులతోనేనని పేరెంట్స్ ఆరోపణ
- సూర్యపేట జిల్లా తుంగతుర్తిలో ఘటన

“ రోజురోజుకీ సర్కారీ బడులలో పరిస్థితులు దిగజారిపోతున్నాయి. ఇప్పటికే సిబ్బంది ధోరణిపై విద్యార్థులు రోడ్డెక్కి మరీ నిరసనలు తెలుపుతున్నారు. మరోపక్క ఆహార వసతి సరిగ్గా లేక ఆస్పత్రుల పాలవుతున్నారు. మానసిక ఆందోళనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇంకొంతమంది పాము కాటుకు బలవుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖను కూడా తన దగ్గరే పెట్టుకున్న రేవంత్ రెడ్డి మౌనం దాల్చడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్నారు. తాజాగా సూర్యపేట జిల్లాలో మరో ఘటన చోటుచేసుకుంది.

మిగతా 2 లో >>> తెలంగాణం, హైదరాబాద్(సెప్టెంబర్ 13):

హైడ్రా వెనక చంద్రబాబు..!

- రేవంత్ రెడ్డి ఆయన ట్రాప్ లో పడ్డారు
- అందుకే హైదరాబాద్ ఇమేజ్ డ్యామేజ్
- అమరావతికి పెట్టుబడుల కోసమే కుట్ర
- కేసీఆర్ హయాంలో సెటిలర్లను అద్భుతంగా చూసుకున్నరు
- నేను అన్నది గాంధీ ఒక్కడినే
- ఆంధ్రావాళ్లు అంటే నాకెంతో గౌరవం
- అరికపూడి నాకు వార్నింగ్ ఇస్తున్నాడు
- తెలంగాణ కోసం చావడానికైనా సిద్ధమే
- పార్టీ మారిన ఎమ్మెల్యేలకు కేసీఆర్ భిక్ష
- పది నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు తప్పవు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



తెలంగాణం, హైదరాబాద్ (సెప్టెంబర్ 13):

హైడ్రా వెనక ఉన్నదే చంద్రబాబు నాయుడు అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బాబు ట్రాప్ లో పడి రేవంత్ రెడ్డి ఇక్కడినుండి పెట్టుబడు లను అమరావతికి తీసుకుపోతున్నాడని ఆరోపించారు. ఇప్పటికే హైడ్రా అని బైడ్రా అని హైదరాబాద్ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని, హైదరాబాద్ లో పెట్టుబడి పెట్టాలి అంటే భయపడే పరిస్థితికి తీసుకువచ్చారని మండిపడ్డారు. ఇది అంతా ఒక పెద్ద కుట్ర.. రేవంత్ రెడ్డి హైదరాబాద్ డెవలప్ కాకుండా చేస్తున్నాడని అన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను రేవంత్ రెడ్డి డ్యామేజ్ చేస్తున్నాడని అన్నారు. దయచేసి హైదరాబాద్ ప్రజలు రేవంత్ కుట్రను గమనించాలని సూచించారు. శుక్రవారం

మిగతా 2 లో >>>



రేవంత్ రెచ్చగొడుతున్నడు!

మొదటిపేజీ తరువాయి

అని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి రివ్యూలు చేస్తున్నాడని.. ఎవరిని ఎలా కొట్టాలని రివ్యూ చేస్తావా..? అంటూ ఎద్దేవా చేశారు. కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసిన వారికి పోలీస్ స్టేషన్ లో రాచమర్యాదలు చేశారని ఆరోపించారు. తమపై నల్గొండ, ఖమ్మంలో దాడి చేశారని, సిద్దిపేటలో తన ఇంటిపై దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రే వీటికి కారణమని అన్నారు. ముఖ్యమంత్రి తన బజారు భాష మార్చుకోవాలని సూచించారు. ఆయన రెచ్చగొట్టే భాష వల్లనే కార్యకర్తలు రెచ్చిపోతున్నారని అన్నారు.

అరెకపూడి గాంధీ, దానం నాగేందర్ బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఇలా వ్యవహరించలేదని యథారాజా తథాప్రజా.. అని ఎద్దేవా చేశారు. ఉద్యమంలో కూడా ఇలాంటి నిర్బంధాలు లేవన్నారు. రేవంత్ పాలన ఎమర్జెన్సీకి మించి ఉందన్నారు. వరద బాధితులను పరామర్శించేందుకు వెళితే దాడి చేశారని ఆ గూండాలను ఇప్పటికీ అరెస్ట్ చేయలేదన్నారు. డీజీపీ బాధ్యతయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. రేవంత్ రెడ్డి ఆనాడు పోలీసులను బిహారీ పోలీసులు అని నోటికివచ్చినట్టు మాట్లాడాడని గుర్తు చేశారు. కాబట్టి పోలీసులు చట్టాన్ని కాపాడాలని, న్యాయబద్ధంగా వ్యవహరించాలని కోరారు. "రాహుల్ గాంధీ వెళ్లి అమెరికాలో లెక్చర్లు ఇస్తున్నాడు. అయ్యా నువ్వు ముందు నీ కాంగ్రెస్ పాలలో ఉన్న తెలంగాణలో జరుగుతున్న రాజ్యాంగ ఉల్లంఘనల గురించి మాట్లాడాలి" అని పిలుపునిచ్చారు. పాడి కౌశిక్, అరెకపూడి గాంధీ మధ్య చిచ్చు పెట్టి లా అండ్ ఆర్డర్ సమస్యగా సృష్టించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌వి ముందు నుండీ డైవర్షన్ పాలిటిక్స్ అని మండిపడ్డారు. రుణమాఫీ గురించి అడిగితే హైడ్రా అనే డ్రామా మొదలు పెట్టాడని అన్నారు. రైతు భరోసా అడిగితే కాళేశ్వరం లీక్ అని డ్రామా, ఖమ్మం వరదల్లో ప్రభుత్వ ఫెయిల్యూర్ ఎండగట్టడానికి వెళితే దాడి చేసి డ్రామా, ఎమ్మెల్యేల ఫిరాయింపులపై హైకోర్టు మొట్టికాయలు వేస్తే పీఏసీ చైర్మన్ ను నియమించి మరో కొత్త డ్రామా మొదలు పెట్టాడని విమర్శించారు. రాళ్లు విసిరితే భయపడతామని అనుకుంటున్నవేమో.. ఉద్యమం చేసినోళ్లం మాకు దాడులు కొత్తకాదని హెచ్చరించారు. 16వ ఆర్థిక సంఘం గురించి మీరు తప్పుడు లెక్కలు చెబితే, మేము బాధ్యతాయుతంగా బలమైన వాదనను వినిపించామన్నారు. నీటి ప్రాజెక్టులకు, మిషన్ భగీరథకు, రాష్ట్ర అభివృద్ధికి నిధులు కావాలని కోరామన్నారు.

రాజకీయం కాదు, రాష్ట్రం ముఖ్యమని భావించి వాస్తవాలు లెక్కల రూపంలో చెప్పాం... 16వ ఆర్థిక సంఘాన్ని సాయం కోరామన్నారు. ఆంధ్రా నాయకుల మీద రేవంత్ రెడ్డి కపట ప్రేమ వలకబోస్తున్నారన్నారు. చిన్న జీయర్‌ని, యాదాద్రిని నిర్మాణానికి ప్లాన్ ఇచ్చిన ఆనంద సాయిని రేవంత్ ఆంధ్రోడు అన్నాడని గుర్తు చేశారు. డిఫెన్స్‌లో ఉన్న ప్రతిసారి కొత్త డ్రామా చేస్తున్నడు. కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను కడుపులో పెట్టుకున్నాడని చెప్పారు. పీఏసీకి ఎన్నిక జరిగిందని రేవంత్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదమని.. ఎలక్షన్ కాదు, సెలక్షన్ ద్వారా జరిగిందన్నారు. రాజ్యాంగం ప్రకారం ఎన్నిక పెట్టాలి కానీ, జరగలేదని తెలిపారు. అదానికి ఓల్డ్ సిటీ అప్పజెప్పుతానని మాట మార్చాడన్నారు. "కరీంనగర్ నుంచి వచ్చి హైదరాబాద్‌లో నీ పెత్తనం ఏంటి" అని కౌశిక్ రెడ్డిని గాంధీ ప్రశ్నించారని, దానికి సమాధానంగానే కౌశిక్ రెడ్డి మాట్లాడారు తప్ప, సెటిలర్ల మీద కౌశిక్ కామెంట్ చేయలేదని వివరించారు. గురువారం జరిగిన తొక్కిసలాటలో భుజం నొప్పి మొదలైందని, ఎమ్మారై స్కాన్ తీసి 15 రోజుల పాటు ఫిజియోథెరపీ సూచించారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ బీఆర్ఎస్ నాయకులను అరెస్టులను చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు మహిళలని కూడా చూడకుండా అరెస్టులు చేయడం దుర్మార్గమని అభిప్రాయపడ్డారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

పంట వేసిన రైతులకే రైతు భరోసా



మంత్రి తుమ్మల ప్రకటన

తెలంగాణం, హైదరాబాద్ (సెప్టెంబర్ 13): పంట వేసిన రైతులకే రైతు భరోసా అందిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మీడియా చిట్ చాట్ లో ఆయన మాట్లాడుతూ... ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ ఇప్పటికే చేశామని తెలిపారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులకు ఈ నెలాఖరు లోపు చేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా పంట బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం ఇప్పటికే రైతు భరోసా వేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో డబ్బులు వేయలేదు. గత ప్రభుత్వం ఎకరానికి ఒక విడతలో రూ.5వేలు ఇవ్వగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.7500 ఇస్తామని హామీ ఇచ్చింది. రెండు విడదతల్లో ఏడాదికి రూ.15వేలు ఇస్తామని ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు రైతు భరోసా ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు రుణమాఫీ కాలేదని రోడ్డెక్కుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో రైతు భరోసా పంట వేసిన రైతులకే వేస్తామని చెప్పడంతో వారిని ఎలా గుర్తిస్తారన్న ప్రశ్న రైతుల్లో మొదలైంది. అందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పి కేవలం 50 శాతం రైతులకే రుణమాఫీ చేయడంతో రైతాంగం సర్కార్ పై అసంతృప్తితో ఉంది. ప్రభుత్వ తాజా ప్రకటనతో రైతుల ఆశల్లో మరోసారి నీళ్లు చల్లినట్లైంది.



ఏచూరికి చంద్రబాబు నివాళులు

తెలంగాణం, ఢిల్లీ(సెప్టెంబర్ 14): సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పార్థివదేహానికి ఏపీ సీఎం చంద్రబాబు నివాళులర్పించారు. ఏచూరి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఏచూరి సేవలను కొనియాడారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు ఏచూరికి నివాళులర్పించిన వారిలో ఉన్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో దిల్లీ వెళ్లిన చంద్రబాబు.. అక్కడి నుంచి నేరుగా ఏచూరి నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు.

సీఎం మార్పు..?

మొదటిపేజీ తరువాయి



తెలుస్తోంది. ఇలా అయితే ఎలా మిస్టర్ రేవంత్ అని పార్టీ అగ్రనేతలు నిలదీసినట్టుగా సమాచారం.

ఎమ్మెల్యేల చేరికలు అట్టర్ ఫ్లాప్!

బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకుంటామని అధిష్ఠానం దగ్గర చెప్పిన రేవంత్ రెడ్డి.. ఆ విషయంలో పూర్తిగా విఫలమయ్యారు. పది మందిని మించి పార్టీలోకి జాయిన్ చేయించుకోలేకపోయారు. ఒకవైపు పార్టీ ఫిరాయింపులపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జాతీయస్థాయిలో పోరాటం చేస్తుంటే, రాష్ట్రంలో మాత్రం దానికి విరుద్ధంగా రేవంత్ రెడ్డి చేస్తున్నారు. దీనిపై జాతీయ మీడియాకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితిలో కాంగ్రెస్ అధిష్ఠానం ఉంది. బీఆర్ఎస్ఎల్పీ విలీనం అంటూ పెద్ద పెద్ద మాటలు చెప్పి.. చివరికి చేతులు ఎత్తేసిన చందంగా రేవంత్ పరిస్థితి ఉంది. ఈ కోణంలోనూ ఆయనకు మైనస్ మార్కులు పడినట్టు తెలుస్తోంది. దీంతో పరువు పోకుండా ఆయన్ను మార్చాలని అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

ఎమ్మెల్యేలపై దాడులు

నిన్నటికి నిన్న పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అనుచరుల దాడి ఘటన సంచలనంగా మారిన విషయం తెలిసిందే. నగరంలోని ఆయన ఇంటికి వెళ్లి మరీ ఎమ్మెల్యే గాంధీ అనుచరులు దౌర్జన్యం చేశారు. ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాహనాలపై దాడికి దిగడం, గాదరి కిశోర్ దీక్షా శిబిరంపై దాడులకు పాల్పడడం, హరీశ్ రావు కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేయడం.. రేవంత్ రెడ్డిని ఇరకాటంలో పెట్టాయి. ఆయన డైరెక్షన్‌లోనే దాడులు జరుగుతున్నాయన్న విషయాన్ని ప్రతిపక్ష బీఆర్ఎస్ సమర్థంగా ఎత్తిచూపే ప్రయత్నం చేస్తుంది. ఈ దాడుల వ్యవహారాన్ని కాంగ్రెస్ జాతీయ నాయకత్వం సీరియస్‌గా తీసుకున్నట్టుగా తెలుస్తుంది. పార్టీ ఇమేజ్‌ను దెబ్బ తీసేలా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసినట్టుగా సమాచారం.

త్వరలో ఉపఎన్నికలు!

రాష్ట్రంలో త్వరలో ఉపఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రభావం ఆ ఎన్నికలపై పడుతుందన్న ఆందోళన కాంగ్రెస్ నాయకత్వంలో నెలకొంది. పార్టీ ఫిరాయించిన 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వేటు పడుతుందన్న ప్రచారం జోరుగా జరుగుతుంది. హైకోర్టు ఆదేశాన్ని స్పీకర్ పాటించక తప్పని పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అనర్హత వేటు పడితే బైఎలక్షన్స్ తథ్యం. దీంతో ఈ గండం నుంచి బయటపడాలంటే రేవంత్ రెడ్డిని తప్పిస్తే బెటర్ అన్న ఆలోచనలో పార్టీ అధిష్ఠానం ఉన్నట్టుగా తెలుస్తుంది.

నాలుగు రాష్ట్రాల ఎన్నికలు

దేశంలో నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఢిల్లీ, జార్ఖండ్, మహారాష్ట్ర, హర్యానాలలో జరిగే ఎన్నికలను కాంగ్రెస్ జాతీయ నాయకత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇక్కడ గెలిస్తే 2029 నాటికి జాతీయ స్థాయిలో తమ ఉనికి బలంగా చాటుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలో రేవంత్ రెడ్డి వ్యవహారం పంటికింద రాయిలా మారింది. రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోకపోతే పార్టీకి నష్టమన్న అభిప్రాయంలో అధిష్ఠానం ఉంది. వచ్చే ఎన్నికలను చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఏ చిన్న తప్పుదొర్లకుండా ఉండాలని భావిస్తుంది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డిని తప్పించడానికి మొగ్గు చూపుతుందని తెలుస్తోంది.

హరీశ్ రావు హెచ్చరిక..!

సీఎం రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోకపోతే.. పార్టీ ఫిరాయింపులపై రాహుల్ మోసాన్ని దేశమంతా చెబుతానంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు వ్యాఖ్యానించడం కూడా కాంగ్రెస్ పార్టీలో ఆందోళన కలిగిస్తుందని టాక్. తెలంగాణలో చోటు చేసుకుంటున్న ఘటనలను మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ, జార్ఖండ్‌లలో ప్రచారం చేస్తామంటూ ఆయన హెచ్చరించడం హైకమాండ్‌ను పునరాలోచనలో పడేసిందని తెలుస్తోంది. జాతీయ స్థాయిలో పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా పరిస్థితులు ఉండటంతో రేవంత్ రెడ్డిపై చర్యలకు రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. ఆయన్ను సీఎం పీఠం నుంచి దింపి వేరొకరికి అవకాశం ఇవ్వాలని ఆలోచిస్తున్నట్టుగా సమాచారం .

గులాబీ నేతల గృహ నిర్బంధం..!



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అక్రమ నిర్బంధం



ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని అడ్డుకున్న పోలీసులు



ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డిని బలవంతంగా లాక్కెళుతున్న పోలీసులు



లా అండ్ ఆర్డర్‌పై సీఎం సీరియస్

రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌పై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. కౌశిక్ రెడ్డి వ్యవహారంపై డీజీపీకి కీలక ఆదేశాలు జారీ చేశారు. అధికారం కోల్పోయామనే అక్కసుతోనే శాంతి భద్రతలకు విఘాతం కల్పించే కుట్రలకు తెరలేపుతున్నారంటూ.. శాంతి భద్రతలు కాపాడే విషయంలో సీరియస్‌గా వ్యవహరించాలని డీజీపీకి సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తీసే విధంగా ఎవరు ప్రవర్తించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

తెలంగాణం, హైదరాబాద్ (సెప్టెంబర్ 13): రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను, మాజీ మంత్రులు, ఇతర నేతలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఉదయం 4 గంటల నుండే నేతల ఇంటికి వెళ్లి పోలీసులు వారిని హౌస్ అరెస్ట్ చేశారు. కోకాపేటలోని నివాసంలో మాజీ మంత్రి హరీష్ రావును హౌస్ అరెస్ట్ చేశారు పోలీసులు. తన భుజానికి గాయం అయ్యిందని, ఆసుపత్రికి వెళ్తానని చెప్పినప్పటికీ ఆయనను వెళ్లనివ్వలేదు. చివరికి పోలీసులే ఆయన వెంట ఉండి ఏఐజీ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. చికిత్స అనంతరం తిరిగి ఆయన నివాసం వద్దకు తీసుకువచ్చారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసానికి బయలుదేరిన మాజీ మంత్రి మల్లారెడ్డిని ఆయన ఇంటి వద్దనే హౌస్ అరెస్ట్ చేశారు. హరీష్‌రావును పరామర్శించేందుకు వచ్చిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతా లక్ష్మా రెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవితలను పోలీసులు బలవంతంగా లాక్కెళ్లారు. అంతే కాకుండా శ్రీనగర్ కాలనీలో సబితా ఇంద్రారెడ్డి, వెస్ట్ మారేడుపల్లిలో తలసాని శ్రీనివాసయాదవ్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే వివేకానందను అడ్డుకుని హౌస్ అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను ఆయన నివాసం వద్ద హౌస్ అరెస్ట్ చేశారు. దీంతో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇంట్లో సమావేశానికి బయలుదేరుతుంటే పోలీసులు తనను వెళ్లడానికి వీలులేదని అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేం అన్యాయం? పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనే స్వేచ్ఛ కూడా లేదా..?? నాటి సమైక్య ఆంధ్ర పాలన రోజులను సీఎం రేవంత్ గుర్తుకు తెస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయమే పోలీసుల కంట పడకుండా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి.. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసానికి వెళ్లారు. అక్కడ నుండి అరికెపూడి గాంధీ నివాసానికి బయలుదేరగా ఇంటి ముందే పోలీసులు అడ్డుకుని హౌస్ అరెస్ట్ చేశారు. కౌశిక్ రెడ్డి వాదించినప్పటికీ పోలీసులు బయటకు వెళ్లనివ్వలేదు.

మరోవైపు అరికెపూడి గాంధీ ఇంటివద్ద పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. గాంధీ ఉదయమే ఆయన అనుచరులతో కలిసి ఇంట్లో కూర్చున్నారు. కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుల కోసం భోజనాలు ఏర్పాటు చేయించామని వస్తే కలిసి భోజనం చేస్తామని అన్నారు. కానీ కండువాలు కప్పొద్దని హెచ్చరించారు. కండువా కప్పేందుకు కౌశిక్ రెడ్డి ఎవరని ప్రశ్నించారు. ఈ క్రమంలో మీరు బీఆర్ఎస్ లోనే ఉన్నారా..? అని ప్రశ్నించగా ఒక్కో మీడియా ఛానల్ కు ఒక్కో సమాధానం ఇచ్చారు. అంతేకాకుండా కౌశిక్ రెడ్డిని బీఆర్ఎస్ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రాంతీయ విభేదాలు లేకుండా స్వేచ్ఛగా బ్రతకాలని కేసీఆర్ చెప్పారని, 29 రాష్ట్రాల ప్రజానికం హైదరాబాద్ లోనే ఉన్న విషయం మరిచి భవిష్యత్ వ్యవస్థకు విచ్ఛిన్నం చేసే మాటలు మాట్లాడితే పార్టీ అధ్యక్షుడు చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ నేతలను మాత్రం పోలీసులు అడ్డుకోగా కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ నేరుగా గాంధీ ఇంటికి వెళ్లి ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశానికి గాంధీ ఇల్లే దొరికిందా.? అని ప్రశ్నించారు. జిల్లా ఆఫీస్ లేదా..? హెడ్ ఆఫీస్ లేదా అని ప్రశ్నించారు. ఇదే కండువా కప్పుకోవాలని రాజ్యాంగంలో ఎక్కడా లేదని అన్నారు. గాంధీని పీఏసీ ఛైర్మన్ గా నియమించిన తరవాత ఆయన ఇచ్చిన స్టేట్ మెంట్ కు కట్టుబడి ఉండాలన్నారు. ఇంటికి వచ్చి జెండా ఎగరేస్తామని అనడం ఏంటని అన్నారు. కౌశిక్ రెడ్డి రెచ్చిపోతున్నాడని ఆయన కెపాసిటీ ఏంటో తెలుసన్నారు.



కేజీబీవీలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

తెలంగాణం, సూర్యాపేట (సెప్టెంబర్ 13): సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో ఆరో తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. మద్దిరాల మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల భవనం రెండో అంతస్తుపై నుంచి విద్యార్థిని దూకేసింది. తీవ్రగాయాలు అవ్వడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనను సిబ్బంది గోప్యంగా ఉంచడం అనుమానాలకు దారి తీస్తోంది. మరోవైపు పాఠశాల సిబ్బంది వేధింపులు తట్టుకోలేకనే తమ కూతురు ఆత్మహత్యాయత్నం చేసిందని విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థిని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

ట్రాన్స్ జెండర్లతో ట్రాఫిక్ నియంత్రణ



మొదటిపేజీ తరువాయి

నియమించాలని శుక్రవారం అధికారులకు సూచించారు. ప్రస్తుతం ట్రాఫిక్ పోలీసులతో పాటు హోంగార్డులు ఈ విధులు నిర్వహిస్తున్నారు. కాగా హోంగార్డుల తరహాలో ట్రాన్స్ జెండర్లకు కూడా అవకాశం కల్పించాలని సీఎం సూచించారు. దీనికోసం ఆసక్తి ఉన్న ట్రాన్స్ జెండర్ల నుండి వివరాలు సేకరించాలని ఆదేశించారు. అంతేకాకుండా ప్రతినెలా వారికి కొంత స్టైఫండ్ ఇవ్వాలని..దీంతో వారికి ఉపాధి కల్పించినట్టు అవుతుందని సూచించారు. అవసరం అయితే వారం పది రోజులు వారికి అవసరమైన శిక్షణ అందించాలని తెలిపారు. విధుల్లో ఉండే ట్రాన్స్ జెండర్ల కోసం ప్రత్యేకమైన యూనిఫామ్ కేటాయించాలని సూచించారు.




హైడ్రా వెనక చంద్రబాబు..!

మొదటిపేజీ తరువాయి

కౌశిక్ రెడ్డి హైదరాబాద్ లోని తన నివాసం వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి కౌశిక్ రెడ్డి స్థాయికి దిగిపోయారని, ఆయనకు ఇక నుంచి కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు అవసరం లేదని షాకింగ్ కామెంట్లు చేశారు. కౌశిక్ రెడ్డి రేవంత్ రెడ్డితో కాంప్రమైజ్ అవ్వడని, తెలంగాణ కోసం బీఆర్ఎస్ ను అధికారంలోకి తీసుకువచ్చేందుకే కొట్లాడతానని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో అన్ని రాష్ట్రాల ప్రజలను అద్భుతంగా స్వాగతించామని చెప్పారు. ఇండియాలోనే నగరాన్ని నంబర్ 1 సిటీగా మార్చామన్నారు. ఇప్పుడు బాబు డైరెక్షన్ లో నడుస్తున్న రేవంత్ రెడ్డి ఇక్కడి నుండి పెట్టుబడులను అమరావతికి తీసుకెళుతున్నారని ఆరోపించారు. దూకుడు తగ్గించుకోవాలని దానం సలహా ఇచ్చారని, నాకు దూకుడు ఎక్కువ ఉంటే దానంకు గోకుడు ఎక్కువ ఉందని ఎద్దేవా చేశారు. గోకుడు బంద్ చేసి సిగ్గు, శరం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఖైరతాబాద్ ఉపఎన్నికల్లో పోటీ చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. హైదరాబాద్ లో ఉన్న ప్రతి ఆంధ్రా సెటిలర్ కు చెబుతున్నా... నేను అన్నది గాంధీ ఒక్కడినే అని స్పష్టం చేశారు. ఆంధ్రా సెటిలర్లకు ఎవరికైనా కాలికి ముల్లు గుచ్చుకుంటే కేసీఆర్ పండ్లతో తీస్తామని అన్నారని, ఇదే సెటిలర్లను బీఆర్ఎస్ పాలనలో ఎంతో మంచిగా చూసుకున్నామని అన్నారు.

వీళ్ల చిల్లర రాజకీయాల కోసమే ఆంధ్రా తెలంగాణ అంటూ ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఆంధ్రావాళ్లపై తనకు గౌరవం ఉందని చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని, నాలుగువారాల్లో డిస్‌క్వాలిఫై చేయాలని అన్నారు. పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పవని కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. అరికెపూడి గాంధీ సంగతి చూస్తానంటున్నాడని, తెలంగాణ కోసం చావడానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. తన ఇంటిపై దాడికి అనుమతి ఇచ్చారని..కానీ అరికపూడి ఇంటికి కండువా కప్పేందుకు వెళతామంటే పోలీసులు హౌస్ అరెస్టులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డే తన ఇంటిపై దాడి చేయాలని చెప్పారని మండిపడ్డారు. తనపై ఆత్మహత్యాయత్నం చేశారని రాష్ట్రంలో ఎమ్మెల్యేకే రక్షణ లేకపోతే ఇంకా ఎందుకని ప్రశ్నించారు. పోలీసు రాజ్యంతో పాలన నడపలేరని హెచ్చరించారు. కేసీఆర్ భిక్షతోనే పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలు అయ్యారని అన్నారు.



పోర్ట్ బ్లెయిర్.. ఇకపై 'శ్రీ విజయపురం'

తెలంగాణం, ఢిల్లీ(సెప్టెంబర్ 13): అండమాన్ నికోబార్ దీవుల రాజధాని పోర్ట్ బ్లెయిర్ పేరు ఇకపై శ్రీ విజయపురం. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. వలసవాద ఆనవాళ్ల నుంచి బయటపడేందుకు ఈ పేరును మార్చినట్లు కేంద్రం ప్రకటనలో పేర్కొంది. వలసవాద గుర్తుల నుంచి దేశానికి విముక్తి కల్పించాలన్న ప్రధాని మోడీ ఆశయాలకు అనుగుణంగా పోర్ట్‌బ్లెయిర్ పేరును 'శ్రీ విజయపురం'గా మార్చాలని నిర్ణయించినట్టు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఎక్స్ వేదికగా తెలిపారు. మునుపటి పేరు వలసవాద వారసత్వాన్ని సూచిస్తోందని, శ్రీ విజయపురం అనేది భారత స్వాతంత్ర్య పోరాటంలో సాధించిన విజయానికి ప్రతీక అన్నారు. నాటి పోరాటంలో అండమాన్ నికోబార్ పాత్ర ఎంతో ప్రత్యేకమన్నారు.

నోటీసులు లేకుండా ఎలా కూల్చేస్తారు?

హైడ్రా తీరుపై హైకోర్టు అసంతృప్తి



తెలంగాణం, హైదరాబాద్(సెప్టెంబర్ 13): హైడ్రాను రద్దు చేయాలంటూ హైకోర్టులో లక్ష్మి అనే మహిళ పిటిషన్ వేశారు. జీవో 99ను పిటిషనర్ ఛాలెంజ్ చేశారు. హైడ్రా చట్టబద్ధతను రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. జీహెచ్ఎంసీ యాక్ట్‌ను కాదని హైడ్రాకు ఎలా అధికారులు ఇస్తారని పిటిషనర్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా హైడ్రా తీరుపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం.. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, వివరణ తీసుకోకుండా నిర్మాణాలు ఎలా కూల్చివేస్తారని హైడ్రాను ప్రశ్నించింది. జీవో 99పై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా అమీన్‌పూర్‌లో ఈ నెల 3న షెడ్లు కూల్చివేశారని పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఉన్నా కూల్చి వేశారని తెలిపారు.

దోమా.. ప్లీజ్ కుట్టకే..!

దవాఖానాల్లో మందులు లేవ్

సదుపాయాలు లేక రోగుల అవస్థలు

ఆందోళనకరంగా డెంగ్యూ, చికెన్ గున్యా కేసులు

కేసులు పెరుగుతున్నా.. పట్టించుకోని సర్కార్

ప్రభుత్వ ఆస్పత్రులలో రోగులకు ఖాళీ టానిక్ సీసాలు

ఉస్మానియా, గాంధీలలో సైతం మందుల్లేవ్

బస్తీ దవాఖానాలలోనూ సేమ్ సిచ్యువేషన్

నా పబ్లికే వస్తారన్న మంత్రి దామోదర ఎక్కడా?

హెల్త్ డిపార్ట్‌మెంట్‌పై సమీక్ష చేసేదెవరు?

శ్వేతపత్రం విడుదల చేయాలంటున్న ప్రతిపక్షం

దావకానాలలో మందుల్లేవ్. సరైన సదుపాయాల్లేవ్. టానిక్ సీసాల్లో టానిక్ లేదు. సర్కారు పట్టించుకుంటలేదు. కాబట్టి.. నువ్ కుట్టి.. మమ్ముల గోసపెట్టకు అన్నట్టుగా రాష్ట్రంలో పరిస్థితి ఉంది. హెల్త్ డిపార్ట్‌మెంట్ పూర్తిగా పడకేసిందా అన్నట్టుగా ఆస్పత్రులు ఉన్నాయి. రోగులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రైవేటుకి వెళ్లలేక, ప్రభుత్వ ఆసుపత్రుల చుట్టూ తిరిగే నిరుపేదలకు సరైన వైద్యం అందడం లేదు. 'నా ప్రజలే వస్తారు' అంటూ సాక్షాత్తు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పినా.. ఇంకా ఆస్పత్రులలో పరిస్థితులు మారకపోవడం విడ్డూరం. రాష్ట్రవ్యాప్తంగా డెంగ్యూ, చికెన్ గున్యా కేసులు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నా.. పట్టించుకున్ననాథుడే లేడు.

తెలంగాణం, స్టేట్ బ్యూరో(సెప్టెంబర్ 13): సీజనల్ వ్యాధులతో రాష్ట్రానికి సుస్తీ చేసింది. దవాఖానాలకు జనం క్యూ కడుతున్నారు. ముఖ్యంగా చికెన్ గున్యా, డెంగ్యూలతో రోగులు బెంబేలెత్తుతున్నారు. జిల్లాలలో ప్రభుత్వ ఆసుపత్రులలో పెద్ద ఎత్తున రోగులు చేరుతున్నారు. నగరాలలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం వారం రోజుల వ్యవధిలోనే 1783 కేసులు పెరిగాయి. ఆగస్ట్ 23 30 మధ్యలో రిపోర్టులు పరిశీలిస్తే 4459 నుంచి 6242కు డెంగ్యూ కేసులు పెరిగాయి. హైదరాబాద్, ఖమ్మం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలలో అత్యధిక కేసులు నమోదు అవుతున్నాయి. ఇదిలా ఉంటే, చాలా కేసులలో చికెన్ గున్యాను డెంగ్యూ పొరబడుతున్నారని వైద్యశాఖాధికారులు అంటున్నారు. జాయింట్ పెయిన్స్, హైఫివర్, రాషెస్ రావడం ఈ రెండింటిలో ఒకేరకమైన లక్షణాలు కలిగి ఉండటమే దీనికి కారణం అంటున్నారు. చాలా మంది సొంత వైద్యం చేసుకోవడం కూడా ఈ కేసుల పెరుగుదలకు ఓ కారణమని డాక్టర్లు అంటున్నారు. దీంతో చికెన్ గున్యాకు సరైన వైద్యం అందివ్వలేకపోవడానికి కారణమవుతుందని చెబుతున్నారు.

ప్రజల్లో అవగాహన కల్గించడం ద్వారా దోమల ఉత్పత్తిని నియంత్రించొచ్చని అంటున్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టడం, పారాసెట్మాల్, హైడ్రేషన్, సమయానికి గుర్తించడం ద్వారా వ్యాధులను అరికట్టొచ్చని తెలిపారు. లక్ష శాంపిల్స్ టెస్ట్ చేస్తే ఆరు వేల కేసులు నమోదు అవుతున్నాయని వైద్యశాఖ అధికారులు తెలిపారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ, నిరోధించడం ద్వారా చికెన్ గున్యా, డెంగ్యూ కేసుల నుంచి బయటపడొచ్చని వైద్య నిపుణులు అంటున్నారు. డెంగ్యూ, చికెన్ గున్యా కేసులలో 20 శాతం మంది పిల్లలు ఉండటం గమనార్హం. మిగిలిన 80 కేసులలో ఇంటి వైద్యం ద్వారా నయమవుతుందన్నారు.

మందుల కొరత

వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు రోగులు పరుగులు తీస్తున్నారు. అయితే అక్కడ మందుల కొరత వారిని మరింత ఇబ్బంది పెడుతోంది. పీహెచ్‌సీలలో, ఆస్పత్రులలో రోగులకు సీజనల్ వ్యాధుల నివారణకు మొత్తం 200 రకాల మందుల బిల్లలు అవసరం ఉండగా వాటిలో 30 రకాల మందులు అందుబాటులో లేవని సమాచారం. వీటిలో కీళ్ల నొప్పులు, జలుబు, పలు రకాల యాంటీబయోటిక్స్ మందుల కొరత ఉంది. గోలీల కోసం, టానిక్‌ల కోసం ప్రైవేటు షాపులకు వెళ్లాల్సి వస్తుందని రోగులు వాపోతున్నారు.





మరికొన్ని ఆస్పత్రులలో ఖాళీ టానిక్ సీసాలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. మంచిర్యాల జిల్లా చెన్నూరు ప్రభుత్వాసుపత్రిలో ఈ ఘటన చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన మనోజ్ కుమారుడు సాయి నిర్విగ్ (4) ఆరోగ్యం బాలేక మంగళవారం చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లాడు. పిల్లల డాక్టర్ రాసిన ప్రిస్క్రిప్షన్‌లో మందులు రాయగా, ఫార్మసీలో మందులు లేవని ఒక్క సెఫిక్సిమ్ ఓరల్ సస్పెన్షన్ డ్రై సిరప్ 30ml బాటిల్ ఇచ్చారు. ఇచ్చిన మెడిసిన్‌కు సీల్ ఉంది కానీ లోపల మందు లేకపోవడంతో అతను కంగుతిన్నాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

నా పబ్లికే వస్తారన్న దామోదర ఎక్కడా?



ఇక ఘనత వహించిన ఉస్మానియా, గాంధీ, కోర్ అండ్ టీ లాంటి ఆస్పత్రులలో కూడా మందుల కొరత తీవ్రంగా ఉంది. బస్తీ దవాఖానాలలోనూ మందుల కొరతపై సామాన్యుడు మండిపడుతున్నాడు. రోగులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవలసిన సర్కార్ అలసత్వాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు. నిరుపేదల దవాఖానాలలో మందుల కొరతపై సమీక్ష నిర్వహించకుండా సర్కార్ ఏం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము దొరలా పరిపాలించలేదని, ఇక్కడకి వచ్చేది తన పబ్లిక్ అని దొరలు కాదని, దొర జనం పెద్ద ఆస్పత్రులకు వెళతారంటూ మాట్లాడిన ఆరోగ్య శాఖ మంత్రి దామోదర ఇప్పుడు ఎక్కడని పలువురు ప్రశ్నిస్తున్నారు. మందుల కొరతపై అడిగిన రిపోర్టర్‌ను ఉద్దేశిస్తూ "నేనేంటో తెలుసా..? దళితున్ని.. ఇక్కడికి నా పబ్లికే వస్తుంది" అంటూ రిపోర్టర్‌పై ఆగ్రహంతో ఊగిపోయిన విషయాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు. సార్ ఎక్కడ ఉన్నారని అడుగుతున్నారు.


బేగంబజార్‌లో వినూత్న గణనాథులు

తెలంగాణం, హైదరాబాద్ (సెప్టెంబర్ 13) : మహానగరంలో వివిధ రీతుల్లో గణనాథులు కొలువు తీరారు. అందులోనూ ఓల్డ్ సిటీ బేగంబజార్‌లో కొలువుతీరిన గణనాథుల ప్రత్యేకతే వేరు. ఇక్కడ కొలువు తీరిన గణనాథులను దర్శించుకోవడానికి ఎక్కడెక్కడి నుంచో భక్తులు తరలివస్తున్నారు.

ఫోటోలు : రాజేష్ జక్కల/వీడియో జర్నలిస్ట్


























పి.హెచ్.సి ఆకస్మిక తనిఖీ చేసిన డి.ఎం&డి.హెచ్.ఓ

తెలంగాణం, హన్మకొండ (సెప్టెంబర్ 13): హన్మకొండ జిల్లా, నడికుడా మండలంలోని రాయపర్తి పి.హెచ్ సి ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య అధికారిని డాక్టర్ లలితదేవి. పి.హెచ్.సి లో అందుతున్న సేవలను పరిశీలించారు. మందుల స్టాక్ ని, ల్యాబ్ ను రికార్డ్ లను పరిశీలించారు. సిబ్బంది తమ పని తీరును ఇంకా ఎక్కువ మెరుగు పరచుకోవాలని అన్నారు. వర్షాకాలం కారణంగా గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో భాద పడుతున్నారని కావున అన్ని గ్రామాల్లోకి మెడికల్ క్యాంపు పెట్టాలని సిబ్బందిని అదేశించారు. ప్రజలకు ఫీల్డ్‌లో అందుబాటులో వుంటూ ఇంటింటికి వెళ్లి చికిత్స అందించాలని అన్నారు.
గర్భిణీ స్త్రీలకు, చిన్నపిల్లకు ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా టీకాలు వేయాలని నాణ్యమైన వాక్సినేషన్ చేయాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సూపర్ వైజర్ క్యాడర్, సిబ్బంది గ్రామాలు విజిట్ చేస్తూ ఏ ఎన్ ఎం లను, హెల్త్ అసిస్టెంట్లకు తగు సూచనలు ఇస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. తీవ్రమైన వ్యాధులతో భాద పడుతున్నవారిని పరకాల సివిల్ హాస్పిటల్ కు గాని ఎం.జి ఎం కు గాని పంపించాలని సూచించారు. గ్రామపంచాయతీ సిబ్బందితో కలసి పనిచేసి గ్రామాలను స్వచ్ఛ ఆరోగ్య గ్రామాలుగా తీర్చిదిదాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యధికారిని డాక్టర్ స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని దర్శించుకున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్

తెలంగాణం పటాన్‌చెరు (సెప్టెంబర్ 13) : అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో వైభవంగా కొనసాగుతున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల భాగంగా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ శివాలయం ఎక్స్ రోడ్ వద్ద శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని, జయలక్ష్మి నగర్ కాలనీ లోని వినాయక మండపంలో ప్రతిష్టించిన స్వామి వారిని పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ పలు మండపంలోని విఘ్నేశ్వరుని దర్శించుకున్నారు.



చర్లలో ఘనంగా హిందీ దినోత్సవం

తెలంగాణం, చర్ల (సెప్టెంబర్ 13) : జాతీయ హిందీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలో హిందీ దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ 1949లో సెప్టెంబర్ 14న రాజ్యాంగ పరిషత్ లో హిందీ భాషను జాతీయ భాషగా గుర్తించినట్లు చెప్పారు. అప్పటినుండి హిందీ దివస్ వేడుకలు నిర్వహించుకున్నట్లు తెలిపారు. మన దేశ భాష అయిన హిందీ దినోత్సవం జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, హిందీ గొప్పతనం గురించి విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. 14న రెండవ శనివారం ఉండడంవల్ల ఒకరోజు ముందుగా హిందీ దినోత్సవ వేడుకలను పాఠశాలలో ఘనంగా నిర్వహించుకున్నామని తెలిపారు. విద్యార్థులతో జరిగిన హిందీ కళారూపాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులతో వ్యాసరచన, హిందీ ప్రాజెక్టులు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పేరెంట్స్ పాల్గొన్నారు.



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన తహసిల్దార్ ఆంజనేయులు

తెలంగాణం, మునగాల (సెప్టెంబర్ 13):
మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాల నిమజ్జనాలను ఆయా గ్రామాల్లోని చెరువుల నందు నిర్వహించేందుకు ఆయా గ్రామాల అధికార యంత్రాంగం మరియు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని తహసిల్దార్ ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని గణపతి విగ్రహాలు నిమజ్జనం చేసే చెరువు ప్రాంతాన్ని వారు ఈ సందర్భంగా పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ, రాబోవు రెండు మూడు రోజులలో ప్రతి గ్రామంలో వినాయకుడి నిమజ్జన కార్యక్రమం జరుగుచున్నందున ప్రతి గ్రామంలో 5 నుండి 10 వరకు గణపతి విగ్రహాలను ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ ఎడమ కాలువకు గండిపడటంతోనీటి విడుదల లేకపోవడంతో పాటు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రతి గ్రామంలోని చెరువులో సమృద్ధిగా నీరు ఉండటంతో ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు, అధికార యంత్రాంగం తమ గ్రామాలలో ఏర్పాటుచేసిన గణపతి విగ్రహాలను ఆ గ్రామ చెరువులోనే నిమజ్జనం చేసేలా కృషి చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఎస్సై ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో రమేష్ దీన్ దయాల్, మండల ఆర్ఐ రామారావు తదితరులు పాల్గొన్నారు.

గణనాథుని దర్శించుకున్నబీజేపీ నాయకులు

-చల్లా నారాయణ రెడ్డి

తెలంగాణం, మహాముత్తారం (సెప్టెంబర్ 13): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన యూత్ సభ్యులు శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా యూత్ సభ్యుల ఆహ్వానం మేరకు పలు గణపతి మండపాలలో బీజేపీ నాయకులు చల్లా నారాయణ రెడ్డి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణనాదుడి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో ఉండాలని గణనాధున్ని వేడుకున్నారు. మహాముత్తారం మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు పూర్ణచందర్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వినాశనకర విధానాల వల్లే రైతు ఆత్మహత్యలు

ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్



తెలంగాణం, హన్మకొండ (సెప్టెంబర్ 13): రైతుల వ్యవసాయం దివాలాతీసి అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవడానికి ప్రధాన కారణం పాలకుల వినాశనకర విధానాలేనని అఖిల భారత రైతు సమైక్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్అన్నారు. రైతాంగాన్ని రక్షించి దేశాన్ని కాపాడాలంటే తక్షణమే కనీస మద్దతు ధరల చట్టం రైతు రుణముక్తి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఏఐకేఎఫ్ జాతీయ కమిటీ పిలుపు మేరకు రైతాంగ సమస్యలు పరిష్కరించాలని వరంగల్ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈసందర్భంగా పెద్దారపు రమేష్ మాట్లాడుతూ రైతులు పంటలు పండించడానికి అయ్యే ఉత్పత్తి ఖర్చులు పెరిగి దిగుబడి తగ్గి పండిన పంట ధరలేక తెచ్చిన అప్పులు కట్టలేక రైతులు సంక్షోభంలో కూరుకుపోయి దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వారిని కాపాడి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు తగిన సహకారం అందించాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అది విస్మరించి కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా విధానాలను రూపకల్పన చేసి రైతులు వ్యవసాయం చేయలేని స్థితికి నెట్టివేస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను అమలు చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పూనుకోవాలని లేకపోతే రైతాంగ ఉద్యమాలు ఉధృతం కాక తప్పదని హెచ్చరించారు. అనంతరం రైతు సమస్యల డిమాండ్లతో కూడిన మెమోరాండాన్ని కలెక్టర్ కు సమర్పించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర బాధ్యులు గోనె కుమారస్వామి, ఎఐసిటియు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నర్ర ప్రతాప్, ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇస్మాయిల్, నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్, రాష్ట్ర నాయకులు నాగేల్లి కొమురయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కేశెట్టి సదానందం పాల్గొన్నారు.

యువత నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి

పరకాల ఆర్డీఓ డాక్టర్.కె.నారాయణ

తెలంగాణం, హన్మకొండ (సెప్టెంబర్ 13): పరకాల ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ నియోజకవర్గంలోని ప్రజలకు వినాయకచవితి నిమజ్జనం భక్తి శ్రద్ధలతో జరుగుకోవాలని సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈతరాని వారు చెరువులు, కాల్వల్లో దిగరాదు, దూకరాదని ఏదైనా జరిగితే వారి తల్లిదండ్రులకు పుత్రశోకాన్ని మిగల్చవద్దన్నారు. యువత ఉత్సాహంతో వాహనాలు ఎక్కుతూ దిగేవారిని నియంత్రించాలని కోరారు. నిమజ్జనానికి వెళ్లేదారిలో విద్యుత్ తీగలు తగలకుండా చూసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా నిమజ్జనానికి వెళ్లాలని సూచించారు. చిన్న పిల్లలు, యువకులను పెద్దలు కనిపెడుతూ ఉండాలని కోరారు.ఊరేగింపు సమయంలో వాహనాలు నడిపే డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.



ప్రజలకి సేవలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదు..!

బీఆర్ఎస్ నాయకులు కొప్పుల ఉపేందర్ రెడ్డి

తెలంగాణం, పాలేరు (సెప్టెంబర్ 13) : ప్రజలను కష్టకాలంలో ఆదుకుని అండగా నిలబడటంలో తనకు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి స్ఫూర్తిదాయకమని ఆయన ముఖ్య అనుచరుడు, బీబిఆర్ఎస్ జిల్లా నాయకులు కొప్పుల ఉపేందర్ రెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన ఎడతెరిపిలేని వర్షాలకు తిరుమలాయపాలెం మండలంలోని రాకాసితండా ప్రజల సర్వం కొట్టుకుపోయి నిరాశ్రయులయ్యారు. శుక్రవారం ఆయన రాకాసి తండాను సందర్శించి వరద బాధితులతో మాట్లాడారు. విపత్తులో వారికి వచ్చిన పరిస్థితిని చూసి చలించిపోయారు. ఏ ఒక్కరూ అధైర్య పడోద్దని సూచించారు. ప్రజలకి సేవ చేయడంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని,అత్యవసర పరిస్థితుల్లో తనను సంప్రదించాలని కోరారు. అనంతరం స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా బాధితులకు కొప్పుల ఉపేందర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు ఆర్మీ రవి, నాయకులు చామకూరి రాజు, రంగాపురం బాలకృష్ణ గౌడ్, సాగర్ రెడ్డి, బానోత్ మోహన్, మల్లయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష

తహసిల్దార్ ఆంజనేయులు

తెలంగాణం, మునగాల (సెప్టెంబర్ 13): మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన గణేశు విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలపై మండలంలోని రెవెన్యూ పంచాయతీరాజ్ పోలీస్ విద్యుత్ వైద్య ఆరోగ్యశాఖ, మండల అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన వేడుకల్లో మండల వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పగడ్బందీగా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల ప్రత్యేక అధికారులతో పాటు వివిధ శాఖల అధికార యంత్రాంగంతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ విగ్రహాల నిమజ్జనం ప్రాంతాలలో విద్యుత్ శాఖ అధికారులు నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా నిమజ్జన ప్రాంతాల్లో వెలుతురు కోసం ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నిమజ్జన వేడుకల్లో ఏదైనా ఒకశృతి చోటు చేసుకుంటే ప్రాథమిక వైద్యం అందించేందుకు తమ సిబ్బందితో అందుబాటులో ఉండాలని తెలిపారు. పోలీస్ శాఖ డిజే బాక్స్ లకు అనుమతి లేనందున ఎవరైనా డీజే బాక్సులు పెట్టినట్లయితే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా విగ్రహాల నిమజ్జన సమయంలో ప్రజలకు ఆటంకం కలిగించకుండా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ దీన్ దయాల్, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ప్రవీణ్ కుమార్, విద్యుత్ శాఖ ఏఈ వికాస్, పంచాయతీ రాజ్ ఏ ఈ వసంత, రేపాల వివి ఎస్ మమత, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి బదిలీ సర్వసాధారణం

ఎంపిడిఓ అశోక్

తెలంగాణం చంద్రుగొండ (సెప్టెంబర్ 13): ఎక్కడ పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ కావడం సర్వసాధరణ విషయమని ఎంపిడిఓ అశోక్ అన్నాడు. శుక్రవారం మద్దుకూరు గ్రామ పంచాయితీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న ఏఎన్ఎం తేజావత్ సుశీల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించాడు. ఓ ప్రభుత్వ ఉద్యోగిగా ఎంతకాలం పనిచేశామన్నది ముఖ్యం కాదని, ఎందరి అభిమానం చూరగొన్నామన్నది ముఖ్యమని అన్నారు. ఓ ఉద్యోగికి బదిలి అయిన వెంటనే ఇంత పెద్ద సంఖ్యలో గ్రామస్తులు వీడ్కోలు సభ పెట్టడం అభినందనీయమన్నాడు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భవాని, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, నాయకులు నల్లమోతు రమణ, చంద్రు విజయ్, పద్దం వినోద్, కీసరి భద్రయ్య, యనమనగండ్ల శివ, నెల్లూరి ప్రసాద్, నాగేశ్వర రావు, రవి,సత్యనారాయణ, స్థానిక రాంబాబుతదితరులు పాల్గొన్నారు.



వరదలతో ముదిరాజ్ మత్స్యకారులకు తీరని నష్టం

- రాష్ట్ర ఉపాధ్యక్షులు గొడుగు శ్రీనివాస్

తెలంగాణం, మహబూబాబాద్ (సెప్టెంబర్ 13): మహబూబాబాద్ జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అధికంగా నష్టపోయింది ముదిరాజ్ మత్స్యకారులలేనని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొడుగు శ్రీనివాసు, ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శి నీలం దుర్గేష్ అన్నారు. మహబూబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు సహదేవ్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన గొడుగు శ్రీనివాస్, నీలం దుర్గేష్ మాట్లాడుతూ ముదిరాజులకు భారీగా నష్టం వాటిల్లినప్పటికీ ప్రభుత్వం గుర్తించకపోవడం విచారకరమని అన్నారు. జిల్లాలో కురిసిన భారీ, అతి భారీ వర్షాలతో ముదిరాజ్ మత్స్య కార్మికులు తీవ్రంగా నష్టపోయారని, జిల్లాలో ఉన్న ముదిరాజ్ మత్స్యకార్మికుల ఆర్థిక పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉన్నందున ఆదుకోవాలని తెలియజేసారు. జిల్లాలో 196 మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలలో 13 వేల మంది సభ్యులు జిల్లాలోని చెరువులపై ఆధారపడి 1 లక్ష 25 వేల ముదిరాజ్ కుటుంబాలు జీవిస్తున్నారని తెలిపారు. ఎడతెరిపి లేని భారీ, అతి భారీ వర్షాల వలన 50 కోట్ల రూపాయల నష్టం ముదిరాజ్ మత్స్యకార్మికులకు జరిగిందిని అన్నారు. గత ఆగస్టు నెలలో కూడా భారీ వర్షాలతో 30 కోట్ల వరకు నష్టం జరిగిందని, దానిని నుంచి కోలుకోక ముందే ఈ భారీ వర్షాలకు ఈ సంవత్సరం 36 కోట్ల 96 లక్షల నష్టం జరిగిందన్నారు. మత్స్యకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకునే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముందు ఇటీవల మరణించిన మహబూబాద్ మధ్యపారిశ్రామిక సహకార సంఘం మాజీ అధ్యక్షులు తోట ముతిలింగంకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాక అధ్యక్షులు కాటా భాస్కర్ ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు పెద్ది సైదులు ముదిరాజ్, రొయ్యల నాగేశ్వరరావు ముదిరాజ్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల చీఫ్ ప్రమోటార్ కొత్తూరు రమేష్ ముదిరాజ్, జిల్లా కార్యదర్శి పిట్టల జనుంజయ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.



కేజ్రీవాల్‌కు బెయిల్!

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఊరట

సుప్రీం కోర్టులో ఢిల్లీ సీఎంకు బెయిల్ మంజూరు

ఆరు నెలల జైలు జీవితం తర్వాత బయటకు!

తెలంగాణం, ఢిల్లీ(సెప్టెంబర్ 13): ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. సీబీఐ కేసులో దేశ అత్యున్నత న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.10లక్షల బాండ్ సమర్పించాలని, కేసు విషయంలో ఎక్కడా మాట్లాడొద్దని.. కేసు విచారణ కోసం ట్రయల్ కోర్టు ఎదుట హాజరుకావాలని సుప్రీం ఆదేశించింది. ఆరునెలల పాటు జైలుజీవితం గడిపిన ఆయన శుక్రవారం సాయంత్రం జైలు నుంచి విడుదలయ్యారు. కేజ్రీవాల్‌కు స్వాగతం పలికిన వాళ్లలో ఆయన సతీమణి సునీతా కేజ్రీవాల్, మంత్రి అతీషి, సీనియర్ నేత మనీష్ సిసోడియా, పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్ ఉన్నారు. తీహార్ జైలు నుంచి విడుదలైన ఆయన.. ఆప్ కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. “నన్ను జైల్లో బంధించి నా మనోస్థైర్యం దెబ్బ తీయాలనుకున్నారు. కానీ, ఇప్పుడు నా బలం, నాలో ధైర్యం వంద రెట్లు పెరిగింది” అన్నారు. “నేను నిజాయితీపరుడిని కాబట్టే దేవుడు నాకు మద్దతుగా నిలిచాడని ఆయన తెలిపారు. తనను జైల్లో వేస్తే బలహీనపడతానని అనుకున్నారని, జైలు గోడలు నన్ను బలహీనపర్చలేవన్నారు. దేశాన్ని అమ్మే.. విచ్ఛిన్న శక్తులకు వ్యతిరేకంగా పోరాడతా అన్నారు. దేశానికి నా సేవ కొనసాగిస్తాను” అని తెలిపారు.
లిక్కర్ పాలసీ కేసులో కేజ్రీవాల్ మార్చి 21న అరెస్టు అయ్యారు. ఈడీ కస్టడీలో ఉన్న ఆయనను జూన్ 26న సీబీఐ అరెస్ట్ చేసింది. జూలై 12న ఈడీ కేసులో కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే సీబీఐ అరెస్ట్ చేయడంతో ఆయన తీహార్ జైలులోనే ఉండాల్సి వచ్చింది. కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. సీబీఐ కేజ్రీవాల్‌ని అరెస్టు చేయడాన్ని ఇన్సురెన్స్ అరెస్టుగా పేర్కొన్నారు. సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. మద్యం పాలసీ కేసులోని సొత్తును 2022లో గోవా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఉపయోగించిందని తెలిపారు. సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ వేయడంపై సైతం అభ్యంతరం తెలిపారు. బెయిల్ కోసం ముఖ్యమంత్రి ఎప్పుడూ ట్రయల్ కోర్టును ఆశ్రయించలేదన్నారు.

ఎంజేపీ స్కూల్ లో బస చేసిన కలెక్టర్



తెలంగాణం, హన్మకొండ (సెప్టెంబర్ 13): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య రాత్రి బస చేశారు. అనంతరం శుక్రవారం ఉదయం విద్యార్థినులతో కలిసి పాఠశాల మైదానంలో రన్నింగ్,వార్మప్, మెడిటేషన్ చేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి కలెక్టర్ వాలీబాల్, షటిల్ ఆడి విద్యార్థినుల్లో ఉత్సాహాన్ని నింపారు. విద్యార్థులకు ఉదయం అందించే అల్పాహారంలో భాగంగా కలెక్టర్ విద్యార్థినులతో కలిసి రాగి జావా, టిఫిన్ చేసి, డైనింగ్ హాల్ కు సంబంధించిన రిజిస్టర్స్, ఫుడ్ మెనూ, మెడికల్, తదితర రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం మీడియా సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు వసతుల కల్పన, వారికి అందించే ఫుడ్ మెనూ స్వయంగా పర్యవేక్షించేందుకు రాత్రి బస చేయడంతో పాటు వారి రోజువారి దినచర్య ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు రాత్రి బస చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గురువారం కమలాపూర్ గ్రామంలో మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యార్థునులతో మాట్లాడి రోజువారి దినచర్య లో భాగంగా మెనూ, వసతి, పుస్తకాలు, దుస్తుల గురించి అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారని అన్నారు. ఫుడ్ విషయంలో ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. విద్యార్థినులు కూడ తమకు మంచి భోజనం అందిస్తున్నారని, విద్యా విధానం చాలా బాగుందని విద్యార్థినులు తెలిపారని కలెక్టర్ పేర్కొన్నారు.కాగా స్కూల్, కాలేజీ కు ఏమైనా అవసరం ఉన్నాయా అని కలెక్టర్ అడుగగా విద్యార్థినులు బెంచీలు,కాంపౌండ్ వాల్సు తదితర మరమ్మతుల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రతిపాదనలు పంపాలని ప్రిన్సిపల్ ను కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్ కుమార్, ప్రిన్సిపల్ సౌజన్య, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణ వేణి, పీఈటీ సంగీత, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



విద్యుత్ మీటర్లు ఉంటేనే గృహజ్యోతి

- ఇన్చార్జి ఏఈ కృష్ణారావు

తెలంగాణం, మంగపేట (సెప్టెంబర్ 13): ప్రభుత్వం పేదలకు తక్కువ ధరకే మీటర్లు అందిస్తోందని, మీటర్లు ఉంటేనే గృహజ్యోతి పథకం వర్తిస్తుందని విద్యుత్ శాఖ మంగపేట ఇంచార్జీ ఏఈ బి.కృష్ణా రావు తెలిపారు. మంగపేట మండలంలోని కొత్తూరు, మోట్లగూడెం గ్రామాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ ఈ మాట్లాడుతూ పథకం ఈనెల 15వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని తెలిపారు. మీటర్లు అవసరం ఉన్నవారు 500 వాట్స్‌కి రూ.938 డీడీ కట్టాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీటర్లు పొంది గృహజ్యోతి పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఏఈతో పాటు లైన్ ఇన్స్పెక్టర్ మధు, పంచాయతీ సెక్రెటరీ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రణాళికాబద్ధంగా డివిజన్ల అభివృద్ధి నిధులు

తెలంగాణం, పటాన్‌చెరు (సెప్టెంబర్ 13): జీహెచ్ఎంసి పరిధిలోని డివిజన్లను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని చైతన్య నగర్, శిశు మందిర్ కాలనీలలో 20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన రహదారుల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. నూతన కాలనీలలో రహదారులు, అంతర్గత డ్రైనేజీల నిర్మాణ పనులకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, అఫ్జల్, వెంకటేష్, అజ్మత్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అద్దె ప్రాతపదికన దుకాణాల కేటాయింపు

-సి. హెచ్.దుర్గాప్రసాద్

తెలంగాణం, మంచిర్యాల (సెప్టెంబరు 13): షెడ్యూల్డ్ కులాల కార్పొరేషన్‌కు సంబంధించి మంచిర్యాల జిల్లాలోని కోటపల్లి మండల కేంద్రంలో గల 5 దుకాణాలను నెలవారి అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు షెడ్యూల్డ్ కులముల వారి నుండి దరఖాస్తులు స్వీకరించనున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం కార్యనిర్వాహక సంచాలకులు సి.హెచ్.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయసు 2150 సంవత్సరాల మధ్య ఉండాలని, సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి 1 లక్ష 50 వేల రూపాయలకు మించి ఉండకూడదని, కనీస విద్యార్హత 5వ తరగతి చదువుకుని ఉండాలని తెలిపారు. దరఖాస్తు ఫారంను కార్యాలయ పని వేళలలో ఉచితంగా పొందవచ్చని, కోటపల్లి మండలానికి చెందిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎఫ్ 3 బ్లాక్, మొదటి అంతస్తులోని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. కోటపల్లి మండలానికి చెందిన షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



కామ్రేడ్ సీతారాం ఏచూరికి విప్లవ జోహార్లు

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్

తెలంగానం, మొయినాబాద్ (సెప్టెంబర్ 13): మొయినాబాద్ మండల కేంద్రంలో ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ సీఐటీయూ మొయినాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు యోధుడు, సీపీఎం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరికి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ మొయినాబాద్ మండల గౌరవాధ్యక్షులు మోహన్ రావు, మండల అధ్యక్ష కార్యదర్శులు గోపాల్, శేఖర్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఉన్నత కుటుంబంలో పుట్టి పేదల కోసం బడుగు బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. పార్లమెంటులో పేదల సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లారని వాటిని పరిష్కారం కోసం ప్రభుత్వానికి సలహాలు ఇచ్చేవారని అన్నారు. ఆయన మరణం కమ్యూనిస్టు అభిమానులు సామాజికవేత్తలు మేధావులు జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు గోపాల్, శేఖర్, కోశాధికారి ప్రశాంత్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, సహాయ కార్యదర్శులు చాంద్ పాషా, పెద్ద సంఖ్యలో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు పాల్గొన్నారు.



క్రమశిక్షణతోనే ఉన్నత లక్ష్యం సాధిస్తాం

రిటైర్డ్ ప్రిన్సిపాల్ అంబరీష్

తెలంగాణం, మంథని (సెప్టెంబర్ 13): విద్యార్థి దశ నుండి క్రమశిక్షణతో జీవిస్తే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని రిటైర్డ్ ప్రిన్సిపాల్ అంబరీష్ అన్నారు. శుక్రవారం మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్ డే వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ చిన్న వయసులో ఉన్నపుడే ఉన్నత ఆశయాలను అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థి దశలో ఇంటర్ ఎంతో కీలకంగా ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ సయ్యద్ సలీం మాట్లాడుతూ ఈ కళాశాల స్థాపించి నేటికీ ముప్పై ఏళ్లు గడిచాయన్నారు. విద్యార్థులు చదువే కాకుండా అనేక అంశాల్లో కూడా ప్రతిభ కనబరచాలన్నారు. ఈ కలశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన సిబ్బంది శ్రీనివాస్, అర్జయ్య, పద్మలను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కొండమిది ఝాన్సీ, పనకంటి శశాంక్, జగన్నాథుల తిరుపతి, రావుల తిరుమల్, మ్యేకల శ్రీదేవి, హనుమండ్ల నగేష్, ఎల్ ఆర్ కే రెడ్డి, బొల్లవరం శ్రీధర్ రావు, కొమురయ్య, మానస, దీపరాణి, రజిత, సిబ్బంది కుక్కల రాజయ్య, బియాబ్బని, సుజాత, అనసూర్య, ప్రభాకర్ పాల్గొన్నారు.



గణనాధుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్

తెలంగాణం, పటాన్‌చెరు (సెప్టెంబర్ 13) : పటాన్‌చెరు నియోజకవర్గంలో అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసినటువంటి వివిధ కాలనీల గణనాధులను మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ దర్శించుకున్నారు. అదేవిధంగా మండల పరిధిలోని పలు గణనాధుల నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొని దర్శించుకున్నారు. వివిధ మండపాలకు చెందిన గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆ గణనాథుడి ఆశీస్సులతో పెద్ద ఎత్తున వినాయక చవితి ఉత్సవాలు జరుపుకుంటున్న ప్రజలందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఇదేవిధంగా ఆ గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆ భగవంతు కోరుతున్నానని తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరసింహ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఓటర్ల జాబితాలో తప్పులు సరి చేసుకోండి

-ఎంపీడీవో రామకృష్ణ

తెలంగాణం, పినపాక (సెప్టెంబర్ 13) : భద్రాద్రి కొత్త గూడెం జిల్లా, పినపాక మండలంలోని 23 గ్రామపంచాయతీ పరిధి లో 202 వార్డుల్లో ఓటర్ల జాబితా ముసాయిదాను ప్రదర్శించామని పినపాక ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన పాత రెడ్డిపాలెం గ్రామపంచాయతీ పరిధిలో మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలు 2024 కి సంబంధించిన ఓటర్ల ముసాయిదా జాబితా గ్రామపంచాయతీ కార్యాలయం నోటీసు బోర్డు లో, మండల ప్రజా పరిషత్ కార్యాలయం నోటీసు బోర్డు నందు ప్రచురించడం జరిగినదన్నారు. ఓటర్ కార్డులో ఏమైనా తప్పులుంటే సంబంధిత సెక్రటరీలను సంప్రదించి సరిచేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వరరావు, సెక్రటరీలు, పాల్గొన్నారు.

వృత్తి శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తుల స్వీకరణ

మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి

తెలంగాణం, మంచిర్యాల (సెప్టెంబరు 13): అర్హులైన ముస్లిం, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీకులు మైనారిటీలకు కొరకు ఐ.టి., ఎడ్యుకేషన్, హెల్త్, అకౌంటింగ్, కన్స్ట్రక్షన్, వెటర్నరీడైరీ, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, హార్టికల్చర్, టూరిజంహాస్పిటాలిటీ, డ్రైవింగ్, ఎలక్ట్రానిక్స్, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ వంటి రంగాల్లో వృత్తి శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నామని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సంస్థలను ట్రైనింగ్ పార్టనర్లుగా నియమించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ వృత్తి శిక్షణ సంస్థల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ సంస్థలు జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్.ఎస్.డి.సి.) / టాస్క్ / ఈ.జీ.ఎం.ఎం./ మెప్మాతో గుర్తింపు/ అనుసంధానం కలిగి ఉండాలని, స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ / డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్‌తో గుర్తింపు పొంది ఉండాలని తెలిపారు. అర్హత, ఆసక్తి గల సంస్థలు తమ దరఖాస్తులను హైదరాబాద్‌నాంపల్లి లోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో అక్టోబర్ 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా సమర్పించాలని, ఇతర వివరాలకు జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని మొదటి అంతస్తులో ఎఫ్ 5 రూమ్ లో గల జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో పనివేళలలో సంప్రదించాలని తెలిపారు.



కామ్రేడ్ ఏచూరికి విప్లవ జోహార్లు

తెలంగాణం, నేరేడుచర్ల (సెప్టెంబర్ 13): భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు అఖిల భారత జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభకు సీపీఎం మండల కార్యదర్శి సిరికొండ శ్రీను అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ నాయకులు కొదమగుండ్ల నగేష్, ధూళిపాళ్ల ధనుంజయ నాయుడు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని అన్నారు. విద్యార్థి నాయకుడిగా ఎస్ఎఫ్ఐలో పనిచేస్తూ జేఎన్టీయూలో ఎస్ఎఫ్ఐ ఉద్యమాన్ని నిర్మించిన గొప్ప నాయకుడు అన్నారు. కామ్రేడ్ ఏచూరి మరణం యావత్తు భారత కమ్యూనిస్టు శ్రేణులను దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. కామ్రేడ్ సీతారాం ఆశయాలని ముందుకు తీసుకుపోయినప్పుడే ఆయనకు ఘనమైన నివాళులు అర్పించిన వాళ్ళం అవుతావని వారన్నారు. ఈ సంతాప సభలో టిడిపి మండల అధ్యక్షుడు ఇంజమూరి వెంకటయ్య, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు కుంకు తిరుపతయ్య, నీల రామ్మూర్తి కట్ట మధు, మామిడి నాగ సైదులు, ఆనెగంటి మీనయ్య, ఎడ్ల సైదులు, సట్టు శ్రీను అల్వాల శ్రీధర్, మచ్చ సోమయ్య, బి శ్రీను, సైదులు, సీపీఐ నాయకులు చిలకరాజు శ్రీను, ఉదర వెంకన్న, పరికె భరత్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన

తెలంగాణం, హన్మకొండ (సెప్టెంబర్ 13): హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం లోనీ ఎంజెపిపీఎస్ పాఠశాలల్లో హసన్ పర్తి ఇన్స్పెక్టర్ చేరాలు, ఎస్ ఐ లు దేవేందర్, రవి, సిద్దయ్య మరియు వారి సిబ్బంది, పిల్లలకు మత్తుపదార్థాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఇన్స్‌స్పెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడటం వల్ల జరిగే నష్టాలు, కొత్త చట్టాలపై అవగాహన, షీ టీమ్ ప్రాముఖ్యత, 100 నెంబర్ యొక్క ప్రాధాన్యత, సైబర్ నేరాలపై అవగాహన 1930, సోషల్ మీడియాను ఏ విధంగా ఉపయోగించుకోవాలి వాటి వల్ల జరిగే లాభాలు నష్టాలు, చైల్డ్ మ్యారేజెస్, సూసైడ్, సీసీ కెమెరాలు ఉపయోగం మొదలగు విషయాల గురించి అవగాహన కల్పించారు.



గండిని పూడ్చి నీటిని విడుదల చేయాలి

తెలంగాణం, హుజూర్‌నగర్ (సెప్టెంబర్ 13): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు 14 కిలోమీటర్ వద్ద పడిన గండిని హుజూర్నగర్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కాల్వకు గండిపడి 15 రోజులు అవుతున్నా, గండిని పూడ్చి నీటిని విడుదల చేయకపోవడం వలన సాగర్ కాల్వ కింద ఇటీవల నాటుపెట్టిన వరి పొలాలు ఎండి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎంబీసీకి చిలుకూరు రెవిన్యూ పరిధిలోని కరక్కాయల గూడెం ఆర్ 8 వద్ద పడిన గండిని పూడ్చి తక్షణమే కాల్వకు నీటిని విడుదల చేసి రైతుల పొలాలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇంతవరకు గండిపూడ్చక పోవడంతోనే ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధిమిటో అర్థం అవుతోందని అన్నారు. ఎడమ కాలువ ద్వారా మునగాల వరకు నీళ్లు వస్తున్నప్పటికీ కూడా, ఈ గండికి తాత్కాలిక మరమ్మతులు చేసైనా నీళ్లు ఇచ్చుంటే రైతులకు మేలు జరిగేది అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ అబ్దుల్ నబీ, సారెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచులు గుజ్జుల సుజాత, అంజిరెడ్డి, కిత జయమ్మ, ధనమూర్తి, షేక్ అలీ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీ నాయకులు అరెస్ట్

తెలంగాణం, తిరుమలగిరి (సెప్టెంబర్ 13): సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండల లో బీఆర్ఎస్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ ఆదేశానుసారం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులపై జరిగిన దాడిని నిరసనగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముట్టడిలో భాగంగా తిరుమలగిరి మండల, మున్సిపాలిటీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ అరెస్ట్ నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు సంకేపల్లి రఘునందన్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ,బిఆర్ఎస్ నాయకులపై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మండలం మాజీ జడ్పీటీసీ ధూపటి రవీందర్, అంజలి, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, మార్కెట్ మాజీ డైరెక్టర్ లింగయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షులు యాకుబ్ నాయక్, మాజీ గ్రంథాలయ చైర్మన్ సురేందర్, మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యులు బత్తుల శ్రీధర్, తదితరులు ఉన్నారు.

తెలంగాణ చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలి

బీజేపీ మండల అధ్యక్షుడు మోలుమురి శ్రీనివాస్

తెలంగాణం, రామగిరి (సెప్టెంబర్ 13): తెలంగాణ చరిత్రను భవిష్యత్ తరాలకు తెలిసేలా పాఠ్యపుస్తకాలలో చేర్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు మోలుమురి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం సెంటినరీ కాలనిలో విలేకరులతో మాట్లాడుతూ నిజాం నవాబ్, రజాకార్ల నుండి హైదరాబాద్ కేంద్రంగా నిజాం సంస్థానం ఉండేదని అన్నారు. దానిలో భాగంగా మహారాష్ట్రలోని నాలుగు జిల్లాలు కర్ణాటక నుండి మూడు జిల్లాలు ఉండేవి అక్కడి రాష్ట్రాలు ఎప్పటినుండో సెప్టెంబర్ 17న అధికారికంగా చేస్తున్నాయి. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కాంగ్రెస్‌పార్టీ నిర్వహించడంతో పాటు, పాఠ్యపుస్తకాలలో చేర్చి భవిష్యత్ తరాలకు తెలంగాణ చరిత్ర తెలియజేయలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆధ్యక్షుడు తీగల శ్రీధర్, సీనియర్ నాయకులు మెరుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



అభాగ్యులకు అండగా వైఎంసీఏ

తెలంగాణం, పాలేరు (సెప్టెంబర్ 13): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన తిరుమలాయపాలెం మండలంలోని రాకాసితండా ప్రజలకు యంగ్ మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైఎంసిఏ)సంస్థ అండగా నిలిచింది. శుక్రవారం సంస్థ బాధ్యులు రాకాసితండాను సందర్శించి క్రిస్టియన్ సర్వీస్ యూనిట్ అధ్యక్షులు ఫ్రాంక్లిన్ నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ చందన రోగులను పరీక్షించి బిపి, షుగర్ వంటి పరీక్షలను నిర్ధారించి, వారికి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. అనంతరం బాధితులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు, ఖమ్మం కార్పొరేటర్ బిజి క్లైమెంట్ మాట్లాడుతూ అభాగ్యులకు అండగా ఉండేందుకు వైఎంసిఏ సంస్థ ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందన్నారు. వరద ఉధృతిలో ఇండ్లు వాకిలి, పండించిన పంట, దాచుకున్న ధాన్యం,నగదు కొట్టుకునిపోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. తదుపరి 77 కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఏ ఒక్కరూ అధైర్య పడొద్దని కష్ట సమయంలో తోడుగా ఉంటామని భరోసా కల్పించారు. వ్యాపారులు, ఎన్నారైలు బాధితులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎంసిఏ వైస్ ప్రెసిడెంట్ శేఖర్ బాబు, కార్యదర్శి జెట్టి సుధాకర్, సభ్యులు కె. సంజీవరావు, గీతా కమలాకర్, మేరి శేకర్ బాబు, జి.రామక్రిష్ణ గాదరి బాబు, శిల్పా జాన్సన్, పల్లా కిషోర్, పీ.అజయ్, నవీన్,రుత్విక్ తదితరుల పాల్గొన్నారు.

అధికారులు విధులపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



తెలంగాణం, జయశంకర్ భూపాలపల్లి (సెప్టెంబర్ 13): గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారులు గ్రామ పంచాయితీ విధులపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో భూపాలపల్లి నియోజక వర్గ పరిధిలోని మండల ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఓలతో గ్రామపంచాయితీ విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, చెట్లు పెంపకం, గ్రామ పంచాయితీలు అభివృద్ధి, వీధి దీపాలు, జనన మరణాల రిజిస్ట్రేషన్, ప్రజారోగ్యం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులకు పిపిటి ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశిత లక్ష్యాలను గ్రామాలలో క్షేత్ర స్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారలదేనని అన్నారు. సర్పంచ్ ల మాదిరిగానే గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారులకు అన్ని రకాల అధికారాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రత్యేక అధికారుల విధులు చాలా కీలకమైనవని సేవల్లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. విద్యుత్, పారిశుధ్యం, సీజనల్ వ్యాధులు ప్రబల కుండా రక్షణ చర్యలు, పెండింగ్ లో ఉన్న రోడ్లు, మురుగునీటి కాల్వల పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. పంట నష్టం, వరద ప్రభావిత నష్టాలను అంచనాలు వేసి జిల్లా కలెక్టర్ కు నివేదిక అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, డిపిఓ నారాయణ రావు, మండల ప్రత్యేక అధికారులు తహసీల్దార్లు, ఎంపిడిఓ లు గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.



భద్రతా నియమాలను పాటించాలి

డి.డి.ఎం.ఎస్.(ఎలక్ట్రికల్)

తెలంగాణం, రామగిరి (సెప్టెంబర్ 13): విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటిస్తూ, నియమ నిబంధలను అనుసరిస్తూ విధులు నిర్వహించాలని సౌత్ సెంట్రల్ జోన్ 2 డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (ఎలక్ట్రికల్) రాజీవ్ ఓం ప్రకాష్ వర్మ అన్నారు. శుక్రవారం ఆయన రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో పర్యటించారు. జి.ఎం. కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన వివిధ గనుల ఎలక్ట్రికల్ విభాగం అధికారులు, సూపర్వైజర్లు, ఎలక్ట్రీషియన్లకు విద్యుత్ భద్రతపై నిర్వహించిన అవగాహణ సదస్సుకు వారు ముఖ్య అతిథిగా హాజరై పలు సలహాలు, సూచనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యుత్ భద్రతకు సంబంధించిన నియమ నిబంధనలను వివరించారు. అదేవిధంగా సంబంధిత ఉద్యోగులు రక్షణ సూత్రాలను పాటిస్తూ, విద్యుత్తు ఉపకరణాలను ఉపయోగించాలని అన్నారు. గనిలో విద్యుత్తు ఎర్త్ సిస్టమ్ ఎల్లప్పుడూ ఉపయోగంలో ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, యంత్రాలకు అమర్చిన భద్రతా పరికరాలను పనిచేసే విధంగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేట్ సేఫ్టీ విభాగం జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్, రామగుండం రీజియన్ సేఫ్టీ విభాగం జనరల్ మేనేజర్ కె.హెచ్.ఎన్.గుప్త, ఆర్.జి3 ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ ఎన్.రాధాక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



వరదబాదితులకు టియుడబ్ల్యూజే ఆర్థిక సాయం

తెలంగాణం, మహబూబాబాద్ (సెప్టెంబర్ 13) : వరదప్రభావతంతో తల్లడిల్లిపోయిన ప్రాంతాలను, ప్రజలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుతో మహబూబాబాద్ జిల్లా టియుడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ స్పందించారు. జర్నలిస్ట్ లుగా బాధలో ఉన్న జనం కోసం ఎంతచేతనయితే అంత ఆర్థికసహాయం చేయాలని యూనియన్ బాధ్యులను, సభ్యులను కోరారు. 91మంది యూనియన్ సభ్యులు స్పందించి ఎవరి శక్తిమేరకు వారు ఆర్థికచేయూతను అందించారు. మొత్తం రూ.60,500/లు సమీకరించగా, అందులోరూ.10వేలు వరదతాకిడికి గురైన ఇద్దరు జర్నలిస్ట్ లకు అందించి, మిగతా రూ.50,500/లను ముఖ్యమంత్రి సహాయనిధి పేరిట డిడి తీసి ఆ..డిడి ని శుక్రవారం మహబూబాబాద్ జిల్లాకలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ కు అంజేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే సంకల్పంతో టియుడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో జర్నలిస్ట్ లు చేసిన ఈ కార్యక్రమం అభినందనీయమని ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ స్పందించి సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి గాడిపల్లి శ్రీహరి, జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మగాని మధు, జిల్లా సహాయకార్యదర్శి జిన్న లచ్చయ్య, మరిపెడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రియాజ్ పాషా,జిల్లా కార్యవర్గ సభ్యులు కార్తీక్, యూనియన్ బాధ్యులు పిడమర్తి ఉపేందర్, యువ రాజ్ ,శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని దర్శించుకున్న నాయకులు

తెలంగాణం, రామగిరి (సెప్టెంబర్ 13) : శుక్రవారం రామగిరి మండలం పన్నూర్ గ్రామంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ పర్యటిస్తూ పలు మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. గణనాథుడికి కొబ్బరికాయ కొట్టి మొక్కుబడి చెల్లించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని వడ్డించడం జరిగింది. ఆ గణనాథుని కరుణతో ప్రజలంతా అష్టఐశ్వర్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తాజా మాజీ పన్నూర్ ఎంపీటీసీ చిందం మహేష్, రామగిరి మండల బీసీ సెల్ అధ్యక్షుడు బండారి సదానందం,రామగిరి మండలం మహిళా ఉపాధ్యక్షురాలు జాగరి రజిత, పన్నూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.



ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం

పూల మొక్క నాటిన మహిళలు

తెలంగాణం, నెక్కొండ (సెప్టెంబర్ 13): గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నెక్కొండ మండలంలోని గుండ్రపల్లి గ్రామంలో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం గ్రీన్ ఇండియా ఛాలెంజ్ జాతీయ మహానంది అవార్డు గ్రహీత నల్లగొండ సమ్మయ్య చేతుల మీదుగా గణనాధుని విగ్రహం ముందు ఆదర్శ యూత్ సంఘం వారిచే (టేకోమా) పూల మొక్క నాటారు. ఈ సందర్భంగా వన ప్రేమికుడు సమ్మయ్య మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షణకు ప్రతి ఒక్కరు ఇంట్లో ఒక పూల మొక్కను ఒక పండ్ల మొక్కను నాటి పర్యావరణాన్ని రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్న విషయం గుర్తు తెచ్చుకోవాలని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో గాండ్ల.అనిల్, మౌనిక,జక్క.భాగ్యలక్ష్మి, లాక. మంజుల, సట్ల. మానస,లాక.భాగ్య, సారగాని స్రవంతి కాలనీవాసులు పాల్గొన్నారు.



సఖీ కేంద్రం బాధితులకు ఆలంబనగా నిలవాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

తెలంగాణం, జయశంకర్ భూపాలపల్లి (సెప్టెంబర్ 13): సఖి కేంద్రం బాధితులుకు ఆలంబనగా నిలవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సఖి కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్యతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా సఖీ కార్యాలయంలో అన్ని గదులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో కొనసాగుతున్న సేవలు, బాదితులు, కేసుల వివరాలు, బాదితులకు వసతి కల్పిన, కేసుల పరిష్కారం, పెండింగ్ లో ఉన్న కేసులు తదితర వివరాలను నిర్వాహకురాలును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సఖి సేవలకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించి మొక్కలు నాటారు. సఖి కేంద్రం వెనకాల నిర్మాణంలో ఉన్న చైల్డ్ హోమ్ భవనాన్ని తనిఖీ చేశారు. భవనం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేయాలని కోరగా మంజూరు చేస్తామని తెలిపారు. జిల్లాలో సఖి కేంద్రం ద్వారా అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సేవలను విస్తరించి బాధితులకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ సఖి కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో అవంతి, సఖి కేంద్ర నిర్వాహకురాలు గాయత్రి, సోషల్ కౌన్సిలర్ మాధవి, అకౌంటెంట్ కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు

తెలంగాణం, రామగిరి (సెప్టెంబర్ 13):

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ, కాంగ్రెస్ గూండాలు దాడి చేసిన నేపథ్యంలో మాజీ మంత్రి హరీశ్ రావు పిలుపు మేరకు హైదరాబాద్‌లో ధర్నా చేయడానికి సిద్ధం గా ఉన్న రామగిరి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులను ముందస్తు అరెస్టులు చేసి రామగిరి పోలీస్ స్టేషన్ కు తరలించారు. కాంగ్రెస్ పార్టీ గెలిచిన నెలల వ్యవధి లోనే కార్యకర్తల మీద, నాయకుల మీద, ఎమ్మెల్యేల మీద దాడులు జరుగుతున్నాయి అని, బీఆర్ఎస్ పార్టీ అధికారం లో ఉన్నప్పుడు ఇలాంటి దాడులు ఎన్నడూ జరగలేదని పుదారి సత్యనారాయణ, నాయకులు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుల మీద దాడులకు పాల్పడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోనే కాంగ్రెస్ పార్టీ గుండాల ఆగాడలు ఎక్కువ అవుతున్నాయి అని అన్నారు.



విద్యర్థులకు ప్లేట్లు గ్లాసులు పంపిణీ

తెలంగాణం, మంథని (సెప్టెంబర్ 13): మంథని పట్టణంలోని రావుల చెరువు కట్ట వీధిలో గల మండల ప్రజా పరిషత్ ప్రైమరీ పాఠశాల లోని విద్యార్థిని, విద్యార్థులకు శుక్రవారం ప్లేట్లు గ్లాసులు పంపిణీ చేశారు. దివంగత లోకే రామ్మోహన్ రావు (రాము) జ్ఞాపకార్థం సోదరులు మనోహర్, శరత్ లు పాఠశాలలోని విద్యార్థి, విద్యార్థులకు అందజేశారు. ప్రతి సంవత్సరం పేద విద్యార్థుల సహాయార్థం పాఠశాల, కళాశాలల్లో మనోహర్, శరత్ లు చేస్తున్న సేవా కార్యక్రమాల్లో పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాస్, ఉపాధ్యాయిని ఎ శారద, దహగం పురుషోత్తం,మంథని రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

సీనియర్ సివిల్ జడ్జి జట్టా శ్యాం కుమార్

తెలంగాణం, హుజూర్‌నగర్ (సెప్టెంబర్ 13) : సెప్టెంబర్ 28 వ తేదీన జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను న్యాయవాదులు, పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సమిష్టి కృషితో విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి జట్టా శ్యాం కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాదు లు కోరారు. శుక్రవారం హుజూర్ నగర్ న్యాయస్థానంలో న్యాయవాదులు, పోలీస్ అధికారులతో విడివిడిగా సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. గత అదాలత్‌లో హుజూర్ నగర్, సూర్యపేట జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవగా, తెలంగాణ రాష్ట్ర స్థాయిలో నాలుగవ స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రస్థాయిలో ఉన్నతమైన స్థానం లభించే విధంగా కృషి చేసినందుకు న్యాయవాదులకు, పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అదే వరవడిని 28 న జరగబోతున్న అదాలత్ లో కూడా న్యాయవాదులు, పోలీసులు చూపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, జక్కుల నాగేశ్వరరావు, నాగేశ్ రాథోడ్, కుక్కడపు సైదులు, హుజూర్ నగర్, కోదాడ రూరల్ సిఐలు, హుజూర్ నగర్, మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకీడు ఎస్సైలు, మహిళ ఎక్సైజ్ ఎస్సై, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రబలుతున్న మలేరియా టైఫాయిడ్

గాలికి వదిలేసిన గ్రామాధికారులు వైద్యాధికారులు

తెలంగాణం, వికారాబాద్ (సెప్టెంబర్ 13): వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలో గ్రామాలలో దోమల బెడద ఎక్కువ అవ్వడం వల్ల ప్రతి ఇంటిలో ఒకరు ఇద్దరు లేదా ఇంటి మొత్తానికి టైఫాయిడ్ మలేరియా లాంటి వ్యాధులతో సతమతమవుతున్నారు. గ్రామాధికారులకు ఎన్నిసార్లు చెప్పినా తూతు మంత్రంగా మెయిన్ రోడ్లపై మందులు పిచికారి చేస్తూ గాలికి వదిలేస్తున్నాని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే వైద్యాధికారులు బస్తి దావకానపెట్టి ఒక్క ఇంటికి కూడా వెళ్లి పరీక్షలు చేసింది లేదు చూసింది లేద అంటున్నారు. ఆఫీసులలో కూర్చొని లెక్కలు వేయడమే తప్ప ఇంటింటికి వెళ్లి సర్వేలు చేసింది లేదు రోగులను అడిగి విషయాలు తెలుసుకున్నది లేదు. గ్రామాలలో ఏ ఇంటిని తట్టిన మలేరియా టైఫాయిడ్ లాంటి వ్యాధుల గురించి చెప్తున్నారు. మరి గ్రామాల్లో ఉన్న అధికారులకు దేనిపైన ధ్యాస ఉందో ఏం ఉద్యోగం చేస్తారో అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచి వ్యవస్థ లేకపోవడం గ్రామ అధికారులు ఆడింది ఆట పడింది పాట మమ్మల్ని ఆపేది ఎవడు అంటూ ఏ టైం కి ఉద్యోగానికి వస్తారో ఏ టైం కి వెళ్తున్నారో ఎవరికి తెలియదు అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పై అధికారులు చొరవ తీసుకొని రోగాల బారిన పడి ప్రాణాలు పోకముందే తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.



హైదరాబాద్ ఇమేజ్ దెబ్బతీసేలా చేస్తున్నారు

మాజీ జెడ్పీటీసీ కొణకండ్ల వెంకటరెడ్డి

తెలంగాణం, చంద్రుగొండ (సెప్టెంబర్ 13): తెలంగాణ, హైదరబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా నాయకులు, మాజీ జెడ్పీటీసీ కొణకండ్ల వెంకటరెడ్డి విమర్శించారు. శుక్రవారం చంద్రుగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .పదేండ్ల కేసీఆర్ పరిపాలనలో చిన్న అలజడి లేకుండా రాష్ట్ర ఉందని, నేడు పది నెలల రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో గృహనిర్బంధాలు, లాఠీచార్జీలు, అరెస్టులు, అణచివేతలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అసలైనా కాంగ్రెస్ వాదులకు రేవంత్ రెడ్డి మనుషులకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారని, నిమజైనా కాంగ్రెస్ నాయకులు ఇలా వ్యవహరించరని, అన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశ్నిస్తే నేరమన్నట్లు చూడటం ఈ ప్రభుత్వానికి తగదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దారా వెంకటేశ్వరరావు, గుంపెన సోసైటి వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, సోసైటి డైరక్టర్ ఉన్నం నాగరాజు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేడా మోహన్ రావు, చాపలమడుగు రామరాజు, ఉగ్గం శ్రీను, కెలోత్ శ్రీను నాయక్, గుగులోత్ ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



అక్రమ అరెస్ట్‌లకు అదరం బెదరం

తెలంగాణం, జగిత్యాల (సెప్టెంబర్ 13) : జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం భూషన్ రావుపేట్ గ్రామంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు మాజీ మంత్రులను అరెస్ట్ చేయడం కాంగ్రెస్ పార్టీ ఏకపక్ష ఒంటెద్దు పోకడలకు నిదర్శమని అన్నారు. మీరు చేసే అక్రమ అరెస్టులకు అదరం బెదరం అని అన్నారు. ఈ అక్రమ అరెస్టులతో కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీ నాయకులను కట్టడి చేశామని అనుకుంటే అంతకన్నా తెలివితక్కువ తనం ఇంకోటి లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, వారి అబద్ధపు హామీలను, మోసపూరిత మాటలను ప్రజలకు తెలియజేస్తూ పోరాటాన్ని ముందుకు తీసుకు వెళ్తామని లోకబాపు రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట కథలా పూర్ మండల మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండారపు గంగాధర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాంపెల్లి లింబాద్రి,మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండీ. రఫీ, బద్దం మహేందర్,గడ్డం శేఖర్ రెడ్డి, ముస్కు శ్రీనివాస్, వంగరి రాజు తదితరులు ఉన్నారు.



గ్రామాలు ఆరోగ్యంగా ఉంటేనే అభివృద్ధి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

తెలంగాణం, రుద్రంగి (సెప్టెంబర్ 13): మారుమూల గ్రామాలకు మేము ఉన్నామంటూ శాంతి భద్రతలే కాకుండా వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందయమని జిల్లా పోలీస్ శాఖను ప్రభుత్వ విప్, ఎంఎల్ఏ ఆది శ్రీనివాస్ అభినందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆరోగ్య శాఖ, అశ్విని హాస్పిటల్, రెనే హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాష్ట్ర యూనియన్ కోపరేటివ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ, ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడాతూ గ్రామాలు ఆరోగ్యం ఉన్నపుడే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఏదైనా సమస్య తలెత్తుతే ఒక్కరు ఇద్దరు తప్ప ఎవరు లేరని పరిస్థితి నుండి ప్రస్తుతం మేము ఉన్నాం అంటూ మానాల చుట్టుపక్కల గ్రామాలు భరోసా జిల్లా అధికార యంత్రాంగం కల్పించిందని అన్నారు. పోలీస్ శాఖ అనగానే శాంతి భద్రతల పరిరక్షణ ఒక్కటే తప్ప ఇతరత్రా సమస్యలు దూరంగా ఉంటుందని అనే ముద్ర నుండి సమస్యలు తలెత్తుతే మేము ఉన్నాం అంటూ సామాజిక సేవకులు అందిస్తు జిల్లా ప్రజలకు భరోసా కల్పిస్తున్న జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలోని జిల్లా పోలీస్ యంత్రాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ వసంతరావు, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య, సీఐలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ మరియు ఎస్ఐలు తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

తెలంగాణం జగిత్యాల (సెప్టెంబర్ 13) : తెలంగాణం జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం భూషన్ రావుపేట్ గ్రామానికి చెందిన మామిడి శ్రీనివాస్‌కి ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందినందుకు రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డి, మామిడి పెల్లి శ్రీనివాస్‌ని శాలువాతో సత్కారించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట కథలాపూర్ మండలం మాజీ జెడ్పీటీసీ నాగం భూమయ్య, మాజీ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండారపు సౌజన్య గంగాధర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపెల్లి లింబాద్రి, మాజీ ఎంపీటీసీ కొండ అంజనేయులు, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండీ. రాఫీ, బద్ధం మహేందర్,పురుకుటపు గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

కోలాహలంగా గణేష్ శోభాయాత్ర

తెలంగాణం, హబ్సీగూడ (సెప్టెంబర్ 13) : హబ్సిగూడ కాకతీయ నగర్ గణనాథుడికి హిందూ జన జాగరణ సమితి ఆధ్వర్యంలో శోభాయాత్ర కోలహాలలాతో నిర్వాహిచారు. లడ్డు వేలం పాటలో పాల్గోని స్వామి వారి లడ్డు రూ. 25 వేలకి రమాకాంత్ రెడ్డి దక్కించుకున్నారు. అనంతరం గణనాదుని శోభయాత్రతో పాల్గొన్నారు. ఈ కార్యకమంలో ఉప్పల్ ఎమ్మెల్యే మేడ్చెల్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, హబ్సిగూడ మాజీ కౌన్సిలర్ కైలాసపతి గౌడ్, హిందూ జన జాగరణ సమితి ఆర్గనైజర్ శివ శైలేందర్, కమిటీ సభ్యులు బొమ్మగోని రఘుపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు..



బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

తెలంగాణం, రుద్రంగి (సెప్టెంబర్ 13) : రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భముగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటి పై గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకుల దాడికి నిరసనగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు హైదరాబాద్ లో నిర్వహిస్తున్న ధర్నా పిలుపుమేరకు హైదరాబాద్ బయలుదేరుతున్న బీఆర్ఎస్ ఉద్యమ నాయకులను తెల్లవారుజామున ముందస్తుగా అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. కానీ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు అరెస్టు చేసినట్లు ఎస్ఐ సిరిసిల్ల అశోక్ తెలిపారు. అరెస్టు అయిన వారిలో గంగం మహేష్, ఆకుల గంగారాం, దయ్యాల కమలాకర్, దెగావత్ తిరుపతి, పిసరి భూమయ్య, మాడిశెట్టి ఆనందం, చెప్యాల గణేష్‌లు ఉన్నారు.

ఎస్జీటి టీచర్ల పై వివక్ష తగదు

- ఎస్జీటీయూ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ దొడ్ల శ్రీనివాస్ రెడ్డి

తెలంగాణం, పెద్దపెల్లి (సెప్టెంబర్ 13): సెకండరి గ్రేడ్ టీచర్‌ల పట్ల వివక్షతగదని, ప్రాథమిక విద్యకు వెన్నెముక అయిన ఎస్జీటీ టీచర్లను చిన్నచూపు చూడవద్దని స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ దొడ్ల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ధర్మారం మండలంలోని పాఠశాలల్లో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో ఐదు తరగతులున్న కూడా అనేక పాఠశాలల్లో ఒక్కరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులతో పద్దెనిమిది సబ్జెక్టులు భోదింపచేస్తూ పనిభారం మోపుతున్నారు. దీనికి తోడు ఎస్జీటీ ఉపాధ్యాయులు హెచ్.ఎమ్.లుగా పనిచేస్తూ వివిధ రకాల రిపోర్టులు, మధ్యాహ్నభోజన నిర్వహణ, ఎఫ్.ఆర్.ఎస్‌కు లాంటి భోధనేతర పనులు అప్పగిస్తూ అందులో ఏమైనా తేడాలుంటే భాధ్యులను చేస్తూ చర్యలు తీసుకోవటంతో ఎస్జీటీ టీచర్లు ఎంతో ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీల సమయంలో కూడా మిగతా క్యాడర్‌లకు రెండు మూడు రోజుల సమయం ఇచ్చి వందల సంఖ్యలో ఉన్న ఎస్జీటి టీచర్లకు ఒకే ఒక్కరోజు వెబ్ అప్షన్ లకు సమయం ఇచ్చి టెన్షన్ కు గురి చేయటం సరి కాదన్నారు. కాబట్టి ప్రాథమిక స్థాయిలో తరగతికి ఒక్క ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రాథమిక విద్య పర్యవేక్షణ సైతం ప్రాథమిక విద్యలో అనుభవం గల్గిన సీనియర్ పి.యస్.హెచ్. ఎమ్. లతో చేయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమలో మండల భాద్యులు గంగారెడ్డి, సతీష్,ప్రభాకర్, రామకృష్ణ, రామన్, సంజీవ్, మల్లయ్య,, శశిధర్, శ్రీనివాస్, సురేష్,కృష్ణహరి మరియు అన్ని పాఠాశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





ఛలో హైదరాబాద్‌కు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు ముందస్తు అరెస్ట్ చేసిన పోలీసులు

తెలంగాణం, ఖానాపురం (సెప్టెంబర్ 13): బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ చలో హైదరాబాద్ పిలుపునివ్వడంతో ఖానాపురం మండల మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు ఆధ్వర్యంలో హైదరాబాద్ వెళుతున్న పార్టీ నాయకులను ఖానాపురం ఎస్ఐ సిహెచ్ రఘుపతి ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎంపీపీ ప్రకాష్ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని కేసిఆర్ అభివృద్ధికి చిరునామాగా మారిస్తే కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండాయిజం చేస్తూ అభివృద్ధి నిరోధకులుగా మారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సమాజం మొత్తం కాంగ్రెస్ అహంకారపు తనాన్ని గమనిస్తుందని గుర్తు చేశారు. అరెస్టు అయిన వారిలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు అజహార్, పార్టీ నాయకులు భూస అశోక్, వద్దే రాజశేఖర్, గంగాపురం రాజు, తరాల శ్రీనివాస్, మైనుద్దీన్, కోడి అశోక్, దేవులపల్లి యాదాద్రి, మారబోయిన రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.



బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్ట్!

పోలీసుల తీరుపై బీఆర్ఎస్ ఆగ్రహం

తెలంగాణం, హుజురాబాద్ (సెప్టెంబర్ 13): హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ వివాదం నేపథ్యంలో హుజురాబాద్ పోలీసులు స్థానిక బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం పలు విమర్శలకు దారితీస్తుంది. అధికార పార్టీ నాయకులకు ఒకరకంగా ప్రతిపక్ష నాయకులకు మరో రకంగా పోలీసులు వ్యవహరిస్తున్న తీరును పలువురు మేధావులు తప్పుపడుతున్నారు. తాము వెళ్లడం లేదని ఇంట్లోనే ఉన్నామని కావాలని రాత్రి వేళలో సడి సప్పుడు కాకుండా వచ్చి తమను బలవంతంగా అదుపులోకి తీసుకొని హుజురాబాద్ పోలీస్ స్టేషన్లో బంధించారని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరోపించారు. ఇప్పటికైనా పోలీసులు అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరించడం మాని చట్ట ప్రకారం నడుచుకోవాలని, తమను అక్రమంగా అదుపులోకి తీసుకోవడం మానుకొని వదిలేయాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ముందస్తు అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, హుజురాబాద్ సింగిల్విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గూడూరు ప్రతాపరెడ్డి, కౌన్సిలర్లు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, గనిశెట్టి ఉమామహేశ్వర్, పార్టీ సీనియర్ నాయకులు చొల్లేటి కిషన్ రెడ్డి తదితరులున్నారు.



వరద బాధితులకు సీలింగ్ ఫ్యాన్లు పంపిణీ

తెలంగాణం, పాలేరు (సెప్టెంబర్ 13): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాకాసి తండా గ్రామం పూర్తిగా వరద ఉధృతిలో సర్వం కోల్పోయి నిరాశ్యులైన గ్రామస్తులకు తిరుమలాయపాలెం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్సై కూచిపూడి జగదీష్‌రాకాసి తండా వరద బాధితులకు సీలింగ్ ఫ్యాన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాకాసి తండా గ్రామ ప్రజలు సర్వం కోల్పోయి, దిక్కతోచని స్థితిలో ఉన్న సంగతి స్వయంగా చూశానని వారి ఆర్థిక నష్టాన్ని తీర్చలేకపోయినా మా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 82 కుటుంబాలకు సీలింగ్ ఫ్యాన్లు పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కష్టకాలంలో రాకాసి తండా ప్రజలు ధైర్యంగా ఉండాలని ధైర్యం చెప్పారు. వారిని ఆదుకోవడానికి వ్యాపారస్తులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు ఎన్నారైలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఏ ఆర్ ఏ ఎస్ ఐ హలీం ,వీరస్వామి ,ఎల్ వెంకటేశ్వర్లు ,లక్ష్మి పాల్గొన్నారు.

గోమ్ముగూడెంలో మహా అన్నదానం

తెలంగాణం, చర్ల (సెప్టెంబర్ 13) : గణపతి నవరాత్రుల ఉత్సవం భాగంగా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టఐశ్వర్యాలతో బాగుండాలని చర్ల మండలం గోమ్ముగూడెం గ్రామం కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ పోడియం మురళి, పొట్రు బ్రహ్మానందం రెడ్డి, ఆవుల మదన్ మోహన్ రెడ్డి, ముత్తవరపు సత్యనారాయణ, పిల్లి పుల్లారెడ్డి, అంగరాజు, వెంకటేశ్వర రాజు, గ్రామస్తులు భక్తులందరూ ఆ గణనాధుని ఆశీస్సులు పొంది అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాడి కౌశిక్ రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు

-యువజన కాంగ్రెస్ నాయకులు

తెలంగాణం, హుజురాబాద్ (సెప్టెంబర్ 13): హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై యువజన కాంగ్రెస్ నాయకులు స్థానిక హుజూరాబాద్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కౌశిక్ రెడ్డి ఉద్దేశ్యపూర్వకంగా భయానక వాతావరణానికి తెరలేపి లేనిపోని గొడవలు, విధ్వంసాలు సృష్టిస్తూ ప్రాంతీయ విబేధాలు అంటూ రెండు రాష్ట్రాల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. కాబట్టి ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కౌశిక్ రెడ్డి లాంటి వ్యక్తుల పట్ల తెలంగాణ సమాజాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యకమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సందమల్ల నరేష్, టేకుల శ్రావణ్, నాయకులు బండ నవీన్, జంగ అనిల్, లంకదాసరి గంగరాజు, ఇప్పలపల్లి చంద్రశేఖర్, నరెడ్ల వినోద్ రెడ్డి పాల్గొన్నారు.



108 నైవేద్యాలతో విఘ్నేశ్వరునికి పూజలు

తెలంగాణం, నర్సంపేట (సెప్టెంబర్ 13): నర్సంపేట నియోజకవర్గంలోని పదో వార్డులో పోచమ్మ ఆలయంలో ఏడవ రోజు విఘ్నేశ్వరుని పూజా కార్యక్రమంలో భాగంగా గణపతికి ఇష్టమైన 108 ప్రసాదాలతో మహిళలు, కౌన్సిలర్ నాగిశెట్టి పద్మ ప్రసాద్, పోచమ్మ యూత్ గణేష్ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఘనంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ నాగిశెట్టి పద్మ ప్రసాద్ మాట్లాడుతూ గణపతికి ఇష్టమైన 108 ప్రసాదాలతో నైవేద్యం అప్పజెప్పడం చాలా ఆనందంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. నర్సంపేట నియోజకవర్గంలోని ప్రజలందరితో పాటు పదో వార్డు ప్రజలకు విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఉండాలని, ప్రతి ఇంటి ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని కోరారు. పూజా కార్యక్రమంలో తాళ్ళపెల్లి కళ్యాని, నాగిశెట్టి. ప్రణీత, ఎదురబోయిన రమ, వార్డులోని ప్రజలు పాల్గొన్నారు.



పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

తెలంగాణం, వాజేడు సెప్టెంబర్(13) : వర్షాకాలం సీజన్లో వచ్చు వ్యాధుల పట్ల అవగాహన, పరిసరాల పరిశుభ్రత తోనే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని మాత శిశు సంరక్షణ వైద్యాధికారిణి డాక్టర్ యోషిత అన్నారు. వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మురుమూరు, అరుణాచల పురం, కొంగాల గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ప్రస్తుత తరుణంలో ప్రజలందరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వృద్ధి చెందకుండా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ప్రతి ఇంట్లో దోమతెరలు వాడాలని అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఉన్న మురికి కాలువల్లో తిమోపాస్ మందు చల్లారు. గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో రోగులను పరీక్షించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పల్లె దవఖాన వైద్యాధికారిని జ్ఞానస, వైద్య పర్యవేక్షకులు కోటిరెడ్డి, స్టాఫ్ నర్స్ అనూష, శేఖర్, చిన వెంకటేశ్వర్లు, నాగవేణి, ఛాయాదేవి, కన్యాకుమారి, రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కొడంగల్లో బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

తెలంగాణం, వికారాబాద్ (సెప్టెంబర్ 13) : వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని బొంరాస్ పెట్, దౌల్తాబాద్, మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులను ముందస్తు అందులోకి తీసుకొని అరెస్టు చేసిన పోలీసులు దౌల్తాబాద్ స్థానిక పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు పలువురు మాట్లాడుతూ తమను అరెస్ట్ చేయడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. అరికపూడి గాంధీ అనుచరులను కాంగ్రెస్ గూండాలను వెంటే వేసుకొని ఒక ఎమ్మెల్యేపై దాడి చేయడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. వారిపై వెంటనే కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్, కాంగ్రెస్ ప్రభుత్వం తమది ప్రజా పాలన అని చెప్పుకుంటున్నారు. ప్రజాపాలన అంటే నిర్బంధాలా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ మహిపాల్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బీములు, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, మాజీ ఎంపిటిసి శివమ్మ శంకర్, నర్సింలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.